తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం

(వ్యాస సంకలనం)

సంకలనం :

ఆచార్య ఎస్వీ రామారావు

ఆచార్య మసన చెన్నప్ప

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001

ఫోన్ నెం.24753724

తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం

(వ్యాస సంకలనం)

ప్రధాన సంపాదకులు :

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత

డా॥ సి. నారాయణ రెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు :

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001

ఫోన్ నెం. 24753724

Telugu Bhasha Sahitya Vaisishtyam

(Collection of Essays on Telugu Language and Literature)

Compilers :

Prof. **S.V. Rama Rao**

Prof. **M.Chennappa**

ప్రథమ ముద్రణ : డిసెంబర్, 2009.

ప్రతులు : 1000

ప్రతులకు : ఆంధ్ర సారస్వత పరిషత్తు,
తిలక్ రోడ్, హైదరాబాదు - 500001.

ఫోన్ : 040 - 24753724

వెల : **100/-**

టైప్ సెట్టింగ్ : Sri Creations,
L.B.Nagar, Hyderabad.
Cell : **9966 175 009**

ముద్రణ : వాగ్దేవి ప్రింటర్స్
నల్లకుంట,
హైదరాబాద్ - 44.
ఫోన్ : 27673772

సంపాదకీయం

ఆంధ్రసారస్వత పరిషత్తు కొనసాగిస్తున్న ప్రయోజనాత్మక కార్యక్రమాల్లో గ్రంథప్రచురణకు ప్రత్యేకస్థానం ఉంది. ఇంటింటా అక్షరజ్యోతిని వెలిగించాలన్న సంకల్పంతో ఏర్పాటైన పరీక్షలకు అవసరమైన వాచకాలతో పాటు, జిజ్ఞాసువులకు ఉపయుక్తములైన పరిశోధన గ్రంథాలు, ఆయారంగాలలో నిష్ణాతులైనవారి ఉపన్యాస పరంపరలు మొదలైన పరిషత్తు ప్రచురణలు పలుముద్రణలు పొంది అసంఖ్యాక పాఠకులను అలరిస్తున్నాయి.

తెలుగుకు ప్రాచీనతాస్థానం కోసం జరుగుతున్న ఉద్యమంలో పరిషత్తు పాలుపంచుకొన్న నేపథ్యంలో తెలుగుభాషపై నిరాదరణ ఏర్పడుతున్న ప్రస్తుత పరిస్థితిని గమనించి తెలుగుభాషా సాహిత్యాల విశిష్టతను చాటే ప్రముఖుల వ్యాసాలను గ్రంథస్థం చేయటం సముచితంగా ఉంటుందని పరిషత్తు అధ్యక్షులైన ఆచార్య సి.నారాయణరెడ్డి గారు సూచిస్తూ ఈ బాధ్యతను పరిషత్తు కార్యవర్గ ఆమోదంతో డా॥ ఎస్వీరామారావు, డా॥ మసన చెన్నప్పలకు అప్పగించారు.

గురువర్యుల ఆలోచనకు అక్షరరూపం కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఈ వ్యాస సంకలనానికి రూపకల్పన జరిగింది. తెలుగు భాష పట్ల ఆదరాభిమానాలు కలిగిన, గడచిన తరానికి చెందిన 17 మంది సాహితీ మూర్తుల వ్యాసాలు ఇందులో చోటు చేసుకున్నాయి. సాహిత్య ప్రయోజనాన్ని, కవిత్వకళ స్వరూపాన్ని విశదీకరించేవి; పూర్వ, ఆధునిక కవుల కవితా ప్రతిభను నిరూపించేవి; సమాజంలో మాతృభాష అయిన తెలుగు ప్రాధాన్యాన్ని చాటిచెప్పేవి; దేశికవితలు, నానుడులు–పలుకుబడులు, సామెతలు మున్నగు అంశాలకు సంబంధించిన తెలుగు భాషా మాధుర్యాన్ని వివరించేవి అయిన రచనలు ఈ గ్రంథానికి వైవిధ్య వైశిష్ట్యాలను సంతరించాయి.

ప్రతిభాశాలురైన సత్కవుల 'సారస్వత జీవితము' ఉత్కృష్టమైనదని, కవులు స్వార్థ దృష్టితో కాక ఉన్నతాదర్శాలతో గ్రంథరచనకు పూనుకోవాలని ప్రబోధిస్తుంది చిలుకూరి

వీరభద్రరావు వ్యాసం. 'కవిత్వ ఫలవృక్షమునకు కవితాశక్తి వేరు, ప్రపంచ జ్ఞానము మ్రాను, భాష కొమ్మల మొత్తము, శైలి పూవులునుపండ్లును అని చెప్పనగును.' అంటూ 'గ్రంథరచన' సాధనాలను పేర్కొన్నారు మారేపల్లి రామచంద్రశాస్త్రి. "విమర్శించి చూడ కవితాకళ, శిల్పగాన చిత్రలేఖన కళల కన్న మిన్నయని నిరాతంకముగా సిద్ధాంతము సేయదగియుండును. భాషా మాధుర్యమును బట్టి మనోజ్ఞకళా వైదగ్ధ్యమును కవితా నైపుణిచే లోకమునకు ప్రసాదింపగల సామర్థ్యమే మన యాంధ్రభాష కలిగియుండుట మన యదృష్ట ఫలమని చెప్పనగును" అంటూ తెలుగు కవుల పద్యోదాహరణలతో మనోజ్ఞంగా వివరించారు సాంఖ్యాయన శర్మ.

సాహిత్య కవిత్వ తత్త్వాలను, 'కులపర్వతముల' వంటి ప్రాచీనాంధ్ర కవుల కావ్యశైలిని 'లోనారసి'న చూపుతో వర్ణిస్తూ 'ఈ పూర్వాంధ్ర సాహిత్యము విలక్షణమైన యొక సంగీత ప్రపంచకము' అని ఉగ్గడించారు విశ్వనాథ. "గత సహస్ర వత్సరాల కాలంలో మహాకవి ప్రతిభా సన్నికర్షచేత తెలుగు పద్యం బహుముఖ శిల్ప సౌందర్యాన్ని సంపాదించుకుంది. తమిళ కన్నడ సాహితీ లక్షణాలను తెలిసిన మిత్రులు ఇంత శిల్ప సంపద ఆ సాహిత్యాల్లో లేదంటారు. ఎందరో కవులు ఇంత సముజ్జ్వల సంపద మనకిచ్చిపోతే దాన్ని అనుభవించడానికి చేతగాక ధ్వంసం చేస్తామనే మాటలు, చేతలు ఈ తెలుగు గడ్డమీదనే పుట్టడం దురదృష్టం". అన్న శేషేంద్ర వాక్కులు పద్యాన్ని నిరాదరించే వారికి కనువిప్పు అవుతాయి.

"నేడు మన దేశీయ భాషలకు పూర్వముకంటే ఎక్కువ గౌరవప్రదమైన స్థానము అంగీకరింపబడుతున్నది. అది ఒక విధంగా నిర్వివాదమైన పరిష్కారము. ప్రజలు చేసిన ఈ పరిష్కారాన్ని ప్రభుత్వాలు ఒప్పుకోవటము అనివార్యము. అయితే మనదేశభాషలను ఆధునిక శాస్త్రీయ, వైజ్ఞానిక సాంకేతిక గ్రంథరచనచే పరిపుష్టం చేసి తెలుగు భాషా సాహిత్యాలకు సంపూర్ణతను సంపాదించే భారం తెలుగు సాహిత్యకులపైన ఉన్నది". అంటూ బూర్గుల రామకృష్ణారావు ప్రబోధించారు. రాయప్రోలు "ఆంధ్రదేశ సౌందర్యమును తాము ముందుంచుకొనవలెను. ఆంధ్ర సంప్రదాయములను పాటింపవలెను. ఆంధ్రుల వేషభాషలను పోషింపవలెను. సాటి

సభ్యతల యందు ఆంధ్ర సభ్యతకేమి లక్షణత్వమున్నదో దాని నుద్ధరించి ప్రకాశింపజేయవలెను". అని స్వస్థాన వేషభాషాభిమానాన్ని ప్రదర్శించారు. గత నూరు సంవత్సరాలలో భారతదేశంతో పాటు ఆంధ్రదేశంలో పొడసూపిన 'సాంస్కృతిక పునరుజ్జీవనము' నకు దోహదం చేసిన మహనీయులు, సంస్థల కృషిని విశదీకరించారు రామానుజరావు గారు.

పరభాషా వ్యామోహంతో మాతృభాషను నిరాదరించేవారిని స్వీయ విలక్షణ శైలితో ఘాటుగా అధిక్షేపిస్తూ వ్యంగ్య ధోరణిలో వ్రాయబడిన పానుగంటి ప్రసిద్ధ వ్యాసం 'స్వభాష'. స్వల్ప సంఖ్యాకులకు మాత్రమే పరిమితమైన ఆంగ్లభాష బహుళ సంఖ్యాకుల వాడుకలో ఉన్న దేశభాషకు ప్రత్యామ్నాయం కాజాలదని, పరభాషల ద్వారా శాస్త్రజ్ఞానం వర్ధిల్లదనీ, విద్యాబోధన దేశభాషలోనే కొనసాగాలని సమర్థంగా వాదిస్తుంది ఉమాకాంతంగారి వ్యాసం. ప్రజలకు అర్థం కాని గ్రాంథికభాషలో కాకుండా, నేడు ప్రజలు మాట్లాడుతున్న భాషలోనే విద్యను నేర్పించటం అవసరమని గిడుగు రామమూర్తి పంతులు ఉగ్గడించారు. 'ఆంధ్రజాతి ఆచార వ్యవహార ప్రవాహములో అంతర్లీనములయి పోయిన' దేశికవితల మాధుర్యాన్ని సోదాహరణంగా చవిచూపారు వేటూరి ప్రభాకరశాస్త్రి.

తాపీ ధర్మారావు "జన సామాన్యమున ప్రచారంలో ఉన్న పలుకుబడులు శక్తిమంతములు. వాటికి ప్రసిద్ధమైన రూపు, నిర్దిష్టమైన జీవం ఉంటుంది" అంటూ తెలుగుదనం ముద్రించుకొన్న పలుకుబడులను తెలుగుకవులు సమయోచితంగా ప్రయోగిస్తూ తమకావ్యాలను రమయంగా చేసుకొన్న తీరును హృద్యంగా విశదీకరించారు. జనవ్యవహారంలో నానార్థాలతో చెలామణిలో ఉన్న తెలుగుమాటలు నానుడులుగా ఎలా రూపాంతరం చెందాయో, అన్యదేశ్యాల చేరికతో భాష ఎలా పుష్టిమంతమవుతుందో పేర్కొన్నారు గిడుగు సీతాపతి. తెలుగు, మరాఠీ భాషా సంప్రదాయాలు, వాటి పరస్పర సంబంధాలు; ప్రభావాలను గురించిన విపులమైన వ్యాసం దొణప్పగారిది. పొరుగుభాష అయిన మరాఠీని తెలుగు ఎలా ప్రభావితం చేసిందో తెలిస్తే ఆశ్చర్యపోతాం.

లోకోక్తుల వెనుక దాగివున్న విశేషాలను విశదీకరించే ప్రతాపరెడ్డి వ్యాసం సామెతలను ఆమెతలు పెడుతుంది. 'తెలంగాణ తెలుగు జుంటితేనోలె, పసిపాపనవ్వోలె చెవులూరించుకుంట ఆమెతలు వెట్టుకపోతాది' అంటూ యాస ముసుగును తొలగించి చూస్తే అందులో అమూల్యమైన రత్నరాసులెన్నో లభ్యమవుతాయని చాటుతుంది యశోదారెడ్డి వ్యాసం.

ఈ వ్యాసాలలో వ్యక్తమైన కొన్ని అభిప్రాయాలు వర్తమాన కాలానికి వర్తించకపోయినా వాటి సమకాలీనతలోని సార్వకాలీనతను గుర్తించక తప్పదు. నేటి యువతరంలో మాతృభాష పట్ల మమకారాన్ని పెంపొందించటానికి ఇవి దోహదం చేయగలవని ఆశిస్తున్నాం.

ఈ సంకలనం రూప కల్పనకు స్ఫూర్తిదాయకులైన గురువర్యులు, ఆంధ్రసారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి.నారాయణరెడ్డి గారికి నమోవాకములు. ప్రోత్సాహం అందించిన సన్మిత్రులు పరిషత్తు ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారికి, వ్యాస సేకరణలో సహకరించిన పరీక్షా కార్యదర్శి ఆచార్య మసన చెన్నప్ప గారికి, మిత్రులు పాండురంగయ్య గారికి నా కృతజ్ఞతాభినందనలు.

హైదరాబాదు

23 నవంబర్, 2009. ఆచార్య ఎస్వీ రామారావు

అవతారిక

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా॥ సి. నారాయణరెడ్డి
అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ లోకనంది శంకరనారాయణరావు వంటి పలువురు సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943లో రూపుదిద్దుకొని, ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్ట స్థానం వహించింది. మాన్యమిత్రులు డా. దేవులపల్లి రామానుజరావు గారు యావజ్జీవితం పరిషత్తు అభివృద్ధికి శ్రమించారు. ఉత్తమాదర్శాలతో, ఆశయాలతో ఆవిర్భవించిన పరిషత్తు కాలానుగుణంగా బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి మన్ననలందు కుంటున్నది. వీటిలో భాషా బోధన, గ్రంథ ప్రచురణ ముఖ్య భూమికలు వహిస్తున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు, ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షలు జరపడంతోపాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాల, స్నాతకోత్తర స్థాయి ప్రాచ్య కళాశాల నిర్వహిస్తున్నది. పరిషత్తు రూపొందించి నిర్వహించే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి వైలక్షణ్యాన్ని సంతరించుకున్నాయి.

పరిషత్తు ఆశయాలలో ఉత్తమ గ్రంథ ప్రచురణ ప్రత్యేక స్థానం సంతరించుకుంది. పరిషత్తు వివిధాంశాలపై ప్రచురించిన గ్రంథాలను సాహితీలోకం హార్దికంగా స్వాగతిస్తున్నది. పరిషత్తు ఇంతవరకు 200కు పైగా గ్రంథాలను వెలువరించింది. ఈ పరంపరలో భాగంగా ప్రచురించిన 'తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం' 17 వ్యాసాల సంకలనం. వ్యాసకర్తలందరు గడచిన తరానికి చెందినవారు. సంస్కృతాంధ్ర భాషల్లో ప్రావీణ్యమున్న వైదుష్యమండితులు. సాహిత్య విమర్శకు సంబంధించిన

మౌలిక సూత్రాల పట్ల విశేష అవగాహన, సమగ్ర విశ్లేషణ గరిమవున్న విజ్ఞులు. గ్రంథనామం ప్రస్ఫుటం చేస్తున్న రీతిగా ఈ సాహితీమూర్తులు తెలుగు భాష, సంస్కృతి, నుడికారం, లోకోక్తులు, కవితాకళ, సాహితీ సౌందర్యం, ఛందస్సు, అలంకారాలు ఇత్యాది అంశాలను ప్రతిభాన్వితంగా వింగడించి వ్యాస రూపంలో అందించారు. ఈ గ్రంథం అధ్యాపకులకు, పరిశోధకులకు, విమర్శకులకు, విద్యార్థులకు, సాహిత్యాభిమానులకు, ఎంతగానో ఉపకరిస్తుంది. యథాపూర్వంగా ఈ గ్రంథం అందరి మన్ననలందుకుంటుందని విశ్వసిస్తున్నాను.

హైదరాబాదు
30-12-2009.

డా. సి. నారాయణ రెడ్డి

ముందుమాట

ఆరున్నర దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి, సంస్కృతికి ఆంధ్ర సారస్వత పరిషత్తు చేస్తున్న కృషి భాషాభిమానులందరికి తెలిసిందే. సమాలోచన సదస్సులు, సందర్భోచిత ప్రసంగాలు, పరిణతవాణి, సంస్మరణ ప్రసంగాలు పరిషత్తు ఏర్పాటు చేస్తున్నది. ప్రాథమిక, ప్రవేశ,విశారద పరీక్షలు కూడా నిర్వహిస్తున్నది. పరిషత్తు కార్యక్రమాల్లో గ్రంథ ప్రచురణ కూడా ముఖ్యమైనది. సదస్సులు ఏర్పాటుచేసి ఆ ప్రసంగాలు వాయు విలీనం కాకుండా గ్రంథరూపంలో ముద్రిస్తున్నది.

కొందరు సాహిత్యవేత్తల కోరిక మీద ఇప్పుడు అలభ్యంగా ఉన్న ప్రముఖుల భాషా సాహిత్య వ్యాసాలను సేకరించి ఒక సంపుటిగా ముద్రిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని మా అధ్యక్షులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు డా.సి. నారాయణరెడ్డి గారు భావించారు. ఈ బాధ్యతను మా కార్యవర్గసభ్యులైన ఆచార్య యస్.వి. రామారావు గారికి, ఆచార్య మసన చెన్నప్ప గారికి అప్పగించాం. ఎంతో శ్రమకోర్చి వారిరువురు ఈ వ్యాసాలను సేకరించి ఇచ్చారు. ఈ వ్యాసాలు ప్రధానంగా భాషా సాహిత్యాలకు సంబంధించినవి. ఎంతో ప్రామాణికమైనవి. నేటి సాహిత్య విద్యార్థులకు, పరిశోధక విద్వాంసులకు ఎంతగానో ఉపకరిస్తాయి, మార్గదర్శనం చేస్తాయి. సాహిత్యాభిమానులు వీటిని చదివి విషయ పరిజ్ఞానం పెంచుకోవడానికి తోడ్పడుతాయి. ఈ సంపుటిని సిద్ధపరచడంలో మిక్కిలి శ్రమించిన మా కార్యక్రమాల సలహాదారు శ్రీ గోవిందరాజు రామకృష్ణారావు గారికి, పరిపాలనాధికారి పాండురంగయ్య గారికి కృతజ్ఞతలు.

హైదరాబాదు
30.12.2009

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ప్రధాన కార్యదర్శి

క్రమ సూచిక

1. చిలుకూరి వీరభద్రరావు

(1872-1939)

చిలుకూరి వీరభద్రరావు గారు సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం తాలూకాలోని పెనుమదం గ్రామంలో 1872 అక్టోబర్ 17వ తేదీన సీతమాంబ, వీరరాజు దంపతులకు జన్మించిన వీరభద్రరావు రేలంగి, కొవ్వూరులలో నివాసం ఏర్పరుచుకొన్నారు. 1939 మే నెలలో స్వర్గస్థులైనారు.

పత్రికా సంపాదకులుగా, చరిత్ర రచయితగా ఆయన విఖ్యాతి గడించారు. దేశోపకారి (1895), విబుధ రంజని (1896), ఆంధ్రకేసరి మున్నగు పత్రికలకు సంపాదకులుగా సంఘసంస్కరణ, దేశభక్తి ప్రబోధకమైన పెక్కు వ్యాసాలు రచించారు. చరిత్ర రచన ఆయనకు అభిమాన విషయం. 'ఆంధ్రుల చరిత్ర'ను ఐదుభాగాలుగా, 'భారత వీరుల చరిత్ర' రెండుభాగాలుగా వెలువరించారు. వీరి తొలి చరిత్ర రచనయైన 'జీర్ణ కర్ణాట రాజ్య చరిత్రము'లో శ్రీకృష్ణదేవరాయల ప్రశంస ఉంది. అళియ రామరాయలు, తిమ్మరుసు మంత్రి, శివాజీ చరిత్ర మున్నగు ప్రత్యేక గ్రంథాలు కూడా రచించారు.

చరిత్ర పరిశోధనలో ఆయన కృషికి ఫలితంగా 1928లో సర్వేపల్లి రాధాకృష్ణ అధ్యక్షతలో నంద్యాల ఆంధ్రమహాసభవారు 'ఆంధ్ర చరిత్ర చతురానన' బిరుదుతో సత్కరించారు. 1925 లో రాజమండ్రిలో ఏర్పాటైన ఆంధ్రేతిహాసపరిశోధన మండలి స్థాపనలో ముఖ్యపాత్ర వహించారు. తిక్కన సోమయాజి, శ్రీనాథ కవి గ్రంథాలు ఆయన సారస్వతాభిరుచిని వెల్లడిస్తాయి.

1. సారస్వత జీవనము

- చిలుకూరి వీరభద్రరావు

ఉ॥ భూషలుగావు మర్త్యులకు భూరిమయాంగద తారహారముల్,
భూషితకేశపాశ మృదుపుష్పసుగంధ జలాభిషేకముల్
భూషలుగావు, పూరుషుని భూషితుఁజేయు పవిత్రవాణి వా
గ్భూషణమే సుభూషణము, భూషణముల్ నశియించు నన్నియున్.

- లక్ష్మణ కవి

సారస్వత జీవనమన నేమి?

సారస్వత జీవన మననేమో యాంగ్లేయభాషా పరిచితులు కాని వారికి బోధపడక యెద్దియో యొక క్రొత్త విశేషముగాఁ బొడకట్టవచ్చును. గ్రంథ రూపముననున్న వాఙ్మయమునకే సారస్వతమను నామము వర్తించుచున్నది. అట్టి సారస్వత నిర్మాణమునే జీవనాధారముగాఁ జేసికొని లోకయాత్ర గడుపునట్టి వృత్తికే సారస్వత జీవనమని నామకరణముఁ జేయుచున్నాఁడను. దీనినే గ్రంథములు వ్రాసి తన్మూలమున ధనమార్జించుటయే వృత్తిగాఁ గలిగియుండుట యని తేటమాటలతోఁ జెప్పఁదగును. ఇట్టి సారస్వత జీవనము నాగరికులైన విదేశీయులలో నెక్కువగాఁ గాన్పించుచున్నను మన యాంధ్రులలో నరుదై యున్నది. ఈ విషయము మహత్తరమైనదగుటచేతను, ఇదియొక వృత్తిగా మనదేశమున నదివఱకుఁ బరిగణింపబడకుండుట చేతను, ఆంధ్రసారస్వతమును గూర్చి మాత్రమే వ్రాయుదును.

ప్రాచీన కాలమున సారస్వత జీవనము

'సారస్వత జీవనము పూర్వముండెనా? ఉన్నచో నేరీతి నుండెను? ఇప్పుడేరీతి నున్నది? దీని నవలంబించుట వలనఁ గలుగు లాభనష్టము లెట్టివి? దీని నభివృద్ధి పరచుటెట్లు?' అను నీ మొదలగు ప్రశ్నంబులకుఁ దగిన ప్రత్యుత్తరంబులు సంగ్రహముగా నైనఁ జర్చించి చెప్పవలసి యుండును. సారస్వత జీవన మొకరీతిగాఁ బూర్వకాలమున మన దేశమున నుండెను గాని స్వచ్ఛమైనరీతి నుండక యదియొక ప్రత్యేక మొక శాఖవారిలోనే యత్యల్ప సంఖ్యాకులచే నలంకరించుకొనబడి దేశకాల స్థితులను బట్టి యెదుగు బొదుగు లేక సంస్కార రహితమై యొప్పుచుండెను.

పూర్వకాలమున రాజ్యపరిపాలనముచేసిన మహారాజులు, మండలాధిపతులు, సేనానాయకులు, మంత్రులు, ధనికులు మొదలగువారు కొందఱు భాషాభిమానులును కీర్తికాములునై కవులనాదరించి భూవసతులను, కొన్నివేళల నగ్రహారములను నొసంగియు, ధనకనక వస్తువాహనాదులచే సంతరింపఁ జేసియు బహువిధంబుల సత్కరించుచుండుటచేత ననేకులు వారలకు కృతుల నంకితములఁ గావించి కుటుంబ పోషణముఁ జేసికొనుచువచ్చిరి కాని యది యంత యుత్తమమార్గముగాఁ గనుపట్టకుండెను. అంతియగాక మహాసముద్రములో నొక జలబిందువువలె మహాసంఘములో వారి సంఖ్య యత్యల్పమైయుండెను. ఆ యత్యల్పసంఖ్యగలవారి మార్గము కూడ నిఱుపేదలై, భక్తాగ్రగణ్యులయిన కవివరేణ్యులచే నీచమైనదిగా గర్హింపఁ బడుచునే వచ్చినది కాని యుత్తమమార్గమని సూచింపఁబడలేదు.

బమ్మెర పోతన

పూర్వజన్మ సహస్ర సంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణకథా ప్రపంచ రచనా కుతూహలుండును, సహజపాండిత్యుండును, కవివరుండును, భక్తాగ్రేసరుండునగు బమ్మెర పోతన నిఱుపేదయయ్యును నరకృతి నిషేధించి, తన భాగవతమును శ్రీహరికంకితము చేసినట్టుగ నేతత్కృతిలోని

ఉ॥ ఇ మ్మనుజేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చికొని సొక్కి శరీరమువాసి కాలుచే
నమ్మెటప్రేటులం బడక నమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరాజొకఁడు భాగవతమ్ము జగద్ధితమ్ముగన్ .

అను పద్యమువలన విస్పష్టమగుచున్నది.

మఱియు సంకుసాల నృసింహకవియు తన కవికర్ణ రసాయనమున

సీ॥ ఆందోళికల యందు నంతరచరులైన
శవకృతాకృతులఁ బిశాచజనుల
వాలవీజనములఁ గ్రాలుచు నీఁగకు
నంటీని ఖరవర్తు లాండసముల
లేత్రపరంపరా విలకంటకాకృతిఁ
జేరఁ బోరాని కర్పూరతరుల
పరకరాలంబులై ప్రార్థింపఁ గైకోక
వాయెత్తకుండు జీవచ్ఛవముల

శంఖనాగస్వరాదిక శ్రవణ సమద
విస్ఫుటచ్ఛత్ర విస్ఫారిత స్ఫటాక
దిష్ట విషవైద్య వశవర్తి దుష్టఫణుల
ప్రభుదురాత్ముల నెవ్వాఁడు ప్రస్తుతించు !

నరగుణాంకితమయ్యెనే నరన కృతియు
దూష్యమగు శునకోద్వృత్త దుగ్ధమట్ల
హరి గుణాంకిత మయ్యెనే నరన కృతియు
హారసూత్రంబు గతి హృదయంగమంబు.

అని వాక్రుచ్చి గర్వించియున్నాఁడు. బమ్మెరపోతరాజు కర్ణాటులకుఁ గృతి యొసంగి ధనము సంపాదింపవలసినదని శ్రీనాథునిచేఁ బ్రేరేపింపఁబడినపుడు భారతి కన్నీరుమున్నీరుగా నేడ్చుచుఁ బ్రత్యక్షమైనట్లుగాఁ గాన్పించిన నతఁడు

ఉ॥ "కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ నేలయేడ్చెదో
కైటభ దైత్యమర్దనుని గాదిలికోడల యోమదంబ యో
హాటకగర్భురాణి నిను నాఁకటికిం గొనిపోయి యల్లక
ర్ణాట కిరాత కీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ!"

అని పలికి యోమె నూరార్చినట్లుగాఁ జెప్పెదరు.

ఒకప్పుడు బమ్మెర పోతరాజు పొలము దున్నుకొనుచు నలసి గట్టునఁ గూర్చుండి యుండఁగా నతని బావమఱఁది యని చెప్పఁబడెడి పై శ్రీనాథకవి "హాలికులు సుఖముగా నున్నారా?" యని పరిహాసము జేయఁగా నమ్మహనీయుఁడు.

ఉ॥ "బాలరసాల సాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్
గూళల కిచ్చి యప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి గహనాంతరసీమలఁ గందమూలకౌ
ద్దాలికులైన నేమి నిజదార సుతోదర పోషణార్థమై?"

అని యతఁడు మాఱుమాటాడకుండు నట్లుగాఁ బ్రత్యుత్తరం బిచ్చెనని కూడ చెప్పెదరు. ఇట్టి దృష్టాంతములను మఱికొన్నిటి నాంధ్రసారస్వతము నుండి యెత్తి చూపవచ్చును గాని గ్రంథవిస్తర భీతివలన వానిని విరమించుచున్నాను.

ప్రాచీన కాలమున సారస్వత జీవనము వృద్ధిబొందకుండుటకు గారణము

ఈ కాలమునందువలె నా కాలమున నచ్చుకూటములు వెలసి, గ్రంథములు ముద్రింపఁబడి మూల్యమునకు విక్రయింపఁబడుట లేని కారణమున, నా కాలమున స్వతంత్రమైన సారస్వత జీవనమున కవకాశము లేక యుండెను. ఏ తన్మూలమున

నాంధ్రసారస్వత మీకాలమునందువలె శాఖోపశాఖలతో వర్ధిల్లుటకు మార్గములేక యున్నతావుననే యుండి యా కాలపుం బ్రభువర్యుల దయాధర్మభిక్షములకు లోనై మనవలసినదయ్యెను. కాంబట్టి యా కాలమునాటి సారస్వత జీవనము నొక జీవనముగాం బరిగణింపవలసిన పనిలేదు.

పూర్వ కాలమునందు కవులు

పూర్వకాలమునం గవులయెడం బ్రజలకు భక్తికన్న భయమెక్కువగనుండెను. కవులు తిట్టిన శాపమైతగులునన్న వెఱ్ఱిభయ మా కాలముననుండుటచేం గొందఱు కవులు భూషించియు, దూషించియుం గూడ ధన మార్జించుచుండిరి. ఒకని గుఱించిన కీర్తిగాని యపకీర్తిగాని వ్యాపింపంజేయుటకు నీ కాలమునందలి వార్తాపత్రికలవలె నా కాలమునందలి కవులు కారకులగుటచేత సాధారణముగా నెల్లవారును కవులకు భయపడుచు, శుభకార్యాదులలో కట్నములు కానుకలుగూడ చెల్లించువారుగ నుండిరి. ఎవ్వరు సన్మానింపరో వారిపైం గత్తికట్టి, కలముచేంబట్టి, చలముచే నొక దూషణపద్యమును గాని గ్రంథమును గాని వ్రాసి దేశ దేశములంజాటు దుష్కవులుకూడ నుండుటచే గ్రంథకర్త పదము భయంకరమైనదై యపకీర్తిపాలయ్యెను. సామాన్యులలో 'గ్రంథకర్త' యనంగా చెడుగుచేయువాండని యపార్థమేర్పడినది. అతండు 'గ్రంథ సాంగుం డు; మనవాండు గ్రంథకర్తయైనాండు' అనునవి చెడుపనులు చేయువారిని గూర్చి పలుకునట్టి వాక్యములుగా నున్నవి.

గీర్వాణభాషా పండితులు

ఇట్లే గీర్వాణ భాషా పండితులు కొందఱు సామాన్య జనుల వేషభాషల నధిక్షేపించుచు నౌచితి నెఱుంగక ఛాందసులై పామరులతో సంభాషించునపుడు సయితము సంస్కృత పదాడంబరము జూపుచుండుటచేత సామాన్య జనులకు వారి భాష యర్థముగాక యుండెను. అందువలన సామాన్యజను లాగీర్వాణ పండితులను గర్వభూయిష్టులనుగాం దలచుచుండిరి. ఏతత్కారణము వలన గీర్వాణ శబ్దమున

కపార్థమేర్పడినది. అతనికి గీర్వాణము బలసిపోయినదనcగా వానికి గర్వమతి శయించినదను నర్థము స్ఫురించుచున్నది. ఎంతటి సద్వస్తువునైనను సద్వినియోగ మునకుcదేక దుర్వినియోగపఱచుచున్న యెడల దానికుండు సహజ గౌరవముకూడ చెడుచుండుననుటకు పై విషయములను తార్కాణముగc జూపవచ్చును. కాబట్టి గ్రంథకర్త శబ్దమునకట్టి యపార్థ మేర్పడినప్పుడు సారస్వత జీవనమునకు సంఘములో గౌరవమెట్లేర్పడc గలదు?

నవీన కాలమునందలి యభివృద్ధి

కనుకనే మనదేశములో నింతకుcబూర్వము గ్రంథరచన యొకవృత్తిగాc బరిగణింపcబడుచుండలేదు. అది సద్వృత్తులలో నొక్కటి యనుమాట జనసామాన్య మునకుc దెలియకుండెను. ప్రస్తుత స్థితి యొకింత పరికింతము. బ్రిటీషు ప్రభుత్వము మనదేశమునకు లభించినాటినుండి మనదేశములో ముద్రాయంత్రములు వెలసి ప్రాచీనాంధ్ర గ్రంథము లనేకములు ముద్రింపcబడి చౌకవెలలకు వేనవేలు విక్రయింపc బడుచున్నవి. వార్తా పత్రికల మూలముననను ఏటేటను ముద్రాయంత్రముల నుండి వెలువడు గ్రంథముల వలనను భాషాభివృద్ధి యగుచున్నది. స్వదేశోద్యమము వలన మన దేశమునకుcగలిగిన లాభము భాషోజ్జీవనమని ముఖ్యముగా జెప్పదగును. సర్వకలాశాలాధికారులు దేశభాషల నుద్ధరింప నుదాసీనులై యున్నను దేశమున గ్రంథ ప్రచారమునకై యనేక సమాజములేర్పడి యేటేట బెక్కు గ్రంథముల నచ్చొత్తించుచు దేశమున వెదcజల్లుచున్నవి. ఆంగ్లేయభాషా విశారదులైనవారు మాతృభాషవట్ల విముఖులుగాక యనేకులిప్పుడు మాతృభాషాభిజ్ఞులై యత్యంతోత్సాహముతో మాతృభాషా సేవకై గడంగుచున్నారు. పల్లెలలో సైతము గ్రంథభాండాగారములు వెలయుచున్నవి.

మార్పు కాలము

శాస్త్ర గ్రంథములు, చరిత్ర గ్రంథములు, నవలలు, నాటకములు ముద్రా యంత్రముల నుండి వెలువడుచు నొకరీతిగా నమ్ముడువోవు కాలము వచ్చినది. ఇది యొక మార్పుకాలము. ఈ కాలస్థితిని జూచి యనేకులాకర్షింపఁబడి గ్రంథరచనకుఁ బూనుకొని దానినే జీవనాధారమగు వృత్తిగఁ జేకొనవలయునని సాహసించి ముందుకు వచ్చుచుండుటచే భాషా ప్రపంచమున నొక గొప్పకలవరము జనించుచున్నది. దాని స్వరూపమిట్టిదని తెలిసికొనుట గ్రంథరచనకు దొరకొనఁబూనిన ప్రతిమనుష్యున కవశ్యకర్తవ్యమై యున్నది. గ్రంథకర్తలకు మాత్రమేకాదు, దేశక్షేమము నభిలషించి సారస్వతాభివృద్ధికై పాటుపడుచున్నట్టి ప్రతిదేశాభిమానికి కలవర స్వరూపమును దెలిసికొనుట విధియై యున్నది. ఈ కలవరమే నేఁడీ వ్యాసమును వ్రాయుటకు నన్నుఁ బ్రేరేపించుచున్నది.

ఈ కాలమునందలి కవులు

వస్తు స్వరూపమును సరిగా గ్రహింపశక్తులు లేక దురాశాబద్ధులై యనేకులు సరియైన భాషాజ్ఞానముగాని, శిక్షగాని, లోకానుభవముగాని, యోర్పుగాని లేక గ్రంథకర్తలకుండు బాధ్యతలను గుర్తెఱుంగక, దుస్సాహసమునకుఁ గూడ నొడిగట్టి, చేతకాని పనులకుఁ జేయిచాచి, తాము నష్టముఁబొందుటయెగాక తాఁజెడ్డకోతి వనమెల్లఁ జెఱిచినదన్నట్లు ప్రతిభాశాలురైన గ్రంథకర్తల ప్రయత్నములకుఁ గూడ నాశనమును గల్పించి, దేశమునకుఁ జేటువాటిల్లురీతి వర్తింప సమకట్టుట శోచనీయము. మనదేశములో నెవ్వఁడేని సమర్థుఁడొకఁ డొకవ్యాపారమును జేసి, యా వ్యాపారమునకై నానాకష్టములుపడి సమర్థతతో దానిని నిర్వహించి కొంచెము లాభము బొందుట తటస్థమైనతోడనే యనేకులదివరకు మాంద్యులై యుండియు, మఱియొకవృత్తికి దొరకొనక వానిపై పోటీకి బోయి, యా వ్యాపారమునే చేయనవలంబించి, తాము నష్టము బొందుటయేగాక, లాభమునుబొందుచున్న

మొదటివానికి నష్టముగలిగించి, చెఱుచుచుండుట మనము కన్నులారఁ జూచుచున్నారము. సారస్వత విషయమునఁ గూడ నిట్టిచందములే గానంబడుచున్నవి.

సారస్వతజీవనము కష్టసాధ్యము. మిక్కిలి పవిత్రవంతము. సుగుణాఢ్యులకు సులభసాధ్యము. దురాశాపాశబద్ధులకు దుస్సాధ్యము. నాల్గుపద్యము లల్లఁగల్గిన వాఁడు కవియు, నాల్గు పత్రములు గీకినవాఁడు గ్రంథకర్తయుఁ గాఁజాలఁడు. సత్కావ్యములను రచించువారు సత్కవులు. సత్కవుల సంవృత్తమును సంకుసాల నృసింహకవి కవికర్ణరసాయనమున నిట్లభివర్ణించియున్నాఁడు.

ఉ॥ మనమునఁగొన్న నెవ్వగలు మాన్పి ఘటింతు రకాండనమ్మదం
బనఘు కథాముఖంబున హితాహిత బోధ మొనర్తు రింపుగా
గనుఁగొనుకంటె నద్భుతముగా నెఱిఁగింతు రతీంద్రియార్థముల్
ఘనమతు లెల్లవారికి నకారణబంధులుగారె సత్కవుల్.

ఇక్కాలమున నిట్టిసత్కవు లెక్కడనోగాని కానంబడరు. సత్కవులెట్టివారో సద్గ్రంథకర్తలు నట్టివారేయగుదురనుటకు సందియములేదు. నిష్కళంకమైన యోచన, సత్యమం దనురాగము, కీర్తిప్రదమైన స్వేచ్ఛ వీనితోగూడికొన్న దైనయెడల సారస్వతజీవనము తక్కినవానికన్న శ్రేష్ఠమైనదనుటకు లవమాత్రము సందియములేదు.

గ్రంథకర్తలు

తనంతగ తానొకపక్షమునకు మొగ్గనూహించినప్పుడు తక్క గ్రంథకర్త యెన్నఁడును నొకమనుష్యునకుఁగాని, యొకస్థలమునకుఁగానిఁ యొకపక్షమునకుఁ గాని వశుఁడు కాఁజాలఁడు. గ్రంథకర్తకు జనసామాన్యమైనను రాజాధిరాజైనను నొక్కటియే. గ్రంథకర్త యనేకప్రజలను బరిపాలింప సమర్థత గలవాఁడు. అతని శక్తి మహత్తరమైనది. అప్రతిమానమైనది. కనుక సారస్వతజీవనము తక్కినవానికన్న నధికసంతోషకరమైనదిగానే నూహించెదను. అట్టివారు సారస్వతజీవనము గలవారిలోనే పెక్కండ్రుకలరని నే

నెఱుంగుదును. అగ్నిమాంద్యముచే కష్టిపడువారనఁగా మనోరథభగ్నులైన గ్రంథకర్తలు పెక్కుండ్రు గలరు. ప్రచురణకర్తలకు ననేక సంవత్సరముల వఱకు నొడంబడికలు వ్రాయువారు శృంఖలములలో నృత్యములు సేయువారివగిది దుఃఖభాజను లగుచున్నారు. సారస్వత జీవనము వలనఁ గలుగవలసిన యానందము గలుగనేరదు. ప్రచురణకర్తలు తమ కృషికి నెంత ప్రతిఫలము నొసంగుదురోయని యనుదినమును తాను వ్రాసిన కాగితములను లెక్కపెట్టుకొనుచుండు గ్రంథకర్త యెన్నఁడును సుఖమనుభవింపఁజాలడు. జన ప్రవాహమెట్లీడ్చిన నట్లుపోవును. నేఁడిచ్చట, రేపు వేఱొక్కచోట, నెల్లుండి మఱొక్కచోట స్తుతిపాఠములంగనుచు, తబ్బిబ్బులగుచు, అప్పటికానందమును బొందఁగోరు గ్రంథకర్త దేవతా ప్రసాదమునకు దూరగుఁడై తానెవ్వరితోఁగలసిమెలసి తిరుగదలంచెనో యట్టి గొప్పవారిచేతనే పరిత్యజింపఁబడి తుదకు కష్టకాలమునకు నసహాయుఁడై పరితప్తుఁడు గాకమానఁడు.

శ్రీనాథుని యవపాన దశ

మహారాజుల చెలిమిఁజేసి, బంగరుతూగుటుయ్యేలలో నూగుచు, హంసతూలికా తల్పంబులలో శయనింపుచు, బల్లకులలో నెక్కి యెల్లవేళల విహరించుచు, బమ్మెర పోతరాజు దారిద్ర్యమును బరిహసించిన కవిసార్వభౌముడు శ్రీనాథుని వంటివాఁడు సైతము వార్ధక్యమునఁ గష్టపరంపరల పాలయిన విషయము శ్రీనాథకవికృతములైన–

సీ॥ కవిరాజు కంఠంబుఁ గౌఁగిలించెనుగదా
పురవీధినెదురెండ పొగడదండ
సార్వభౌముని భుజా స్తంభమెక్కెనుగదా
నగరివాకిటనుండు నల్లగుండు
ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబున
దగిలియుండెనుగదా నిగళయుగము

వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత
వియ్యమొందెనుగదా వెదురుగొడియ

కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు తినిపోయెఁ దిలలుఁబెసలు
బొడ్డుపల్లెను గొడ్డేలి మోసపోతి
నెట్లు చెల్లింతు టంకంబు లేడునూర్లు.

సీ॥ కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి
రత్నాంబరంబు లే రాయఁడిచ్చుఁ
గైలానగిరిఁబండ మైలార విభుఁ డేగె
దినవెచ్చ మేరాజు తీర్పఁగలఁడు
రంభగూడె తెనుంగురాయరాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి మఱి హేమ
పాత్రాన్న మెవ్వనిపంక్తిఁ గలదు

భాస్కరుఁడు మున్నె దేవునిపాలి కరిగెఁ
గలియుగంబున నుండఁ గష్టమనుచు
దివిజకవివరు గుండియల్ దిగ్గు రనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి.

అను పద్యములలోఁ దెలుపఁబడియుండెను.

రాబర్టు బరన్సు

ఇట్లే ప్రసిద్ధిఁగాంచిన 'రాబర్టుబరన్సు' అను నాంగ్లేయకవి యౌవనకాలమున మిక్కిలి గౌరవించి శ్లాఘించుచుండెడి తన తొంటిమిత్రు లుపేక్షాపరులై , యొక్కరొక్కరే

విడిచిపోవ, 'నైదుపోను' లప్పీయవలసినదని యొక ప్రచురణకర్తను బ్రార్థింపవలసి వచ్చినది. తన యౌవనమునఁ దన్ను స్తుతించిన ధనాఢ్యులగు ప్రభువులందఱు నేమైరి? వారి సంబంధములు వారి కార్యములు నెఱవేరినంతవఱకే. కుక్షింభరణార్థము స్తోత్రప్రియులైన ప్రభువులను, ధనాఢ్యులను బొగడుచుండెడి కవులకెప్పటికి సారస్వతజీవనముల వలనఁ గలిగెడి నిజమైన సౌఖ్యము గలుగనేరదు. కుక్షింభరణార్థము తన యమూల్యమైన స్వాతంత్ర్యామృతమును ధారవోసి, బానిసతనము నలంకరించుకొను గ్రంథకర్తకు నిజమైన సౌఖ్యమెట్లు లభించును? మఱికొందఱు గ్రంథకర్తలు కుక్షింభరణార్థము తమ కృతినాథుల సంతోషపెట్టుటకై యోగ్యులైన సత్కవులెన్నడును వినరాని కనరాని క్షుద్రవిషయములకుఁదిగి తమ శక్తులను భ్రష్టపఱచుకొనుచున్నారు.

గ్రంథకర్త కష్టములు

ఇట్టివారి విషయ మటుండనిచ్చి, సారస్వతము జీవనముగాఁజేసికొన్న సద్గ్రంథకర్తలకు కష్టములు లేవాయని యడుగవచ్చును. గ్రంథకర్తలకు ఆశాభంగములు, నిరుత్సాహములు, కష్టములు లేకయున్నయెడల వారు ఆనందముయొక్క విలువనెట్లు తెలిసికొననగును? సుస్థిరచిత్తుఁడైన గ్రంథకర్త ఫలసిద్ధినిగోరువాఁడగునేని యెన్నఁడు నాశాభంగములకు, నిరుత్సాహములకు, నాటంకములకు భయపడి వెనుదీయఁడు. అతఁడు వానినే విజయకారణములుగా జేసికొనఁజూచును. సారస్వతమునకు సేవఁ జేయబూనిన నిజమైన గ్రంథకర్త యుత్కృష్టాదర్శములను గలిగియుండు భాగ్యము వహించియుండెనేని సౌఖ్యప్రదములయిన వస్తువులను వ్యర్థవ్యయములను దాంభికత్వమును విడిచి సులభజీవనమున కలవాటుపడి, తృప్తిఁగాంచియుండును, పుష్టికరమైన భోజనము మెదటికి చుఱుకుఁబుట్టింపఁ జాలదు. ప్రతిభాశాలి లక్షాధికారిగఁ బుట్టియుండలేదు. అసూయాపిశాచగ్రస్థులగు కువిమర్శకుల వలన గ్రంథకర్తలకు మనస్తాపములు కలుగుచుండును. గొప్పతనమునుగోరి ముందుకు సాగివచ్చు ప్రతిగ్రంథకర్తకు నిట్టిపీడ కలుగుచునేయుండును.

నిజమైన గ్రంథకర్త

కాని ప్రతిభాశాలియైన గ్రంథకర్త యెన్నడును నిరుత్సాహమును జెందక పట్టుదలయు, నభినివేశమునుగలిగి నిరంతరకృషిచే నట్టి శత్రువుల కందనివాఁడై యున్నతస్థానమును జేరి పరమానందమును బడయుచుండును. సత్యానురక్తి, ఆత్మ గౌరవము, ఆత్మవిశ్వాసము, ఆత్మశిక్ష, జితేంద్రియత్వము, నిరంతర పరిశ్రమ అభినివేశము, సాహసము, ధైర్యము గలిగియుండునట్టి ప్రతిభాశాలియైన గ్రంథకర్త పామరజనానురాగమునకై యుత్తమగుణములను గోల్పోవఁజూడఁడు. ప్రపంచమును దనవెంట నీడ్చుకొనిపోవఁజూచునుకాని ప్రపంచము వెంటఁ దాను బఱుగిడఁజూడఁడు. ఇట్టి శక్తులులేనివాఁడు గ్రంథరచనకు దిగరాదు. దిగినను నిష్ప్రయోజనము.

క. **నేరిచిన సుకవి కృతిచేఁ**
బే రెఱిఁగించుకొని జగతిఁ బెంపగు టొప్పున్
నేరక కృతిఁ జెప్పుట దన
నేరమి యపకీర్తి జగతి నిలువుట గాదే.

క. **ఏ రసముఁ జెప్పఁ బూనిన**
నా రస మాలించువారి కదరింపని యా
నీరసవుఁ గావ్యశవముల
దూరముసన పరిహరింపుదురు నీతిజ్ఞుల్.

చ. **భణితులు రెంట మూఁట నొకపద్యము గూరుచువారు లక్ష్యల**
క్షణ సహకావ్యనిర్వహిత గల్గుట చిత్రము గానియట్ల పో
ఫణిమణిమాత్రధారులగుపాము లసంఖ్యము గాన తత్ఫణా
మణివిధ విశ్వభూభృతి సమర్థుఁడు శేషుఁడు గాక కల్గునే.

అని పై పద్యములలోఁ గవికర్ణరసాయన కావ్యకర్త విస్పష్టములగు వాక్కులతోఁ బ్రతివాఁడును గ్రంథరచనమునకు దిగరాదని సూచించియున్నాఁడు.

"Valuable energy is wasted by being misdirected. Men are constantly attempting without special aptitude, is indispensable". అని జార్జిహెన్రీలూయిస్ వక్కాణించుచున్నాఁడు. అన్నింటికంటెను సారస్వతజీవన ముత్కృష్టమైనదనుటకు సందియములేదు. ప్రతిభాశాలియైన గ్రంథకర్త యొక్కఁడుమాత్రమే కష్టపరంపరల నుండి తప్పించుకొని, సానంబట్టిన మణివలెఁ బ్రకాశింపఁగలఁడుగాన ప్రతిభాశాలురుమాత్రమే సారస్వతమును స్వతంత్రజీవనముగఁ జేసికొనఁదగియుందురుగాని యే విధమైన విద్యాశిక్షణమును లేక యచ్చుకూటములు తేరగనున్నవికదాయని పాడుపొత్తములను రచించి ముద్రణముగావించి యదియొక జీవనోపాధిగఁ జేసికొనఁ గోరువారు తుదకు నష్టమును బొందగలుగుదురే కాని లాభమును బడయఁజాలరు. ఎల్లవారును సద్గ్రంథకర్తలఁ బ్రోత్సాహపఱుచుచు నసద్గ్రంథకర్తల నిరుత్సాహపఱుచుచు నాంధ్రసారస్వతము పరిశుద్ధమైన దానినిగఁజేయుట విద్యుక్తధర్మమని వేఱుగ నేఁ జెప్పనక్కరలేదు.

మనము చేయవలసిన పని

ఆంధ్రసారస్వతము బెక్కువిధముల నేఁ డభివృద్ధిగాంచుచున్నను, సంస్కారమభిలషించుచున్నది. నేటికాలమున వందలకొలఁది నవలలు ముద్రింపఁబడుచున్నను గొన్నిట మృదుమధురమైన శైలి మృగ్యమగుచున్నది. మన యాంధ్రులలోఁ బ్రతిభాశాలురైన మేధావులు కొంద ఱాంధ్రసారస్వతమును జీవనాధారముగఁజేసికొని సంఘమున కత్యావశ్యకములును, ఆరోగ్యప్రదములునగు గ్రంథసముదాయము నుజ్జీవింపఁజేయవలసియున్నది. అట్టి ప్రతిభాశాలురు బయల్వెడలిన యెడల దేశాభిమానులెల్లరును వారికి సర్వవిధములఁదోడ్పడి యాంధ్రసారస్వత మున్నతస్థితికి వచ్చునట్టులను జేయుటయుగాక సారస్వతజీవనముగూడఁ బవిత్రమైనదనియు, నత్యావశ్యకమైనదనియు, బ్రోత్సాహపఱుపఁదగినదనియు నాంధ్రలోకము గ్రహించునట్లు కృషిసల్పుట మనకెల్లరకు ముఖ్యకర్తవ్యము.

(గ్రంథాలయ సర్వస్వము – 1910, I.1)

౭. మారేపల్లి రామచంద్ర శాస్త్రి

(1874-1951)

శతాధిక గ్రంథకర్తగా పేరొందిన విద్వత్కవి, నాటక కర్త, జాతీయవాది. కృష్ణాజిల్లా కనకవల్లి అగ్రహారంలో కనకదుర్గ, శ్రీరాములు దంపతులకు జన్మించిన రామచంద్ర శాస్త్రి విశాఖపట్టణాన్ని నివాసంగా చేసుకొన్నారు. స్వాతంత్ర్యోద్యమం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభలలో క్రియా శీలకమైన పాత్ర నిర్వహించారు. విద్యార్థి దశలోనే కవిగా గుర్తింపు పొంది 'కవిగారు' అన్న బిరుదును సార్థకం చేసుకొన్నారు. నాటకాలు, దేశీయ గీతాలు, దండకాలు, హరికథలు, చాటుపద్యాలు మున్నగు అసంఖ్యాక రచనలు చేశారు. బాల్య వివాహం, కన్యాశుల్కం, వరశుల్కం, వేశ్యావృత్తి మొ॥ దురాచారాలను తమరచనల్లో నిరసించారు. రౌద్రం, పరాక్రమం, సెబాసు వంటి నూతన వృత్తాలను కల్పించి ఛందస్సులో ప్రయోగాలు చేశారు. తెలుగు భాషోత్పత్తికి సంబంధించిన 'తెలుగు నుడికడలి' అన్న నిఘంటువును సంకల్పించారు కాని అందులో కొంత భాగం మాత్రమే ప్రచురితమైంది. క్రియా పదాలకు 'చెయిది పొడలు', తత్సమాలకు 'సరి నుడులు', దేశ్యాలకు 'నాటి నుడులు' అని పేర్లు పెట్టిన శాస్త్రిగారు 'నన్నయ నుడులు' అన్న గ్రంథం కూడా వెలువరించారు. వీరి జీవిత చరిత్రను 'కవిగారి మనుగడ' పేరుతో (1935) జయంతి సుబ్బారావు రచించారు.

౭. గ్రంథరచన

- మూరేపల్లి రామచంద్రశాస్త్రి

ప్రపంచము పుట్టి ఎంతో కాలమైనది. ఎన్నో యుగములు కడచినవి. ఎన్నో రాజ్యములు ఎన్నో సామ్రాజ్యములును వెలసినవి అడుగంటిపోయినవి. ఎందఱో జ్ఞానులును, భక్తులును, శాస్త్రజ్ఞులును, మహాయోధులును, దేశాభిమానులును,పరోపకార పరాయణులును బయలుదేఱి, తమ తెలివితేటల చేతను, మంచిపనుల చేతను లోకమును బాగుచేయ ప్రయత్నించి కొంతవఱకు బాగుచేసినారు; గతించినారు. తరువాత ఎన్నో క్రొత్తరాజ్యములును, సామ్రాజ్యములును తలలెత్తి ఇప్పుడు వెలయుచున్నవి. ప్రాతవియు కొన్ని మరల పైకి లేచుచున్నవి. లోకోపకారకములగు సత్ప్రయత్నములు అనేకములు జరుగుచున్నవి.

అయిన – పూర్వుల అనుభవముగాని – ఇప్పటి వారి అనుభవముగాని, పూర్వుల బుద్ధివిశేష ఫలములు గాని – ఇప్పటి వారి బుద్ధి విశేష ఫలములుగాని తెలియుట ఎట్లు? ఎంతకాలమో శ్రమపడి సమకూర్చిన జ్ఞానధనము మనకు ఒక్కసారియే అబ్బుట ఎట్లు? ఇప్పుడున్న పండితుల వల్లనే స్వయముగా జ్ఞానము గడింప వీలు సరిగా లేకున్నప్పుడు గతించిన పూర్వుల జ్ఞానము వారివల్లనే సంపాదింత మనుకొనుటకు అసలే వీలు లేదు కదా! ఇఁక సాధనాంతరములు ఏవైన ఉన్నవా? లేవా? దైవానుగ్రహమున లేకపోలేదు, ఉన్నవి. అవి బుద్ధిమంతులగు పూర్వులే కనిపెట్టినారు. వారు తమ జ్ఞానము తమ తోడను – తమ తోడివారి తోడను నశించిపోక స్థిరముగా ఉండునట్లు చేయుటకై వ్రాఁత కనిపెట్టినారు. ఆ వ్రాత రూపమున తమ జ్ఞానము తమ కాలపువారి మేలుకొఱకును, తరువాతి వారి మేలుకొఱకును నిలుచున్నట్లు

చేసినారు. తరువాత బుద్ధిమంతులు కూడ అటులే చేయ మొదలుపెట్టినారు; చేయుచున్నారు. వ్రాంత రూపమున వెలయుచున్న జ్ఞానపు గనులే గ్రంథములు. అక్షరాత్మకములగు ఈ గ్రంథములే; నిజముగా అక్షరములగు నీ గ్రంథములే లోకజ్ఞానము కలిగించు ప్రబల సాధనములు. ఈ సాధనముల వల్లనే ఎందఱ తాము బాగుపడి–తోడివారిని బాగుచేయుటకు తగిన స్థితిలోనికి వచ్చినారు. వచ్చుచున్నారు. (గ్రంథములకే కావ్యములు అని మఱి ఒక పేరు.) అందుచేత గ్రంథ రచన అత్యావశ్యకము. పెక్కుమాటలేల? గ్రంథరచనయే లేకున్న మనలోకము ఇప్పటి ఉన్నత స్థితిలోనైన ఉండి ఉండదు. ఇది శిలాక్షరము.

గ్రంథరచన అనగా నేమి?

గ్రంథములు చేయుటయే గ్రంథరచన. గ్రంథములు చేయుట అని చెప్పుటచేత ఒక గ్రంథమును చూచి దానికి మఱి ఒక ప్రతి వ్రాయుట గ్రంథ రచనకాదు. అయిన, మఱిఏమి? స్వభావసిద్ధములగు సంగతులుగాని–అనుభవసిద్ధములగు సంగతులుగాని–శాస్త్ర సిద్ధములగు సంగతులుగాని–ఆయా కాలములయందు జరిగిన సంగతులుగాని–అనుభవమును బట్టి బుద్ధివిశేషముచే కల్పించిన సంగతులుగాని–పై తరగతులలో కొన్ని కొన్ని తీసికొని కలిపిన సంగతులు గాని ఒకదానితో ఒకటి సంబంధము కలిగి ఉండునటుల–చక్కని భాషలో–మనసు కరిగించునట్టి ఒప్పిదమగు శైలిని–జ్ఞానము కలిగించియో–నీతి బోధించియో ఆనందము కలిగించుటకు సహజ శక్తి చేత స్వయముగా కూర్చి వ్రాయుటయే గ్రంథములు చేయుట. పై లక్షణములు కల ఒక భాషలోని గ్రంథములను వేరొక భాషలోనికి తెచ్చుటయును గ్రంథరచన గానే ఎన్నిక కాంచుచున్నది. గ్రంథరచనకే కవిత్వము అని మఱి ఒకపేరు.

పై సంగతులను బట్టి, గ్రంథరచనకు (1) సహజమగు కవితాశక్తి (2) మంచి ప్రపంచ జ్ఞానము (3) చక్కని భాషా జ్ఞానము (4) తగినంత శైలి జ్ఞానము అను నాలుగు సాధనములు ప్రధానములు అని తట్టును. ఇందులో కవితాశక్తి

కావ్యలక్ష్మికి ప్రాణము, ప్రపంచజ్ఞానము శరీరము, భాష వాహనము, శైలి వస్త్రాద్యలంకారము అని చెప్పవచ్చును. కాని గ్రంథరచన చేయఁగోరు వారికి ఈ సాధనములను గూర్చి కొంతవఱకైనను తెలిసికొనుట ముఖ్యము. కాఁబట్టి, ఒక్కొక్కటిగా తీసికొని వీనిని గూర్చి సంగ్రహముగా చర్చించి చూడనగును.

1. కవితా శక్తి :

ఆయా గుణములు మనకు పూర్వవాసన వల్ల వచ్చునట్లే కవితా శక్తియు పూర్వ వాసనవల్లనే వచ్చును. పూర్వవాసన హెచ్చయిన కొలఁదిని కవితాశక్తియు హెచ్చగును. కొందఱు మహాకవులును–కొందఱు సాధారణ కవులును అగుటకు కారణము పూర్వవాసన యందలి హెచ్చుతగ్గుల భేదమే. కవితాశక్తితో సంబంధించిన పూర్వ వాసన ఏమియులేనిచో కవితాశక్తి అబ్బనే అబ్బదు. మహాపండితులు కొందఱు నాలుగు ముక్కలు కూడ కూర్పఁజాలకపోవుటయే ఇందుకు తార్కాణము. అందుచేతనే పెద్దలు ఋషుల అంశలేనివారు కవులు కానేరరని చెప్పిరి. కవితాశక్తి సామాన్యపు భాగ్యము కాదు. దానితో సమానమగు భాగ్యము మఱియొకటి లేదనియే చెప్పనగును. రాజర్షి భర్తృహరి అందుచేతనే కదా 'సుకవితా యద్యస్తి రాజ్యేనకిమ్' అని అనుభవము చేత చెప్పినాఁడు. చూచితిరా! సుకవిత ఉన్న యెడల రాజ్యముకూడ అక్కఱలేదట! కాఁబట్టి దైవానుగ్రహమున కవితాశక్తి అబ్బినవారు అది సరిగా వాడుకచేసి అందువలన తాము మేలుపొంది, లోకమునకు మేలుచేయ యత్నించవలె. ధారాజలము కాలువల మూలమున పండ్లచెట్ల పాదులకు చేర్చి, అవి ఫలించునట్లొనర్చి ఆ ఫలములనుభవించి సుఖపడుటకు అవకాశము కలిగించు విధమున, సహజమగు కవితా ధారను లోకజ్ఞానమూలమున సద్విషయములకు చేర్చి, వాని ఫలము లనుభవించి లోకులు సుఖపడుటకు అవకాశము కలిగింపవలెఁగాని ఉప్పు పఱ్ఱలలో చేరి వ్యర్థమగు ధారాజలమువలె కవితాధార దుర్విషయములతో చేచి వ్యర్థమగునట్లు చేయరాదు. ప్రయత్నించి కవితాశక్తి అంకురించునట్లు కూడ జేసికొననగును.

ఎండకాలము భూమిలో అణగియుండు విత్తనమువలెను, వేరు వలెను,

దుంపవలెను కవితాశక్తి చిన్నతనమున కవుల మనస్సున అణఁగి యుండును. తొలుకరి వానలుపడి భూమి నానిన పిదప మొలకెత్తు విత్తనము మొదలగు వానివలె కవితా శక్తియు అక్షరజ్ఞానము కలిగి, మంచి గ్రంథములు చదువ మొదలుపెట్టిన పిమ్మట బయలుపడును. కాలమునకు వానలు సరిగా కురియుచుండిన యెడల మొలకెత్తిన మొక్క నవనవలాడుచు పెరిఁగి, పూచియో, కాచియో, పండియో లోకులకు మేలు చేయునటుల కవితాశక్తియు క్రమక్రమముగా సద్గ్రంథములు చదువుటచేతను, సృష్టి చిత్రములు కనిపెట్టుచుండుట చేతను జ్ఞానమభివృద్ధి పొందిన కొలఁదిని మనోహరముగా దినదినాభివృద్ధి నొంది, పురాణరూపముననో, ప్రబంధరూపముననో, నాటక రూపముననో, నవలరూపముననో, మఱి ఏదో తరగతి గ్రంథరూపముననో వెలువడి లోకులకు మేలు చేయఁజాలును.

కాని లోకమునకు సరిగా మేలుచేయుటకు తగియుండు కవిత్వమునకు కొన్ని సంస్కారములు కావలయును. సంస్కారములేని కవిత్వము అడవి వంటిది. అడవిలో పండ్లచెట్లును ఉండును; ముండ్లచెట్లును ఉండును. పూలపొదలును ఉండును; ముండ్లపొదలును ఉండును. ముండ్లమొక్కలు మొదలగునవి ఉండిన నేమి? వాని జోలి మనకెందుకు? అని అనుకొనుటకు వీలులేదు. అడవిలోనికి అసలే వెళ్ళకపోయిన ఏమియును భయములేదు గాని, వెళ్ళితిమా వాని జోలి మనకక్కఱలేదనుకొన్నను వానికి మనజోలి తప్పక కావలసియుండును. అడవిలో కాలు పెట్టునప్పటికి అవి తమ ప్రభావము కనఁబఱుప మొదలుపెట్టును. పువ్వుల కొఱకుఁగాని, కాయల కొఱకుఁగాని, పండ్లకొఱకుఁగాని ఆశపడిన వారికి ముండ్లముద్ర తాతాచార్యుల గారి ముద్రయే. ముండ్లమొక్కలు మొదలగునవి పూలమొక్కలు మొదలగువానితో కలిసి మెలసి ఉండుటయే ఈయవస్థకు కారణము. ఇందువల్ల తేలినదేమి? అడవివల్ల లోకమునకు మేలుతోపాటు కీడును కలుగును. ఇట్లే సంస్కారములేని కవిత్వము వలన అక్కడక్కడ గుణములు ఉన్నను వానితోపాటు దోషములును కలిసి ఉండును గావున మేలుతోపాటె కీడును కలుగును. దోషములే హెచ్చయిన ఇఁక చెప్పవలసిన

దేమున్నది? " సిరి అంటదు, కాని చీడ అంటును" అను సామెత ఎవరికి తెలియదు? నీతి పట్టువడుట దుర్లభముగాని దుర్నీతి పట్టువడుట సులభము. చక్కని భాష స్వాధీనము కాదుగాని పాడుభాష సులువుగ స్వాధీనమగును; కాదు, స్వాధీనము చేసికొనును. దురభ్యాసములు పట్టువడుట సుకరముగాని వదలుట దుష్కరము. కాన సంస్కారములేని కవిత్వము వల్ల తుదకు మేలుకంటె కీడే హెచ్చుగా కలుగును. కాఁబట్టి, కవిత్వము అడవి వంటిది గాక పూలతోఁట వంటిది కావలయును. సంస్కారములు పొందిన కవిత్వము పూలతోటవలెనే ఉండును.

కవిత్వము కళలలో ఒకటి; పూలతోట వేయుటయును కళలలోనే చేరును. రెండింటి యందును మనుష్యుల బుద్ధి వాడుక కావలెను. రెండింటి వల్లను పొందఁదలఁచు ఫలము ఆనందమే. పూలతోటలో నేల అంతయు నదనుచేసి–బాటలువేసి, తోఁటమాలి ఆయా పట్ల పూలమొక్కలును – పండ్లచెట్లునువేసి పూలపొదరిండ్లు కట్టి – తీఁగెలు ప్రాకించి – తగిన దోహదములు చేసి – పూచునవి పూచునట్లును – కాచునవి కాచునట్లును చేసి, సమస్తేంద్రియములకును ఆనందము సమకూర్చును. పనికిమాలిన గడ్డిగాదములుగాని – బాధించు ముండ్లచెట్లుగాని పూలతోఁటయందు పొడకట్టవు. అట్లే సంస్కారములు పొందిన కవిత్వమందు – గ్రంథరచనయందు – స్వభావసిద్ధములయి మృదుమధురములగు శబ్దములును – గంభీరములగు అర్థములును – కల్పనలును – నీతులును – ఆదర్శములును – ఉచితములగు రసములును – గుణములును కానవచ్చును. మనస్సు కరఁగించి – ఆనందమున తేల్చునుగాని – స్వభావ సిద్ధములుగాక వెంటనే మొగము మొత్తించు చెవికింపుగాని మోటుమాటలును– సాంకేతిక పదములును – చొప్పదంటు అర్థములును – కల్పనలును – దుర్నీతులును– దురాదర్శములును – ఔచిత్యము పాటింపమిచే అసహ్యకరములగు రసములును – దోషములును కానరావు.

కవిత్వ సాధనములలో కవితాశక్తి మొదటిదిగాన దీనికే మొదట సంస్కారము కావలసియుండును. దీని సంస్కారము ప్రారంభమైనచో తక్కిన సాధనములకును

సంస్కారము ప్రారంభమైనట్లే. ఏమందురా? కవిత్వ సాధనములన్నియు బీరకాయ పీచువలె ఒండొంటితో సంబంధము కలిగి ఉండునవిగాని 'నీళ్ళకు నీళ్ళు ప్రసాదమునకు ప్రసాదము' అను నటుల దేనికది వేఱై సంబంధము లేకుండునవి కావు. కవిత్వ ఫలవృక్షమునకు కవితాశక్తి వేరు, ప్రపంచజ్ఞానము మ్రాను, భాష కొమ్మల మొత్తము, శైలి పూవులును పండ్లును అని చెప్పనగును. కవిత్వ తత్త్వము కరతలామలకము చేసికొనఁగోరువారు ఈ అంశము మనస్సున గుర్తుగా ఉంచుకొననగును.

మన శరీరమున వాయువునకు ఊపిరితిత్తులును, రక్తమునకు గుండెలును ముఖ్యస్థానము లగునట్లు కవితాశక్తికి కవిత్వములో ఆలోచన భాగము ముఖ్య స్థానము. ఏ విషయమును గూర్చిగాని ఆలోచించుట గాలి ప్రోగుచేయుట వంటిది. మంచిగాలితోపాటు చెడుగాలులును కలసి ఉండును గాన కీడు కలుగకుండుటకు వానిని విడఁదీయవలెను. చెడుగాలులను మంచిగాలి నుండి విడఁదీయుట కష్టమగుపని అని వేరే చెప్పనక్కఱలేదు. ఇట్లే, ఆలోచన చేయునపుడు మంచి తలఁపులతోపాటు చెడు తలఁపులును వచ్చును. అవి విడఁదీయుట కష్టమైనను విడఁదీయక తప్పదు. విడదీయవలె. చెడుతలఁపులు వేరుపురుగుల వంటివి. కవితాశక్తి కవిత్వ వృక్షమునకు వేరు. అట్టిచో చెడుతలఁపు వేరుపురుగులను తీసివేయకున్న కవితావృక్షము ఏపు తగ్గి చచ్చునుగాని ఎదిగి ఫలింపదు. చెడుతలఁపులు లేకుండునటులచేసి మంచి తలఁపులు మాత్రము నిలుపుటయే కవితాశక్తికి చేయవలసిన సంస్కారము. ఇట్లు సంస్కారము పొందిన కవితాశక్తి నిర్మలమగు చల్లగాలివలెను, ఏపుగా నెదిగి ఫలించు చెట్టువలెను కీడు రవంతయు కలిగింపక, మేలేచేసి, ఆనందమును తేల్చును.

కవితాశక్తి వృద్ధి పొందుటకు సాధనములు ఏమి ?

1. చక్కగా ఆలోచించుట, 2. సృష్టి చిత్రములను సరిగా కనిపెట్టుట, 3. మంచిగ్రంథములు చదువుట – అను మూడును కవితాశక్తిని వృద్ధి పొందించు ముఖ్య సాధనములని చెప్పవచ్చును. ఈ సాధనములన్నియు ఒకదానితో నొకటి సంబంధము

కలిగి ఉన్నప్పుడే కవితా శక్తి బాగుగా అభివృద్ధి పొందును గాని ప్రత్యేకముగా ఒక్కొక్కటియే ముఖ్యముగా తీసికొనునప్పుడు అట్టి అభివృద్ధి కలుగదు. అందులో గ్రంథములు చదువుట వలన కలిగిన జ్ఞానమే ముఖ్యముగా చేసికొని గ్రంథరచన చేసిన యెడల పాడినదేపాటగా ఆయా గ్రంథములలోని సంగతులే మరల చెప్పుట తటస్థించును. ఇది వ్రాసినవారికి వ్యర్థ ప్రయాసము; చదువువారికి వ్యర్థమగు కాలక్షేపము. ఇఁక మూలగ్రంథములలోని అంశములు సరిగా గ్రహింపక వ్రాసిన యెడల విపరీత జ్ఞానము కలిగి, కీడుకూడ కలుగును. అంశములు సరిగా గ్రహించినను భాషస్వాధీనమైనది కాకున్న, మంచిశైలి పట్టువడకున్న రసపుష్టి చెడును. అందుచేత కవితాశక్తి వృద్ధిపొందకపోవుటయే కాక తగ్గికూడ తగ్గిపోవును. కాన, ఉభయభాషా పాండిత్యము కలవాఁడే తర్జుమాచేయుటకు పూనుకొన నగును. గ్రంథములు చదువుటతోపాటు సృష్టి చిత్రములు సరిగా కనిపెట్టుచు స్వయముగా ఆలోచించుచు నుండినయెడల జ్ఞానము వృద్ధిపొంది, దానితోపాటు కవితాశక్తియు చక్కగా వృద్ధిపొందును.

మంచిగ్రంథములు చదువుట మొదట ప్రారంభింప వలయును. దానితోపాటు ఆయా విషయములను గూర్చి అవకాశమున్నపుడెల్ల సృష్టి చిత్రములను కనిపెట్టుటయును కూడ మొదలుపెట్ట వలెను. ఇట్టి స్థితిలో చెప్పు కవిత్వము సాధారణ కవిత్వము. ఇది కవిత్వమునకు బాల్యావస్థ. పై గ్రంథములలోని అంశమే ఆధారముగాఁ గల కవిత్వము పోఁతపాలబిడ్డ. సహజమగు తల్లిపాలతో పెరఁగు బిడ్డకు ఉండు శరీరపటుత్వముగాని, ఉత్సాహముగాని, కళాకాంతులుగాని, ఆకర్షణశక్తి గాని పోఁతపాల బిడ్డకు నుండుట వట్టిది.

ప్రపంచమునకు పరాత్పరుఁడే తండ్రి; పరాత్పరుఁడే తల్లి. అట్లే కవితా లక్ష్మికి కవియే తండ్రి; కవియే తల్లి. సముద్రము తఱవఁగా పుట్టిన అమృతము లక్ష్మికి ఆహారమైనట్లు కవి హృదయమును తఱవఁగా పుట్టు మంచి తలఁపులే కవితా లక్ష్మి పెరఁగి, ఎప్పుడును నిండు జవ్వనమున ఉండుటకు త్రాగుపాలు. పలుపలుకులేల?

మంచి తలంపు పాలే కవితాలక్ష్మికి సహజముగా ఆహారము. లోకజ్ఞానము కలిగిన పిమ్మట చక్కఁగా ఆలోచించుచుండుట వల్లను, సృష్టి చిత్రములు కనిపెట్టు చుండుటవల్లను, మంచి గ్రంథములు చదువుట వల్లను, పెద్దలతో కలిసిమెలసి ఉండుటవల్లను, మంచితలంపులు పుట్టును. మంచితలంపులే ఆధారముగా చేసికొని చెప్పు కవిత్వమే మంచి కవిత్వము. ఇదే భర్తృహరి చెప్పిన 'సుకవిత'; ఇదే కవిత్వమునకు యౌవనావస్థ. దేవతలు ఎప్పటికిని త్రిదశులే అయినట్లు మంచికవిత్వమునకు ఎప్పటికిని యౌవనావస్థయే. ఈ అవస్థలోనికి వచ్చిన కవిత్వము ఎన్నాళ్ళ కైనను చెక్కుచెదరదు; ఎక్కడనైన గౌరవమునకు పాత్రమగును. ఎవరికైనను మనసు కరగించును; ఉత్సాహము పెంచును. మేలుకలిగించును. మేలుచేయించును. అందఱిని ఆనందమున – సాధారణపు ఆనందముకాదు – బ్రహ్మానందమున తేల్చును. కాబట్టి గ్రంథరచనచేయు అభిలాషకలవారు ఇట్టి కవితాశక్తిని సంపాదింప ప్రయత్నింతురు గాక!

2. ప్రపంచజ్ఞానము :

జ్ఞానము కలిగించి అందువలన ఆనందము కలిగించుట కవిత్వధర్మము. కావున, కవిత్వము చెప్పఁదలఁచు వారికి ప్రపంచజ్ఞానము అత్యావశ్యకము. 1.ప్రపంచమును స్వయముగా కనిపెట్టుట. 2.పెద్దలవల్ల తెలిసికొనుట. 3.మంచి గ్రంథములు చదువుట అను మూడు సాధనముల వలన ముఖ్యముగా ప్రపంచ జ్ఞానము కలుగును.

ప్రపంచ జ్ఞానము సంపాదించుట ఎట్లు ?

మనకు జ్ఞానేంద్రియములు ఉన్నందుకు ఫలము అవి సరిగా వాడుక చేయుటయే. లోభికి ధనము ఉన్నను దాని వలన ఫలము కలుగనటుల తెలివితక్కువ వారికి జ్ఞానేంద్రియములున్నను ఫలము మాత్రము కలుగదు. కన్ను, చెవి–అను రెండును జ్ఞానేంద్రియములలో ముఖ్యములు అయినను, తెలివితక్కువ వారు అవి కూడ సరిగా వాడుక చేయరు. కనుగ్రుడ్డి, వినుచెవుడు – అను సామెత వారినిబట్టియే

వచ్చినది. సృష్టి చిత్రములు చూచి, వాని విశేషములను కనిపెట్టి, జ్ఞానాభివృద్ధి చేసికొని సర్వేశ్వరుని మహిమ తెలిసికొని, ఆనందించి అట్టి ఆనందము తోడివారికి పంచిపెట్టుటయే కన్నులున్నందుకు ఫలము. ఇట్లే, చెవులున్నందుకు ఆయా ధ్వనులు విని, వాని విశేషములు కనిపెట్టియు, ముక్కున్నందుకు ఆయా వాసనలు మూర్కొని వాని విశేషములు కనిపెట్టియు, చర్మము ఉన్నందుకు ఆయావస్తువులను తాఁకి వాని విశేషములు కనిపెట్టియు జ్ఞానము అభివృద్ధి చేసికొనవలెను. ఇట్లు జ్ఞానాభివృద్ధి చేసికొనుచు, మన మానందించుచు, అట్టి ఆనందము మన తోడివారికి పంచిపెట్టుచుండ వలెను. ఈ ఆనందము పంచిపెట్టిన కొలఁదిని పెరుగునదేకాని తఱుఁగునదికాదు.

అయినను ప్రపంచమంతయు స్వయముగా కనిపెట్టుట ఎవరికిని దుర్లభము. ప్రపంచమున లెక్కలేని లోకములు కలవు. మన పూర్వులు లోకములు పదునాలుగుగా ఎన్నినారు. చంద్రమండలాదులును లోకములుగానే ఎన్నిక చెందినవి. అంగారక మండలము మన భూలోకము వంటిది కావచ్చునని ఈ నడుమనే పరిశోధకులు కనిపెట్టిరి. మన 'కుజ' శబ్దము వీరి పరిశోధనముల కేమైన ఆధారమైన దేమో! మన భూలోకమును గూర్చియే మనకు ఇప్పటికిని పూర్తిగా తెలియదు. భూలోకపు మాట ఎందుకు? మన దేశమును గూర్చికాని - అంతదాఁక అక్కఱలేదు - మన రాష్ట్రమునుగూర్చి కాని - అదియును వదలివేయుదము - మనజిల్లాను గూర్చి కాని- అంతయు అవసరములేదు - మన తాలూకాను గూర్చికాని - అదియును వద్దు- తుదకు మనమున్న ఊరినిగూర్చికాని మనకు పూర్తిగా తెలియనప్పుడు 'ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కునా' అని అన్ని లోకముల గూర్చియు పూర్తిగా తెలియుట ఎట్లు? అనేకలోకములను గూర్చి మనుష్యులు ఎవరికిని ఇంకను ఏమియును తెలియదు. పురాణాదులలో ప్రత్యక్షములుకాని కొన్ని లోకములను గూర్చి కానవచ్చు సంగతులు నిజములో కావో తెలిసికొనుటకు ఆధారములు ఏమియు కానరావు. సూర్యాదిలోకములను గూర్చి మిడిమిడి జ్ఞానము మాత్రము కలదు. భూలోకమును గూర్చి కొంతవరకు స్పష్టమగు జ్ఞానము కలిగినది. కాని, ఇదియును ఆయా ప్రకృతి

శాస్త్రములు అభిమానముగా చదివినవారికే. ఒక శాస్త్రము బాగుగా తెలిసిన వారికి మఱీఒక శాస్త్రము బాగుగా తెలియుట అరిది. అనేక శాస్త్రములు పూర్తిగా తెలిసికొనుటకు మన ఆయుస్సు చాలదు. దీనికి తోడు 'దుర్భిక్షములో అధికమాస' మన్నట్లు మనుష్యలందఱికిని భాష ఒకటి కాదు. ఎన్నో భాషలు ఉన్నవి. ప్రతి భాషలోను అన్ని శాస్త్రములును లేవు. అందుచేత శాస్త్రజ్ఞానము సంపాదింపవలెననుకొన్న పెక్కు భాషలు నేర్చుకొనవలె. తల్లిభాషయే సరిగా నేర్చుకొనలేని వారికి పైభాషలు నేర్చుకొనుట సులభమా? దీనికి ఎంతోకాలము పట్టును. ఇంతే కాక, జ్ఞానసంపాదనమునకు ధనలోపము – యోగ్యతాలోపము – సంసారబాధలు మొదలగు అడ్డులుకూడ ఎన్నో ఉన్నవి. అందుచేత ప్రపంచజ్ఞానమంతయు పూర్తిగా సంపాదింపఁగలుగుట ఎవరికిఁ గాని అందని మ్రానిపండు. అయినను, మనచేతనయినంత వఱకు ప్రయత్నించి ప్రపంచజ్ఞానము సమకూర్చు కొనవలె.

ఇదివఱకు యుగయుగములనుండి పూర్వులు సంపాదించినట్టియు, ఇప్పటి వారు సంపాదించినట్టియు ప్రపంచజ్ఞానము గ్రంథరూపమున సిద్ధముగా ఉన్నది. కాఁబట్టి గ్రంథములు చదివి మనము మొదట ప్రపంచజ్ఞానము సంపాదింపవలయును. ఆ జ్ఞానము పునాదిగా చేసికొని, దానిమీఁద స్వయముగా కనిపెట్టుట పెద్దల వలన తెలిసికొనుట అను సాధనములతో కవితాభవనము కట్టవలయును. ఇందుకు పూనుకొను మనవారికి ఆంధ్రులకు స్వభాష చక్కఁగా వచ్చి ఉండవలె; మన రాజభాష ఇంగ్లీషు కూడ దానిలో గ్రంథరచనకుఁ గాకున్నను జ్ఞానసంపాదనమునకైనను తగినట్లు రావలె. సంస్కృతము కూడ అట్లే వచ్చి ఉండవలె. ఈ మూఁడు భాషలును వచ్చి వాని యందలి గ్రంథములు చదివి జ్ఞానము సంపాదించుకొని, సృష్టి చిత్రములను వీలగునంత వఱకు స్వయముగా కనిపెట్టుచు తెలియని సంగతులు పెద్దల వలన తెలిసికొనుచు కృషిచేసిన యెడల తగినంత ప్రపంచజ్ఞానము కలుగును. అప్పుడు ఆయా విషయములను గూర్చి బాగుగా తెలియును. అందుచేత గ్రంథరచనకు పూనుకొనుటకు అర్హత కలుగును. అన్ని విషయములను గూర్చియు అందఱికిని తెలిసి ఉండుట కష్టము గాన, ఎవరికి

ఏ విషయముల యందు ఎక్కువ ఆసక్తి ఉండునో వారు ఆ విషయములను గూర్చి సాధ్యమైనంత వఱకు తెలిసికొన ప్రయత్నింప వలయును. అటుల బాగుగా తెలిసిన విషయములను గూర్చియే గ్రంథరచన చేయవలెను. అటుచేసినచో ఆ గ్రంథములు వ్రాసిన వారికిని ఆనందదాయకములు గాక మానవు. కాన గ్రంథరచనయందాసక్తి గలవారు మంచి ప్రపంచజ్ఞానమును సంపాదించుటకై శ్రద్ధ వహింపనగును.

3. భాషా జ్ఞానము :

ప్రపంచ జ్ఞానము కలిగినంత మాత్రమున గ్రంథరచన సాధ్యముకాదు. ఏ భాషయందు గ్రంథరచన చేయఁదలఁతుమో ఆ భాషయందు మంచి పాండిత్యము ఉండవలయును. అందుకు నిఘంటు జ్ఞానమును, వ్యాకరణ జ్ఞానమును ఆవశ్యకములు. అంతేకాదు, అలంకార శాస్త్రమును, ఛందశ్శాస్త్రమును తెలిసి ఉండవలె. భాషలోని ప్రమాణగ్రంథములు చదువవలె. అప్పటికి భాష కొంతవఱకు స్వాధీనమగును. గ్రంథరచనకు అవకాశము కలుగును. కావున భాషాజ్ఞానము గ్రంథరచనకు ముఖ్యము. భాషాజ్ఞానము లేనియెడల మనస్సున ఎన్ని మంచితలఁపులున్నను అవి దరిద్రునికోరికలవలెనే మనస్సున లోలోన అణఁగి జీర్ణముకావలసినవేకాని క్రియారూపమును పొందజాలవు. ఇఁక చక్కని భాషా జ్ఞానము ఉన్నయెడల ధనవంతుని కోరికలు మేడలుగానో, మిద్దెలుగానో, కోటలుగానో, తోటలుగానో, నగలుగానో – మఱి ఏరూపుననో పరిణమించు విధమున మనస్సులోని మంచితలపులన్నియు పురాణములుగానో, ప్రబంధములుగానో, నాటకములుగానో, నవలలుగానో, చరిత్రములుగానో, శాస్త్రములుగానో, ఇఁక మఱిఒక రూపముననో మారి కర్తకులను లోకులకును కూడ ఆనందము కలిగించును.

ఆంధ్రభాషాజ్ఞానము అభివృద్ధిచేసికొనుట ఎట్లు ?

ఒండొంటితోకలసి అర్థమిచ్చు శబ్దముల సమూహమే భాష. కాన, ఆంధ్రభాషజ్ఞానము కావలయుననిప మొదట ఆంధ్ర శబ్దజ్ఞానము ఉండవలయును.

అనఁగా గ్రంథరచనకు పనికివచ్చు ఆంధ్రశబ్దములన్నియును గ్రంథరచనచేయువారికి తెలిసిఉండవలెను. ఇందుకు నిఘంటువులు చదువవలయును. ఇదేమి బాధ? ఇంగ్లీషు భాషా జ్ఞానము సంపాదించుటకు ఇట్టి ఏర్పాటు అవసరములేదే అని ఇంగ్లీషుచదువుకొనిన మనవారు అనవచ్చును. కాని, భాషా స్వభావములు వేఱుగానుండునుగాన భాషా జ్ఞానము సంపాదించు పద్ధతులును వానిననుసరించి కొంతవఱకు వేఱుగా ఉండకతప్పదు. ఇంగ్లీషులో సాధారణముగా పదములు సంధికి లోనుకావు. తెలుఁగులో కొంతవఱకు సహజముగానే పదములు సంధికి లోనగును. అందుచేత పదముల సహజరూపము మాఱును. దీనికితోడు మొదటినుండియు మొన్నమొన్నటివఱకును తెలుఁగులో వచన రచనకంటె పద్య రచనయే హెచ్చుగా కానవచ్చుచున్నది. పద్య రచనలో ఛందోనియమములను బట్టి సంధి మరింత ముదిరినది. అందుచేత మన గ్రంథములలో సహజమగు శబ్ద స్వరూపము చాలవఱకు తెలియరాదు. కాన ఇంగ్లీషు గ్రంథములలో ఆ భాషాస్వభావమును బట్టి సాధారణముగా సహజరూపములతో ఉండు పదములకు తెలియనప్పుడు అకారాది నిఘంటువులలో అర్థము చూచుకొని భాషాజ్ఞానము క్రమక్రమముగా అభివృద్ధి చేసుకొనునంత సులువు మన భాషయందు లేదు.

కాఁబట్టి కంఠస్థమగునట్లు పద్యరూపమున ఉన్న నిఘంటువులు వర్ణింప లేకపోయినను మనస్సునకు శబ్దస్వరూపము తట్టి ఉండునంత వఱకైనను ఆంధ్రనామ సంగ్రహము – ఆంధ్రభాషార్ణవము – సాంబనిఘంటు – వేంకటేశాంధ్రము మొదలగు నిఘంటువులు చదువుట అవసరము. ఇందులో పదవిభాగముతోడను –అర్థము తోడను ఉన్న నిఘంటువులు ముందు చదువవలయును. ఇట్లు చదివినయెడల శబ్దజ్ఞానముతోపాటు పర్యాయపదజ్ఞానమును కలుగును. ఇట్టి జ్ఞానము 'లక్ష్మీనారాయణీయము' అను అకారాది నిఘంటువు వల్ల కూడ కలుగును. కాన ఆయా పద్యనిఘంటువులు చదువుటకు బద్ధకించువారు ఈ అకారాది నిఘంటువు తెలియనిపదము వచ్చినప్పుడెల్ల చూచుచుండవలయును. సంస్కృత శబ్దజ్ఞానము

కొఱకును, సమాసజ్ఞానము కొఱకును వాడుకచేయవలసిన అకారాది నిఘంటువు 'శబ్దరత్నాకరము'. ఇందువలన సామాన్యముగా తెలుఁగు గ్రంథములయందు వాడుకగు అన్ని శబ్దముల మొదటి స్వరూపమును తెలియును. శబ్దార్థ జ్ఞానము బాగుగా సంపాదించదలంచు ఓపికపట్టి శబ్దరత్నాకరము మొదటినుండియు చివర వఱకును ఎన్ని పర్యాయములు తిరుగవేసిన అంతమంచిది. ఇట్లు శబ్దజ్ఞానమును దానితోపాటు అర్థజ్ఞానమును సంపాదించుకొననగును. ఈ శబ్దార్థజ్ఞానము భారత భాగవత రామాయణాది గ్రంథములు వీలగునపుడెల్ల చదువుచు, మనుచరిత్ర, వసుచరిత్ర, ఆముక్తమాల్యద, రాఘవపాండవీయము మొదలగు ప్రబంధములు వ్యాఖ్యానములతో చక్కఁగా చదివినయెడల బాగుగా బలపడును.

కాని, ఇంతటితో భాషాజ్ఞానము పూర్తికాదు. నిఘంటువులు చదువుటవల్ల శబ్దముల మొదటిరూపములే బాగుగా తెలియును. భారతాది గ్రంథములు చదువుట వలన ఆయా శబ్దములు పొందు వివిధరూపములు పొడకట్టునుగాని ఆ వివిధ రూపములను గూర్చిన జ్ఞానము సరిగా పట్టుపడదు. ఈ వివిధరూపముల జ్ఞానము గ్రంథరచనకు అత్యావశ్యకము. ఇది వెంకయ్య వ్యాకరణము, బాలవ్యాకరణము, ప్రౌఢవ్యాకరణము మొదలగువ్యాకరణములు స్వయంకృషితోపాటు గురుసాహాయ్యము కూడ పొంది చదివినఁగాని కలుగదు. వచన గ్రంథరచన చేయువారికైనను వ్యాకరణజ్ఞానము తప్పక ఉండవలయును. ఇంతేకాదు, తెలుఁగున గ్రంథములు రచించువారికి ఆంధ్రవ్యాకరణ జ్ఞానమేకాక, సంస్కృత పదములును, సమాసములును తెలుఁగున వాడకతప్పదు. కావున సంస్కృత వ్యాకరణజ్ఞానము కొంతవఱకైనను ఉండితీఱవలయును. ఇందుకూడ స్వయంకృషితోపాటు గురుసాహాయ్యము కావలయును. ఇంగ్లీషువచ్చినవారు ఇంగ్లీషులో సిద్ధాంతకౌముది ననుసరించి వ్రాసిన 'ఖేలు సంస్కృత వ్యాకరణము' చదువనగును. పద్య కవిత్వము చెప్పఁదలఁచువారు ఛందో జ్ఞానము సంపాదించుటకు సులక్షణ సారము, అప్పకవీయము చక్కగా చదువవలయును. ఇది స్వయముగా చదువుకొనుచు తెలియనిచోట్ల పెద్దలనడిగి తెలిసికొనవలఁ.

కావ్యలక్షణములు, దోషములు మొదలగువానిని గూర్చి జ్ఞానము సంపాదించుటకు సరసభూపాలీయము మొదలగు గ్రంథములు చదువవలయును. ఇటుల నిఘంటుజ్ఞానమును, వ్యాకరణ జ్ఞానమును, ఛందోజ్ఞానమును కావ్యలక్షణాది జ్ఞానమును సంపాదించిన యెడల భాషా జ్ఞానము సమకూడును. కాఁబట్టి గ్రంథరచన చేయఁగోరువారు పైన వివరించిన విధమున చక్కని భాషా జ్ఞానము సంపాదించవలె.

సంస్కృత గ్రంథములను తెలుఁగులోనికి తేఁదలఁచువారికి సంస్కృతమున మంచి జ్ఞానము సంపాదించుట ఆవశ్యకము. సంస్కృత కావ్యములు కొన్నియు, నాటకములు కొన్నియు, తెలుఁగు టీకలతోఉన్న భగవద్గీతలు మొదలగు తక్కిన గ్రంథములు కొన్నియు చదివినయెడల సాహిత్యజ్ఞానము కలుగును. రామాయణాది గ్రంథములకును, రఘువంశాది కావ్యములకును కొంతవఱకును తెలుఁగున వ్యాఖ్యానములు ఉండుటచేతను, సంస్కృతనాటకములు కొన్ని తెలుఁగులోనికి తర్జుమాఅయి ఉండుటచేతను స్వయంకృషి చేసి సంస్కృతమున పాండిత్యము సంపాదించుటకు సదుపాయమేర్పడినదిగాన గ్రంథరచన చేయఁగోరువారు దీని వలన సంస్కృత భాషా జ్ఞానము సంపాదించుకొన నగును. అవసరములని తోచిన సంస్కృత గ్రంథములను తెలుఁగులోనికి మార్చనగును.

ఇఁక, ప్రకృతి శాస్త్రజ్ఞానము, చరిత్రజ్ఞానము మొదలగు పలురకముల జ్ఞానము సంపాదించుటకును, అట్టి జ్ఞానము ఇంగ్లీషు రాని మన ఆంధ్రసోదరులకు సమకూర్చుటకును ఇంగ్లీషులో తగినంత అక్షరజ్ఞానము కలుగువఱకు గ్రంథరచన చేయగోరువారు కృషిచేయవలెను. ఇట్లు ఆంధ్రభాష యందును, సంస్కృత భాష యందును, ఇంగ్లీషుభాష యందును తగినంత జ్ఞానము కలిగినఁగాని మన భాష యందు చక్కఁగా గ్రంథములు చేయుటకు శక్తి కలుగదు.

మఱి ఒకమాట, ఏ భాష యందు గ్రంథములు రచింతుమో ఆ భాషయందు అభిమానముండవలెను. లేనిచో భాషాస్వభావము పోయి భాష చెడును.

ఆంధ్రగ్రంథములు రచించువారికి ఆంధ్రగ్రంథముల యందు అభిమానముండవలె. ఆంధ్రభాషా స్వభావమును బాగుగా పాటింపవలె. కాని సంస్కృతము అభిమానముగా చదివినట్టియు, ఇంగ్లీషు అభిమానముగా చదివినట్టియు మన వారు కొందఱు ఆ భాషల సంప్రదాయములు తెలుఁగు గ్రంథరచనలోనికి తెచ్చి, ఆంధ్రభాషకు సహజముకాని కావ్యరచన చేయుటవలన మన భాషాస్వభావము చెడి, తెలుఁగు పదములతో కూడి ఉన్నను ఆ భాష తెలుగు భాషమాత్రము కాకుండుట తటస్థించుచున్నది. ఇట్టి భాషా సాంకర్యముగల గ్రంథములు ఎన్నటికిని సద్గ్రంథములుగా ఎన్నికకు రానేరవు.

భాషా జ్ఞానము బాగుగా ఉన్నవారే గ్రంథరచనకు అర్హులు. అర్హులు వ్రాసిన గ్రంథములే స్థిరముగా నిలుచును. అవే మేలు కలిగించి ఆనందము సమకూర్చగలుగును. కాఁబట్టి తెలుఁగు గ్రంథరచన చేసి తోడివారికి మేలు చేయవలయునను ఉత్సాహముగల మనవారు భాషాభిమానము కనఁబఱుపనగును. చక్కని భాషా జ్ఞానము సంపాదింప ప్రయత్నింపనగును.

శైలి జ్ఞానము

కవితాశక్తి ఉన్నఁగాని ఏ విషయమును గూర్చి గాని ఆలోచనయే సాగదు. ప్రపంచజ్ఞానము ఉన్నఁగాని ఏ విషయమును గూర్చిగాని సరిగా వ్రాయుటకు అవకాశము కలుగదు. భాషాజ్ఞానము ఉన్నగాని ఏవిషయమును గూర్చికాని దోషములు లేకుండ గ్రంథరచన చేయుటకు వీలులేదు. కవితాశక్తియు, ప్రపంచ జ్ఞానమును, భాషాజ్ఞానమును ఉండి గ్రంథరచన చేసినను శైలి తగినది కాని యెడల గ్రంథము జనరంజకము కాఁజాలదు. జనరంజకము కాని గ్రంథము నిష్ఫలము.

కావ్యలక్ష్మికి శైలి ఐదవతనము. గ్రంథమునకు శైలిలోపము కలిగిన యెడల 'అన్నియును ఉన్నవి కాని ఐదవతనము లేదు' అను సామెత దాని యెడల సార్థకమగును. ఐదవతనములేని స్త్రీ రాణింపనట్లే శైలి లోపముగల గ్రంథము రాణింపదు. శబ్దములు

సుశబ్దములు కావచ్చును. అర్థములు సరిగ ఉండవచ్చును. భావములు మంచివే కావచ్చును. దోషములు లేకపోవచ్చును. పాండిత్య ప్రకర్షము కానరావచ్చును. - కాని ఇవన్నియు గ్రంథమునకు వన్నె తేఁజాలవు. వన్నె తేఁగలది శైలియే. శైలి లోపము లేని గ్రంథము రసవంతమై, మనస్సు కరఁగించి, ఆనందమున ఓలలాడింపఁ జాలును. శైలి లోపముచేత వన్నెకు రాకపోయిన గ్రంథములు మన భాషలో కొన్ని ఉన్నవి. వాని స్థితియే శైలి గ్రంథరచనకు ఎంత ప్రధానమో ఢంకా మీఁద దెబ్బవేసి చాటుచున్నది. కాన, గ్రంథములు రచింపఁబూనుకొను వారికి శైలిజ్ఞానము అత్యావశ్యకము.

శైలి అనఁగా ఏమి ?

ఆయాసంగతులు చక్కఁగా మనస్సుకు ఎక్కునట్లు గ్రంథములు వ్రాయుటయే శైలి. కావ్యలక్ష్మికి శైలి ఐదవతనమని ఇదివఱకే అనుకొన్నాము. అయిన, ఐదవతనమునకు ఐదు వన్నెలు ఉన్నవి. శైలికి కూడ ఐదు వన్నెలు ఉండవలెను అవి ఏవి? అని అడుగవచ్చును. వన్నెలు లేకున్న శైలి గ్రంథమునకు వన్నె తెచ్చునది ఎట్లగును? 1.రసములు, 2.వృత్తులు, 3.పాకములు, 4.గుణములు, 5.అలంకారములు అనునవే శైలితో సంబంధించిన వన్నెలు. ఇవే మనస్సును కరిగింపఁ జాలిన గ్రంథరచనా సాధనములు. ఈ వన్నెలతో కూడిన భాషలో గ్రంథము వ్రాయువిధమే శైలి.

మంచిశైలి పట్టుపడుట ఎట్లు ?

తగినంత కవితాశక్తి సహజముగానే ఉన్నవారికి ఆశక్తి వల్లనే మంచిశైలి వచ్చును. కాని, అట్టిశక్తి లేనివారు మంచిశైలి పట్టుపడునట్లు చేసికొనుటకు మంచి శైలిలో వ్రాసిన గ్రంథములు పలుమారులు చదువవలెను. ఈ విషయమున ఇంత కంటె మంచి సాధనము మఱి ఒకటి లేదు. కావున గ్రంథరచనకు పూనుకొనఁదలఁచువారు భారతము మొదలగు మంచిశైలిలో వ్రాసిన గ్రంథములు వీలగునప్పుడెల్ల చదువ వలెను. ఇటుల చదువుట వల్ల సహజకవితా శక్తి వృద్ధి అయి దానితో పాటు

మంచిశైలియు పట్టుపడును. శైలి జ్ఞానము కొఱకు గ్రంథములు చదువునప్పుడు తక్కిన విషయముల మీదకంటె గ్రంథశైలియందే దృష్టి ఉంచవలెను.

సాధరణముగా శైలి 'సులభశైలి', 'కఠినశైలి' అని రెండు విధములు. వీనిలో కఠినశైలి భాషాజ్ఞానమును పరీక్షింపవలసిన పెద్ద పరీక్షలకు చదువు వారికొఱకు ఉద్దేశించి వ్రాయు గ్రంథముల యందే వాడుక చేయనగును. కాని తక్కిన గ్రంథములలో వాడుక చేయరాదు. కావున సాధారణముగా గ్రంథరచనయందు అవలంబింపవలసిన శైలి సులభశైలియే. సులభశైలిని వ్రాసిన గ్రంథములె పలువురకు మేలు కలిగించును. ఆనందము సమకూర్చును. కాబట్టి గ్రంథరచన చేయువారు సులభశైలిని వ్రాయుటకే ప్రయత్నింపనగును.

'అమ్మో! గ్రంథరచనకు ఇంతకష్టపడవలెనా!' అని మనవారు కొందఱు కవితాశక్తి కొంత అబ్బినంతమాత్రమున ప్రపంచజ్ఞానముగాని, భాషా జ్ఞానముగాని శైలిజ్ఞానముగాని సరిగా సంపాదింపకయే రచనకు సిద్ధపడువారు – అడుగవచ్చును. భర్తృహరి చెప్పిన సుకవితా సామ్రాజ్యమును, దాని వలన బ్రహ్మానందమును పొందఁ దలఁచువారు తాము బాగుపడి తోడివారిని బాగుచేయఁదలఁచువారు తక్కిన విషయములలో వలెనే ఈ గ్రంథరచనా విషయములో కూడ కష్టపడవలె; కష్టపడకున్న యెడల ఫలము కలుగదు. కవితా సామ్రాజ్యముగాని, బ్రహ్మానందము గాని అక్కఱలేనివారు కష్టపడనక్కరలేదు. కష్టపడుటకు మొదలు పెట్టిన యెడల కష్టము కష్టమనిపించదు. కావున, క్రొత్తగా గ్రంథరచన చేయువారు తాము వ్రాసిన గ్రంథములు తోడివారికి మేలుచేయఁగలిగిన స్థిరముగా ఉండుటకు అన్నివిధములగు జ్ఞానము సరిగా కలుగువఱకును తమ వ్రాఁతలు గ్రంథ సాహాయ్యమువల్లను పండితుల సాహాయ్యము వల్లను చక్కబఱచుకొనవలెను. మంచి గ్రంథములు చేయుటకు తగిన జ్ఞానము సంపాదించి కవితాసామ్రాజ్య సుఖము లనుభవించి, తాము బ్రహ్మానందమున తేలి తోడివారిని బ్రహ్మానందమున తేల్పవలెను.

(గ్రంథాలయ సర్వస్వము, I – 2)

3. ఆచంట వేంకట (రాయ) సాంఖ్యాయన శర్మ
(1864-1933)

'మహోపాధ్యాయ' బిరుదాంచితులైన సాంఖ్యాయన శర్మగారు కవి, నాటకకర్త, కథానికా రచయిత. సుజన ప్రమోదిని, కల్పలత పత్రికలకు సంపాదకులుగా వాటిలో ఖండకృతులు, కథలు, వ్యాసాలు మొ॥నవి వ్రాశారు. 1903 నవంబరులో కల్పలతలో ప్రచురితమైన 'లలిత' తొలి తెలుగు కథానికగా కొందరు పరిశోధకులు భావిస్తున్నారు. అలాగే 'ఆంధ్ర పద్యావళి' (1892) లోని గేయాలు నవ్య కవిత్వ లక్షణాలు కలవిగా పేరుపొందాయి. వీనిలో వస్తు నవ్యత, భావ నవ్యత గోచరిస్తాయి. వైజ్ఞానిక విషయ పరిజ్ఞానం గల శర్మగారు క్రిమికీటక పక్షి జంతు సంబంధమైన విజ్ఞాన విషయాలతో కూడిన వ్యాస సంపుటి (రహస్య దర్పణం) ప్రకటించారు. తిరుపతి కవులకు పూర్వమే (1884-85) శతావధానం, శతఘంట కవిత్వం మొ॥ ప్రక్రియలు నిర్వహించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు స్థాపకులలో ఒకరైన శర్మగారు సంస్కృతానువాద నాటకాలు, 'నాటక సర్వస్వం' అన్న లక్షణ గ్రంథం విరచించారు. 1864 అక్టోబరు 25న విజయనగరం జిల్లా మేరంగిలో జన్మించి విశాఖలో స్థిరపడిన సాంఖ్యాయన శర్మ 1933 ఆగస్టు 3న పరమపదించారు.

3. ఆంధ్ర కవితాకళ - తదితర మనోజ్ఞకళలు

- ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ

వాపీకూప తటాకాదుల యందలి జలము భాగీరథీ జలబిందు సంపర్కమునఁ బావనమగు తీరునను, ఘృతాభిఘార సంస్కారము వలన ద్రవ్యములు పవిత్రములగు వడువునను గీర్వాణభాషా సంపర్క వశమున నాంధ్రభాష పవిత్రమగుచున్నది. మరియును లోక వ్యవహారమున కనుకూలించు తీరున సర్వదా మన ముపయోగ పఱచుకొను వెండి నాణెములను ముద్రించునపుడు మున్ముందు స్వల్పాంశము సువర్ణమును రజితములో గడిపి కరగించి నాణీయములను గొట్టుదురు. అప్పుడు గాని వాని కనుకూలమగు పటుత్వము లభింపదు. అట్లే గీర్వాణభాష సంపర్కము లేశ మాత్రమున లేనియెడల నాంధ్రభాషకు బాటవము గలుగనేరదు. ఇదియును గాక సంస్కృతభాషా సారస్వతము మనకుఁ బిత్రార్జిత ద్రవ్యము. కావున దానికి హాని కలుగకుండ భద్రపఱచి యుంచుకొని కాపాడుచు నభివృద్ధిఁ జేసికొనుచు సమయాను సారముగా నవసరము గలుగునపుడు దానినుండి స్వల్పమాత్రము గ్రహించి వినియోగ పఱచికొనవలసి యుండును. మనకుఁ గేవలము స్వార్జిత ద్రవ్యమువంటి యాంధ్రభాషా సారస్వతమును దుర్వినియోగము మాత్రము చేయక సముచిత మార్గమున యథేచ్ఛముగా వినియోగ పఱచుకొనుటకు మనకు స్వాతంత్ర్యము గలదు. కాబట్టి యాంధ్రకవితా విషయికమగు నీ యుపన్యాస ప్రారంభమున మంగళాచరణమునకుఁ బోలె రెండు మూడు విషయములను మాత్రము సంస్కృత భాషా సారస్వతమునుండి గ్రహించి వినియోగించి పిమ్మట సమస్తమును గేవలాంధ్రభాషా సారస్వతము నుండియే యథేచ్ఛగా వినియోగపఱచెదను. అక్కడక్కడ భాషాంతర పండిత సంప్రదాయములను

గూడ నుదహరించి చర్చించుటయు విజ్ఞానాభివర్ధకమగుట వలన వానిని గూడ స్వీకరించి వినియోగించుచున్నాను.

కాళిదాసమహాకవి యభిజ్ఞాన శాకుంతలమునందు,

'రమ్యాణి వీక్ష్య, మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకీ భవతి యత్సుఖి తోపిజంతుః
తచ్చేతసా స్మరతి నూన మబోధ పూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాని'

అని చెప్పియున్నాడు. రమ్యములగు వస్తువులను వీక్షించునప్పుడును మధురములగు శబ్దముల నాకర్ణించునపుడును హాయిగా సుఖపడునదియైనను జీవి వుత్కంఠను జెందుట కలదు. అట్టి కళవళపాటనునది (యేలోయెఱుకపడక) భావమున స్థిరముగా నాటుకొనియుండు జన్మాంతర సంస్కార వాసనలు తలంపునఁబడుట వలన గలుగును, అని దీని తాత్పర్యము. వేదశాస్త్రముల యందు ప్రామాణ్య బుద్ధి గల యార్ష సంతతి వారమగు మనము జన్మాంతర సంస్కార సిద్ధాంతము నంగీకరింతుము. ఈ విషయమును భగవానుడగు పతంజలి మహర్షి యోగదర్శనమున

"తత స్తద్విపాకానుగుణానా మేవాభివ్యక్తి ర్వాసనానాం",
"జాతి దేశ కాలవ్యవహితానా మప్యానంతర్యం
స్మృతి సంస్కారయోరేక రూపత్వాత్"
"తాసామనా ద్విపరాశిషో నిత్యత్వాత్"

అను మూడు సూత్రముల మూలమున సిద్ధాంతీకరించి యున్నాడు. 'కర్మ విపాకానుగుణముగా సంస్కారములు వ్యక్తములగును. స్మృతి సంస్కారము లేక రూపము గలవి గనుక జాతి దేశకాల వ్యవహితము లయినను వాని కానంతర్యము గలుగును. మహామోహ రూపమగు నవిద్య యనాది గావున స్మృతి సంస్కారము లకుఁగూడ

ననాదిత్వము' అని యాసూత్ర సిద్ధాంతము. గీర్వాణ సారస్వతము నుండి యీమాత్రము గ్రహించి వినియోగ పఱచుకొనుచున్నాను.

కాళిదాసమహాకవి రచించిన శ్లోకములోని పూర్వార్థము సమగ్రముగాఁ బ్రస్తుతోపన్యాస విషయముతో సంబంధము గలిగియున్నది. ఉత్తరార్థమైనను గేవల ప్రస్తుత ప్రశంస కాకపోవుటయే కాక యుపన్యాస విషయముతోఁ గొంత సంబంధము గలిగి యున్నది. ముందు ముందు సరిపెట్టుకొనఁ దగియుండును.

సర్ మోనియర్ విలియమ్స్ మహాశయుఁడీ శ్లోకమును –

' Not Seldem in our happy hours of ease, when thought is still, the sight of some fair form. Or mournful fall of music breathing low, will stir strange fancies, thrilling all the soul with a mysterious sadness, and a sense of vague yet earnest longing, can it be that dim memory of events long past, or friendships formed in other states of being., And flits like a passing shadow the spirit? '

అని యింగ్లీషుభాషలోనికి మార్చి దాని తాత్పర్యము నా రీతిన వ్యక్తీకరించెను. మఱియు నాతఁడు కాళిదాసును గుఱించియు నభిజ్ఞానశాకుంతలము గూర్చియు

' No one can read this act (IVth) nor indeed any act of the play without being struck with the racines and elevation of its author's genius, the exulerance and glow of his fancy, his ordent love of the beautiful his deep sympathy with natural and nature's loveliest scenes, his profound knowledge of the human heart, his delicate appreciation of its most refined feelings, his familiarity with its conflicting sentiments and emotions.'

అని వ్రాసెను. కాళిదాస మూలశ్లోకములోని పూర్వార్థమును సర్ మోనియర్ విలిమయ్సుగారి యభిప్రాయములోని " his ardent love of the beautiful "

అను మాటలను మనసున గీల్కొల్పి సమయము వచ్చునపు డనగా మరియొక గడియకు స్మరింతురుగాక! ఏమనిన నవి ప్రకృతి విషయములతో సంపూర్ణ సంబంధము గలిగియే యుండును. తక్కిన భాగములును గొంత సంబంధము గలిగియే యుండును. కావున నవియును విస్మరణీయములుగావు.

మన ప్రాచీనులు లోకసంగ్రహము కొఱకనేకములగు విద్యలను గళలను మనకుఁ బ్రసాదించి యున్నారు. విద్యలలోఁ బ్రధానములు పదునాలుగని కొందఱు జెప్పుదురు. ప్రధానకళలు మాత్ర మఱువదినాలుగని యందఱు నంగీకరింతురు. విద్యలను గూర్చిన చర్చ మనకిప్పుడవసరము లేకపోయినను గళలలోఁ గొన్ని విద్యా మూలకము లగుటచేత విద్యా ప్రశంసయుఁ జేయవలసి వచ్చినది. విద్యలలో ధనుర్వేద గాంధర్వ వేదములు పరిగణింపబడినవి. మల్లయుద్ధ వ్యూహరచనాదులు ధనుర్వేదములోని కళలు. నృత్యగీత వాద్యాదులు గాంధర్వవేదకళలు. కాబట్టి యిఁక విద్యా ప్రశంస నటుంచి కేవల కళావిషయమును మాత్రమే విచారింతము.

వాగింద్రియ వ్యాపార ప్రదర్శన యోగ్యమగునది విద్యయనియు మూఁగవాఁ డయినను నిర్వర్తింపగలది కళయనియును సామాన్య లక్షణము. కాని యీ లక్షణము నిర్దుష్టముగాఁ గనబడదు. కళలకు మనలోఁ గ్రియలనియును నామాంతరము. అఱువది నాలుగు కళలలో ననేకములు కేవల కార్మికములును బారిశ్రామికములును నయి జీవయాత్ర కనుకూలపడుచున్నవి. వాని నటుండనిచ్చి సుప్రసిద్ధములును, సముత్కృష్టములును మనోరంజకములును నగు నతిప్రధాన కళలను మాత్రమే విమర్శింతము. వీనినే మనోజ్ఞకళలని (Fine arts) యందురు. పశ్చిమఖండ పండితులు మనోజ్ఞకళా విమర్శనమును సమగ్రముగా దెలుపు శాస్త్రము రచించుకొనిరి.

అది మనోజ్ఞ వస్తు మీమాంస యనబడును (Aesthetics, the science of Philosophy of the beautiful, of taste or of the fine arts). శిల్పకళ (Architecture), మృద్దారు శిలాలోహాది క్రియాకలాపము(Sculpture), చిత్ర

లేఖనము(Painting), గానకళ(Music), కవిత్వము(Poetry) అను నీయైదును మనోజ్ఞ కళలు(Fine arts) అని వారును మనమును నంగీకరింతుము. మన ప్రాచీనులు మృద్దారులోహ శిలా క్రియాకలాపమును వేర్వేరు కళల క్రింద విభాగించి యున్నను వాని నన్నింటిని బ్రధానకళయగు శిల్పకళలోనే చేర్చుకొనుట వలన మనోజ్ఞకళలు నాలుగేయని మనవారి యభిప్రాయము. ఈ మనోజ్ఞ కళలలో గాన కవిత్వములు శ్రోత్రేంద్రియ గ్రాహ్యములును దక్కినవి నేత్రేంద్రియ గ్రాహ్యములును గాఁబట్టి శ్రవ్యకళలు(Arts of the ear), దృశ్యకళలు(Arts of the eye) అని పేర్కొనబడుచున్నవి. ఇట్లే గానకవిత్వములు వాగింద్రియ ప్రాధాన్యములగుట వలన వాచ్యకళలు(Speking arts) అనియుఁ దక్కినవి రూపనిర్మాణ ప్రాధాన్యము లగుటంజేసి నిర్మితకళలు(Shaping) అనియు చెప్పుదురు. మఱియును దేశకాల ప్రాధాన్యమును బట్టి గాన కవిత్వములు కాలిక కళలు(Arts of time) తక్కినవి వైదేశికకళలు (Arts of space) అనియును బేర్కొనబడుచున్నవి. ఇంతియేగాక కవిత్వములు వాచికకళలు (Vocal Arts) మిగిలినవి కాయిక కళలు(Manual Arts) అనియును జెప్పుదురు.

ప్రధానములగు నీ కళలు నేత్రశ్రోత్ర గోచరములయి తద్వారమున మనసున కెక్కి మనోజ్ఞములగును. కాఁబట్టి దృశ్య శ్రవ్యభేదమును వాచిక కాయిక భేదమును మాత్రమంగీకరించి సామాన్యధర్మమగు మనోజ్ఞతను సుస్పష్టముగాఁ బేర్కొన కుండుట న్యాయముగాదని యెంచెనోయనఁ గాళిదాసమహాకవి 'రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్ ' అని యంతటితోఁ జాలింపక 'పర్యుత్సుకీభవతి' అనియు 'చేతనాస్మరతి' అనియు మానసికత్వమును గూడ వివరించియున్నాడు.

కాళిదాసవిరచితమగు శ్లోకమును సర్ మోనియర్ విలియమ్సుగారి ప్రశంసా వాక్యములను స్మరింపదగిన సమయమిదియే. మనోజ్ఞకళలు నేత్రశ్రోత్రగ్రాహ్యములై తద్వారమున మనోజ్ఞత నలవరుచుటయెకాక విలక్షణమగు పర్యుత్సుకతను గూడఁ గలిగించుటయుం గలదని కాళిదాసాదుల యభిప్రాయ మీ విషయమునఁ దెలిసికొనదగియుండును. లోకములోని సమస్తవైచిత్ర్యములను బ్రదర్శించునది ప్రకృతి

(Nature). మనుష్యున కింద్రియ గోచరములగుచుండు వైచిత్ర్యములను మాత్రము ప్రదర్శించునది కళ (Art). కాఁబట్టి కళాప్రదర్శనమునకు బ్రాగ్భావన (Preneditation) పరమావశ్యకము. ప్రకృతి కీనియమములేదుగదా? కళా ప్రదర్శనమునఁ బ్రదర్శకులకుఁ దదితరులకును నానందానుభవము గలుగుచున్నను నిర్మమత్వము(Dis-interestedness) మాత్రము మనోజ్ఞకళలకుఁ బ్రధానగుణము. ఎట్లనిన - కవితాగానములయందుఁగాని నాటకాదులయందుఁగాని ప్రదర్శింబడు ననురాగము (Love) కృత్రిమమే కాక యరాగాభినయము మాత్రమేయగును. అది అందఱిసొమ్మే కాని యొక్కరిదికానేరదు. యథార్థానురాగము (True love) ప్రకృతి ధర్మము. ఇట్లే తక్కిన విషయములును.

ఇంతటితో నీ చర్చనుచాలించి మనోజ్ఞ కళలకుఁగల పరస్పర సంబంధమును విచారింతము.

దృశ్యకళలకు శిల్ప చిత్రలేఖనములకు రూపరేఖావిలాసములు(line light and Shade and Colour) ప్రధానములు. మనలో రూపము(light and shade) మొదటిది. రేఖ(line) రెండవది. పశ్చిమఖండ పండితులలోఁ బ్రాచీనులమతమున రేఖ(line) మొదటిది. రూపము(light and shade) రెండవది. వారిలోని యాధునికులు గొందఱు మనతో నేకీభవించుచున్నారు. మఱికొందఱు రేఖ(line)ను బూర్తిగాఁ బరిత్యజించి రూపవిలాసములను మాత్రమే గ్రహించుచున్నారు.

మఱియును శిల్పకళా ప్రదర్శనకును వ్యక్తి పరిమాణమును బట్టి పొడుగును, వెడల్పును, లోతు, దళసరులను(length, breadth, thickness or depth) ఇమిడియుండదగిన స్థలము(Space) కావలసియుండును. చిత్రలేఖన కళా ప్రదర్శనమున కన్నో పొడుగు వెడల్పులమాత్రమే యిమిడియుండదగిన సరళ ప్రదేశము (plane surface) కావలయును. ఈ రెండు కళల యందును నేదోయొక్క కాలమును నేదో యొక్క ప్రదేశమును మాత్రమే సుస్థిరముగఁ బ్రదర్శింపబడును. శిల్ప కళలయందు

దూరస్థితములగు సజాతీయ విజాతీయ పదార్థముల ప్రదర్శనము సాధ్యముగాదు. చిత్రలేఖన కళయందుమాత్రము దవ్వుదూరములతో నిమిత్తము లేక దృష్టిపథమునఁ బడఁదగిన సకల వైచిత్ర్యములను బ్రదర్శింప సాధ్యపడును. మఱియును రూపరేఖా విలాసములన్నింటిలోఁగాని కొన్నింటిలో గాని చిత్రలేఖనమున వస్తు ప్రదర్శనము మనోజ్ఞముగాఁ గావింపవచ్చును. శిల్పకళయందది వీలుపడదు.

ఇఁక దేశికములగు కళల నుండి కాలికములగు కళలకు దిగిచూతము. అతి గంభీరమగు నంతరాళము నుండి యగాథమగు కాలసముద్రములోనికిఁ జెంగున దాటుట దుష్కర కార్యమని తోచకమానదు. కాని దేశకాలములు రెండును నీర క్షీరన్యాయమునఁ గలసిమెలసియుండుటవలన నొకదానినుండి యింకొకదానిని జేరఁ బోవుట మిక్కిలి సులభకార్యమని తలంపదగును.

దృశ్యకళలచేఁ బ్రదర్శింప ననువుపడని వైచిత్ర్యములను శ్రవ్యకళలగుగాన కవిత్వములు ప్రదర్శింపగలవు. వానికి దేశ కాలనిర్బంధములు లేవుకాని కవిత్వ సంబంధములేని కేవల నాదాత్మకమగు గానమునకు మాత్రమంతటి ప్రజ్ఞలేదు. కావున శిల్ప చిత్రలేఖన గాన కళలు ప్రదర్శించు సకలవైచిత్ర్యములను గవితాకళ యొక్కటే ప్రదర్శింపగల సామర్థ్యముగలది. కాఁబట్టి మనోజ్ఞకళలన్నింటిలోను సర్వోత్కృష్ట మగునది కవితాకళయని యంగీకరింపవలసియుండును. ఇప్పటికి ప్రస్తుతాంశమున కందుబాటు దూరమునకు వచ్చితిమి.

ఏకైక భాషాకవిత్వ ప్రశంస ప్రసక్తించునపుడు తోడ్తోన దానిని జర్చింపఁ బూనుటకన్నఁ బ్రథమమునఁ గవిత్వసామాన్యమును జర్చించిచూచుకొని పిమ్మట విశేషమును జర్చించుకొనుట సమంజసపద్ధతి. కాఁబట్టి కవితయననేమో తొలుత విమర్శింతము.

చేతనా చేతన ప్రకృతివైచిత్ర్యములన్నింటినిగాని కొన్నింటినిగాని విననింపయిన నియమక్రమపద్ధతిని బ్రయోగింపఁబడు శబ్దజాలముచే ననుకరించుటవలనఁగాని

యాక్రోశించుటవలనఁగాని భావోద్రేకమును వ్యక్తీకరించుటయు విజృంభింపఁ జేయుటయుఁ గాలిక కళయగు కవిత యనబడును. (Poetry is a time art of which the business is to express and arouse emotion by imitating or evoking of all or any of the Phenoumena of life and the nature by means of words arranged with musical regularity) అని పశ్చిమఖండ పండితులు నిర్వచించుచున్నారు. వీరి మతమునఁ బద్యరూపముగా నుండునదియే కవితకాని గద్యరూపముగా నుండునది కవితకాదు. ఫ్రెంచిపండితులు కొందఱు మాత్రము గద్యముగూడఁ గవిత్వమని యంగీకరింతురు. మనలో గద్యము పద్యము పదమును గూడ కవితయే.

కవితా ప్రభావము నిరుపమానము, కవితాశక్తి నిరంకుశము. వాగ్రూపమున వ్యక్తపఱపఁదగిన సకల పదార్థములను, సకల ధర్మములను, సకల వైచిత్ర్యములను వేయేల సచరాచరంబగు లోకమునందలి సకల విషయములను మనః ఫలకమున నైపుణ్యముతోఁ జిత్రించి ప్రత్యక్షము సేయు సామర్థ్యముగలది కవిత. పరంపరారూపమైన కార్యకారణ ప్రణాళిక, జడచేతనముల వివిధ వైచిత్ర్యములు, నానావిధ దశాంతర్దశలు, కాలసూత్రమునకు లోఁబడు వివిధపరిణామములు, వివిధావస్థలు, వివిధ భావములు కవితా కళకు లొంగినట్లు తక్కిన ఏకళకు లొంగవు. భాషయందలి లోపముచేత భావవ్యక్తీకరణమున కనుకూలమగు శబ్దజాలము లభింపకపోయినను, ఉన్నవానితోనే సమగ్రముగా భావమును వ్యక్తీకరించు శక్తియుఁ గవితకుఁగలదని చెప్పనగును.

ఇంతవఱకుఁ దెలుపఁబడిన సంప్రదాయ సిద్ధములగు విషయములన్నియు నాంధ్రభాషా కవిత్వమునకును నన్వయించును.

కావ్య ప్రబంధ రూపమగు సారస్వతమునందుఁ గవి తాను గొంతమాటాడి పాత్రవర్గముచేఁ గొంత మాటాడించునది యొకతెగ. పాత్ర వర్గమును నోరెత్తనీయక కవియే మాటాడునది యింకొక తెగ. కవి తాను పెదవి గడపక పాత్రవర్గము చేతనే మాటాడించునది మఱియొక తెగ. దీనినే రూపకమని యందురు. ఆంధ్రమున మొదటి

రెండు తెగల కావ్యములే చిరకాలమునుండి లభించుచున్నవి. మూఁడవ తెగ యిప్పుడిప్పుడు పొడసూపుచున్నది. భావిదశ యెట్లుండునో చెప్పఁజాలము. ఏమనినఁ బ్రకృతమునఁ బ్రచలితములగు నాంధ్రనాటకాది రూపకములను జూడగా నిరుత్సాహము గలుగుచున్నది. తెలిగింపఁబడిన సంస్కృత రూపకముల నటుండ నిచ్చి క్రొత్తగా రచింపబడుచున్న తెలుగు రూపకములను గొన్నింటిని బరిశీలించితిమేని వానిని రూపకములని పేర్కొనుటకే యనువుపడదు. గద్య పద్యాత్మకమగు కథోపకథన మాత్రమెల్ల రూపకమనవలసి వచ్చెను. వివక్షితార్థ ప్రతపాదనము గాని, యితివృత్త విస్తరము గాని, చమత్కారిత్వము గాని వాని యందు స్ఫుటముగాఁ బొడకట్టదు. ఈ రీతి దృశ్య ప్రబంధముల వలన నాంధ్రరూపక సారస్వతము వన్నె కెక్కఁజాలదు.

ఇప్పుడు వివరించిన భేదములు గల యాంధ్ర సారస్వతమునందలి కవిత్వ కళకు శిల్ప చిత్రలేఖన గాన కళలతోఁ గల సంబంధమును మనమేతీరున సమన్వయము చేసికొనఁగలమో యోజింతము. ఈ పని తలపెట్టినప్పుడు ముందుగాఁ గవికిని గవిత్వమునకును లోకమునకును గల సంబంధమును దెలిసికొనవలసి యుండును. కావున సంగ్రహముగా విన్నవించుచున్నాను.

చందురుఁ డభ్రమున్ దివము
సైకతముల్ నదులు న్నగంబులున్
గందరముల్ గొలంకులు వ
నంబులు మున్నగు రమ్యవస్తువుల్
జెందుఁ గృతార్థతన్ గవుల
చేతనె; వారును లోక విశ్రుతిం
గందురు వానిచే; నిదియె
కాదె యొనంగుట పుచ్చుకొంటయున్.
కవిత యొనర్చి నంతతము
గానము సేయుచు దాని తోడిదే

భువనమటంచుఁ దెల్పు మగ
మొల్కయొకం డరుదయ్యెనేని నై
భవము దొలంగి లోకమొక
భంగి నిరర్థకమౌ ననందగున్
గవియును గాఁడతం డితర
గాథలు వేలకొలంది సెప్పినన్.

కావుననే,

మలయ సమీరణం బొలయ
మంజుల కుంజవనాంతసీమలన్
మలయుచు గంధబంధుర ను
మప్రకరంబులఁ గాంచి సొక్కుచున్
జలజసరోవిహారములు
సల్పుచు వెన్నెల లందు నిల్చుచున్
గలకలలాడు లోకమును
గాంచి కవీంద్రులు మిన్నకుందురే ?

అని యీ తీరునఁ గవనమును వెల్లివిరియించు సుకవుల పలుకు లెట్టివన్న;

చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము
గలిగినను – సౌరభముఁ జలువయుఁ దలిర్పం
బొలుపెనఁగు కప్పురపు బలుకులకుఁ గోమలత
నెలకొనిన – సౌరభముఁ జలువవనయుం గో
మలతయును గలిగి జగములు మిగులఁ బెంపె
నఁగు మలయపవనంపుఁ గొదమలకు మధురత్వం
బలవడిన – నీడు మఱి కలదనఁగవచ్చుఁ గడువెలయు

గల (యా) సుకవి పలుకులకు నెంచన్.

అని పింగళి సూరకవి చెప్పియున్నాడు. ఇట్లత్యంత స్తవనీయమగు నాంధ్ర కవిత్వము సహజమార్దవ మాధుర్యములు గలిగి యమృతధారా సంపాతంబునం బోలె మనలఁ దనియించును. అవ్యక్త మధురమగు గానామృతమునకు సువ్యక్తమధుర మగు నాంధ్ర కవితామృతము తోడ్పడి యాంధ్రలోకమును నిరంతరానందామృత మహాసముద్ర తరంగములలో నోలలాడించుచున్నది.

అవ్యక్తమధురమై కేవల నాదైక రూపమగు గానమునే రామరాజ భూషణుడు 'వీనులవిందై యమృతపు, సోనల పొందై యమందసుమదలదళినీ, గానము క్రందై యాస్వన, మానంద బ్రహ్మమైన' దని వచించెను.

రసోచితమగు సాహిత్య సంపదగల కవితను గలస్వనముతో సమ్మేళన మొనరించునప్పుడు మనకు గాన కళాప్రభావము సువ్యక్తమగును. ఆ యానందము నిరుపమానము. సంగీత సాహిత్యముల సమగౌరవము 'సకల మోదక తాళ వృత్త గతుల' ను మనోహరముగా మన కవులు విశదపఱచి యున్నారు.

శిల్పకళా నైపుణ్యమును బ్రత్యక్షముగాఁ జూపించు శిల్పకారులకన్న సుకవులు తమ కవితా నైపుణిచే మనకు దానిని దేశాంతర కాలాంతరముల యందు మనోగోచరము గావించుచున్నారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విగ్రహము మనకెక్కడ గావలసిన నక్కడ, నెప్పుడు గావలసిన నప్పుడు మనోగోచరమగునట్లు పింగళి సూరకవి –

'మృదు పదాంబుజములు, మెఱుఁగుటందెలు, పైడి దుప్పటియును, మొలముప్పడియును, మణిమేఖలయు, బొడ్డుమానికంబును, వైజయంతియు, నురముననలరు సిరియు, వరదహస్తము, కటివర్తిలుకేలు, శంఖము, చక్రమును దాల్చినకరయుగంబు, తారహారంబులు, చారుకంఠంబు, నిద్దపుఁజెక్కులును,

నవ్వుదళుకు పసలు, మకరకుండలములును, దామరలఁ దెగడు కన్నులు, మనోజ్ఞనాసయుగలికి బొమలు, ముత్తియపు నామమును, రత్నముకుటవరము నెసఁగగనుపట్టు శ్రీవేంకటేశుఁ' జూపు చున్నాడు. మఱియు నాతండు-

"కుటిలకచా! యెఱుంగుదువె
గొఱ్ఱుననేఁజని కొల్వకూటమె
క్కటి కడనున్కి యారయక
కట్టెదుటన్ బటికంపు గోడఁ బ్ర
స్ఫుటముగ దానియందు హరిఁ
జూచుచు మ్రొక్కగ వెన్క నుండి య
ట్టిటు మొగమంచు నవ్వె నభ
యెల్లను దన్మణి భిత్తియున్నదే?"

అని అడిగి శిల్పకళా చాతుర్యమును బ్రత్యక్షము సేయుచున్నాడు.

కవి స్వయముగాఁ దన కళా నైపుణ్యమును మాటలతోఁ జెప్పి విగ్రహమును నిర్మింపుమని శిల్పకారునిఁ చిత్తరువును వ్రాయమని చిత్రకారునిఁ బ్రోత్సాహము చేయుచున్నాఁడోయన -

" మెఱుఁగారు ముంజియు, మేని కోమలికంబు గడుదిట గుణము గుల్కెడు మొగంబు, పసుపు గోచులయొప్పు, బ్రహ్మతేజంబును, జారు కృష్ణాజిన ధారణంబు, తళుకు జన్నిదము మే, ధావి బొట్టును జిన్ని పట్టవర్ధనమును జిట్టితడుపు, మొలవంక యుంగరంబుల సొంపు, దండపుగోలయు, సన్నపు వ్రేల సిగయు, నొప్పు బ్రహ్మచారి యొకఁ డేఁగుదెంచెఁ, బుస్తకము గొంచు మిగుల సంభ్రమమున"

అని యొక బ్రహ్మచారిని మాటలతో మనకుఁ జూపించుచున్నాడు.

నేర్పరియగు చిత్రకారుడు చిత్రించిన చిత్తరువును జూచి చూడఁగానే విద్యా

గంధమెఱుంగని పామర జనులైనను బాలికా బాలకులైనను దాని మనోజ్ఞతఁ జప్పునఁ గ్రహించి యొకానొక విధమగు నానందము ననుభవింతురు. కవియగు నాతఁడో తన యానందమును బట్టజాలక మనోభావమును గవిత్వరూపమున వెల్లడి చేయును. ఒక జవ్వని చిత్తరువును జూచి యొకకవి మనసు నిలువబెట్టుకొనఁ జాలక–

"పలుకక పల్కరించు గతిఁ బాడక పాడిన రీతిఁ దేనియల్
చిలుకఁగ నవ్వకే నగిన లీలఁ గనుంగొనుచున్న నాదు క
న్నుల కతిసుందరంబగు మనోజ్ఞవు జిత్తరువందు నున్న నీ
చెలువము గాంచి నేను నొక చిత్తరువైతిని గాదె కోమలీ"

అని కొనియాడి యంతటితోఁ జాలించక

"పలుద నిగారవుఁ బటువు
వట్రువ యఱ్ఱవు నిబ్బరంపు గు
బ్బలు తెలినీటి పోల్కిఁ గను
వట్టెడు నన్నని జిల్గువయ్యెద
న్వెలువడి త్రుళ్ళి పైకుబికె
వీలఁటె గోలలకేల చేలముం
గలికిరొ కేలఁ గప్పవు."

అని సిగ్గువిడిచి యడిగి చప్పునఁ దెలివితెచ్చుకొని

"– అటుగాదఁటె చిత్తరువందుఁ గోమలీ?

అని సరిపుచ్చుకొనెను. ఆహా! చిత్రలేఖన కళాప్రభావము! విద్వాంసుల నయినను విమోహితులను జేయఁజాలునుగదా!

శిల్పకళకన్నఁ జిత్రలేఖనకళ యెక్కువ సౌకర్యము గలదైనను దేశకాలాను రోధముచేతను జలాచల విశేషానురోధముచేతను జిత్రకారుని హస్తలాఘవ మొక్కొ

క్కప్పుడు కట్టుపడి పోవుచుండును. దృష్టిగోచరములగు కొన్ని కొన్ని వైచిత్ర్యములను లిఖించి చూపఁజాలకుండఁ జిత్రకారునికి నిర్బంధము గలుగ వచ్చును గాని చిత్రపటమునఁ జూడ ననువుపడని చిత్తరువును మాటల నేర్పున మనకుం జూపింపగల కవికి మాత్ర మట్టి నిర్బంధములేదు.

"రవిగాననిచోఁ గవిగాననేర్చు" నన్న మాట సత్యమే యనవచ్చును.

శ్రీనాథ కవి చెప్పినట్లు-

"తటుకున నస్తమించు" రవిని జిత్తరువునఁ జూడజాలము.

అల్లసాని పెద్దనకవి యనుగ్రహించిన,

'సహసా నఖంపచ స్తన దత్త పరిరం ' భాది సౌఖ్యములను మీకుఁ జిత్ర కారుఁ డొసంగలేదు.

సర్వజ్ఞ సోమనాథకవి,

"అరచందురు డెందములోఁ
జొరఁ బారి వణంకు తోఁకచుక్కయ పోలెన్
నరకుండేసిన బాణము
హరి నిటలతటంబు నాటి యల్లల నాడెన్ "

అని చూపిన యుపమానోపమేయములను జిత్రకారుఁడు చూపఁ జాలడు.

మఱియు నాతని యుషాస్వప్నములోని 'లోఁగిటికిరాని రూపంబుఁ గౌఁ గిటికిన్ రాని పొందు" జిత్తరువున లభింపనేరవు.

పింగళి సూరకవి వలె నేచిత్రకారుఁడును జవ్వనులచేఁ బంతాలాడించుచు నుయ్యాల లూగించుచు నుండజాలడు.

బమ్మెర పోతనామాత్యుడు కడుపొట్టి వడుగును గగనమున కెక్కించి సత్య లోకమును దాటింప నెంచగా,

" ఇంతింతై వటుఁడింతయై మఱియుఁదా
నింతై నభోవీథిపై
నంతై తోయదమండలాగ్రమున క
ల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధృవునిపై
నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతు డగుచు బ్ర
హ్మాండాంత సంవర్ధియై.

పరమేశ్వరుఁడాతని మనోరథమీడేర్చి లోకమున కీపద్యము చదువునపుడెల్లఁ దానారూపమునఁ బ్రత్యక్షమగుచుండును.

ఇట్లు విమర్శించిచూడఁ గవితా కళ, శిల్పగాన చిత్రలేఖన కళల కన్న మిన్నయని నిరాతంకముగా సిద్ధాంతము సేయఁదగియుండును. భాషామాధుర్యమును బట్టి మనోజ్ఞ కళావైదగ్ధ్యమును గవితానైపుణిచే లోకమునకుఁ బ్రసాదింపగల సామర్థ్యమే మన యాంధ్రభాష కత్యధికముగాఁ గలిగియుండుట మన యదృష్టఫలమని చెప్పనగును. స్వదేశ భాషాభిమానముగల సంస్థానాధీశుల సమాదరణము చేతను సత్కవుల సామర్థ్య ప్రదర్శనము చేతను మహాజనుల యానుకూల్యము చేతను మన యాంధ్రకవిత శాశ్వతమగు లోకఖ్యాతిని గడించునట్లు పరమేశ్వరుఁడను గ్రహించు గాక!

(గ్రంథాలయ సర్వస్వము – 1924 అక్టోబరు)

4. విశ్వనాథ సత్యనారాయణ
(1895-1976)

కవిసమ్రాట్, జ్ఞానపీఠ బహుమతి గ్రహీత అయిన విశ్వనాథ సత్యనారాయణ ఆధునికయుగ రచయితలలో అగ్రగణ్యమైన స్థానం అలంకరించారు. కృష్ణాజిల్లా నందమూరులో 1895 సెప్టెంబరు 10వ తదీన పార్వతీ దేవి శోభనాద్రి దంపతులకు జన్మించిన విశ్వనాథ ఎం.ఏ. పట్టభద్రులై కళాశాల అధ్యాపక, ప్రిన్సిపాల్ పదవులు నిర్వహించారు. ఆయన రచించిన అసంఖ్యాకమైన కావ్యాలు, నవలలు, కథానికలు నాటకాలు, వ్యాసాలు, విమర్శగ్రంథాలు సాహిత్య రంగంలో ఆయనకు సుప్రతిష్ఠితమైన స్థానాన్ని సముపార్జించాయి. వీటన్నింటిలో ఆయన జాతీయాభిమానం, సనాతన ధర్మాభినివేశం ప్రస్ఫుటంగా ద్యోతకమవుతాయి. సంప్రదాయప్రియులైన విశ్వనాథ నవ్యకవితా ప్రక్రియలన్నీ చేబట్టి సాహిత్య సృజనలో అనేక నూత్న ప్రయోగాలు చేశారు. ఆంధ్ర ప్రశస్తి, గిరికుమారుని ప్రేమగీతాలు, కిన్నెరసాని పాటలు, వరలక్ష్మీ త్రిశతి మున్నగు కావ్యాలు నవ్యకవితా ప్రక్రియకు విశిష్టమైన నిదర్శనాలు. నవ్యసంప్రదాయ మార్గంలో విరచితమైన రామాయణ కల్పవృక్షం తెలుగులో మొదటి జ్ఞానపీఠ పురస్కార గౌరవాన్ని పొందింది. సాంఘిక–చారిత్రక–పౌరాణిక నవలలు 70కి పైగా ఆయన కలం నుంచి వెలువడ్డాయి. ఏకవీర, వేయిపడగలు, చెలియలికట్ట, తెరచిరాజు, మాబాబు, ఆరునదులు మున్నగు నవలలు ఎంతో ప్రఖ్యాతిని గడించాయి.

సృజనాత్మక రంగంలోనేకాక సంస్కృతాంధ్ర సాహిత్యాలు, ప్రక్రియలు, కవులపై ఆయన రచించిన వ్యాసాలు, విమర్శలు విమర్శ ప్రక్రియలో కూడా ఆయన ప్రతిభను చాటుతాయి. తెలుగు సాహిత్య చరిత్రను పది రేడియో రూపకాలద్వారా అందించటం అపూర్వ ప్రయోగం. వివిధ రచయితల గ్రంథాలకు ఆయన రచించిన పీఠికలు, సాహిత్యోపన్యాసాలు ప్రత్యేక సంపుటాటుగా వెలువడ్డాయి. తెలుగు సాహిత్యానికి అఖండ ఖ్యాతి గడించిన సత్యనారాయణగారు రాష్ట్ర, కేంద్ర అకాడమీల బహుమతులు, గజారోహణ–పుష్పకిరీట సన్మానాలు, కళాప్రపూర్ణ – పద్మభూషణ బిరుదులు – ఆస్థాన కవి పదవి మున్నగు అనేక గౌరవాలు, పురస్కారాలు పొందారు. సహస్రమాస జీవితోత్సవం జరుపుకొన్న విశ్వనాథ 1976 అక్టోబరు 18వ తేదీన స్వర్గస్థులైనారు.

4. పూర్వాంధ్ర సాహిత్యము

- విశ్వనాథ సత్యనారాయణ

సాహిత్యమనగానేమి? సహితానాం భావః సాహిత్యమ్. సహితములైన వానియొక్క భావము సాహిత్యము. సహితమనగా కూడుకొని యున్న అని యర్థము. లోకమునందు చెప్పుచున్నారు. కాని నిజముగా హితమైన దానితో కూడి యున్నదని యర్థము. హితమనగానేమి? 'హితం మనోహారిచ దుర్లభంవచః' అని భారవి వ్రాసినాడు. హితమును, మనోహారియునైన వాక్కు దుర్లభము. ఏ మాట మనోహారిగా నుండునో, మనస్సునకు తాత్కాలికమైన యొక పొంగును తెచ్చునో, అట్టిదియు హితమైనదియునైన మాట దుర్లభము. హితమనగా నేమి, హితమనగా పథ్యము. అనగా తత్కాలమునం దయిష్టముగా నుండి అనంతర కాలమునందు మేలును సమకూర్చునది. వైద్యుడు పథ్యమును చెప్పును. అది తినుట కష్టము. కాని తిన్నచో వ్యాధి కుదురును. మొత్తముమీద సాహిత్యమనగా తత్కాలమునందు హితముగా నుండదు. అనంతర కాలమునందు హితముగా నుండును. తరువాత మేలును సమకూర్చును. తరువాత ననగా నెప్పుడు? దానితో నీవు పరిచయము వృద్ధి చేసికొని, దానిలోని సౌందర్యము నాస్వాదించుట కలవాటుపడి, ఆ సౌందర్యము ననుభవించుచు నానందము పొందగలిగినంత జీవలక్షణము పెంపొందించుకొని, అందులో చెప్పబడ్డ మహా విషయములే యథార్థములని తెలిసికొన్న తరువాత నది సాహిత్యమగును.

ఏ భాషలోనైనను కులపర్వతములవలె కొందరు కవులుంటారు.

పూర్వ కవులు కొన్ని వందల మంది యున్నారు. వేయి సంఖ్య దాటినదేమో

తెలియదు. పాతిక ముప్పది నలువది యేండ్లు ప్రమాణముగా చూచికొన్నచో నెప్పటికపుడు ప్రతి భాషలోనను – అనగా నాగరిక భాషలలో నసంఖ్యాకులయిన కవులుందురు. అందుకనియే 'ఏమహాత్ములు కల్గ భూమీశ సభలలో గవులకు మిగుల విఖ్యాతి కలిగె' అన్నాడు. భూమీశ సభలనగా వట్టి రాజుల సభలని కాదు. సదసద్విచారణ చేయగల సభలని యర్థము. సామాన్యముగా పూర్వ రాజులే పండితులు. అది కాక వారి సభలలో పండితులు, భావుకులు సదసద్విచార గుణశీలురు నుండెడివారు. పూర్వ కవులలో కొద్ది మంది మహాత్ములు, మహా సాహిత్య నిర్మాతలు, చాల మంది పద్యరచనయు ధారాశుద్ధియు, పలుకుబడియు కొంత గడుసుదనము కలవారు. వారి పేర్లు నిలువలేదు. నిలుచుట రెండు విధములు. దేశములో భావుకుల పరంపర యొకటి యుండును. వారి యందు నిలచినచో నిలుచుట; కాళిదాస కవి నిలిచియున్నాడు. కాళిదాసు మహాకవి యనెడి వారిలో నెంతమంది కాళిదాసును చదివినారు? చదివినవారిలో నెంతమందికి కాళిదాసర్థమైనాడు? సరిగా నర్థమైనవారి సంఖ్య తక్కువ, ఈ తక్కువ సంఖ్యవారు కాళిదాసుని మహాకవియన్నది పరంపరయా తరతరములుగా వచ్చుచున్న తక్కువ సంఖ్యలో కల యీ భావుకులే కాళిదాసును నిలబెట్టుకొనుచు వచ్చుచున్నారు. ఇది నిజమైన నిలుచుట. రెండవ విధమైన నిలుచుట నిలుచుట కాదు. పూర్వముకూడ వ్రాతప్రతులనేకములుండెడివి. వానిని చదివెడు వారుండెడివారు. ఇప్పుడచ్చుపడ్డ గ్రంథములున్నవి. చదివెడు వారున్నారు. వందలాది కవులుండవచ్చును. తత్తత్ప్రాంతములలో, తత్తద్భావాభినివేశము కలవారిలో వారు తాత్కాలికముగా కవులు. దానిని సాహిత్య మనవచ్చునో రాదో తెలియదు. కొందరు కవులు తమ కవిత్వములకు ప్రచారము చేయుదురు. ప్రచారకులను నియమింతురు. శాఖావర్ణాదికముల యభిమానముచేత ఒక కాలమునందు కొందరు కొందరు పూర్వ కవులకు ప్రచారకులగుదురు. తాత్పర్యమేమనగా యథార్థమైన సాహిత్యమును నిర్ణయించుట కష్టము. ఈ నిర్ణయ మిష్టము వచ్చినట్లుండుచున్నది.

కాని కుల పర్వతములవలె కొందరున్నారు. సంస్కృతములోనైన నింతే.

సాహిత్యమును వృద్ధి పొందించుకున్న సర్వనాగరిక భాషలలో నింతే. ఇంగ్లీషులోనైన నింతే. ప్రస్తుతము హితమనగా నేమో విచారించ వలయును. ఆ హితము నెరుంగుటకు మొదటనే రెండు నియమములు చెప్పబడినవి. మొదటిది యా మహా గ్రంథములతో నిత్య పరిచయముండుట. యథార్థమైన సౌందర్యము హఠాత్తుగా భాసించదు. చర్వణము చేసిన కొలది భాసించును. రెండవది దాని యాథార్థ్యమును జీవతః గ్రహించుట. పూర్వ కావ్యములున్నవి. పురపట్టణాది వర్ణనలున్నవి. పురవర్ణనములో ప్రాకారము, అగడ్త, సౌధములు, నాల్గు వర్ణములవారు, పుష్పలావికలు మొదలైనవాని వర్ణనలుండును. ఆ కావ్యములకిది స్థాయి.

ఆ సంఘమట్టిది. ఆ నాగరికత యట్టిది. ఆ ధర్మమట్టిది. అప్పటి కది హితము. దానిని నమ్మినచో జీవుని ప్రయాణము సులభమగును. ఐహికాముష్మికములు సిద్ధించును. అనంతకాలము బుద్ధికి భాసించును. నిత్యముగా నున్న యీ మానవసృష్టి యర్థమగును. యుగములుగా నీ మానవుడిట్లే బ్రతికి యున్నచో సామాన్యజీవులు తాము బ్రహ్మ పదార్థమని తెలిసికొనవలసిన యగత్యమున్నచో, ననంతర జన్మముల నెత్తవలసిన యవసరమున్నదని తెలిసినచో నేజన్మ కాజన్మ మంచి నడవడికతో నున్నచో, నది సాధ్యమగునన్న విశ్వాసము కలిగినచో నది హితము.

ఈ హితము రెండు విధములు. ఈ చెప్పినదెల్ల మొదటి హితము. అది జీవసంబంధమైన హితము. సృష్టిసంబంధమైన హితము. వ్యవస్థా సంబంధమైన హితము రెండవ హితము. అదికావ్యగతమై యుండును.

కావ్యమనగానేమి? ఆలంకారికముగా విచారించుట కాదు. అలంకారములని కొందఱు, నిర్దుష్టమైన శబ్దమని కొందఱు, ధ్వనియని కొందఱు, పలు మంది పలు విధముల చెప్పినారు. ఈ చెప్పిన దంతయు రెండు విషయముల కోసమని చెప్పబడినది. ఒకటి, పాఠకునకు కావ్యము చదివెడి శక్తి కలుగుటకు, రెండవది, కావ్య నిర్మాణ వైఖరిని క్రొత్త కవులకు చెప్పుటకు. కనుక, నాలంకారిక గ్రంథములు పరమ రహస్యమును చెప్పలేదన్నమాట. ఆ గ్రంథములు వ్రాసిన వారికా ప్రసక్తి లేదు.

ఎందుచేత? సంఘాది వ్యవస్థల విచారణ వారు చేసి చెప్పిరా? ఉన్న సంఘమును వర్ణించిరి. ఇదియునట్లే.

ఎవరు చెప్పినను తెలివి వృద్ధి చేసికొనుటకు చెప్పుదురు తప్ప తదధికమైన దానిని చెప్పరు. తెలివి యెట్టిది? ఎక్కడనుండి వచ్చుచున్నది? ఆ వచ్చెడి స్థలమేది? ఆ స్థలము నందుండవలసిన సంస్కార స్వరూపమెట్టిది? అది యెట్లేర్పడును? ఇట్టి ప్రశ్నలకు సమాధానము చెప్పబడదు. వేదములు, శాస్త్రములు, స్మృతులు, సూత్రములు కూడ చెప్పవు. యోగ్యమైన కర్మ, అయోగ్యమైన కర్మ వాని ఫలితములను మాత్రమే అవి చెప్పును.

కావ్యలక్షణములు :

ఒక కావ్యమునందు రెండు లక్షణములు కలవు. ఒకటి శబ్దము రెండవది యర్థము. అర్థమును విభజించి వేలమంది చెప్పినారు. శబ్దమును గురించి చాల తక్కువ చెప్పఁబడినది. శైలి, పాకము, రీతి యీ మూడు మాటలలో శబ్దమును గూర్చి సూచింపబడినది. ఎందుకు విస్తరించి చెప్పఁబడలేదు? ఔచిత్యము, ధ్వని, వక్రోక్తి, అలంకారములను గూర్చి కుప్పతెప్పలుగఁ జెప్పబడినది. రసములు – వానిలో మిత్రములు, అమిత్రములు, వీనిని గూర్చి కూడ కొంత స్థూలముగా ఁ జెప్పబడినది. శైలి పాకరీతులు ఎట్టివి! ఎట్లేర్పడుచున్నవి?

సూత్ర భాష్యాదులు, అలంకార గ్రంథములు చెప్పని యొక విషయమున్నది. అది జీవుని పరిణతి, జీవుని సంస్కారము.

శబ్దములు లేకుండ వాక్యము లేదు. అన్వయము లేకుండ వాక్యములేదు. ఈ అన్వయము ప్రౌఢ కవులలోఁ గొన్ని చోట్ల నధ్యాహారము చేసికొన్నఁగాని కుదురదు. చాలమంది చేసికోరు. ప్రౌఢకవి చెడిపోవుచున్నాడు. కనుక కావ్యము చదువుటకు తెలివి యవసరము. మహాకవుల కావ్యముల యొక్క సూక్ష్మ పరిశీలన మవసరము.

దీనిని గూర్చి చాల యున్నది. వదలి పెట్టుదము. శబ్దములున్నవి కదా! శబ్దములు ఒకటి మొదలు ఆరు ఏడు ఎనిమిదక్షరముల వరకు కూడిక కల్గిన వున్నవి. ఆ శబ్దములను కవి సృష్టించలేదు. కొన్ని శబ్దములు వ్యాకరణ సూత్రముల వలన నేర్పడుచున్నవి. ఎట్లయినను ఆ శబ్దములను మన ముచ్చరించుచున్నాము. వాని యందొక యుచ్చారణ సౌలభ్యము, వెనుక నెదో జీవునకిష్టమైన సవ్వడి, ఒక స్వర సంపుటి వంటిది. మంచి గాయకుడు వేసిన సంగతి వెనుక నొక కమ్మని రుచి యున్నది. మన జీవునకు నది తెలియును. కొందఱు జీవులు కొన్ని శబ్దములను కక్కసించు కొందురు. ఆ జీవున కాపరిణతి లేదని యర్థము. ఆ సంస్కారమా జీవునిలో లేదని తాత్పర్యము. ఇప్పటికి సూత్రభాష్యాదులు అలంకార గ్రంథాదులు చెప్పని యొక విషయము వచ్చినది. అదియేమనగా జీవుని పరిణతి. జీవుని సంస్కారము. ఈ రెంటి చేతనే శైలిగాని, పాకముగాని, రీతిగాని పాఠకుఁడు తెలిసికొనఁగలఁడు. ఇది యిట్లని చెప్పెడివాఁడెవ్వఁడును లేఁడు.

నన్నయ్యను పోలినవాడు సృష్టిలో మరియొకడుండడు.

ఇన్ని శబ్దములుండగా, శబ్దము లనంతవిధములైనవి యుండగా, ఆశబ్దముల వెనుక మన మూహించనిది, మనకు తెలియనిది ఒక తదక్షర సంపుటి వలన నేర్పడిన సంస్కారముచేత మాత్రమే తెలిసికొనఁదగిన ఆ గానములోని ఒక సంగతి వేసినపుడు వేసిన ఒక స్వరసంయోజన జనిత గుణము, అదియు సంగీతము వంటిదేమో అనుకొనఁ దగిన యొక సవ్వడిలోని యేదో గుణము కలదు గదా! ఇప్పుడు కవి తాను కావ్యము వ్రాయునప్పుడు తానట్టి శబ్దములను సమకూర్చుటయే గదా చేయునది. తన సమకూర్పులో నొక కావ్యములో ఒక పదియో పాతికయో శబ్దములుండును గదా! ఆ శబ్దముల యొక్క వెనుకనున్న సమీచీనత, సాన్నిహిత్యము సంగీతము. కాని సంగీతము సరిపోయినదా అని చూచి కొనవలయును. యథార్థమైన కవి వీఁడు. అప్పుడు శైలియో, పాకమో, రీతియో యేర్పడును. వానికి మించిన యిదమిత్థమని

చెప్పరాని యొక సంగీతమేర్పడును. మనకున్న శబ్దముల యొక్క దారిద్ర్యము చేత దానిని సంగీత మనుచున్నాము. కాని అది సంగీతము కాదు. సంగీతము వంటిది. అదియాత్మానుభవ వేద్యము. ఎవడును చెప్పెడిది కాదు. ఎవని యాత్మకు వానికి దెలియ వలసినదే. ఇది కాళిదాసుని యందున్నది. వాల్మీకి యందున్నది. నన్నయగారి యందున్నది. తక్కిన కొందఱు మహాకవుల యందున్న దెట్టిదో యాలంకారికులు చెప్పిరి. దానిని గుణములుగా విభజించిరి. మాధుర్యము, సౌకుమార్యము, ఓజస్సు మొదలైన గుణములుగా చెప్పిరి. ఈ గుణములను ప్రతిభాశాలియైన కవి, ఒక గుణముల లక్షణము కలిగిన ఒక జీవ సంపత్తి కలవాడు, సమకూర్చవచ్చును. ఒక శ్రీనాథుఁడు శబ్దముల నెన్నుట చేత తనరచన యందు మాధుర్యమన్న గుణము నెక్కి తొక్కిసలుగా సమకూర్చును. సంస్కృతములో భవభూతి కూడ నిట్టివాడే. మురారి ఆయన శిష్యుడు. అందుచేత నన్నయ్య, వాల్మీకి, కాళిదాసుల యందు మాధుర్య సౌకుమార్యాది గుణములు విస్పష్టముగ కన్పించవు. ఆ మహా విషయములలో నన్నయ్యను పోలినవాడు సృష్టిలో మరియొకడుండడు. ఇంగ్లీషు భాషలోనున్న ఇట్టి లక్షణము – నేను జన్మచేత నింగ్లీషువాడను కాను గనుక నాకు తెలియదు గాని– 'మిల్టను' లో నున్నదందురు. ఆ దేశములో మిల్టను ముందు 'షేక్స్పియర్' కూడ కవి కాదను వారున్నారు. ఈ కవిత్వ మిట్టిదని నిర్ణయించుటకు వీలులేదు. పద్య రచన వేఱు. ఇట్టి విలక్షణమైన కవిరచనవేఱు. 'జాన్ స్టూవర్ట్ బ్లాకీ' అనునొక స్కాట్లండులోని 18వ శతాబ్దములోని మహా గ్రీకు పండితుడొక వాక్యమును వ్రాసినాడు – పద్యము కవికిని తాత్వికునికి సమానమట! తాత్వికుడు కూడ పద్యము వ్రాయును. కాని పద్యములో వంద గుణములుండును. అనగా యథార్థమైన కవిగాడు. కవియై పుట్టలేదు.

తెలుగు కవుల్లో ప్రసిద్ధులు

తెలుగు భాషలో ప్రసిద్ధులైన మహా కవులు మొత్తము మీద నెనమండుగురు తొమ్మండుగురికన్న నెక్కువలేరు. వీరిలో నన్నయ్య వంటివారు 'తక్కినవారు కాదు'.

తెలిసికొనుటకు పైన చెప్పిన మహా విషయము లవగతమైన జీవసంపుటిలోని సంస్కార పరిణతుల యొక్క యావశ్యకత కలదు. అదియెక్కడో యెందుకో తెలియదు. ఈ దృష్టితో సంస్కృతములోననే నన్నయ్య వంటివాడు లేడు. నాకు తెలియదు. ఇంగ్లీషులో మిల్టను కావచ్చును. ఈ బ్లాకీ యొక గ్రీకు నాటకకర్త – నాటకములను తర్జుమా చేసినాడు. ఆ నాటక కర్త ఇట్టి కవియని యతడు చెప్పినాడు. నన్నయ్య వాణిలో సరస్వతీదేవి తన కచ్ఛపి మీద చమత్కారముగా నొకవ్రేలితో తంత్రులను మీటినది. ఆ ధ్వని ముందు నారద తుంబురులను కూడ చెప్పుటకు వీలు లేదేమో! ఒక ఏదో పరమ నిగూఢమైన రహస్యమును విప్పి నేను చెప్పుచున్నాను గనుక మీరొప్పుకొనుడనుట న్యాయమే కాదేమో!

నన్నయ్యగారి రచన ఈ సహజమైన పరమేశ్వరుడిచ్చిన యొక సంగీతపూర్ణమైన యక్షర సంయోగ చాతురితో సర్వత్ర నడచుచుండగా నాయన యలంకార శాస్త్రపు మర్యాదలను గూడ చక్కగా పాటించుచుండును. ఆ సమయములో కూడ నీ సంగీత లక్షణ మనుస్యూతముగానే యుండును. ఆ శబ్ద సన్నివేశము తద్గుణమును గుర్తించుటకు ప్రయోగించినాడని వెంటనే తెలియుచుండును. ఒక గుణమును పుట్టించుటకు నొక కవి కొన్ని శబ్దములను యేరి యేరి ప్రయోగించినాడనుకొనుడు. గుణము కనిపించును. దాని ఫలితము దానికి కలుగును. అయినను కవి దీని కొఱకీ శబ్దములను ప్రయోగించినాడని తెలియుచుండును. అది యాకస్మిక ప్రత్యవభాసము కాదు. కవి తన నేర్పు చేత చేసినది. ఈ సంగతి సర్వజ్ఞుడైన పాఠకునకు తెలిసిన వెంటనే దానిలోని గుణాధిక్యము కొంత కొరత పడును. పాఠకుడొక యానంద వీధి విహారము చేయుచుండును. ఒక యానంద సన్నివేశానుభూతి వేళ తదనుభూతి కారణము స్పష్టముగా తెలిసినచో ననుభూతిధారకు నడ్డము తగులును.

"హా! మహారాజ! మహామహీరక్షణ దక్ష దక్షిణ బాహుదండ దండితారాతి"

ఇది నలుడు తన చీర చించుకొని పోయినప్పుడు దమయంతి పొందిన దుః

ఖము. ఇంకొక కవి యైనచో పది భావములు పెట్టి పది పద్యములు వ్రాయును. తాను కరుణ రసమును పోషించుచున్నానని యనుకొనును. ఇచ్చటనది యేమియు లేదు. ఈ చిన్న కూర్పులో ముక్తపద గ్రస్తాలంకార మున్నది. ఆ యలంకారమున్నదని లీలగా తెలియుచున్నది. ఒక యలంకారమును కవి చొప్పించినాడన్న భావము లీలగానైన మహా భావుకునకు స్ఫురించరాదు. స్ఫురించుట తోడనే యానందధార కుంటుపడును. పెరభావము చేత తాడితమగును. నన్నయ్య దగ్గఱ నిదియొక నేర్పు కలదు. కూర్చిన శబ్దములచేత రసస్ఫూర్తిని కలిగించును. ఈ పైనుదహరించినది అందులోని భావము. అవి వట్టి సంబోధనలు. అందులో నుండి రసము సముద్భవించుచున్నది. ఎచ్చటనుండి పుట్టుచున్నది? శబ్ద సంయోజనము నుండి పుట్టుచున్నది. నన్నయ్య రచన యంతయు దీని కుదాహరణమే.

తిక్కన లేనిచో తెనుగు కవిత్వము లేదు ఇది తిక్కన విశిష్టత

తరువాతి వాడు తిక్కన్న. ఇద్దఱకు నిజముగా సంబంధములేదు. బహిః పరిస్థితులు చూచినచో నాంధ్రరాజ్యము శాంతముగా నున్నప్పుడు నన్నయ్య జనించెను. తిక్కన్న పుట్టిన కాలము వేఱు. దేశము ఛిన్నమై పోయినది. మనుమసిద్ధి చిన్నరాజు. అటు వీర శైవము విజృంభణలో నున్నది. తెలుగు శబ్దముల బాహుళ్యమునకు ప్రాచుర్యము వచ్చినది. ఇట్టి హేతువులు మహాకవి మీద పనిచేయునా? ఒక్కొక్కప్పుడు పని చేయును. ఛందస్సున్నది – ఆ గణముల యేర్పాటుగా పద్యము వ్రాసినచో పద్యమునకు శ్రుతిపేయత తగ్గును. శబ్దములను బట్టి గణములు కాని, గణములను బట్టి శబ్దములు కావు. తిక్కన్న తానెన్నుకొన్న శబ్దములను విరచి పద్యములందు గుప్పించి యొక యఖండమైన కవితానిర్మాణము చేసినాడు. అది యాయనకే సాధ్యము. ఇంకొకడు చేయలేడు. కాని భాష మీద నంత ప్రభుత్వము కలవాఁడు చేయగలఁడు. చేయును. కొందఱు చేసిరి. నేడు చేయుచున్నారు. కాని తిక్కన్న గొప్పదనము దీనిలో మాత్రమే లేదు. అనంత భావసంపుటిని సంగ్రహించుటలో నున్నది. వానిని పొడి

పొడి మాటలలో చెప్పుటలో నున్నది. సంస్కృత శబ్దములు బహుళముగా వాడి వానిని వాడనే లేదనిపించుటలో నున్నది. రసస్ఫోరకమైన భావోద్దీపకమైన రచనలో సంస్కృత సమాసములను వేయును. వేసినట్లు కనిపించదు. ఆ సమాసములు తిక్కనగారికున్న సహజ కవితావేశములో నుండి వచ్చినవి. తక్కినచోట్ల యందలి సమాసములు పాకములో నుండవు. తిక్కన్న లేనిచో తెనుఁగు కవిత్వము లేదు. నన్నయ్య నెవ్వఁడును అనుసరించలేడు. తిక్కన్నను ప్రతిభావంతుఁడనుసరించ వచ్చును. తిక్కన నుడికారమును, కాకువులను, పలుకుబడిని పట్టుకొని గుంజును. కావ్యమంతయు రసధ్వనిమయమగును. అయినది. అపవాదములైన పెక్కు స్థలములున్నను, ప్రధానమైన తిక్కన గారి కవితాలక్షణమిది. భారతము చదువుట కష్టమని తెలుఁగులో నానుడి కలదు. ఈ నానుడి పదునేను పర్వములు వ్రాసిన తిక్కనగారి భారతము చదువుటలో నున్న కష్టమును బట్టి వచ్చినది. సమృద్ధిగా కాకువును సంయోజింపవలయును. కంఠస్వరమును మార్చవలయును. వేదము నందువలె నుదాత్తానుదాత్త స్వరితములను సమకూర్చుకొన్నచో గాని తిక్కన రచన చదువలేము. చదివిన గాని సంపూర్ణ నర్థమీయదు.

శ్రీనాథుఁడున్నాడు. అదియొక గంగా ప్రవాహము. గంగ భూమికి దిగినది. కాని యథార్థముగా నామె మందాకిని. పూర్వ సంస్కృత కవులలో నున్న రమణీయ భావములు కలిగి బహుసమాసములను యథేచ్ఛముగా తన కవితలోనికి చొప్పించును. ఆయన సీసపద్యము తిక్కనగారి సీసపద్యములకనుకరణ కాని, ఆయన సంగ్రహించిన మాధుర్యము ధారా శుద్ధిచేత 'సీసమునకు శ్రీనాథుఁ' డైనాడు. విడమరచి చూపించినచో నట్టి సీసపద్య రచన యెంత సులభమో తెలియఁగలదు. ఆయన మఱియొక చమత్కారము చేసినాఁడు. సీస పద్యరచనమంతయు చేసి చివరకొక తెలుఁగు ధాతువును సమకూర్చును. దానితో నతని తెలుఁగు పద్యము తళుక్కుమనును. ఇట్టివి సర్వకవుల యందు క్రొత్త క్రొత్త మెఁలకువలుండును. ఇవి యన్నియు భావపరిపోషకములు, రసోన్మీలనములు.

సంగీత ప్రపంచకము

సంస్కృతములో వాల్మీకి వ్యాసులను వదలినచో, కాళిదాసుతో మొదలుపెట్టి కావ్యశైలి యొకటేర్పాటైనది. ఈ కావ్యశైలిలోనికి భారవి రాఁడు. తెలుగులో నన్నయగారి దగ్గఱనుండి కావ్యశైలియే. పెద్దనగారి కాలమునకు నీ కావ్యశైలి మరియు బిగిసి తెలుఁగు పద్య మొకపట్టు జరీ చీర కట్టిన సౌందర్యవతి వలె సిద్ధమైనది. అంత బిగింపు అంత ధారాశుద్ధి అంతమాధుర్యమున్న తెలుఁగు పద్యము పునాదులు పూర్వమే పడినవి. శ్రీనాథునితో మొదలు పెట్టినవి. ఈ పద్యమునకు పెద్దన పట్టాభిషేకమును చేసినాడు. అందుకని ఆయన యాంధ్రకవితా పితామహుఁడు. అన్నింటికంటె విలక్షణమైన గ్రంథమొకటి కలదు. దానిపేరు పాండురంగ మాహాత్మ్యము. శబ్దముల వెనుకనున్న యొక సులక్షణ షడ్జమస్వరము దాని మాధుర్యము దానికే తెలియును.

ఈ పూర్వాంధ్ర సాహిత్యము విలక్షణమైన యొక సంగీత ప్రపంచకము.

(ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక సంచిక నవంబరు 1976)

5. గుంటూరు శేషేంద్ర శర్మ
(1927 - 2007)

అమేయమైన ప్రతిభా వ్యుత్పత్తులను పండించుకొన్న మహాకవిగా విద్వద్విమర్శకులుగా గుంటూరు శేషేంద్రశర్మ ఆధునిక సాహితీ రంగంలో విశిష్ట స్థానం గడించారు. నెల్లూరు జిల్లాలో 1927 అక్టోబర్ 20న గుంటూరు సుబ్రహ్మణ్యం, అనుమాయమ్మలకు జన్మించిన శేషేంద్ర 1948 లో బి.ఎల్.డిగ్రీ పొంది కర్నూలు, హైదరాబాదు మున్నగు ప్రాంతాలలో మునిసిపల్ కమీషనర్‌గా పనిచేశారు. తమ 80వ ఏట 2007 మే 30వ తేదీన పరమపదించారు. సోరాబు, ఋతుఘోష మొ॥ కావ్యాల ద్వారా పద్య రచనలో ప్రతిభను ప్రదర్శించిన శర్మగారి కవితా ప్రస్థానం 1970 లో మలుపు తిరిగి వచన కవితా రంగంలో వాసికెక్కారు. శేషజ్యోత్స్న, మండే సూర్యుడు, నాదేశం-నా ప్రజలు, నీరైపారింది, గొరిల్లా మొ॥ కవితా సంపుటులు విలక్షణమైన ఆయన కవిత్వ పరిభాషకు, విశిష్టమైన అభివ్యక్తికి గీటురాళ్లు. సాహిత్యాభిమానులు కాకినాడలో 'నవకవితా పితామహ' బిరుదుతో (1997) ఆయనను సన్మానించారు.

ప్రతీకాత్మక విమర్శకు ప్రశస్త ఉదాహరణలైన విమర్శ రచనలు (షోడశిరామాయణ రహస్యములు, స్వర్ణహంస) వేద పురాణ కావ్యాలలో ఆయనకు గల గాఢ పరిచయాన్ని ద్యోతకం చేస్తాయి. ఆధునిక కావ్యశాస్త్రంగా వెలువరించిన కవిసేన మేనిఫెస్టో కవిత్వ విలువలతో కూడిన సాహిత్య స్పృహకు ప్రాముఖ్యం ఒసగింది. సంస్కృతం, తెలుగు, హిందీ, ఉర్దూ భాషలతో పాటు గ్రీక్, ల్యాటిన్ భాషలలో నిష్ణాతులైన శర్మగారు ప్రాచ్య పాశ్చాత్య సాహిత్యాలను తులనాత్మక వివేచన కావించిన 'కాలరేఖ' కు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. నరుడు-నక్షత్రాలు, సాహిత్యకౌముది మున్నగు వ్యాస సంపుటులలో ప్రాచీనాంధ్ర కవుల ప్రతిభకు ప్రతిఫలమైన పద్య రచనా శిల్ప సౌందర్యాన్ని హృద్యంగా వివేచించారు.

✻

5. ఛందస్సుకు అలంకార శాస్త్రానికి సేతువు పద్యశిల్ప శాస్త్రం

- గుంటూరు శేషేంద్రశర్మ

భావాలు పర్వతాలయితే ఈ భావం హిమాలయం వంటిది. ఒక మహత్తర శాస్త్రావిర్భావ శుభోదర్కం గనుక.

నేను చెపుతున్న మాటలు సూచన ప్రాయంగా చెప్పేవి మాత్రమే. తరతరాలుగా ఒక కృషి కొనసాగి, అది పండి పరిణతిపొందిన దశలో, ఆ కృషికి కొన్ని విస్పష్ట లక్షణాలు సమకూరుతాయి. ఆ లక్షణాలు తత్కృషి జ్ఞానకీలకాలు. ఆ లక్షణాలను బుద్ధిమంతులు గ్రహించి సూత్రీకరించినట్లయితే అదే శాస్త్రం అవుతుంది. బుద్ధిమంతులు నిర్మించిన శాస్త్రం సహాయంతో సామాన్యులకు తద్విషయ పరిజ్ఞానం సుగమం అవుతుంది. ఇది శాస్త్రావతారక్రమమూ, శాస్త్రప్రయోజనమూ.

అనుభవంచేత జ్ఞానం గడించాలి. ఇది అన్ని విషయాల్లోనూ సాధ్యం కాదు. మానవజాతి కొన్ని యుగాలనుంచీ క్రమంగా ఆర్జించిన ఒక అనుభవాన్ని ఒకడు తన జీవితకాలంలో మొదటినుంచీ అంతా తానే ఆర్జించడం అనేది అసాధ్యమూ, అసహజమూ, అవివేకమూ. అంతవరకూ పెంపొందిన అనుభవాన్ని, విజ్ఞానాన్ని స్వీకరించి అక్కడినుంచి ముందుకు పోతూ ఉండడమే మానవజాతి లక్షణము. అంతేకాని ఒక చొక్కా వేసుకోవలసివస్తే దూది సేకరించడం, వడికి నూలుచేయడం, బట్టనేయడం ఇత్యాది క్రియలన్నీ ఎవ్వడూ తానే చేయడు. బజారులో సిద్ధంగా ఉన్న బట్ట తీసుకొని చొక్కా

కుట్టించుకుంటాడు. ఒకడికి వ్యవసాయ విషయాలు తెలియవు. ఇప్పటికే కొన్ని వందల ఏళ్ళుగా మనుష్యులు వ్యవసాయం చేసి జీవిస్తున్నారు. ఇన్నాళ్ళ నుంచీ ఇంతమంది కలిసి పొందిన అనుభవాలన్నీ సమీకృతమై ఒక విజ్ఞానరూపంతో ఇవాళ మనకు ఉపలబ్ధం అవుతూఉంది. దాని సహాయంతో వ్యవసాయం చేయడం వివేకమవుతుందిగానీ, ఆ అనుభవం అంతా నేనే గడిస్తాననడం మూఢత్వం. ఈ దీర్ఘకాలిక వ్యవసాయజ్ఞానాన్ని సూత్రీకరిస్తే వచ్చేది శాస్త్రం. ఆ శాస్త్రం మనచేతిలో ఉంటే వ్యవసాయమర్మవేతృత్వానికి అదే సాధనం. అట్లాగే మనకు తెలీని భాషను లొంగదీసి వశం చేసుకోవడానికి వ్యాకరణం. అట్లాగే అన్ని శాస్త్రాలున్నూ....

తెలుగు పద్యరచనాకృషి దాదాపు వెయ్యి సంవత్సరాలనుంచీ జరుగుతూ ఉంది. అతి ప్రతిభాశాలురైన కవులు పుంఖానుపుంఖాలుగా అనంతకోటి పద్యజాలాన్ని సృష్టించారు. విశేషమేమంటే ఒక్కొక్క వృత్తంలోనే సందర్భోచితంగా నానావిధ రీతులు వచ్చాయి. ఉత్పల మాలికల కన్నిటికి యతిగణములు ఒక్క విధంగానే ఉంటాయి. కానీ ఆమాలిక ఎత్తుగడలో, ముగింపులో, మలుపులో, విరుపులో చూపించే వైవిధ్యము వైచిత్రిచేత అది ఒక్కొక విశిష్ట శక్తిని సంతరించుకుంటుంది. సీసము, కందములు కూడా ఇట్లాగే పెంపొందింపబడ్డాయి. ప్రత్యేకించి సీసానికి ఒక విశిష్ట స్థానం వచ్చింది.

ఉదా॥ ఒక మహాపురుషుడి మహత్తును చెప్పడానికి: ఎవ్వాని వాకిట ఇభమదపంకంబు రాజ భూషణ రజోరాజినడగు, ఎవ్వాని గుణలతలేడు వారాసుల కడపటి కొండపై కలయబ్రాకు, ఎవ్వాని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి మానిత సంపదలీనుచుండు ఈ విధంగా ఎవ్వాని, ఎవ్వాని అని ఎత్తుకుంటూ ఆ మహాపురుషుడి విశిష్ట లక్షణాలు నాలుగు వరుసగా చెప్పి చివర తేటగీతిలో అతడు భూరి ప్రతాప మహాప్రదీప దూర విఘటిత గర్వాంధకార వైరివీరకోటీర మణిఘృణి వేష్టితాంఘ్రితలుడు కేవల మర్త్యుడే ధర్మసుతుడు అని ఒక దీర్ఘ సమాసంతో ప్రశ్నార్థకంగా ముగించడం. ఇది ఒక గొప్ప శిల్పరీతి. ఇది తిక్కన పద్యం.

ఇట్లాగే శ్రీనాథుడు– 'ఎవ్వాడు డాచేతి క్రొవ్వాడినఖమున, చిదిమె భాషాదేవి చిగురు ముక్కు' అంటూ నాల్గు పాదాల తర్వాత గీతంలో 'అట్టి శ్రీ వీరభద్రు డీ యద్రిమీద' అంటూ ముగించాడు. జక్కన కించిద్భేదంతో 'ఏకొండ శిఖరాగ్ర మీక్షించినంతన భవబంధములు బెడ బాపగల్గు..... అట్టి శ్రీపర్వతము.' కొరవి గోపరాజు– 'ఎవ్వాని సాహసం బేవేళ జూచిన పరహితంబుల కెల్ల పట్టుగొమ్మ' అల్లసాని – 'ఉదయాచలేంద్రంబు మొదల నెవ్వని కుమారతకు క్రౌంచాచల రాజమయ్యె..... అట్టి శ్రీకృష్ణరాయ వీరాగ్రణ్యు'. వసుచరిత్రకారుడు– 'వసుమతీభార ధూర హత నెవ్వని యుర్వరా వరాహాంక మర్థమువహించు'.

ఈ సందర్భంలోనే మరొకపద్ధతి – మంచన 'తన కృపాజలధికి ధరణీ తలంబుపై మానవేంద్రులు నీటి మానిసులుగ' అంటూ తనతన అని నాల్గు పాదాలు చెప్పి చివరిగీతంతో మరింత నిబిడక్లుప్త సమాస ఘటనతో అతని గుణోత్కర్షచేసి పేరుచెప్పి ముగించడం. యిట్లా 'నెగడు బ్రహ్మవంశ నీరధి సంపూర్ణ చంద్రముడు.... నండూరి గుండనమంత్రి నిఖిల మంత్రిమండనంబు'. జక్కన – 'తన భుజాస్తంభంబు ధరణీ విలాసినీ సాలభంజికకు నాస్పదముగాగ.....(గీ) సురభిసురరత్న సురభూజ శరధిచంద్ర..... దనరె శృంగార శేఖర ధరణివిభుడు'. శ్రీనాథుడు – 'తన కృపాణము సముద్ధతవైరి శుద్ధాంత తాటంకముల కెగ్గు తలచుచుండ.....(గీ) పరగు శ్రీ వేమమండలేశ్వరుని మంత్రి'. తెనాలి రామకృష్ణుడు (పాండురంగడు)– 'తన కులాచార వర్తన వైష్ణవాచార పర్యాయుల కొజ్జబంతిగాగ..... (గీ) భద్రగుణసీరి విరూరి వేదాద్రిశౌరి'. వసుచరిత్ర– 'తన యశోవిశదముక్తా సౌధపాళికి నంబుదాయనము వాతాయనముగ....(గీ) వరలు భవ్యవిభావసుడు వసుడు.' కూచిమంచి జగ్గన– 'తన యపకీర్తి మాద్యత్ కృష్ణకాకికి ఘనతరాజాండంబు గూడుగాగ'.

సీసంలో ఒక సందర్భంలో మహాకవులు చూపిన కొన్ని పద్ధతుల్లో రెండు వివరించాను. తొలుత సీసపద్యానికి శిల్పరేఖలు సమకూర్చినవాడు తిక్కన సోమయాజి. దాన్ని శ్రీనాథుడు పట్టుకొని వియన్మార్గానికి తీసుకొని వెళ్ళాడు. సందర్భ సముత్పన్న

భావోద్వేగంతో వివిధ రీతుల్లో సీసపద్యాన్ని చెప్పాడు. ఆయన సీస శిల్పంలో ప్రధానంగా నాలుగు మర్మాలు కనిపిస్తాయి. యతిస్థానం ముందు శబ్దం ముగిస్తాడు. శబ్ద మధ్యంలో యతిరాదు. తర్వాత– యతికి పాదారంభవర్ణమే తీసుకుంటాడు. ఉదా: 'ప్రవహించు నెందేని భాగీరథీ గంగ ఉపకంఠమున హారమోయనంగ'. మూడు – సాధారణంగా గురువులు కలిగి దీర్ఘంగా సమంగా సాగే గణాలు తీసుకుంటాడు. నాలుగు – శబ్దాలు ఉదాత్త సుందరస్వరూప సంపద ఉన్నవాటిని వాడుకుంటాడు.

ఇక వృత్త నిర్మాణ పరిశీలన – ఒక ప్రదేశానికి ఒకడు వెళ్ళి అక్కడ కొండలో కానలో ఏవో వింత దృశ్యాలు చూడడం అనే సందర్భంలో రూపొందిన ప్రసిద్ధ పద్య నిర్మాణ పద్ధతి చూడండి–

శ్రీనాథుడు – 'కాంచెన్ గాంచనగర్భ సంభవు డుదగ్రగ్రావ కోటి స్కలత్..... శుంభత్కుంభి దర్పాంధ్యమున్..... భూమిభృచ్ఛిఖర గర్వా వంధ్యమున్ వింధ్యమున్'. పినవీరభద్రుడు– 'ఏంచి నుతింప శక్యమె మహీశ్వరునంతటి వానికైన రత్నాంచిత రోచిరుద్గమ నిరస్త సమస్త రవీందుజాలమున్..... దేవతామిథున వాంఛిత జాలము శీతశైలమున్'. జక్కన – 'నాకము గాంచె నట్టియెడ నందన మందచరన్నితంబి నీ లోకము..... విలాస మేనకా లోకము..... చంచల చంచరీకమున్..... విశేషపాకము..... పుణ్యలోకమున్'. కొరవి గోపరాజు– 'భూరమణుండు గాంచె నతిభూరి పయోధర ఝూటము..... మహావటజాటము..... కృతోటజవాటము..... ప్రభాపటల చిత్రకూటము చిత్రకూటమున్'. మనుచరిత్ర– 'అట జని కాంచె భూమిసురు డంబర చుంబి..... స్ఫుటనటనానుకూలపరిఫుల్ల కలాప కలాపి జాలమున్..... కంపిత సాలముశీతశైలమున్'. వసుచరిత్ర– 'వనజముఖుల్ కనుంగొని రవారిత వారితరంగ రంగనర్తన..... రథాంగధామమున్..... కంజగతాళి ధూమమున్..... సమధామము నొక్క సరోలలామమున్'. పాండురంగడు– 'వనితా చూచితె మాల్యవంతము ప్రభావంతంబు..... సానుకాంతము..... జనకేళీవద చంద్రకాంతము..... కూటవర్థ నదుర్దాంతము...... ప్రాగ్వర్ణితోదంతమున్'. నాచన–

'కదిసితిమంత దంతపరిఘద్విప ఖండిత దేవదారువున్..... మానసవాస భీరువున్..... లన్తక దేశచారువున్, ముదితచమూరువున్, ఫలితమూల సమేరువు నా సుమేరువున్'.

ఒక బిబ్బోకవతి భయవిస్మయకారణాల్లో దేనిచేతనైనా లేచి వేగిర పాటుతో పది అడుగులు నడచిన సందర్భంలో: మను– 'చూచి ఝుళంఝుళత్కటక సూచిత వేగ పదారవిందయై లేచి కుచంబులుం దురుము లేనడు మల్లలనాడ.....'. వసు–'వేణి చలింప కంపిత నవీనమృణాళ భుజాగ్రకంకణ శ్రేణి నటింప.....' ఇట్లా ఒకపాటి సమాసంతో అలతి పలుకులతో భావపూర్తి అవుతూ వాక్యం విరుగుతూ నడిపించడం ఈ సందర్భానికి అందమైన ఒక పద్ధతి.

ఒక విలాసవతి శోకాన్ని వర్ణించే సందర్భంలో మహాకవులు చూపిన పద్య శిల్పం – పద్యాలు సుప్రసిద్ధాలే.

శ్రీనాథు– 'కొసరి వసంతకాలమున కోయిల క్రోల్చిన భంగి' (ఆ.5.ప. 167)

మను – 'పాటున కింతులోర్తురె కృపారహితాత్మక......' (ఆ.2. ప. 70)

వసు – 'ఆ జాబిల్లి వెలుంగు వెల్లికల డాయన్ లేక......' (ఆ.4.ప.52)

తిమ్మన – 'ఈసునబుట్టి డెందమున హెచ్చిన శోక.....' (ఆ. ప.)

ఒక చిత్రమైన విషయం చూడండి. సౌందరనందం అనే ఒక ఆధునిక కావ్యంలో ఈ పద్యం ఉంది.

'నా తమ్ముండు దయాపయోధి శ్రితచింతారత్న మావన్న ర
క్షా తాత్పర్యుడు బౌద్ధధర్మ లతికల్ సాకంగలాడంచు నే
చేతః ప్రీతిగ నెంచుకొందుగద యిన్నీ పుష్పబాణాగమా
ధ్యేతృ ప్రాథమికుండవై తిరుగజన్నే నీ కిటుల్ సోదరా!'

దారి తప్పిన తమ్ముడ్ని సంబోధిస్తూ ఘనుడు కావలసిన వాడంటూ ప్రకృతావస్థను

ఈసడించుకుంటూ చెప్పే సందర్భం. సరిగ్గా ఇల్లాంటి సందర్భంలోనే పాండురంగడు చెప్పిన పద్యం చూడండి–

'నాదు సహోదరుండు సుజనస్తవనీయ నయప్రసక్తి బ్ర
హ్మాదుల మెచ్చుడేనతని యజ్ఞమునందున పూజ్యురాలనై
వేది యలంకరింతునని వేపురి లోపల చెప్పికొందు నీ
వేదియు లేక సర్వగుణహీనుడవౌట యెరుంగ తమ్ముడా!'–

ఈ ప్రాచీన పద్యానికి ఆధునిక పద్యం నఖశిఖపర్యంత అనుకరణ. అంటే ఆ సందర్భంలో అంత చక్కగా చెప్పాలంటే ఆపూర్వ పద్యపు నిర్మాణ శిల్పం ఉత్తమం అని భావించి దాన్ని స్వీకరించడం అన్నమాట. ఈ పని మన ఆధునిక కవి మాత్రమే చేయలేదు. తమ్ముని ఘనతను ప్రస్తావించే పట్ల పద్యాన్ని ఇల్లాంటి ఎత్తుగడతో విన్యాసంతో రచన చేయడము సంప్రదాయం అయి పూర్వం నుంచీ ఉంది. ఆధునిక కవి పాండురంగడి నుంచి తీసుకుంటే, పాండురంగడు పోతన దగ్గర నుంచి తీసుకున్నాడు. పోతన హిరణ్యకశిపుడు తన సహోదరుడు హిరణ్యాక్షుడ్ని గూర్చి రాక్షసబృందం ముందు ఉగ్గడిస్తూ ఇట్లా అంటాడు–'నాకుం దమ్ముడు మీకు నెచ్చెలి రణన్యాయైకదక్షుండు.....'. దీనికి మూలం మరొక చోట ఉంది. ఎర్రన హరివంశంలో కృతిభర్తయైన వేమారెడ్డి చేత అతని తమ్ముడ్ని గూర్చి చెప్పించిన పద్యం – 'నా తమ్ముండు ఘనుండు మల్లరథినీ నాథుండు.....' ఇత్యాది.

మత్తేభ శార్దూల విక్రీడితాల్లో సామాన్యంగా ఒక పద్ధతి గోచరిస్తూ ఉంటుంది. వృత్తారంభంలో మూడు నాలుగు గణాల వరకు అలతిపలుకులతో సాగించి, ప్రథమ పాదంతం నుంచిగానీ లేక రెండవ పాదాంతం నుంచి గానీ రెండు సమాసాలు ప్రయోగించి మరొక రెండు సమాసాలు మూడవ పాదంలో వేసి నాల్గవ పాదంలో ఒకే దీర్ఘసమాసం వేయడం ఒక శిల్పవిధానం.

తిక్కన– **'సింగం బాకటితో గుహాంతరమునం జేడ్పాటుమై యుండి మా**
తంగస్ఫూర్జిత యూథదర్శన సముద్య త్క్రోధమై వచ్చునో
జం గాంతార నివాస ఖిన్నమతి నస్మత్సేనపై వాడె వ
చ్చెం గుంతీసుత మధ్యముండు సమర స్థేమాభిరామాకృతిన్.'

పినవీరభద్రుడు –

'సింగంపుం బోదివచ్చు చందమున వచ్చెంబో యకాలారి యు
త్తుంగ శ్యామల దేహసంజనిత కాంతు ల్వీరలక్ష్మీ నవా
పాంగచ్ఛాయలతోడ బెల్లొదవి మ్రోయన్ వేల్లదుద్యద్భుజా
సంగత్వంగ దభంగ భంగుర ధనుర్జ్యా వల్లరీ ఝల్లరుల్'.

ఆదిమధ్యాంత మర్యాదలు పైన నేను చెప్పినట్లేగాక కించిద్భేదాలతో గూడ ఒప్పి ఉంటాయి. ఒక్కొకప్పుడు ప్రథమపాదంతోనే దీర్ఘ సమాసం వేసి మధ్య అలతి సమాసాలతో నడిపి క్రియను ఆ భాగంలోనే నిక్షేపించి తిరిగి పద్యాంతంలో దీర్ఘ సమాసం వేసి ముగించడమూ కద్దు.

జక్కన– **'నవ శబ్దార్థ రసానుబంధ పదవిన్యాస క్రియా భావ గౌ**
రవ పాకధ్వని రీతి శయ్యల గవీంద్రశ్రేణి కావ్యాళి జె
ప్ప వృథా మత్సరమూని దుష్కవులు జెప్పం జూతు రట్లేకదా
శివుడు దాండవమాడ నాడవె పిశాచీభూత భేతాళముల్'. కొన్ని

స్వల్పవ్యత్యాసాలున్నా నేను చూపిన పద్యాల్లో పైన జెప్పిన లక్షణాలు సామాన్యంగా ఉన్నాయి. ఇంకా ముఖ్యమైన లక్షణం మరొకటి ఉంది. ప్రసిద్ధ కవులందరి శార్దూల మత్తేభవృత్తాల్లో ప్రథమ పాదాంత్య గణం ఒక శబ్ద మధ్యంలో ముగిసిపోతుంది. ఆ శబ్దం మాత్రం ప్రథమపాదం దాటి రెండవ పాదానికి వచ్చి ప్రాసస్థానం కూడ దాటి తర్వాత ముగుస్తుంది. అట్లాగే పద్యాంతంలో సామాన్యంగా పెద్దదో చిన్నదో ఒక సమాసము ఉండి తీరుతుంది. ఈ శిల్పమర్మాన్ని గ్రహించి తద్రీతిగా పద్యనిర్మాణం చేస్తే ఉదాహృత పద్యాల్లో ఉన్న గంభీర గమనశక్తి మన పద్యాల్లోనూ ఉంటుంది.

క్రియా పదంతో ప్రారంభించడం ఒక పద్ధతి. నైషధం– 'చెమరించున్ దుహినచ్ఛ టాచ్ఛలమునన్.....' కాశీఖండం – 'కొనియెంగంచుకముల్ సముద్భట నటద్ఘోటీభట ప్రౌఢి'. క్రీడాభిరామం – 'వ్రాలెం దిక్కుల భామభావ్యతికర.....'

మరొక పద్ధతి రెండేసి సమాసాలు మొదటి రెండు లేక మూడు పాదాల్లో వేయడం, నాల్గవ పాదంలో ఒక దీర్ఘ సమాసం వేయడం, క్రియా పదం చివరి పాదంలో ఉంచడం.

శ్రీనాథ– 'స్మరదివ్యాగమ కోవిదుల్ మదన శిక్షాతంత్ర పారంగతుల్.....'.

గోపరాజు – 'లంకేశారి పదాంకితంబులు ఝురాలంకార కూలంకషల్, పంకేజాకర సంకులాంతరములుం.....'.

నాచన – 'ధనదాంతఃపురతారహారములు యాదఃపాల బాలా ఘన స్తన కాశ్మీరము.....'

లేకపోతే తృతీయా విభక్త్యంతంగా సమాసాలు విరిచి చెప్పడం.

జక్కన – "దివిజస్త్రీ కుచకుంభ కుంకుమముతో దివ్యాంగనా వాటికా నవకర్పూర రజంబుతో....."

నాచన – "గనయంబుం గొనయంబు నెన్నడుముతో కర్ణావతంసంబుతో... తర్జన గర్జారవ జర్జరాంగ రుధిరాసారంబు తోరంబుగాన్".

అసలు పద్యాన్నంతా దీర్ఘసమాసజుష్టం చేసి తద్గత సమాసగమనంతో ఒక ఒయ్యారం ఒక శబ్ద వైచిత్రి చూపించడం మరొక పద్ధతి:

నాచన – "అరి జూచున్ వరుజూచు చూచుకములం దందంద మందారమాలా మకరంద బిందు సలిలస్యందంబు లందంబులై......".

"...ముని సంఘాత శిరోభినీత శరణాంభోజాత సంభూత నూతన రాగద్యుతి భాసురంబు..."

శ్రీనాథ – "ద్యావాపృథ్వ్యవకాశ పేశల యశోధారా నభస్సింధువై".

పాండురంగడు – "మన్మథ భుజానత పుష్ప ధనుర్మధూళి ధారామధురోక్తి గుంభన భరస్ఫురణా పరిణాహచాతురిన్".

నాచన సోమనాథుడు పద్య శిల్పఖని, మహానుభావుడు . ఆయన, శ్రీనాథుడు, జక్కన – వీరిలో శార్దూల మత్తేభవృత్తాల వాడుక ఎక్కువ. ఇది సంస్కృత సాహిత్య విశేష పరిచితీ ప్రభావమో, లేక వేగంగా పరుగెత్తే అవకాశం ఉన్న కావ్యేతర మార్గరచనా సందర్భ సహజధోరణి యేమో. కావ్యం వచ్చేసరికి శార్దూల మత్తేభాలు పోయి ఉత్పల చంపకాలు వస్తాయి. కాశీఖండ, భీమఖండాదుల్లో శార్దూల మత్తేభాలు విరివిగా వాడిన శ్రీనాథుడు శృంగార నైషధంలో చంపక ఉత్పలాలే ఎక్కువగా వాడాడు. కాశీఖండంలో 117 శార్దూల మత్తేభాలు, 112 ఉత్పల చంపకాలు వాడాడు. కానీ నైషధంలో 150 శార్దూల మత్తేభాలు వాడితే 241 ఉత్పల చంపకాలు వాడాడు. కాశీఖండంలో మొత్తం గద్య పద్యాలు 1834. కానీ నైషధంలో 1306. మను, వసుల్లో ఎక్కువగా ఉత్పల చంపకాలే వాడబడ్డాయి. శార్దూల మత్తేభాల శిల్పమూ, ఉత్పల చంపకాల శిల్పమూ ఇంచుమించూ సమానమే అయినా లేశము శారీరకభేధం ఉండడం చేత తెలుగు పలుకుబడికి శార్దూల మత్తేభాల కంటే ఉత్పల చంపకాలే యోగ్యంగా ఉంటాయి. అందుచేతనే శార్దూల మత్తేభాలు సాధారణంగా సంస్కృత జుష్టంగా ఉంటూ ఉత్పల చంపకాలు తెనుగు నుడికారపు కమ్మతావులు గుబాళిస్తుంటాయి. శ్రీనాథుడి అనంతరం కావ్యాల్లో శార్దూల మత్తేభాలు క్వాచిత్కంగానూ, ఉత్పల చంపకాలు బహుళంగాను వాడబడ్డాయి.

సంస్కృత సమాసకల్పనమే శిల్పం కాదు. సందర్భ స్వభావానుకూలంగా ప్రదర్శించే ఉత్కృష్ట నిర్మాణ చాతురీవిశేషమే శిల్పం అవుతుంది. అందుచేత ఈ క్రింద

ఉదహరించిన రమణీయవాక్య సంయోజన శిల్పం కాకపోదు.

శ్రీనాథ – "వియ్యంబందు తదీయ కీర్తులు దిశావేదండ తుండాళితోన్".

"రణకండూభర దున్సహాంబయిన యా
రాజన్య దేవేంద్రు ద
క్షిణ బాహాగ్రమునం జనించిన మహా
కీర్తి ప్రవాహంబు కా
రణ నంక్రాంత మహానుషంగముననో
ప్రస్పీత జ్మత్త వా
రణ గండస్థల కుంభకూలములతో
రాయుం దివారాత్రముల్".

"ఏలర యాచలం బుడిగియేలర బాలరసాల మాలతీ
జాలములో శశాంకకర జాలములో....."

అందుచేత సందర్భోచిత శయ్యా సౌభాగ్య సంపాదన, శబ్ద ప్రయోగ ప్రాగల్భ్యము కలసి శిల్పం అనిపించుకోగలదు. అయితే అట్లాంటి శిల్ప రీతులను సూత్రీకరించడం ఎట్లా సాధ్యమవుతుంది? ప్రధానంగా లబ్ధమయ్యే లక్షణాలను సూత్రీకరించి మిగతా వాటిని కవుల ప్రతిభాధీనంగా వదిలివేయవచ్చు. అలంకార ప్రకరణంలో ఉన్న అలంకారాలు కాకుండా మరొక కొత్త అలంకారం ఎవడయినా వేస్తే దాన్ని కాదంటామా? శాస్త్రం సాధ్యమయినంత వరకు సూత్రీకరిస్తుంది. అంతవరకయినా దారిసుగమమై లోకోపకారం జరుగుతుంది.

'ఏలర' "వియ్యంబందు" ఇత్యాదుల్లో ఏ నిర్ణీత నిర్మాణ క్రమం లేకపోయినా, అవి యిప్పటికే ఉన్న అలంకార శాస్త్రంలో చెప్పిన పాకశయ్యాలంకారాదుల క్రింద వస్తాయి. ఈ చోట పద్యశిల్పశాస్త్రం అలంకారశాస్త్రము మధ్య ఉన్న హద్దు

రద్దయిపోతుంది. అలంకార శాస్త్రంలో శబ్దార్థ విచారణ ఎంతజరిగినా శబ్ద విషయకమే అయిన ఛందో విషయం గురించి నిశితవివేచన జరుగలేదు. ఛందస్సు ప్రత్యేక శాస్త్రంగా ఉన్నప్పటికీ అందులోనూ వృత్త స్వరూప నిరూపణ స్థూలంగా జరిగిందేగాని దాని నిర్మాణక్రియలో సాధించదగిన అనంతవిధరీతులు చర్చింపబడలేదు. ఈ దృష్టిలో ఇది ఛందస్సుకు అనుబంధ శాస్త్రం అవుతుంది (వృత్యనుప్రాస, చేకానుప్రాస, యమకాది శబ్దాలంకారాలు వాక్య నిర్మాణ శిల్పం అవుతున్నాయి). కనుక మన పద్య శిల్పశాస్త్రం ఆవిర్భవిస్తే అది ఇటు అలంకారశాస్త్రానికి, అటు ఛందశ్శాస్త్రానికి సేతువుగా ఉంటూ ఒక విశిష్ట ప్రయోజనాన్ని నెరవేరుస్తుంది.

కొందరు కవులు కేవలం సంస్కృత సమాస సాహాయ్యంచేతనే పద్యంలో శిల్పం చూపించారు. అంటే వారి శిల్పం సంస్కృత సమాసాధీనం అన్నమాట. వారు నన్నయ్య, నాచన, పోతన, అయ్యలరాజు రామభద్రుడు, శేషం వేంకటకవి యిత్యాదులు. కానీ పద్యశిల్పం అంతే కాదు. తెనుగు శబ్ద ప్రయోగం చేత కూడా శిల్పచాతురి చూపించవచ్చును. ఆంధ్రవాఙ్మయంలో స్వభాషాభిమానం, దేశికవితాభినివేశం (బలిన తర్వాత తన్నాయకుడైన తిక్కన సోమయాజి మూలంగా తెలుగులో పద్యశిల్పం చూపడం ప్రారంభమయింది. పద్యవిద్యలో తొలుత శిల్పభావాన్ని తాను చూచి లోకానికి చూపించిన మహానుభావుడు ఆయనే. 'అమలోదాత్తమనీష నేనుభయ కావ్య ప్రౌఢి బాటించు శిల్పమునం బారగుడన్.....' అన్నాడు. తర్వాత కేతన, మారనలు, లేశమాత్రంగా నాచన, గోపరాజులు , ఆతర్వాత చాలాకాలానికి చేమకూర వేంకటకవి వచ్చారు. చేమకూర కవి ఈ విషయములో అతివిశిష్టుడు. తెలుగుపదాలతో కూర్పుచేత, విరుపుచేత శ్లేషను తీసుకొని వచ్చిన ఉపాయశాలి, చాతురీధురీణుడు. శబ్దాలంకారాలు కూడా తెలుగులో సాధించడం ఇతని ప్రత్యేకత. ఇది జాగ్రత్తగా గమనించండి. ఆ తర్వాత సంస్కృతాంధ్రాలను జోడించి అఖండ ప్రజ్ఞావిలసనంతో దేదీప్యమానంగా పద్య శిల్పాన్ని వెలయించిన మహాత్ముడు శ్రీనాథుడు. శ్రీనాథుడు ఆంధ్రకవితా ఘంటాపథ స్వైరవిహార గంధేభమూర్తి.

ఉదా: 'చికిలించుకొనియుండు జిలుగు ఱెప్పలలోన కుసుమసాయక వైరి నొసలికన్ను'.

'కబరికాభారంబుకై పెక్కు విరులతో, నవటు భాగంబుపై నత్తమిల్ల'.

'వలమానతాటంక వజ్రాంకురచ్ఛాయ లేతవెన్నెల పుక్కిలించి ఉమియ'.

'కంఠాగ్ర కరిరాజు దుంఠి విఘ్నేశుండు వడకు గుబ్బలి కూతు కొడుకు గుజ్జు'

'చిఱుసానబట్టించి చికిలి సేయించిన గండ్రగొడ్డలి నిశాగహనలతకు'.

'సేసకొప్పునజుట్టు శిఖిపింఛరింఛోళి మక్కళించిన జిల్గు మడుగుపాగ'.

శ్రీనాథమార్గ సమ్మోహితులై మను, పాండురంగాదులు ఉభయ భాషాసమ్మేళనతో శిల్ప సృష్టి చేయడం అవలంబించి కొనసాగించాయి. ఉదాహరణకు వసు. చూడండి.

'ఇమ్ములై మరుహజారమ్ములై పొదలుండ... తెప్పలై నెత్తావికుప్పలై పుప్పొళ్ళు...'

'ఏపారు పొదరిండ్ల నా పాటలాశోక...'

'ఒక చాయ ననపాయ పికగేయ సముదాయ'.

'నాదంబొక్కటి పిక్కటిల్లె దిశలన్ నవ్యామృతా వ్యాహతాస్వాదంబై...'

కందంలో శిల్పం – 'వీనుల విందై అమృతపుసోనల పొందై అమంద సుమచలదళినీ గానము క్రందై...'

'నాళీకాకర తీరసార కదళీ నారంగపూగావళీ...'

'కమ్మని వింటిజోదు నెరకైదువులైన మిటారి తమ్ము లీ తమ్ముల నెట్లు వోలు సతతమ్ము లతాంగుల...'

పద్య శిల్పానికి వసుచరిత్ర అంతా ఉదాహరణమే. పద్యశిల్పం రెండు విధాలు.

ఒకటి అర్థ చమత్కృతిచేత వచ్చేది, రెండు శబ్దచమత్కృతి చేత వచ్చేది. వెనక యిచ్చిన 'వసు' ఉదాహరణలు శబ్ద శిల్పం విశదీకరిస్తాయి. పాండురంగడిలో అర్థ శిల్పం విరివిగా దొరుకుతుంది.

ఉదా – 'కతపత్ర మిదవచ్చు కలగాంచునపుడైన కోరిక పరకాంత గోరడనుచు'.

'తొడవులు పెక్కులు తొడవి యుండెనెగాని సత్యంబు తనకు నిజాల తొడవు.'

'మొలక చీకటి జలజలరాల్పగా రాదె నెఱులు మించిన వీరి కురులయందు.'

కలుగ కుండిన నేమి కడిమిపువ్వులతావి ననిచిన మరువ మెంతటికి నోప...దు!!

లౌక్యచర్యా మర్యాద ప్రతిపాదించే సహజ సంభాషణ ధోరణితోనూ లోకోక్తులతోనూ పద్యం రచనచేయడం ఒక విధమైన శిల్పం. తిక్కన దీనికి మూలపురుషుడు. ఉదా: 'కౌరవసేనగాదు త్రిజగంబులు నొక్కట నెత్తివచ్చినం దేరు బృహన్నలావశగతిం జరియించిన గెల్వవచ్చు...'

ఎత్తునగొందు కౌరవుల నెల్లను మార్కొనిరేని గోవులం దెత్తు
ముహూర్త మాత్రమున తేరికి సారథిలేమిజేసి నా
చిత్తము నన్విచారదశ సెందెడు...
వచ్చినవాడు ఫల్గును డవశ్యము గెల్తుమనంగ రాదు.
వరమున బుట్టితిన్ భరతవంశము మెట్టితి.

ఆతర్వాత ఈ మార్గంలో తిరుపతి వేంకటకవులు ప్రముఖులు.

గత సహస్రవత్సరాల కాలంలో మహాకవి ప్రతిభా సన్నికర్షచేత తెలుగు పద్యం యిట్లా బహుముఖ శిల్ప సౌందర్యాన్ని సంపాదించుకుంది. తమిళ కన్నడ సాహితీ లక్షణాలను తెలిసిన మిత్రులు ఇంత శిల్ప సంపద ఆ సాహిత్యాల్లో లేదంటారు. ఎందరో కవులు ఇంత సముజ్జ్వల సంపద మనకిచ్చిపోతే దాన్ని అనుభవించడానికి

చేతగాక ధ్వంసం చేస్తామనే మాటలు, చేతలు ఈ తెలుగు గడ్డమీదనే పుట్టడం దురదృష్టం. ఇది నాగర లోకమా అని విచారం కలుగుతుంది.

ఈదృశ పద్య శిల్పం మర్మాలను ప్రజ్ఞావంతులైన కవులు, రసజ్ఞులు గుర్తిస్తున్నా, వ్యాఖ్యానాల్లో దాని ప్రస్తావన రాకపోవడం ఒక తీవ్రలోపం. పద్య సౌందర్య హేతువులుగా ఏ యితర చమత్కృతి విశేషాలున్నా యిక్కడ నేను చెప్పిన శిల్పం కీలక హేతువు అనేది ముఖ్యంగా గమనింపవలసిన విషయము. ఇక యీ విషయం వ్యాఖ్యానాల్లో ప్రస్తావించబడాలి. పద్య శిల్ప లక్షణాల నన్నిటినీ క్రోడీకరించి, వ్యాకరణచ్ఛందోలంకార శాస్త్రాలు సృష్టింపబడినట్లే ఒక పద్యశిల్ప శాస్త్రం సృష్టించాలి. దానికి మన పద్య సాహిత్యంలో పరిపక్వదశ వచ్చింది. కర్త అవతరించడమే మిగిలి ఉంది. వ్యాకరణాన్ని నన్నయభట్టు సృష్టించి వాగనుశాసనుడయ్యాడు. అలంకారశాస్త్రం సృష్టింపబడవలసిన అవసరం రాలేదు. సంస్కృత వాఙ్మయంలో ఉన్నదాన్నే వాడుకుంటున్నాము. అట్లాగే కించిద్భేదాలతో ఛందశ్శాస్త్రం కూడా. కానీ తెలుగువారు స్వహస్తాలతో సంపాదించిన సంపద ఈ పద్య శిల్పం. కనుక దీనికి ఒక శాస్త్రం సృష్టించుకోవలసిన అవసరం వారి మీద ఉంది.

అయితే ఈ విస్తార పద్యరాశిలోనుంచి లక్షణాలు తీసి క్రోడీకరించి సూత్రరచన చేయడం సాధ్యమా! పిచ్చివాడి ప్రలాపం అనిపించవచ్చు. కానీ తొలుత తెల్గుభాష ఎట్లా ఉండేది! దారీ తెన్నూలేక 'గాసటబీసటే చదివి గాథలు త్రవ్వెడు' అవ్యవస్థితదశలో ఉన్న తెలుగు భాషకు రూపు రేఖలు తీర్చిదిద్ది నన్నయభట్టు లక్షణం చెప్పలేదా? అట్లాగే చేసి ఈ మహత్తర శిల్ప సంపదను రక్షించుకోవాలి. దుస్సాధ్యమైన పని! ఎవరైనా చేసేదికాదు. ఈ మహా 'సముద్రము దరియంగ నీదను విధాతృనకైనను నేరబోలునే!' కేవల పండితులకు సాధ్యం కాదు. కవి శబ్దవాచ్యులూ అంతే.

(సాహిత్య కౌముది వ్యాస సంపుటి. 1968)

౬. బూర్గుల రామకృష్ణారావు

(౧౮౯౯-౧౯౬౭)

మహబూబ్‌నగర్ జిల్లా బూర్గుల వాస్తవ్యులైన రామకృష్ణారావు 1899 మార్చి 13న రంగనాయకమ్మ, నరసింగరావు దంపతులకు జన్మించారు. కొంతకాలం న్యాయవాద వృత్తిలో కొనసాగారు. ఆంధ్రోద్యమంలో చురుకుగా పాల్గొని తెలంగాణా ప్రజల చైతన్యానికి దోహదం చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని కారాగారవాసం అనుభవించారు. ముఖ్యమంత్రి, గవర్నరు మున్నగు ఉన్నత స్థానాలను అలంకరించారు. రామకృష్ణారావు బహుభాషా కోవిదులు, సంస్కృతం, ఉర్దూ, పర్షియన్, ఇంగ్లీషు భాషల్లో నిష్ణాతులేకాక కన్నడం, మరాఠీ భాషల్లో కూడా పరిజ్ఞానం కలవారు. స్వయంగా కవియై సంస్కృతం, తెలుగు, ఆంగ్లభాషల్లో కృతులు రచించటమే కాక ఇతర భాషా రచనలను తెలుగులోనికి అనువదించారు. సూఫీకవి సర్మద్, పారసీకవి ఉమర్ ఖయ్యాం రుబాయిలను, ఆదిశంకరులు, పండితరాయల సంస్కృత రచనలను, థామస్‌గ్రే ఆంగ్ల ఎలిజీలను భావయుక్తంగా ఆంధ్రీకరించారు. భక్తిపూరితమైన శతకాలు వెలువరించారు. కవిగానే కాక విమర్శకులుగా కూడ బూర్గులకు విశిష్ట స్థానం ఉంది. ఎంకిపాటలపై దుమారం చెలరేగినప్పుడు వానిరసభావాలను ప్రశంసిస్తూ వ్యాసం వ్రాశారు. కాకునూరి అప్పకవి జన్మస్థలము, రెడ్డిరాజుల కాలపు మత సంస్కృతులు వంటి పరిశోధనాత్మక వ్యాసాలు (సారస్వత వ్యాస ముక్తావళి) ఆయన సూక్ష్మ వివేచనను చాటుతాయి. బూర్గుల పీఠికలు విజ్ఞాన పేటికలు. దాశరథి గాలిబ్‌గీతాలు, గంగాపురం హనుమచ్ఛర్మ దుందుభి, గోవిందరామాయణం పీఠికలు పేర్కొనదగనవి. ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి 1967 సెప్టెంబర్ 10వ తేదీన పరమపదించారు.

✷

6. తెలుగు సాహిత్యంలో యుగకర్తలు

- బూర్గుల రామకృష్ణారావు

ఆంధ్రులకు సాహితీ సంస్కృతులు వేదకాలం నుంచియే అనూచానంగా వస్తున్నవను విషయము ఐతరేయ బ్రాహ్మణంలో స్పష్టంగా సూచితమై యున్నది. ఆంధ్రభాషకు నన్నయకు పూర్వమే శాసనవాఙ్మయములో సాహిత్యస్థాయి లభించినది. జానపద సాహిత్యరూపంలో విరివిగా సార్వజనీనంగా ప్రచారంలో ఉన్నట్లు అందరికి విదితమే. అయినను నన్నయకు పూర్వం సంస్కృత భాషాసాహిత్య ప్రాధాన్యత దేశమంతయు వ్యాప్తయై యుండడం మూలాన తెలుగు సాహిత్యానికి అర్హమైన స్థానం లభించియుండలేదు. ఆ లోపం నన్నయభట్టారకుడు తీర్చి తొలిసారిగా తెలుగులో ఉద్గ్రంథాన్ని రచించడానికి సంకల్పించాడు. రాజరాజనరేంద్రుని ఆస్థానంలో ఉన్న సంస్కృత పండితులు కొందరు నన్నయను అనుసరించిననూ, తన మార్గాన్ని నిరసించిననూ, రాజరాజుయొక్క ఆదరాభిమానములతో నన్నయ తన అభ్యుదయ పంథాలో జయప్రదంగా ముందుకు సాగి అజరామరమైన ఆంధ్రమహాభారత గ్రంథాన్ని నిర్మించెను. ఆయనకు నారాయణభట్టు మున్నగు విద్వాంసులు చేదోడువాదోడుగా నుండి సహకరింపగా 'వ్యాసముని ప్రణీతపరమార్థాన్ని' నన్నయ ఆంధ్రలోకానికి వెల్లడిచేశాడు. గోదావరి తీరంలో నన్నయ ఆదికావ్యమును, ఆదివ్యాకరణాన్ని వెలయించి ఆంధ్రభాషకు పవిత్రసాహిత్య స్థానాన్ని కల్గించినాడు. 'గాసటబీసట' యగు బాసయని నిరసింపబడు ఆంధ్రభాషకు ఉచ్చ సాహిత్యస్థాయి నొసంగిన నన్నపార్యునికి ఆంధ్రలోకం కలకాలము ఋణపడి యున్నది. అనేక వ్యావహారిక పదాలకు సాధుత్వం కల్పించి అసాధుత్వ లక్షణములను సంస్కరించి శాశ్వత ప్రామాణికతను ప్రసాదించినాడు.

అనేక సంస్కృత శబ్దాలకు తెలుగు విభక్తి ప్రత్యయాలు చేర్చి దేశీయ భాషాకోశాన్ని విస్తరించాడు. దేశీయ ఛందస్సులో ఉన్న గీతం, సీసం మొదలగువాటితోపాటు సంస్కృతవృత్తాలైన ఉత్పల, చంపక, మత్తేభ, శార్దూలాదులను స్వీకరించి పైగా సంస్కృత, కన్నడములలో లేని 'యతి' నియమమును ప్రవేశపెట్టి శబ్దానుశాసనుడై తర్వాతి ఆంధ్రకవులకు నన్నయ మార్గదర్శకుడైనాడు. మనకు కావ్యరచనారీతులలోగూడ నన్నయయే మూలపురుషుడు. పండిత కుంజరాల గండస్థలాల నవనత మొనర్చు సుదీర్ఘ సంస్కృత సమాసాలు, తెలుగువారికి కడుపునిండునట్లుగా అచ్చతెనుగు నానుడులు రెండునూ ప్రయోగించుచు నన్నయ భట్టరకుడు తన ఉభయభాషావైదుష్యాన్ని ప్రకటించాడు. 'ప్రసన్న కథాకవితార్థయుక్తి', 'అక్షర రమ్యత', 'గోస్తనీపాకము', 'సభ్యశృంగార వర్ణనము' 'సరససంస్కృత పదభూయిష్ఠశైలి' వంటి అత్యున్నత కావ్యరీతులతో ఆంధ్రసాహిత్య ప్రపంచానికి నన్నయ ఆదియుగకర్తయై విలసిల్లెను. ఏ బెదిరింపులకు లొంగక సాహిత్య రంగంలో క్రొత్తబాటను వేసిన ఈ యుగకర్త అధునాతనులగు నూతన పథానువర్తులగు వారికిని ఆదర్శప్రాయుడైన వాడగును. నన్నయ తర్వాత ఆయన నాటిన ఆంధ్రసాహితీబీజం దాదాపు తొమ్మిది వందల ఏండ్లకాలంలో క్రమక్రమాభివృద్ధిని బొందుచు బహుశాఖావ్యాప్తమై సుందరమధుర పుష్పఫలభరితమై సహృదయానందకరమగు కల్పవృక్షమై వెలయుచున్నది.

సాహిత్యయుగానికి చెందిన మరికొందరు యుగకర్తలుగా పరిగణింప బడుతున్నారు. వీరిలో ముఖ్యముగా శివకవులు ప్రాధాన్యత వహించుచున్నారు. నన్నయ వేసినది క్రొత్తబాట అయినప్పటికినీ అది మార్గ కవితకు అతి సన్నిహితమై కొందరి మెప్పును బడయజాలలేదు. నన్నయ తరువాత అతడేర్పరచిన మార్గకవితామార్గము వదలి, దానిని దేశకవిత యొక్క పూలబాటగా మార్చిన మహాకవి పాలకుర్తి సోమనాథుడు. నన్నయ భట్టారకుని తత్సమపద భూయిష్టమైన శైలి బహుజనాదరణము పొందజాలదనీ, వీరశైవమతాన్ని ప్రజానీకంలో పరివ్యాప్తం చేయాలంటే సంస్కృత వృత్తాలను విసర్జించి సంస్కృత భూయిష్టమైన భాషకూడ వదలి దేశికవిత నాదరించవలెనని సోమనాథుడు

అనుకొన్నాడు. ప్రజానీకంలో ఆవేశం కలగాలంటే పద్యాల కన్న పాటలే ఎక్కువ ప్రయోజనకరమైనవని సోమనాథుడు గుర్తించగలిగాడు. తిక్కన, ఎఱ్ఱనాది కవీంద్రులు కొంచెము భేదంతో నన్నయ కావ్య ఫక్కీనే అనుసరించి ఉత్తమ కావ్యసృష్టి చేయగా సోమనాథుడు దేశికవితా యుగకర్తగా జాను తెనుగు ప్రసన్నతకై ప్రయత్నించినాడు. అల్పాక్షరముల అనల్పార్థరచన కల్పించుటయే కవి వివేకమని నూతన కవితాసూత్రాలు రచించాడు సోమనాథుడు. తన కాలములో వ్యవహారములోనున్న తెలుగు పలుకుబడులను విరివిగా ప్రయోగించి బసవపురాణము, పండితారాధ్య చరిత్రము వంటి ప్రౌఢ కావ్యాలను కేవలం ద్విపద ఛందస్సులో రచించిన సోమనాథుడు ఆంధ్ర సాహిత్యములో రెండవ యుగకర్త. నూతన సాహితీ యుగానికి అంకురార్పణచేసిన పాలకుర్తి సోమనాథుడు వ్యావహారిక భాషకు సాహిత్యస్థాయి నొసంగి పూర్వాచారమగు యతిప్రాస నియమాలను కూడ నుల్లంఘించి కేవల ఛందోబంధనలు ఉత్తమ సాహిత్య సృష్టికి అనివార్యములు కావని నిరూపించినాడు.'పుడమీశుడు', 'నిత్యనియమం', 'ముల్లోకగతుడు', ఇతరవేల్పులు వంటి వైరి సమాసాలు బసవపురాణంలో ప్రయోగించి తన సంప్రదాయ విశృంఖలత్వాన్ని స్వేచ్ఛా ప్రియత్వాన్ని చాటినాడు. సోమనాథు ననుసరించి రంగనాథ రామాయణం, హరిశ్చంద్రోపాఖ్యానం వంటి ద్విపద కావ్యాలు పల్నాటి వీరచరిత్ర వంటి ఉత్తమ కావ్యాలు వెలసినవి. అనన్య ప్రతిభాసమేతుడైన సోమనాథుడు ద్విపదను, శివశిరజ్జనిత గంగాఝరిలా దూకించి తర్వాతి ద్విపదకవులకు ఆదర్శప్రాయుడైనాడు. శ్రీనాథుడు రచించిన పల్నాటి వీరచరిత్రకు పాల్కురికి కావ్యాలే ఉపస్కారకములు. ద్విపద వంటి సామాన్య దేశీయ ఛందస్సులైనను మార్గకవితా ప్రామాణికములగు వృత్తాదులైనను గ్రాంథిక భాష అయినను, వ్యావహారిక భాష అయినను ప్రతిభావ్యుత్పత్తులుగల సాహిత్యకుని చేతిలో ఉత్కృష్టమైన ప్రౌఢకావ్యాల సృష్టికి సాధనములే యగును. 'క్రియా సిద్ధిః సత్వే భవతి మహతాం నోపకరణే'.

సోమనాథుని తర్వాత కావ్యజగత్తులో శిఖరాయమానంగా అగుపడే కవి శ్రీనాథుడు. ఒకవైపు తెలంగాణ మాగాణంలో పోతరాజు 'అంబుజోదర దివ్య

పాదారవింద చింతనామృతపాన విశేషమత్తచిత్తుడై' భాగవతం రచిస్తూ ఉంటే, మరొకవైపు శ్రీనాథుడు 'ద్రాక్షారామచళుక్య భీమ వరగంధర్వ అప్సరోభామినీ వక్షోజద్వయ కుంభికుంభములపై వాసించు' కస్తూరికా వాసనలు ఆఘ్రాణిస్తూన్న ద్రాక్షారామేశ్వరుని జైత్రయాత్రను వర్ణింపసాగినాడు. ఈ మహాకవి చిన్నారి పొన్నారి చిరుతకూకటి నుండి జన్మాంతము కావ్య వ్యవసాయము సాగిస్తూనే వచ్చాడు. కేవల రచనా వ్యాసంగంలోనే గాక, ఈతడు ఆంధ్రభాషా వ్యాప్తికై తానలంకరించిన రాజాస్థాన ఆలంబనముచే విశేషకృషి చేశాడు. పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారి పదవిలో ఉండి విద్యావ్యాప్తికి దోహదం చేసినాడు. కర్ణాటాధీశ్వరుని కొలువులో డిండిమభట్టు కంచుఢక్క పగులగొట్టించి ప్రౌఢదేవరాయల సభాస్థలిలో స్వర్ణస్నానం చేశాడు. ఈ కవిసార్వభౌముని నాల్కకు బంధాలువేయ ప్రయత్నించిన ప్రతిపక్షాలు ఆనాడు నిశ్చేష్టులైనారు. తాను దర్శించిన ప్రతి క్షేత్రాన్ని, ప్రతి ప్రదేశాన్ని తన మనస్సునాకర్షించిన ప్రతి వస్తువును, ప్రతి సాంఘికాచారమును, జీవన పద్ధతిని హాస్యరసాస్పదముగా వర్ణించి విమర్శించాడు. ఆయన తన మనోజ్ఞములగు చాటువులతో తన కంటబడిన ఏ గర్హ్యమగు వ్యక్తినిగాని, విషయమునుగాని విమర్శింపక వదలలేదు. 'కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ, అగ్గిపుల్ల కాదోయ్ కవితకేదీ అనర్హం' అను నభిప్రాయమును వెల్లడించిన శ్రీశ్రీగారికి శ్రీనాథుడు చాల సన్నిహితుడుగా కనబడతాడు. ఒకవైపు సాహిత్య ఉద్యమాన్ని ఈ విధముగా నడుపుతూనే శ్రీనాథుడు మరొకవైపు ఉక్కు ఖండాలవంటి కావ్యఖండాలు సృష్టించాడు. కాశీఖండము, శృంగారనైషధం మున్నగునవి ఇటువంటివే. 'కాశీఖండ మయఃపిండం నైషధం విద్వదౌషధం' అన్నారు విజ్ఞులు. తెలుగు కావ్యరచనా పద్ధతిలో సీసమును వివిధ గతులలో పయనింపజేసి సెలఏరులాగా జలపాతంలాగా పిల్లకాలువలాగా గంగానది లాగా అనేక వేగ ప్రమాణాలతో ప్రవహింపజేశాడు. శ్రీనాథుని సీసపద్యం చదువుతూ వాద్య కళా నిపుణులకు మృదంగాలను చక్కగా వాయించే అవకాశం ఉంటుందనిపిస్తుంది. ఈ కవిసార్వభౌముడు పల్నాటివీరచరిత్రము రచించి, ప్రబోధవీర నవ్య రచనను ఆరంభించాడు. అందువలన శ్రీనాథుడు మరుపురాని యుగకర్త అని భావించవచ్చును.

పెద్దన కించిత్ భేదంతో నన్నయభట్టారకుడు ఆవిష్కరించిన సాహిత్య యుగంలో చేరినవాడైనను, ప్రథమ ఆంధ్ర ప్రబంధకర్త యగుటచే ఒక యుగకర్తగా పరిగణింపదగిన వాడని నా యభిప్రాయము. నన్నెచోడుని కుమార సంభవంలో మెరుపులాగా ప్రభవించిన ప్రబంధకవితా రీతులను ఆకళించుకొని పెద్దనామాత్యుడు సర్వలక్షణలక్షితమైన ప్రబంధరత్నాన్ని సృష్టించాడు. ఒక పౌరాణిక గాథను ఇతివృత్తంగా తీసుకొని శృంగారరసం అంగిగా, వీరరసం అంగముగా అష్టాదశ వర్ణనలతో అతి మనోహరంగా ప్రబంధకల్పన చేసి పెద్దన ఒక నవీన యుగాన్ని ఆవిష్కరించాడు. ఇతని పద్యరచన ఒక ఉదాత్తమైన శైలిలోసాగి, సాహిత్యలోకంలో ప్రత్యేకస్థానం ఆక్రమించుకొన్నది. పెద్దన వరూధినిని సృష్టించాడు. ఆ వరూధినియే ఆతని కమృతత్వ మొసంగినది. తరువాతి కవులెందరో అపర వరూధినులను కల్పించినను అవి అనుకరణములేగాని స్వతంత్ర కల్పనలు కావు. తరువాతి కాలంలో నేటిదాకా రచింపబడిన శృంగార ప్రబంధశతాలన్నీ ఇంచుమించు మనుచరిత్ర యొక్క అపూర్ణ ప్రతిబింబములని చెప్పవచ్చును. ఏ క్రొత్త పద్ధతి అయినా, ఏ ఆచారమైనా నవీనంగా వచ్చినప్పుడు ఎంత మంచిదైనను కాలక్రమేణ అది జడీభూతమై దానిలోని మెరుగు తరగి నిస్సారమైపోవును. పెద్దనార్యుడారంభించిన ప్రబంధయుగం కూడా అదేవిధంగా దుర్దశను పొందినది. శృంగార రసపోషణ అసభ్యతవరకు దిగజారింది. పాండిత్య ప్రకర్ష తప్ప సహజ కవితా ప్రజ్ఞ కొరవడసాగింది. నిర్ణీత నిబంధనల ననుసరించియే కావ్య కల్పన చేయటము శక్యమనే మూఢవిశ్వాసం వేళ్లునాటుకొన్నది.

ఇట్టి స్తబ్ధ పరిస్థితిలో పింగళిసూరన ఒక్కమాటు సాహిత్య సాగరంలో ఒక తాళోత్తాలమైన తరంగం కదిలించినాడు. అదియే కళాపూర్ణోదయ కావ్య సృష్టి. ఇప్పటికీ కళాపూర్ణోదయం ఆంధ్రకవితా జగత్తులో అనన్యసృష్టి అని ఒప్పుకోక తప్పదు. కళాపూర్ణోదయం నిజమైన కేవల కల్పనా కథ. ముఖ్యమైన కథలో అవాంతరమైన కల్పనాకథలను సహజ సముద్భూతము లగునట్లు కల్పించి అంగాంగ శృంగార వర్ణనలను అడుసులోద్రోసి, సహజ మానసిక ప్రవృత్తి చిత్రణలో సూరనార్యుడు తన

సర్వశక్తులు ధారపోశాడు. అట్లే శ్లేషకావ్యం కూడా వ్రాసిన మహాకవి సూరనయే. ఇతని ప్రతిభకు కళాపూర్ణోదయం పరాకాష్ఠగా ఉంటే, ఇతని పాండిత్యానికి రాఘవపాండవీయం పతాక సదృశంగా నున్నది. ఇతని ననుసరించినవారు వరుసగా హరిశ్చంద్ర నలోపాఖ్యానం, నలయాదవ రాఘవ పాండవీయము మున్నగు అనేకార్థ కావ్యాలను రచించారు. సూరనార్యుడును తెలుగు సాహిత్యమునందు ఒక యుగపురుషునిగా గణింపదగినవాడు.

సాధారణంగా సాహిత్య చరిత్రకారులచేత విస్మరింపబడుతున్న యుగకర్త వేమన. సోమనాథునిలాగా తేటతెనుగు ఛందస్సుగా ఆటవెలదిలో అనేక సహస్ర పద్యాలు రచించిన కవిమహర్షి వేమన. వేమనకు పూర్వం కథాసూత్రం లేని కావ్యమాలలు వెలువడినట్లు కనబడదు. సమకాలీన సమాజాన్ని కవితా వస్తువుగా స్వీకరించి, లోకంలో స్త్రీ పురుషులను కేవలం నాయికా నాయకులుగా గాక సంఘంలోని వ్యక్తులుగా గ్రహించి మానవజీవితాన్ని వివిధ సంఘటనల భూమికల్లో విమర్శించి తన మనస్సు స్పందించినపుడు పద్యాలు గుప్పాడు వేమన. ప్రతి పద్యం సాంఘిక దురాచారాలను, వ్యక్తుల లోపాలను, అంధ విశ్వాసాలను సువ్యక్తంగా ప్రతిబింబించే దర్పణము. ప్రతి మనిషి పద్యం చదివినపుడు తనను తాను అందులో చూచుకొని ఉలికిపడుతాడు; దిగ్భ్రాంతుడౌతాడు. వేమన పద్యాలు నెత్తురు చిందకుండా మానవుని మనస్సును దూసుకుపోయే బాకులు. ఆధునిక కవులలో పలువురు వేమన రచనచే ప్రభావితులై విమర్శాత్మక గీతాలు రాస్తున్నారు. ఇతని పద్యాల ననుసరిస్తూ అసంఖ్యాకంగా ఈ కోవకు చెందిన గీత వాఙ్మయం వెలువడింది. తన కాలంలోని మంచి చెడులను పద్యాత్మకంగా విమర్శించి సమకాలీనులకేగాక రాబోవు తరాలవారికి కూడా తెలియజెప్పి నీతిబోధ గావించిన ప్రథమ ప్రాచీన కవి వేమన. ఆంధ్ర సాహిత్యంలోని ప్రాచీన యుగకర్తలలో వేమన చివరివాడు. తెలుగు సాహిత్యంలోని ప్రాచీన సాహిత్యాకాశంవైపు స్థూలదృష్టిని ప్రసరిస్తే నాకగుపించిన తేజోమూర్తులైన కొందరు మహాకవులను యుగకర్తలుగా పేర్కొన సాహసించాను.

తెలుగు సాహిత్య చరిత్రలో ఆధునిక యుగకర్త కీర్తిశేషులైన గురజాడ అప్పారావుగారని అందరికీ తెలిసిన విషయమే. వారి ముత్యాల సరాలు, కన్యాశుల్కం ఈ రెండూ రెండు క్రొత్త బాటలను తీసి అసంఖ్యాకులగు ఆధునిక ఆంధ్ర రచయితలకు దారి చూపించినవి. వ్యావహారిక భాషను గ్రంథస్థం చేసి సాహిత్య స్థాయి నొసంగిన నూతన యుగపురుషుడు గురజాడ. సాంఘిక దురాచారాలను హాస్యరసాత్మకంగా చిత్రించి విమర్శించటం, అనేక దురాచారాలలో అత్యంతంగా సంఘాన్ని పీడిస్తూండే కన్యాశుల్క వరవిక్రయ దురాచారాలను ఎత్తి చూపించటం కేవలం సాహిత్యకంగా ఒక నూతన పద్ధతేకాదు; అది పరిణామకారకమైన సంఘసంస్కార సాధనం కూడ. కీర్తి శేషులైన వీరేశలింగం పంతులుగారే మొట్టమొదట సంఘసంస్కార దృష్టితో ప్రహసనములు మున్నగునవి వ్రాసి సంఘంలో చైతన్యాన్ని కల్పించిరి. కాని వారు సాహిత్య సంస్కారానికి ముందంజవేయ సాహసించలేదు. ఆధునిక యుగానికి గతశతాబ్దం చివరలో పునాదులు వేయబడ్డప్పటికీ యుగావతరణం మాత్రం ఈ శతాబ్దంలోనే జరిగింది అని ఒప్పుకోకతప్పదు. ఈ యుగంలోనే సాహిత్యకృషి బహుముఖంగా వ్యాప్తినిగాంచి ప్రపంచ సాహిత్యంతో తులతూగే ప్రయత్నం కొనసాగింది.

ఆధునికయుగ సాహిత్య ప్రగతి యొక్క ప్రధానమైన పరిణామం వచన రచనా వ్యాప్తి. ప్రాచీనయుగంలో చంపూకావ్యాలలో ప్రబంధాలలో శాసనాలలో అక్కడక్కడ గద్యం ఉపయోగించబడ్డప్పటికీ వచనానికి ప్రత్యేకమైన స్థానం కలుగనేలేదు. తెలుగు సాహిత్యంలోను, భారతీయమైన ఇతర భాషా సాహిత్యాల్లోను వచనానికి అర్హమైన స్థానం లభించటం పాశ్చాత్య సాహిత్య సంపర్కం వల్లనే కలిగిందని స్పష్టంగా అంగీకరించవలసిన సత్యము. వీరేశలింగంగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు మున్నగు పెద్దలు వచన కావ్యములు, నవలలు రచింపనారంభించిన తరువాత విజ్ఞానచంద్రికామండలి మున్నగు సంస్థల ద్వారాను, వెంకట పార్వతీశ కవులవంటి వ్యక్తుల ద్వారాను వచన సాహిత్యాన్ని తెలుగులో అవతరింపజేయుటకు దారి ఏర్పడింది. ఆధునిక నవలా వాఙ్మయం అతి విస్తారమైంది.

ఈ సాహిత్య యుగం యొక్క ప్రథమ ధర్మము వచన సాహిత్య ప్రాబల్యము. రెండవ ధర్మము కవితా ప్రపంచంలో జరిగిన యనేక ప్రధానమైన మార్పులు. చారిత్రకంగా జరిగినట్టి మొదటి మార్పు కేవల భావనా ప్రధానమైన ఖండకావ్యసృష్టి. ఈ పద్ధతికి చెందిన సాహిత్యాన్ని భావకవిత్వమని సామాన్యంగా పేర్కొనుట కలదు. ఈ ముఖ్యమైన పరివర్తనకు పునాదులు ఈ శతాబ్దమునందు వెలసిన కొందరు పండిత ప్రకాండులే వేసిరి. వారిలో కీర్తిశేషులైన చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రులు గారు ఆంధ్ర సాహిత్యకారులలో నిద్రాణమైయున్న కవితాశక్తిని మేల్కొలిపిరనుట అతిశయోక్తి కాజాలదు. ఉద్బుద్ధమైన ఈ వాతావరణంలో అనేక కవులు, సాహిత్యకారులు బహుముఖంగా తమ రచనలు సాగించి క్రొత మార్గము త్రొక్కిరి. సహజంగా పాశ్చాత్య సాహిత్య పరిచయం కలిగి, ఇతర సాహిత్యాలలో ఉండే వైవిధ్యం వల్ల ఆకర్షింపబడిన ఆంధ్ర కవులు నూతన ఫక్కీలో రచనలు సాగించిరి. అందులో కొందరు ప్రాచీన సాహిత్య సంస్కారాభిమానులు నవీన పద్ధతులను స్వీకరించినను, ప్రాతిపదికమైన ప్రాచ్య సారస్వత సిద్ధాంతాలను వదులుటకు ఉద్యుక్తులు కాలేదు. అట్టి వారిలో శ్రీరాయప్రోలు సుబ్బారావుగారు, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు మున్నగు వారు గణనీయులు. దేశంలో ప్రజ్వలితమై విజృంభించిన స్వాతంత్ర్యకాంక్ష, దేశసేవానురక్తి, స్వాతంత్ర్య ప్రాప్తికై జరిగిన చారిత్రకమైన పోరాటము ఇవన్నీ తెలుగు సాహిత్యంపై గాఢమై ముద్రవేయుటచే జాతీయ వాఙ్మయము వెల్లువగా వెలువడింది. సాహిత్య సృజనోత్తేజకములగు పై కారణములచే ప్రభావితులైన అనేక కవులు సాహిత్యకారులు రచనలు సాగించినారు.

ఈ యుగంలోనే జరిగిన రెండవ మార్పు మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఆరంభమైనది. అభ్యుదయ సాహిత్యమను ఒక క్రొత్తబాట ఏర్పడింది. ఈ దారి చూపిన వారిలో గణనీయులైనవారు శ్రీశ్రీగారు. ప్రాచీన సంప్రదాయం ప్రకారం నాయికా నాయకులగుట కర్హులని నిర్ణయింపబడినవారు ఆర్థికంగా సాంఘికంగా పైతరగతులకు చెందినవారు. అట్లుగాక నేటి సాంఘిక సమానత్వ సిద్ధాంతాలననుసరించి

సమాజహోదాననుసరించి రైతులు, కూలీలు, హరిజనులు, వెనుకబడిన జాతులవారు, పతితులు పీడితులు అనుకొనబడు దుఃఖజీవులు మున్నగువారంతా సాహిత్య రచన కనువగు వస్తువులే అని సిద్ధాంతీకరించారు శ్రీశ్రీగారు. అంతేగాక ఛందో నిబంధనలను సంపూర్ణంగా విడనాడి ఏదో ఒక భావాన్ని ఏ విధమగు భాషలోనైన హృదయమునకు ఆ క్షణంలో హత్తుకొనునట్లు వ్యక్తపరచినచో అది సాహిత్యమే యగునను యొక సిద్ధాంతము యీ అభ్యుదయ సాహిత్యకారుల విశ్వాసాలలోనుండి బయలుదేరినది.

దీనితోబాటు ఇంకా గ్రాంథిక వ్యావహారిక వాదాలు చెలరేగి, ఇంకను అవి సంపూర్ణంగా పరిష్కరింపబడలేదు. ఈ సంధియుగంలో సహజంగా ఏర్పడే వివాదాలు సాహిత్య సృష్టికేమాత్రము ఆటంకాలు కాలేదు. ఒక విధముగా దోహదములే అయినవని చెప్పవచ్చును. గ్రాంథిక భాషావాదులు ప్రాచీన సంప్రదాయానుసారం తమ రచనలు సాగించారు. సంస్కృత వాఙ్మయం నుండి కొత్త కొత్త అనువాదాలు చేసి తెలుగు సాహిత్య సంపదను పెంపొందించారు. మరి కొందరు 'క్రొత్త పాతల మేలుకలయిక క్రొమ్మెరుంగులు చిమ్మగా' తమ సాహిత్య కృషిని సాగించారు. మరి కొందరు నూతనాధి నూతనములగు పాశ్చాత్య రచనా పద్ధతులను అనుకరించి అలవరచుకొని స్వాయత్తపరచుకొన్నారు. ఈ ముత్తెరంగుల సాహిత్యకారులలో కూడ సఫలులు, విఫలులు ఉభయులు ఉండటం సహజము. పర్యవసానం ఏమంటే నేటి తెలుగు సాహిత్యం సర్వతోముఖాభివృద్ధిని గాంచుచూ అలరారుచున్నది. నవలలు, జీవిత కథలు, చారిత్రక గ్రంథాలు, సాహితీ విమర్శక రచనలు, నాటకములు, నాటికలు, కథలు, కథానికలు, పత్రికా రచనలు, వ్యాసరచన మున్నగు వివిధ సాహిత్య క్షేత్రాలలో సమధికమైన కృషి జరుగుతూనే ఉన్నది.

నేడు మన దేశీయ భాషలకు పూర్వము కంటె ఎక్కువ గౌరవ ప్రదమైన స్థానము అంగీకరింపబడుతున్నది. అది ఒక విధంగా నిర్వివాదమైన పరిష్కారము. ప్రజలు చేసిన ఈ పరిష్కారాన్ని ప్రభుత్వాలు ఒప్పుకోవటము అనివార్యము. అయితే

మన దేశభాషలను ఆధునిక శాస్త్రీయ, వైజ్ఞానిక సాంకేతిక గ్రంథరచనచే పరిపుష్టం చేసి తెలుగు భాషా సాహిత్యాలకు సంపూర్ణతను సంపాదించే భారం తెలుగు సాహిత్యకులపైన ఉన్నది. ఇంకను శాస్త్రీయ వైజ్ఞానిక సాంకేతిక గ్రంథరచనకు అర్హమైన ప్రాధాన్యం ఇవ్వబడటం లేదు. ఈ లోపాన్ని తీర్చటం సాహిత్యకుల కర్తవ్యము. బాలసాహిత్యం కూడ తగిన స్థాయిలో సృష్టింపబడలేదు. తెలుగు సాహిత్య ప్రపంచమున వ్యక్తిగతంగా సంతృప్తికరమైన ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ సమిష్టి ప్రయత్నాలు ఎక్కువగా కనబడుటలేదు. నేటి కవులుగాని, ఇతర రచయితలుగాని తమ రచనలను ప్రచురించే అవకాశాలే లేక దీనావస్థలో మునిగి ఉండటం మనకంతా తెలిసిన విషయమే. అయినను సాహిత్యకులు స్వయంగాగాని, లేక సాహిత్యాభిరుచిగలిగిన సాహిత్యకులలో సానుభూతి గలిగిన సాహితీ రసజ్ఞులుగాని ఈ లోపములను తీర్చే ప్రయత్నం చేయటం లేదు. రచయితలందరూ మారినట్టి నేటి ప్రపంచ పరిస్థితులలో తమ రచనలు అచ్చువేసి ప్రజల ఆదరాభిమానాలను చూరగొని తమ సాహిత్యకృషి యొక్క సంపూర్ణ ఫలాన్ని అనుభవించుట కవకాశాలు కలిగించుకోవలెను. కృతులగొని, కృతికర్తలను సన్మానించి, ధన గౌరవాదుల నొసంగి, సాహిత్యాన్ని పరిపోషించిన రోజులు మారినవి. నేడు సర్వవిధములైన సంపత్తులు ప్రజలలో కేంద్రీకరింపబడి ఉన్నవి. కనుక రచయితలును తమ సాహిత్య కృషిని జయప్రదంగా సాగించుకొనుటకై సహకార పద్ధతిపై గ్రంథప్రచురణ విక్రయాది కార్యములకై తామే పూనుకొనవలెను. రచయితలు స్వయంగా సభ్యులుగా ఉన్నటువంటి సహకార సంఘాలను ఏర్పరచుకొని మూలధనాన్ని కొంత సమకూర్చుకొని ఆ సంఘం ద్వారా కొనసాగించుకోవలెను. ఇతర రాష్ట్రాలలో ముఖ్యంగా కేరళలో ఇటువంటి ఉద్యమం అమలులో ఉన్నది. కొట్టాయంలో దాదాపు 400 రచయితలు సభ్యులుగాగల ఒక పెద్ద సహకార సంఘం స్థాపించబడినది. నియమాలు ఏర్పరచుకొని సహకార చట్టం క్రింద రిజిష్టర్ చేయించుకొని మూలధనం సేకరించి చక్కగా సంఘాన్ని నడుపుకొనుచున్నారు. సభ్యులు కానివారి పుస్తకములుకూడ ఆ సంఘం ప్రకటిస్తోంది. వారికి రాయల్టీ 10 ప్రతిశతి తక్కువ కాకుండా ఇస్తోంది. ఈ విధంగా ఆ సంఘం

ద్వారా నేను ఎరిగినంత వరకు ఇప్పటికి వెయ్యి గ్రంథాలు అచ్చువేయబడి పాఠకలోకానికి అందించబడినవి. ఒక లక్షరూపాయలకంటె ఎక్కువ ధనం ఇప్పటివరకు రాయల్టీ క్రింద ఆసంఘం రచయితలకు అందజేసింది. ఇటువంటి ఒక సహకార సంస్థను స్థాపించుకొనిన అముద్రిత గ్రంథాల చింతాభారమును మోయలేని అనేక ఆధునిక రచయితలు లాభపడే అవకాశమున్నది. ఇలాంటి ఉద్యమాన్ని ఆరంభించటం లాభకరంగా ఉంటుందని నా అభిప్రాయం. అత్యవసరమని కూడా నా మతం. తెలుగు రచయితలు యీ సూచననూ ఆలోచించెదరుగాక.

నేడు భారతదేశంలో విలసిల్లిఉన్న అన్ని ప్రాంతీయ భాషలు సర్వ విధములైన సౌకర్యములు కలిగి ఉన్నవి. ప్రతి లిపియొక్క టైప్ మిషన్స్ సిద్ధపర్చటం జరుగుతున్నది. అంతేగాక కేంద్రీయ ప్రచార సంస్థలు, అఖిల భారతీయ సారస్వత సేవా కేంద్రాలు, ప్రాంతీయ సాహిత్య సభలు, బహుభాషా కోవిదులైన పండిత పుంగవులు అందరు తమతమ భాషలను పరిపుష్టమొనర్చి తమ భాషా సాహిత్యములకు ఇతోధికమైన సామర్థ్యాన్ని ప్రాముఖ్యాన్ని సంపాదిస్తున్నారు. అట్టితరి, తెలుగు సాహిత్యమునకు మాత్రం అఖిలభారతీయ స్థాయిలో అర్హమైన ప్రాధాన్యత ఇంకా లభించలేదు. దానికై తెలుగు సాహిత్యకారులేగాక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము అఖిలభారతీయ స్థాయి పలుకుబడిగల ఆంధ్రులందరూ కలిసి సమైక్యతతో ప్రయత్నించవలసి ఉన్నది. అంతేగాక ఇతర ప్రాంతీయ భాషలలో వెలసి ఉన్నట్టి సారస్వతము, వైజ్ఞానిక సంపత్తిని తెలుగులోనికి తీసుకొని రావటం, అదేవిధంగా తెలుగు సారస్వత సౌందర్యాన్ని తెలుగు సాహిత్యంలోని అనర్ఘ రత్నాలను ఇతర భాషలలోకి అనువదించి పరస్పర ఆదాన ప్రదానం ద్వారా పరిపుష్టం చేసుకోవలసిన అవసరం ఎంతేని గలదు. ఈ విషయంలో జరుగుతున్న కృషి అంత సంతృప్తికంగా లేదేమోనని నా సందేహం. ఈ విషయమున మనమందరము జాగరూకులమై కృషి సల్పెదముగాక.

(1960 మే నెలలో హైద్రాబాదులో జరిగిన ప్రథమ అఖిల భారత తెలుగు రచయితల మహాసభలో చేసిన అధ్యక్షోపన్యాసం)

7. రాయప్రోలు సుబ్బారావు

(1892-1984)

నవ్యకవితా యుగకర్తగా శాశ్వత యశస్సు గడించిన మహాకవి రాయప్రోలు సుబ్బారావు. గుంటూరు జిల్లా గార్లపాడులో 1892 మార్చి 13న ఆదెమ్మ, వెంకటప్పావధాని దంపతులకు జన్మించిన రాయప్రోలు శాంతినికేతన్‌లో రవీంద్రుని సాన్నిధ్యంలో సాహిత్యాధ్యయనం చేశారు. జాతీయోద్యమం, కాల్పనికవాదం ప్రేరణలతో నవ్యకవితారీతికి శ్రీకారం చుట్టారు. మృదు పదబంధ సరణిలో రమణీయ రచనా శైలిలో వెలువడిన రాయప్రోలు రచనలతో తెలుగు కవిత్వభాషా స్వరూపమే మారిపోయింది. స్త్రీని భోగవస్తువుగా పరిగణించే స్థితిని త్రోసిరాజని, గౌరవ ప్రదమైన స్థానాన్ని కల్పిస్తూ 'అమలిన శృంగారం' అన్న ప్రణయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు రాయప్రోలు. లలిత, అనుమతి, తృణకంకణం, స్నేహలత, స్వప్నకుమారము, కష్ట కమల, రూపనవనీతము మున్నగు కావ్యాలన్నీ ఈ దృక్పథాన్ని విశిష్టంగా ప్రతిబింబిస్తాయి. తృణ కంకణం కావ్యం (1912) కవితా రంగంలో నూత్నగవాక్షాలు తెరిచింది. మాధురీదర్శనం, రమ్యాలోకం నవ్య కవిత్వ లక్షణాలు వివరించే 'మేనిఫెస్టో' లుగా ప్రత్యేకత గడించాయి. దేశభక్తి, రాష్ట్రభక్తి కవితల్లో రాయప్రోలుది గురుపీఠం. 'ఏదేశమేగినా ఎందుకాలిడినా, పొగడరా నీ తల్లిభూమి భారతిని'అన్న గేయం బహుళ ప్రచారం పొందింది. ఆంధ్రావళి, తెనుగుతోట సంపుటులు ఆంధ్ర వైభవాన్ని,తెలుగు పల్లెల సౌందర్యాన్ని, తెలుగు తోటల పరిమళాన్ని హృద్యంగా వర్ణిస్తాయి. వాల్మీకి సుందరాకాండ, కాళిదాసు మేఘసందేశం, ఉమర్‌ఖయ్యాం, ఆదిశంకరుల భజగోవిందం, గోల్డ్‌స్మిత్, టెన్నిసన్‌ల కృతులకు అనువాదాలు, అనుసృజనలు చేశారు. ఆయన మిశ్రమంజరి కావ్యానికి సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. 'కళాప్రపూర్ణ' గౌరవబిరుదం పొంది, భావితరాల కవులను గాఢంగా ప్రభావితం చేసి స్ఫూర్తిదాయకంగా నిలచిన రాయప్రోలు సుబ్బారావు 92 ఏళ్ల పరిపూర్ణ జీవితం గడిపి 1984 జనవరి 30వ తేదీన పరమపదించారు.

✵

౭. ఆధునికాంధ్ర సారస్వతము

- రాయప్రోలు సుబ్బారావు

నేనిందు సారస్వత శబ్ద వ్యుత్పత్తిని గూర్చి చర్చింపఁ దలఁచ లేదు. పూర్వాపర దశలను బోల్చి తారతమ్యమును తేల్ప నెంచలేదు. చిరంతన శోధనచేఁ జేర్చిన భాషా చరిత్రమును వినిపింప రాలేదు. తుదకు క్రొత్త క్రొత్త నియమముల బెంచి ఆధునిక సారస్వతమును శాసింప సాహసింపలేదు. ఇందే కార్యమునకుఁ గాని నాకుఁజాలినన్ని అధికార యోగ్యతలులేవు. అది నాకన్న నితరులెక్కువగా నెఱుఁగరు. కాని, సారస్వతము యొక్క వర్తమానావస్థను విప్పి చెప్ప సంకల్పించితిని. ఇందు ఖండనమండనములకు అవకాశములు కొలఁది యని సహృదయు లెరుగనిది కాదు. సందర్భవశమై యట్టి ప్రసక్తి గలిగినను వ్యాసకారకుని యభిమతము కాదని విశ్వసింతురు గాత. ఈ కార్యమును అలతియైనది కాదు. ఒక్కొక్కని యనుభవము వేఱు, ఒక్కొక్కని మార్గములు వేఱు. కాని మొత్తము మీదఁజేయునది భాషా వ్యవసాయమె.

ఒకనికి రుచించినది మఱియొకనికి రుచింపదు. ఒకఁ డభిమానించిన దానిని మఱియొకఁడు తిరస్కరించును. ఈ భిన్న రుచిత్వమునకు ప్రకృతి యొకసాక్షి. ఒగరు చిగుళ్ళదిను కోయిలకు పండు తమలపాకులు రుచింపవు. పాము కుబుసముల వంటి ఉప్పాడ చీరెలపై మనసుపడు మానవతి యొక్కతె. కన్నుచెదరు కలంకారి చీరెలనే యందగించుకొను సుందరి యింక నొకతె. అయితే యిరువురకును అలంకారమె ప్రధాన సంకల్పము. కాని యభిరుచులనుఁ దిప్పు దృష్టి మాత్రము వేఱు. ఇంతకును జెప్పవచ్చిన దేమన స్వీయరుచిపై నధికమైన యభిమానముండుట సమంజసమే. అది

కళాధర్మము. కాని భిన్నరుచిని వెక్కిరించుట ప్రమాదము. నేనీక్రింది పంక్తులలో సాధ్యమైనంత వఱకు నా సొంత యూహలను వ్యక్తీకరింతును. సంకల్ప దృష్టిమాత్రము సమరసభావము నందున్నది. ఒక పక్షమును ద్రోసిరాజనవలెనని నా మతము కాదు. మఱియొక పక్షము నాకాశమున కెక్కించవలెనని యూహ యసలే లేదు. అందువలననే మహాకవి రవీంద్రుని సూక్తులు ధ్యాన పురస్సరములుగా నీ వ్యాసము నారంభింతును.

"వాగర్థ ప్రపంచమునేలు ఓ వాణీ! నీ మధురస్వరూపమును, నీ స్నిగ్ధ స్వభావమును నన్నావహింప నిమ్ము. నా వాక్కులు ప్రమాద సమ్మోహితములు. కావున నా మాతృభాషా గౌరవమును గాని, తదుద్గమన గానమును గాని, తదున్మీల తేజస్సునుగాని ఏ మాత్రమును మైలచేయని రసననిమ్ము. అదియే నాసంకల్పము."

కవిత

సారస్వత పరిణామమందు కవిత కాద్యస్థానము కలదు. ఏజాతి సారస్వతము నవలోకించినను ఈ రహస్యము తేటపడును. 'హోమరు' మహాకవి కావ్యములు లేకపోయినచో పాశ్చాత్య వీరులు లేరు. వారి చిత్ర జీవితములు లేవు. వారి శైశవ నాగరికత లేదు. 'హ్యాయనిషియో' పాటలు లేక అతిపురాతనమైన చీనా జాతీయ సభ్యత బోధపడదు. ఋషుల ఋక్కులును, మునుల పురాణములును ఉదయింపవేని మన భారతవర్షనాగరికతకు జిహ్నములే కాన్పించి యుండవు. ఇవి యన్నియుఁ గవితారూపములోనే యున్నవి. కావున కవిత భాషా పరిణామఫలములలో నుత్కృష్టమైనదని చెప్పక తీరదు.

వర్తమానావస్థ యందు మన భాషలో కవితలేదని చెప్పుట తప్పు తప్పేమి, గొప్పపాపము. కాని అది మాఱి యవతరించుచున్నది. మార్పు అనివార్యమనియే నాయూహ. ఈ మారుపు జాతిభాషల యందచందములకును, వికాస విస్తారములకును క్రొత్త నాజూకుఁ దేగలదు; కాని కొందఱపోహపడునట్లు సమూలచ్ఛేదనమును

దాకొల్పదు. చిహ్నముల యందు వికసన సౌష్ఠవమున్నది. కాని, వికారదురాగత మేమియులేదు. ఈ మార్పును నిరసించి నిరోధించు పండితులు కొందఱు ప్రకృతినైజమును గుర్తింపలేకున్నారు. కవితకుఁ బ్రాణము పోసి యుజ్జీవింపఁ చేయుశక్తులు భాషలో నున్నవని వీరి భ్రమ. అట్లుకాదు. జాతీయ పరిస్థితి, దేశవికాసము, సాంఘికగతి, విద్యాపద్ధతి, నాగరకాభిరుచి మున్నగునవి కొన్ని కవితాప్రేరేపకములు. చూడుడు – శ్రీకృష్ణదేవరాయల కాలమునాడు ఆంధ్రకవితకొక స్వేచ్ఛావికాసమలవడినది. ఎందుచేత? ఆవఱకు వేంగియుంతయు తీవ్రసంక్షోభపడినది. కాని ఈ సంక్షోభ దేనియందు? మతమునందు. అప్పటికి ఆంధ్ర సభ్యతా దృష్టి మత నిర్బంధముల నుండి తొలఁగలేదు. ప్రజాభినివేశమునందు మతము ప్రధానముగా నుండును. ఇతరములు లేవని నా అభిప్రాయముగాదు. మత సంసక్తి నుండి జాతీయదృష్టి బలవంతముగా నాకర్షింపఁదగిన అన్య పరిస్థితి పొసఁగి యుండలేదని నా భావము. శ్రీకృష్ణదేవరాయల కాలమందు ఈ గతి మాఱినది. జాతీయదృష్టి తురకకత్తి మెఱపులచే లాగఁబడెను. పౌరుషము, విజయకాంక్ష తొలకరించెను. జాతీయమగునొక అహంభావము క్రమ క్రమముగా బలిసెను. దీని పరిణామ మిచట నప్రసక్తము. కాని, పర్యవసానమేమి? దిగంత విశ్రాంతమగు ఆంధ్ర సామ్రాజ్య ప్రతిష్ఠ ఆంధ్రుల ప్రతాపము పురాతన వేంగీసీమాగ్రములు దాటిపోయినవి. ఇటు కళింగము ఘ్రింగినది. అటు కర్ణాటమును కబళించినది. ఆంధ్రుల జయస్తంభములు దూర దూర స్థలముల నెత్తఁబడెను. ఇది యొక సజీవమైన పరిస్థితి. జాతిలోని యంతశ్శక్తులను ప్రజ్వలించు సమయము లిట్టివె. ప్రజలలో ప్రభుత్వ గర్వము రాణించినది. అభిమానము బలిసినది. సంపదలు పెంపొందినవి. దానితో సౌఖ్యానురక్తి యధికమైనది. తదనుభూతమై సౌకుమార్య విలాసములు నందుకొనినవి. అదియే సంగీత సాహిత్యములు మొహపెట్టు తరుణము. ఆకాలపు సాహిత్య పరిణామముగా 'మనుచరిత్ర' వంటి విలక్షణ గ్రంథ ముదయించినది. అందలి నాయికను జూడుఁడు. ఆ కాలమునాటికి ఆంధ్ర స్త్రీలోకమున బుష్పించిన సాహససంపత్తి ధ్వనింపకపోదు. వరూధినీ చర్యను కేవల కవిభావనా

ఫలితమని సామాన్య ధర్మముగా నన్వయింపకుఁడు. భావపరముగ నన్వేషింపుఁడు. నాయర్థము బోధపడగలదు. వరూధిని సాహసించి నాయకుని గౌగిలించినది. రస ప్రపంచమునందిది సామాన్య సమర్థనీయమని నేనెఱుఁగుదును. కాని, కావ్యమునందు తన నాయిక కింత సాహసచర్యను 'సహృదయసమ్మతముగా' నేర్పి దిద్దిన తెనుఁగుకవులు ఆవఱకు మిగుల తక్కువ. ఆపె వేషమునందు ఆకాలమునకు గలిగినమార్పు గాన్పింపక పోదు. వేయేల, వరూధిని వాలకమంతయు మొగలాయి నాగరికతా లీనమైన పిదప బరిణమించిన తెనుఁగు నాజూకునకు నిదర్శనమని నా యాశయము. అందలి వర్ణనలు చూడుఁడు కాలికాభిరుచిని జెప్పక చెప్పుచున్నవి.

*క.	కుశలత యేవ్రతముల నగు*
నశనాయానమున, నింద్రియనిరోధమునన్
గృశుఁడవయి యాత్మ నలచెదు
నశరీర స్వర్గసుఖము నమకొని యుండన్.

ఈ పద్యపంక్తులయం దెంత యర్థమో ధ్వనించుచున్నది. మతాచారములపై శ్రద్ధ తొలఁగినది. సుఖవిలాసము లవశ్యభోగ్యములను నభిరుచి తలయెత్తినది. ప్రవరాఖ్యుని వంటి భూలోకబృహస్పతిని జూచి ఆ కాలపు నాగరకు లేమనుకొనిరో మనకీ పద్యము హృద్యముగఁ జెప్పుచున్నది. ఇట్టి కవితను బ్రేరేపించినది జాతీయ పరిస్థితి. కాని భాషాతత్త్వము కాదు. భావనను గురించి భాష కవి చేతులలో నాటలాడినది.

ఆనాడెఁట్టి మార్పు కలిగినదో ఈనాఁడును అట్టి మార్పే కలుగుచున్నది. కొన్నిట నీమార్పు అధికమైనది; బలవత్తరమైనది యని చెప్పుట కవకాశములు కలవు. ఆంధ్ర కన్య సౌభాగ్య సౌందర్యమును దిలకింపుఁడు. దుకూలధారణము నుండి తలకొప్పు తీరిక వఱకు నెంతమార్పు వాటిలినదో తెలిసికొనుఁడు. తెనుగు కన్నె మెడలోఁగాసుల దండ లూగుచున్నవి. కంఠరేఖలవంటి నానులు నాజూకుఁ బెంచుచున్నవి. నాగరములేని

తెనుఁగు చిన్నది యిపుడు కానరాదు. పెద్దనాది మహాకవులు తాము పోషించిన నాయికల మెడలలో కాసుల దండలు వేయలేదు. నానులు పెట్టలేదు. నాగరములు చేయించలేదు. కాని ఆధునిక మహాకవులు తీర్చిదిద్దిన నాయికల కవి యేల యుండరాదు? నిషేధముండకూడదని నా మతము. నిషేధ మటుంతము, విధిపూర్వకముగా నీ మార్పును అభిరుచి ధర్మము నర్థించి చేయవలెను.

ఇంకొకటి, తెనుఁగు కవుల రచనలయందు తెనుఁగు నాయికలేల యుండరో నేనూహింపఁ జాలకున్నాను. తెనుఁగు నాయిక పేర తెనుఁగు కాంతాలోకముయొక్క 'విలక్షణత' సారస్వతమందు పొందుపడవలెను. దీనికొక నిదర్శనము చెప్పెదను. గుజరాతీ సారస్వతము నిపుడు నడిపించుచున్న మహాకవి 'కలాపి'. ఆతని కావ్యము నెందుఁజూచినను ఆ సంఘ పరివర్తనము అద్దములోఁ జూచినట్లు పొడకట్టును. వారి వస్త్రాద్యలంకారము లంత యింపైనవి కావు. వనితల వాలకమంత హృదయంగమముగ నుండదు. పలువురు విదుషీమణులీ సందర్భమును గూర్చి వ్రాసిరి. మార్చుటకై విశ్వప్రయత్నములు సలిపిరి. కాని, తుదకు 'కలాపి' కవితయు, మహారాజ శాయజీ మార్గదర్శకత్వమును జతపడు వఱకు అభ్యర్థనీయము సాధ్యమయినది కాదు. ఆయన కవితయం దెందుఁ జూచినను గుజరాతీకాంతా సౌందర్య ప్రశంస యుండును. ఆయన శైలియు మిగుల గడుసైనది. ఒక నాయికను పూర్వ పద్ధతికిఁ బ్రతిరూపముగా దిద్దును. మఱియొక నాయికను అభ్యర్థనీయ పద్ధతికి ప్రతిరూపముగా దిద్దును. నాకీ పరస్పర వైపరీత్యము ఆయన చదివి వినిపించినపుడు బోధపడినది కాదు. ఏల యిట్లు రచించితివని ప్రశ్నించితిని. అందుల కాయన యీ క్రింది ప్రత్యుత్తరము నిచ్చెను.

"నేను ప్రయోజనము నర్థించియే యీ రచనాక్రమ మవలంబించితిని. పూర్వపు స్త్రీ సౌందర్యమును జిత్రించుటచే దాని విలక్షణతకు స్థాయిఁ గల్పించిన వాఁడనైతిని. కాలిక వృత్తమును బాటించుటచే, కలుగుచున్న మార్పునకు దారులు తీసిన వాఁ డనైతిని. అనఁగా భావియందొక చిత్రకారుఁడు ఈ కాల వాఙ్మయమును బరిశోధించుట

తటస్థించుననుకొనుము. అప్పుడాశిల్పకుని దృష్టికి పూర్వపుగుజరాతి స్త్రీ రూపమును, మార్పులతో బరిణమించిన ఆధునిక కన్యక వాలకమును రెండు రెండు పృథగ్బింబములుగా గానవచ్చును."

ఇందెంత యర్థమున్నదో యూహింపుఁడు. మార్పు అనివార్యమె. కాని ఆమార్పులను సారస్వతమునందు లీనమధురములుగా దిద్దుకవి యెంత ప్రౌఢుఁడు గావలెనో, ఏ సాధనాంతరముల నవలంబింప వలెనో తలపోయుఁడు.

భావగీతములు

ఇపుడు చిన్ని చిన్ని పొత్తములు వెడలుచున్నవి. వీనిని ఆంగ్లమందలి 'లిరికు' కావ్యముల ననుసరించి భావగీతములని పిలుచుచున్నారు. ఇది కేవలము మనవారెఱుంగని పంథకాదు. లాక్షణికులు వాకొనిన ఖండకావ్యము లిట్టివే. మేఘదూత నెఱుఁగనివారుండరు. మహాకవి కాళిదాసుని హృదయ పరిపాక మాపద్యముల యందెంత భావమోహనముగా కేంద్రీకృతమైనదో ఎఱుఁగుదుము. భాగవతము జదవని తెనుఁగువారు లేరు. అందన్ని యెడలకంటె గొన్ని స్థలాంతరములలో రసమునకు స్థాయియే కుదిరినట్లు తోఁచును. భ్రమరగీత లిందులకొక యుదాహరణము. ఒక్కొక్క పద్యమునందు ఒక్కొక్క హృద్యభావము మనసు నలరించుచున్నది. గోపికల వియోగవేదన యెంత నిశిత మధురమో; పోతన తరళపద సరళియును అంత సమ్మోహనాస్త్ర సూత్రమై 'హ్లాదైక రమణీయ' మ్మను ఉదాత్త కావ్య లక్షణమును బ్రతికించుచున్నది. కారణమేమి? కేంద్రభావమంత మాధుర్యవిశిష్టముగ నుండుటయే. గోపికలు వలచిన శ్రీకృష్ణవియోగము నిందు వ్యాజస్తుతిగాఁ గవి గ్రహించినాడు. కాని నిజమునకుఁ బోతనమహాకవి యాత్మవేదనయే యిందు స్ఫుటమగుచున్నది. లీలాసంవరణమైన పరమాత్మను పోతన హృదయమెంత యార్ద్రసుకుమారముగా వలచెనో తద్వియోగము నెంత కఱకుగా ననుభవించెనో, భ్రమర గీతల యందుఁ బ్రతిపదమునందును మెదలుచున్నది. పోతన భావోత్కంఠ యింత నిశితముగా నీ గీతలలో లీనమైనది గావుననే రసోపలబ్ధికింత లాలనీయమైన స్థాయి కుదిరినది.

ఖండకావ్యములు వ్రాయు ఆధునిక కవులు ఈ రహస్యమును మనసునందుంచుకొనుట లగ్గు. పండితులు వీనిని కేవలము విజాతి భాషా సంప్రదాయ ఖండము నుండి మన సారస్వత వనమునందు దింపరాబడినవని నిరసింప నక్కరలేదు. పూర్వ లక్షణములందున్న ఒకానొక కావ్యాంగమునకే ఇప్పుడు పృథగ్వికాసము ప్రాప్తించినదని సమరసించుట యెగ్గు. ఈ ఖండకావ్య శీర్షిక క్రింద నానావిధ కావ్య రచనా చర్చయును వచ్చును. అందులకు నాకిచట అవకాశము లేదు.

ప్రయోగ పరిణామము

ఆధునిక కవులు శబ్ద ప్రయోగముల పట్ల 'నిరంకుశులు'గా నున్నారని యొక వాదము కలదు. కవియై కావ్యము నుజ్జీవింప జేయవలెను గాని శబ్ద ప్రయోగము పట్ల తప్పక నిరంకుశుడుగా నుండవలయుననియే నా కాంక్ష. ఈ మర్యాదగూడ కేవలము నవీనముకాదు. శయ్యను బాటించిన నన్నయ భట్టారకునకును, శైలిని దోహదించిన తిక్కన కవిబ్రహ్మకును సూక్ష్మ సుందరమైన భేదము కలదు. ఈ భేదము ప్రయోగసరణి ననుసరించి రేకెత్తినదే. త్రికవుల ప్రమాణముల నటుంచి ప్రయోగస్వాతంత్ర్యము వహించిన కవులు ప్రబంధ నిర్మాతలలోఁ బలువురు కలరు. ఉత్తమకావ్య మనదగు ఆముక్తమాల్యదయందు ఈ ప్రయోగవిధానము కవికలమునకెంత సంపూర్ణ విధేయమై అందచందములు మోసెనో సహృదయు లెఱుంగుదురు. నన్నయ తిక్కనలకుఁగల భేదము గూడ నొకతీరున విశదీకరింపవచ్చును. సావిత్రి విషాదమందును, శకుంతల సాధ్వసకంపనము నందును, అర్జునుఁడు మత్స్యయంత్రము తెగనేయు కలకలము నందును నన్నయ శయ్యాలాలిత్యము నుయ్యాల లూగుచునే యున్నది. తిక్కన యజ్ఞ్వ యట్లుకాదు. ద్రౌపదీ సౌకుమార్య సౌందర్యముల నయనోత్సవము నుండి, ఉత్తర గోగ్రహణ కోలాహలమునకు దరిమి, ఒక్క విసరులో ఉత్తర పెండ్లి సంబరమున మంగళహారతులు వినిపించును. భావమునకు భాష నింత పరమవిధేయముగ నొనర్చు మహాకవి శిల్ప మనన్యము. ప్రయోగస్వాతంత్ర్యములను

దోషములుగా సిద్ధాంతీకరించినచో భావపుష్టిగల ప్రబంధములు చాల ఈ దోషమున కగ్గమగు ననుట నిస్సంశయము. ఈ పోరాటము చాల దూరము వచ్చినది. కాని తేలిన సారాంశమేమియో చూడవలసి యున్నది. ప్రయోగమునకు బహుత్వసిద్ధి యున్నదని సంప్రదాయవాదులును ఒప్పుకొనుచున్నారు. కాని త్రికవులకు దక్కినవన్నియు తప్పులే యని వారి వాదము. కవి యొకమారు స్వతంత్రించి ప్రయోగమును వాడిన తరువాత అది సహృదయలోక పరిచయముచే సాధువై బ్రదికినది. కాన అది నవీనులకుఁ బ్రయోగయోగ్యమే అని యిప్పటి వారి మతము. ఎట్లులైనను భావమునందు దృష్టి కేంద్రమగుచున్న ఈ కాలమందు ప్రయోగమునకు వైరళ్యము నాపాదించుట భాషా కళ్యాణమునకు సహకారి కాఁజాలదు.

గీతి

సారస్వతము సాధ్యమైనంత జాతీయముగ నుండవలయునని చెప్పితిని . ఇందులకు వంగమహారాష్ట్ర వాఙ్మయములే నాకాధారములు. జాతి సారస్వతమునందు గీతికిఁ జాల ప్రధానమైన స్థానము కలదు. మన లాక్షణికులు 'పదకవిత'ను త్రోసిరాజనిరి. చిత్రమైన ఒక నాగరికత కలవారైన మన రసికులు పాటలను నాదరింపరైరి. అందుచే నిరాదరమె దాని పాలైనది. రానురానీకవిత జీర్ణించి యస్తమయావస్థకు వచ్చినది. కాని వంగ మహారాష్ట్ర సారస్వతములందు గీతిసాహిత్యమున కీగతి పట్టలేదు. ఇందులకు నాకొక్క కారణము కనుపట్టుచున్నది. ఆది యందు ఈ గీతి కవిత కవలంబన మిచ్చినవారు సాధువులు. చైతన్యుఁడు అంతకు ముందు చండీదాసు మొదలగువారు తమ భావలోకమునెల్ల గీతియందే ప్రసాదించిరి. తుకారాము, రామదాసు మున్నగు మహారాష్ట్రయోగులు కూడ నట్లేగీతికి బ్రాధాన్యమిచ్చిరి. వారి హృదయము లెట్లు లోకసంగ్రహమునకై పరితపించినవో, వారి బుజాలమీది ఏకతారీలును నట్లే మ్రోగినవి. దాన మోహపడి ప్రజాసంతానమును పరవశగీతములను బాడినది. కవి యర్థించిన యావేశము తాండవ మాడినది. అంత ధన్యతయు బ్రాపించినది. వంగమహా రాష్ట్రమందు సాధుజనభక్తి యధికము. అందుచే వారి పాటలును ప్రజాహృదయముల నాటుకొనినవి.

ఇప్పటికి సైతము సంధ్యాకాలములయందు సావేశములతోఁ బాడఁబడుచున్నవి. మనకట్లు కాలేదు. మన కవుల యందు యోగులు చాల తక్కువ. మనవేమనాదులున్నారు. కాని మనలాక్షణికులు వారి పేరైన నెత్తలేదు. హృదయ మోహనములగు అనేక రసవద్గీతల నుండి ఒక్క ఉదాహరణమైన వారి వ్రాతలలో గానరాదు. ఎట్లు కలిగిన నేమి, ఎంత నీరస నికృష్టమైన దైనను పద్యమునకు గౌరవముద్ర పడినది. ఎంత రసోత్కృష్టమైన దైనను పదమునకు నిరాదర నైచ్య మలమి కొనినది. కారణములు రసికులు చర్చింతురు గాక. చెప్పవచ్చినదేమన, సారస్వతము వెదచల్లు భావములు ప్రజాహృదయములందు బ్రవేశించవలెను. ఆ ప్రజాహృదయ ప్రవేశమునకు గీతి సాధనమైనట్లు పద్యము కానేరదు. మహాకవి రవీంద్రుని యుదాత్త వాఙ్మయము వంగజాతీయ గతి భ్రమణమున కెంత సహకారమైనదో నేనిందు వేఱ చెప్పనక్కరలేదు. గీతియొక్క ప్రయోజనమును చక్కగా వినియోగించిన వారిలో రవీంద్రమహాకవి ఆధునిక కాలమందు అగ్రగణ్యుఁడు. మండల సభలు జరిగినవి. ఆంధ్రమహాసభలు కడచినవి. గ్రంథాలయ ప్రచారము వచ్చినది. కాని ఆంధ్రదేశమందు ఏకగ్రీవముగఁ బాడఁబడిన 'జాతీయగీత' మొకటి యుదయింపలేదు. కారణమేమి? కవుల ముఖములయందు ఆంధ్రభాషా మధువున్నది. కాని కవుల హృదయములందు ఆంధ్రజాతీయత లేదు. సన్నిహితము లయియున్న మహారాష్ట్ర వంగములను దిలకింపుఁడు. ఎన్ని జాతీయ గీతలు ఆబాలగోపాలముచే త్రోవల రేగు ధూళిగూడ పుప్పొడి యగునట్లు పాడఁబడుచున్నవో వినుఁడు. మహాకవులు గీతినాదరించినగాని ఈ లోటుతీరదు. రసికజనాభిరుచి తదభిముఖత్వమును సూచించినపుడు గాని ఈ మార్పు కలుగదు.

గద్యరచన

వర్తమానావస్థయందు గద్యరచన జరుగుట లేదని వాదించుట యవివేకము. ఏదో ఒక నవల చదువరుల చేతులలోకి వచ్చుచునే యున్నది. ఏదో జీవిత చరిత్ర ప్రకటింపఁ బడుచునే యున్నది. కాని జాతీయ పరత్వముగా రచన సాగుటలేదని నా

సందియము. ఇట్లంటినని కేవ లాభావన్యాయము నాశ్రయించుటలేదు. చాలినంత లేదని నా యర్థము. నవలలు వ్రాయు రచయితలు ఆంధ్రదేశ సౌందర్యమును తాము ముందుంచుకొనవలెను. ఆంధ్రసంప్రదాయములను బాటింపవలెను. ఆంధ్రుల వేషభాషలను బోషింపవలెను. సాటి సభ్యతల యందు ఆంధ్రసభ్యతకేమి లక్షణత్వమున్నదో దాని నుద్ధరించి ప్రకాశింపఁ జేయవలెను. ఇందుకు-

గీ. అరికి జయమిచ్చి తిరిగిన ప్రాణపతికి
వసువు నీళ్ళు తోడిన వీరవనిత చరిత
తెలుఁగు చెలుల నుద్బోధించు దేశ్యరచన
లంకురించు . . . .

ఇందు రణతిక్కన భార్య ఎంత విస్పష్టముగ ధ్వనించుచున్నదో యాలకింపుఁడు. ఐతమ్మకథ నాంధ్రపురంధ్రు లెఱుఁగరు. ఈ స్థితి దేశబాంధవు లర్థింపఁదగినది కాదని నేనిచట చెప్పనక్కఱలేదు. ఆంధ్ర రచయితలు ఆంధ్రనాయికలను రసోచితముగా నభిమానింప వలెను. కథలలోను, ఖండ కావ్యములలోను, నవలల లోను గూడ ఈ మార్పు సత్వరము కలుగవలెను. ఇట్టి లోపములు సవరించు కొనుటకు రచయితలందరును సమావేశమై పరస్పరాభిప్రాయములను వెల్లడించుకొనుట మంచిది.

గద్యరచన క్రింద నింక కొంత చెప్పవలసి యున్నది. ద్రౌపదీ పాత్రౌచితీ పోషణమునందు తిక్కన మహాకవి పెట్టిన వన్నె లెట్టివో ప్రకాశింపఁజేయ వలెను. ఉత్తమ ప్రబంధముల యందున్న ఉదారగుణ వైభవమును సహస్రముఖముల వెల్లడించ వలెను. దీనినే సమాలోచనమని వంగీయులు వాడుచున్నారు. ప్రాచీన సాహిత్యమునుండి యిప్పటికి సైతము రచయితలు మాస పత్రికలలో నపూర్వ విషయములను మణులను త్రవ్వినట్లు త్రవ్వి యెత్తుచుందురు. ఉత్కృష్టమగు వ్యాసరచన లేమి యొక కొఱత. మతాభిమానముగల పండితులు కొందఱు గలరు. కాని 'వీర శైవము ఆంధ్రదేశ చరిత్రయం దేస్థానము నందఁగల' దని చర్చించినవారు గానరారు. సంస్కృత

సారస్వతమునకు ఆంధ్రాలంకారికులు సలిపిన దోహద మెట్టిదో మనవారెఱుఁగరు.

హైందవ సమిష్టి శిల్పము నందు ఆంధ్ర చిత్రకారులకెంత సంబంధమున్నదో ఎందును చర్చింపఁబడి యుండలేదు. స్థాలీపులాకన్యాయముగ వ్యాసరచనకు వస్తు నిర్దేశము నిచట సూచించితిని; కాని, వేత్త లెఱుఁగరని కాదు.

శాస్త్ర చరిత్ర వికాసము

శాస్త్రమనఁగా తర్కాదులని మన యర్థముకాదు. రాసాయనిక భూగోళములు మున్నగునవి. ఈ విషయమై పరిశ్రమ జరుగుచున్నది. కాని, జనసామాన్యము నాకర్షించు గ్రంథ మొకటి రాలేదు. 'బాబు జగదానందరే' వ్రాసినట్లు ప్రకృతి శాస్త్రమును కథలుగాఁ గల్పింప వలెను. ఆయన వ్రాసిన 'ప్రకృతీ ఓ ఇతిహాస్' అను కథలను వంగదేశము నం దాడువారుగూడ చదువుదురు. ఇందులకు గారణమేమన, ఆయన రసోచితములగు కల్పనలతో విషయములను సింగారించెను. 'గ్రావిటీ' వాదమును బోధించు సందర్భమున ఆయన యద్భుతముగ నవల వంటి కథను జిత్రించెను. సందర్భవశమున నిది సూచించితిని. మహారాష్ట్రమునందు 'భూపరిచయ'యను విలాసగ్రంథమొక్కటి కలదు. ఆ గ్రంథకర్త తాను భూయాత్ర సలుపు చున్నట్లును, శిష్యునకు ఆయా ఖండ ఖండాంతర శీతోష్ణ వైచిత్ర్యములను పరిచయముఁ జేయునట్లును ఒక సరస కల్పనము నాశ్రయించెను. శాస్త్రజ్ఞులకు పద్ధతి భేదములను సూచించితిని గాని నాకీ విషయమందు అధికారముండి కాదు.

నవలలు

ఆధునికులకు నవలలయందభిరుచి యధికముగ నున్నమాట నిజము. ఎచ్చటఁ జూచినను నవలలు నవనవముగాఁ బ్రకాశించుచున్నవి. కాని ఒక శోచనీయస్థితి బయలుపడుచున్నది. నవలపఠన మెంతవ్యాప్తియందున్నదో, అందలి భావములంత వ్యాపకము నందుట లేదు. కారణము ప్రాజ్ఞుల విమర్శకదృష్టికి విడుచుచున్నాను.

'జీవన ప్రభాత్' వంటి నవల యొక్కటియు మన తెనుఁగున నింతవఱకు బయలుదేరలేదు. మన రచయితలు ఏ హిమాలయ ప్రాంతమందలి బయళ్ళలోనో ఏ రాజపుత్రస్థానపు టెడారులలోనో ఒక పాంథుని ప్రవేశపెట్టుదురు. కాని, కొండవీటి కొండలోయలలోను, భద్రాచలపు టడవులలోను కథా పాత్రములను ప్రవేశపెట్టి చూపరు. మన కీదృష్టి పూర్ణముగా మారి అసలు తెనుఁగురచన బయలుదేరవలెను. నేనిట్లంటినని అభావతర్కమును తడవఁగూడదు. ఇప్పటికి నీభాషాంతరీకరణములను గణింపలేదని గూడ గణింపరాదు. ప్లూటార్క వర్ణిత చరిత్ర కంటె శ్రీనాథ వర్ణిత పల్నాటి వీరుల చరిత్రలు అధిక ప్రయోజనకరములుగా నెన్నఁదగినవి.

విమర్శనము

మన సారస్వత మీశాఖ యందు చాల గర్హ్యదశ యందున్నది. సోదర సారస్వతములతోఁ బోల్చి పరిశీలించినపుడు ఈ భేదము మరింత గాఢముగఁ గాన వచ్చును. ఇంతవఱకును విమర్శనమన్న 'ఇచట అఖండ యతికి జడలు పెరిగినవి. ఇచట సంధిఁగలపలేదు. ఇందు లక్షణము లంకల పాలైనది' అని వ్రాయు వ్రాతగాంధ్రు లెక్క కెక్కువగ నున్నారు. సానుభూతితో వాఙ్నిధులయందున్న అపూర్వరత్నముల నెత్తు వారరిది. ఈ సందర్భమున నిదమిద్ధమని చెప్పుటకే అసాధ్యముగ నున్నది. నవీనుల విమర్శనలు పూర్వలాక్షణికములను మొదలంట త్రోసివేయుచున్నవి. ప్రాచీనుల విమర్శనలు గతానుగతికములయిన పురాణపథముల నుండి ఒక అంగుళమైనను కదలకున్నవి. రెండును శోభన ప్రదమగు సారస్వత వికాసమునకు దోహదకర్మలు కావు. మార్గము మధ్యగా నున్నదని నా యూహ. అందులకు ఉదారదృష్టిగల యుభయభాషావిదులు ముందుకు రావలసియున్నారు. ఇటీవలి విమర్శలయం దందందు ఇట్టి శుభపరిణామమును సూచించిన చిహ్నములు గలవు. గత సంవత్సర వంగీయ పరిషదధ్యక్షుల యుపన్యాసము నందలి ముక్కలనిందు పొందుపఱపక విడువలేకున్నాను. "వర్తమానావస్థయందు జాతి జీవనమున లీనమగుచున్న మార్పు లనంతములు. ఆ

భిన్న భిన్నోల్బణ దశలన్నియు సాహిత్యమునందు బింబించుచున్నవి. ఈ సమయమున దార్శనికుని హృదయ కౌశలము లతీవనిశిత ప్రతిభావ్యాకోచములై యుండవలెను. సారస్వతమునందు నిషేదింపఁదగిన దానికంటె వ్యాఖ్యానించి విశదము చేయవలసిన దెక్కువయున్నది. ఈ యపూర్వవస్తు సమాలోచనము పాఠకలోకమునకుఁ బరిచయ సరళిమొనరించు చమత్కార కార్యమె వర్తమాన దార్శనికుని యుదాత్త సామర్థ్యము".

వంగ సాహిత్యమునందు సమాలోచన శాఖ చాలవఱకు బెంపొందినది. భగవద్గీతలపై వ్రాయఁబడిన వ్యాఖ్యానములు దాదాపు 22 కలవు. ఉపనిషత్తులపై వ్రాసిన వ్యాసములు అపారములు. ఈ ధర్మవాఙ్మయము వలన నెంత జాతీయత దీపించినదో అది మహాశయుల భావనకే వదలుచున్నాను.

ఇందు నాటకాదుల గురించి చెప్పలేదు. సామాన్య రచన క్రిందవచ్చు పత్రికా వ్యాస ప్రసక్తినిగూడఁ దడవలేదు. ఇంక ననేకములు ప్రమాదవశమున తప్పిపోయి యుండును. అందులకు పండితుల యుపేక్షాపక్షపాతమును వేడుచున్నాను. మన సారస్వతమును ఇతర సారస్వతములతో సరిచూచినపుడు స్వస్వరూపావస్థలు బయటపడును. అట్లు చేయగాఁ దోచిన యూహలే ఇట్లు వెల్లడించితిని.

(గ్రంథాలయ సర్వస్వము 1.2)

౮. దేవులపల్లి రామానుజరావు

(౧౯౧౭ - ౧౯౯౩)

సారస్వత సేవకులుగా, సంస్థానిర్వాహకులుగా, పత్రికా సంపాదకులుగా, వక్తగా చిరయశస్సునార్జించిన మహా మనీషి దేవులపల్లి రామానుజరావుగారు. 1917 ఆగస్టు 25వ తేదీన వరంగల్‌లో జన్మించిన రామానుజరావు మెట్రిక్యులేషన్ పూర్తిచేసి హైదరాబాదు నిజాం కళాశాల నుంచి బి.ఏ. (1939) పట్టభద్రులైనారు. ఎల్.ఎల్.బి.లో (నాగపూర్ విశ్వవిద్యాలయం) ఉత్తీర్ణులై కొంతకాలం న్యాయవాద వృత్తిలో పనిచేశారు. యువక దశలో రాయప్రోలు, విశ్వనాథ వంటి కవుల ప్రభావంతో భావకవితా ధోరణిలో 'పచ్చతోరణము' కావ్యం 'నవనీతము' సాహిత్య వ్యాససంపుటి వెలువరించి పలువురి ప్రశంసలు పొందారు. ఆయన విశిష్ట సాహిత్యాభిరుచికి వరంగల్ నుండి వెలువడిన 'శోభ' పత్రిక (1945-46, 1950-52) తార్కాణం. తర్వాత గోలకొండ పత్రికకు ఉపసంపాదకులుగా (1948-64) రాజకీయ, సాంస్కృతిక అంశాలపై తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడిస్తూ వ్యాసాలు వ్రాశారు.

తెలంగాణాలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి, విశాలాంధ్ర అవతరణకు దోహదం చేసిన మహనీయులలో రామానుజరావుగారికి ప్రముఖ పాత్ర ఉంది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా తెలుగు భాషా సాహిత్యాలకు ఆయన అందించిన సేవలు నిరుపమానమైనవి. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ హిందీ విశ్వవిద్యాలయంగా చేయాలన్న ప్రతిపాదనను ప్రతిఘటించిన రామానుజరావు విశ్వవిద్యాలయ సెనేట్, సిండికేట్ సభ్యులుగాను, (1953-1975) రాజ్యసభ సభ్యులుగానూ (1960-62) కొనసాగారు. ఆయన రేడియో ప్రసంగాలు, సాహిత్యోపన్యాసాలు, సుదీర్ఘ జీవన యాత్రలోని జ్ఞాపకాలు, బాల సాహిత్య రచనలు గ్రంథరూపంలో ప్రచురితమైనాయి. 1993 జూన్ 8న ఆయన పరమపదించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆయన కీర్తి పతాకగా వెలుగొందుతున్నది.

8. సాంస్కృతిక పునరుజ్జీవనము

- డా॥ దేవులపల్లి రామానుజరావు.

కాల గర్భమున ఒక శతాబ్ద మేమంత దీర్ఘమైనది కాదు. కాని భారతదేశ చరిత్రలో గడచిన శతాబ్దము మిక్కిలి ప్రధానమైనదని చెప్పవలెను. 1855 నుండి 1956 వఱకు అనఁగా నొక నూరు సంవత్సరాల కాలమున మనదేశములో మహోజ్వలమైన చరిత్ర నిర్మాణము జరిగినది. నూటయేఁబది సంవత్సరాలు పరదేశ పరిపాలన క్రింద చితికిపోయిన దేశము స్వతంత్రము సంపాదించుకొన్నది. ప్రపంచ చరిత్రలో భారతదేశ స్వాతంత్ర్యోద్యమ కథ అద్వితీయమైన ఘట్టము. ఈ చరిత్రను సింహావలోకనము గావించినపుడు జాతీయ చైతన్యముతో బాటు భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనము సర్వతోముఖముగా అభివృద్ధియైనట్లు వెల్లడి యగుచున్నది.

తెలుఁగు దేశమున ఈ కాలమందు జరిగిన సాంస్కృతిక పునరుజ్జీవనమును సమీక్షించుటకు ముందు సాంస్కృతిక పునరుజ్జీవనమనఁగానేమ? యను ప్రశ్నకు విశాలముగా సమాధానమిచ్చుట అవసరము. ఐరోపాఖండమున స్పష్టమైన యొకానొక ప్రత్యేక కాలమున గలిగిన భావపరిణామమును సూచించు శబ్దమీ పునరుజ్జీవనము. అది యా కాలమున ఐరోపా ఖండమున జరిగిన యభివృద్ధిని సూచించుచున్నది. మధ్యయుగమని చెప్పఁబడు కాలమునుండి ఆధునిక యుగమని చెప్పు కాలములోనికి అడుగుపెట్టుటకు మార్గదర్శకమైన పరిణామాల కాలము నీ పునరుజ్జీవనము సూచించుచున్నది. పునరుజ్జీవనమనగా పునర్జన్మ లేక క్రొత్త జన్మ. యుగ పరిణామమునకు కారణభూతమైన పాశ్చాత్య రాజ్యాల నైతిక వైజ్ఞానిక దృక్పథాల యందలి మార్పులను యీ పునరుజ్జీవనము సూచించుచున్నది.

భారతదేశపు ఇటీవలి చరిత్రకు ఐరోపా ఖండములోని పునరుజ్జీవన కాలమునకు (Renaissance) దగ్గరి పోలికలు కన్పించుచున్నవి. భారతదేశమందలి అన్ని రాష్ట్రాలలోను, అన్ని రంగాలయందును, కొంత తరతమ భేదాలతో కొన్ని స్థానిక ప్రత్యేకతలతో, కొన్ని విశిష్టతలతో ఈ మార్పు అనగా మధ్యకాలము నుండి యాధునిక కాలములో అడుగుపెట్టుట స్పష్టముగా గనబడుచున్నది.

నవీనమైన యిట్టి మార్పునకు ముఖ్యకారణము విదేశ పరిపాలన. మొగలుల యొక్కయుఁ బాశ్చాత్యుల యొక్కయు పరిపాలనలో cగొంత ఉద్దేశపూర్వకముగ, మరికొంత అనివార్యముగ భారతదేశము జాతీయమైన తన సంస్కృతియందు ఆయా పాలకుల జాతిసిద్ధమగు ఆచరణలను, సంప్రదాయములను లీనము చేసికొన్నది. తన్మూలముగ భారతీయ సంస్కృతి పురాతనమైన దానికన్న విశిష్టముగా భాసించుట జరిగినది. ఇట్టి వైశిష్ట్యము నంగీకరించు ప్రజలందరు ఆధునిక యుగములోని వారే.

నూతన చైతన్యము, భావ సంఘర్షణ, నవజీవనము, మానసిక పరివర్తన మన దేశమున రాజకీయ సాంస్కృతిక రంగాలలో స్పష్టమగుచున్నవి. మత, వేదాంతాభిప్రాయాలలో నూతన వ్యాఖ్యలు, ప్రపంచ పరిస్థితుల ప్రభావము, వైజ్ఞానిక రంగములోని పరిశోధనలు, కళారంగములోని నూతన మార్గాలు, భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనమునకు దోహదము గావించినవి. పూర్వపు వ్యవస్థలు, అభిప్రాయాలు మారినవి. సర్వతోముఖ భావపరివర్తన స్పష్టముగా కనబడుచున్నది. మొదట మొగలాయి పరిపాలన; తరువాత రవి యస్తమించని ఇంగ్లీషు సామ్రాజ్యము మన దేశమున వ్యాపించి అస్తమించినవి. నాజాతి, నా దేశము, నా భాషయను భావాలతోcబాటు సమాజములో వ్యక్తి స్వాతంత్ర్యము, రాజకీయ రంగమందలి వయోజన ఓటింగుద్వారా ప్రాబల్యము వహించుచున్నవి. ఈ ప్రభావము పల్లె పల్లెయందును ప్రతి పట్టణమందును స్పష్టముగా కనబడుచున్నది. స్వదేశ సంస్థానాలు పోయినవి. జాగీరుదారీ లంతరించినవి; భూస్వామ్య విధానము చరమదశలోనున్నది. అచ్చు

యంత్రాలు ప్రతి పట్టణము నందవతరించినవి; 'జొన్నన్నము జొన్న కలి' పోయి వరి యన్నము సన్నన్నము ఊరూర ఇంటింట వ్యాపించినవి. యంత్రాల ద్వారా వ్యవసాయము పల్లె పల్లెకు పరిచయమగుచున్నది. విద్యుచ్ఛక్తి మన దైనందిన వ్యవహారములకు వినియోగపడుచున్నది. ఆధునిక విజ్ఞాన ప్రభావము మన జీవితమందు అడుగడుగున ప్రత్యక్షమగుచున్నది. అణఁచివేయఁబడిన శక్తులు, దాగుకొనియున్న ప్రతిభ స్వాతంత్ర్యము పొంది ప్రకాశించుచున్నవి. దేశములో ఒక విధమగు క్రొత్త జీవనము కనబడుచున్నది. ఈ నవజీవనమే పునరుజ్జీవన ప్రతిబింబము. ఇందుకు తోడు ప్రాచీన విజ్ఞానము, ప్రాంతీయ భాషలలోని పూర్వ సాహిత్యము, ప్రాంతీయ సంస్కృతుల, కళల పునరుద్ధరణ కృషి జాతీయ వికాసమునకు దోహదము చేయుచున్నవి. ఈ దోహద ఫలితమైన శోభనమే, యీ మంగళమే యీనాటి మన దేశమందలి సాంస్కృతిక పునరుజ్జీవనమునకు ముఖ్య ప్రాతిపదిక.

ప్రతి జాతికిని దేశమునకు ఆద్యమై యవ్యాహతముగా సాగివచ్చు ఆచారములు, సంప్రదాయములు కొన్ని ఉండును. ఆయా ప్రజల మానసిక దృక్పథము, వారి వారి జీవిత పరిధుల ననుసరించి , వారితర మానవాళి యెడ జూపగలుగు విశాల దృష్టి సాంఘిక, రాజకీయ, వైజ్ఞానిక మత విషయములలో వారి మేధలు చొచ్చుకొని పోగలుగు లోతులు, ఇవన్నియు నొక్కొక్క దేశమునకు జాతికి విభిన్నములై విలక్షణములై ఆయా దేశాల, మరియు జాతుల ప్రత్యేకతల నెత్తిచూపుచుండును. వీని కూడలినే ఆ జాతి లేదా ఆ దేశము యొక్క సంస్కృతి యని చెప్పవచ్చును. ఇట్టి సంస్కృతి కొన్ని సారులు విచ్ఛిన్నమై నామ రూప రహితమై యంతరింపవచ్చును. ఒక దేశము పరదేశ పరిపాలనా పీడితమై, దాస్యభారవినమ్రమై ఉన్న అజ్ఞాత దశయందు, దాని సంస్కృతి పాలకుల సంస్కృతిచే విచ్ఛిన్నమై కనుమరగిపోవుట తటస్థింపవచ్చును. దాస్య మేఘములు నలుదెసల చెదరి పోయిన నాడు, దేశమాత స్వతంత్రతా కిరణదీప్తిచే కళ కళ లాడిననాఁడు ఆ యుచ్ఛదశ కనుగుణముగా విస్మృతమైన దాని సంస్కృతి కూడా పునరుద్ధరించుట జరుగును. అట్లు జరుగు పునరుద్ధరణలో ఇంత కాలము

మిళితమై మనదిగా చెల్లుబడి నందుచున్న వైదేశిక సంస్కృతినిఁ గూడ గ్రహించుటయు, మన్నించుటయు జరుగవచ్చును. ఒక జాతి విస్మృత సంస్కృతిని వెలుగులోనికిఁ దెచ్చుకొనుటయే కాక కొన్ని నాళ్ళుగా ఆమోదించి అభినందించిన వైదేశిక సంస్కృతి మేళనముచే దానిని మరింత పరిపుష్టముగా జేసి సర్వాంగ సుందరముగా జేయుటయే మనదేశపు సాంస్కృతిక పునరుజ్జీవనము.

కొందరు పునరుజ్జీవన మనగా కేవలము ప్రాచీన విజ్ఞానము యొక్క పునరుజ్జీవనయని భావించుట కలదు. ఇతర దేశాలమాట యెట్లున్నప్పటికిని మనదేశ ములో పునరుజ్జీవనమనగా ప్రాచీన విజ్ఞాన పునరుద్ధరణ మాత్రమేకాదు. ప్రాచీన విజ్ఞాన పునరుద్ధరణ, ప్రాచీన కళల పునరుద్ధరణ, ఈ సాంస్కృతిక పురుజ్జీవనములోని యొక భాగము మాత్రమే. ప్రాచీన విజ్ఞానము, కళలు మొదలైన వాని పునరుద్ధరణ, నేటి నవసమాజ సౌధమునకు ఒక గట్టి పునాది మాత్రమే. నవచైతన్యము, ఆధునిక భావపరిణామాలు ఈ సౌధ నిర్మాణమునకు ముఖ్య సాధన సామగ్రి , గాంధీ, నెహ్రూల రాజకీయ, నైతిక దృక్పథాలు భారతదేశ ఉన్నతిని గూర్చి, భవిష్యత్తును గూర్చి యీ నాయకులొసగిన విశిష్టాభిప్రాయాలు అన్ని రంగాలలో ప్రాత క్రొత్తఁ మేలికలయికను సాధించి నూతన సమాజ నిర్మాణమునకు దారి చూపించినవి. గాంధీ, నెహ్రూలు గత చరిత్రను గూర్చి వట్టి గొప్పలు చెప్పుకొనుచు పగటి కలలు కనుచు కూర్చుండలేదు. భారతీయ సంస్కృతి యందలి నిగ్గు నవగాహన చేసుకొని సత్యాహింసల ప్రాతిపదికలో, నవభారత నిర్మాణ ప్రయత్నాలారంభించిన కార్యశూరులువారు. అందుచేత భారతదేశ పునరుజ్జీవనము సమగ్రమైన సర్వతోముఖ సాంస్కృతికాభివృద్ధి యుద్యమముగా పెంపొందుచున్నది. గ్రుడ్డి నమ్మకాలను, కాలదోశము పట్టిన సాంఘిక చాదస్తములను తొలగించుకొని సామ్రాజ్యతత్త్వ జాతి విచక్షణ విధానాలను ప్రతిఘటించి, విధ్వంసమునకై అణుశక్తిని వినియోగించు ప్రయత్నాలను ధిక్కరించుచు, వ్యక్తి స్వాతంత్ర్యము, వ్యక్తి ప్రతిభయొక్క పరిపూర్ణ వికాసము కాంక్షించుచు, ప్రపంచ రాజ్యాల పరస్పర సహజీవనము నభిలషించి, జగత్కల్యాణము గమ్యస్థానముగా

నిర్ణయించుకొని భారతదేశము పురోగమించు చున్నది. ఈపురోగమనము మనజాతి పునరుజ్జీవనమునకు జీవకళను, నిర్మాణశక్తిని, ప్రతిభాసంపదను ప్రసాదించుచున్నది. ఈ విధముగా ప్రాతదానిలో నిగ్గును దీసుకొని సకల ప్రపంచములోని మంచి నాకళించుకొని, నూతన సమాజ నిర్మాణమునకు భారత దేశము కృషిచేయుచున్నది. ఈకృషి మన సాంస్కృతిక రంగాలలో ప్రతిబింబితమగుచున్నది. ఈ ప్రతి బింబమే మన సాంస్కృతిక పునరుజ్జీవనము. గడిచిన నూరు సంవత్సరాలలోని సాంస్కృతిక పునరుజ్జీవనము యొక్క స్థూల స్వరూపమిది.

అంకురార్పణ

భారతదేశమున 1857 సంవత్సరమున విదేశ పరిపాలనకు వ్యతిరేకముగా సైనికుల తిరుగుబాటు జరిగినది. ఇది సాధారణమైన తిరుగుబాటు కాదు. ఇది దేశ స్వాతంత్ర్యము కొరకు జరిగిన యుద్ధ ప్రకటనమే. దీనిని భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామమని వినాయక దామోదర సవర్కర్ వర్ణించినాడు. దీని తరువాత మనదేశములో ఈస్టిండియా కంపెనీ అధికార విరమణ జరిగి ఇంగ్లాండు ప్రభుత్వముచే అధికార స్వీకరణ జరిగి ఇండియాలో బ్రిటీష్ సామ్రాజ్యస్థాపన జరిగినది. భారతదేశమునకు విక్టోరియా రాణి చక్రవర్తినియైనది. తరువాత మన దేశములో కొంతకాలము తిరుగుబాటులంతమొంది ఇంగ్లీషు పరిపాలన శాంతముగా నడిచినది. ఈస్టిండియా కంపెనీ నుండి యింగ్లీషు వారు పరిపాలన హస్తగతము చేసికొని యావద్భారతమును తమ యేలుబడిలోనికి తీసుకొని రాక ముందు అనఁగా, 16, 17, 18 శతాబ్దములలోను, 19వ శతాబ్దపు తొలి భాగమునందును ఇంగ్లీషువారితో బాటు ఫ్రెంచి పోర్చుగీసు వారు గూడ మనదేశ పరిపాలనను హస్తగతము గావించుకొనుటకు కృషిచేసినారు. రెండునూర్ల సంవత్సరాల యీ కృషిలో ఇంగ్లీషు భాషతోబాటు ఫ్రెంచి, పోర్చుగీసు భాష ప్రభావము, క్రైస్తవ మత ప్రచారము మనదేశ భాషలలో గోచరించుచున్నది. కాని యీ ప్రభావము స్వల్పమనియే చెప్పవలసి

యుండును. 19వ శతాబ్దానికి పూర్వము మనదేశములో విదేశ భాషల సంపర్క ఫలితముగాను, పాశ్చాత్య సంస్కృతి ప్రభావ ఫలితముగాను జరిగిన భావ విప్లవము లేక, భావ పరవర్తనము మిక్కిలి కొంచమే; ఇట్టి పరిస్థితిలో 1885 సంవత్సరం డిసెంబరు 28వ తేది మధ్యాహ్నము 12 గంటలకు బొంబాయిలోని గోకుల్‌దాస్ తేజ్‌పాల్ సంస్కృత కళాశాల భవనమున భారత జాతీయ మహాసభ అవతరించినది. ఈ సమావేశమునందు ఆనాఁడు దేశమునందలి ప్రముఖులు చాలమంది పాల్గొనిరి. ఈ జాతీయ మహాసభ భారతీయులలో గాఢదేశాభిమానము, తీవ్ర స్వాతంత్ర్య కాంక్షలను రేకెత్తించి దేశ స్వాతంత్ర్యోద్యమము సాగించి, ప్రజలలో నూతన చైతన్యము కలుగజేసి అన్ని రంగాలలో పునరుజ్జీవనము సాధించినది. మనదేశములో స్వాతంత్ర్య కాంక్షకు సాంస్కృతిక పునరుజ్జీవన ప్రయత్నాలకు జాతీయ మహాసభ స్థాపనతో అంకురార్పణ జరిగినప్పటికి ఇందుకు అనుకూలమైన క్షేత్రము కొంతముందే సిద్ధము చేయబడినది. ఈ కృషి చేసినవారిలో ప్రథములు రాజా రామోహన రాయలు. భారతదేశము ఈస్టిండియా కంపెనీ ఆధీనములో నున్నప్పుడే ప్రజల విద్యా సమస్యల యందు, సాంఘిక సమస్యలయందు రామమోహన రాయలు శ్రద్ధ తీసుకొని మనదేశ సాంస్కృతిక పునరుజ్జీవన కార్యకలాపాలకు బలమైన పునాది వేసినాఁడు.

జాతీయ మహాసభ - సంస్కరణోద్యమాలు

ఈస్టిండియా కంపెనీ పరిపాలన వలన దేశములోని ఆర్థిక సాంఘిక వ్యవస్థ దెబ్బతిన్నది. ప్రాచీన గ్రామ జీవన విధానమును కంపెనీవారు నాశనము చేసిరి. భారతదేశ పరిశ్రమలీ కాలమున కూకటి వేళ్ళతో పెల్లగించి వేయబడెను. మన యోడలు మాయమైపోయినవి. ఇంగ్లీషు వ్యాపారము దేశమంతటను వ్యాపించినది. మన వ్యాపారము సన్నగిల్లినది. ఈ పతనము సాంస్కృతిక రంగములో గూడ గనబడుచున్నది. వేద పురాణ శాస్త్రముల ప్రాధాన్యము తగ్గినది. వానిని అభ్యసించువారి సంఖ్య దినదినము తక్కువ కాఁజొచ్చెను. దేశభాషల వ్యాప్తి కుంటుపడెను. వాని నాదరించువారు క్రమ

క్రమముగా తక్కువ కాజొచ్చిరి. ఇస్లాం మతవ్యాప్తి తగ్గి క్రైస్తవ మతవ్యాప్తి యెక్కువ కాజొచ్చెను. ఆంధ్ర చిత్రకళ తన వ్యాప్తిని గోల్పోయెను. ఉత్తమ కవిత తక్కువ కాజొచ్చెను. అచ్చు యంత్రా లవతరించెను. ఇంగ్లీషువారు దేశీయుల విద్యనుగూర్చి 1855 వరకు శ్రద్ధ తీసికొనలేదు. 1858 లో కలకత్తా, బొంబాయి విశ్వవిద్యాలయాలు నెలకొల్పఁ బడినవి. ఇంగ్లీషు విద్య భారతదేశములో అడుగు పెట్టినది. ఈ ఇంగ్లీషు విద్యా ప్రచారమును గూర్చి ఆ రోజులలో మనదేశమున తీవ్రమైన వాదోపవాదములు బయలుదేరినవి. రాజా రామమోహనరాయలు భారతీయులకు ఇంగ్లీషు విద్య అవసరమనియు ఆ విద్యా ప్రచారానికి మనదేశములో సంపూర్ణావకాశాలు కలిగించవలె ననియు వాదించి, ప్రభుత్వమును సమర్థించి ఇంగ్లీషు విద్యా ప్రచారానికి అండయై నిలిచెను.

1858 తరువాత భారతదేశమున బాశ్చాత్య విద్యా ప్రవేశమును గూర్చిన వాదోపవాదాలలో సాంస్కృతిక రంగమందలి భావ సంఘర్షణ ప్రస్ఫుటమగుచున్నది. తరువతా ఈ భావ సంఘర్షణ మరింత తీవ్రముగా కన్పించుచున్నది. ఒక వైపునఁ పాశ్చాత్య విద్య, క్రైస్తవమతము, పాశ్చాత్య నాగరికత, వేషభాషలు, ఆచార వ్యవహారాలపై మోజు, ఇంకొక వైపు మనదేశ సంప్రదాయాలు, ప్రాచీన సాంస్కృతిక విజ్ఞానాల పునరుద్ధరణ ఉద్యమాలు స్పష్టముగా కనఁబడుచున్నవి. 1858లో విశ్వవిద్యాలయాల స్థాపన, 1861-63 ల మధ్య హైకోర్టుల స్థాపన జరిగి, ఆంగ్ల న్యాయపరిపాలనా విధానములు మన దేశములో ప్రవేశపెట్టఁబడెను. రామమోహనరాయల వంటివారు మన ప్రజల ఆచారములను నిరసించుచు, సంఘ సంస్కరణోద్యమమును బలపరచిరి, వితంతు వివాహ చట్టము, సహగమన నిరోధకచట్టము అమలులోనికి వచ్చి ఆంగ్ల సభ్యత సంపర్కము వలన ఆంగ్ల విద్యాధికులలో మానసిక పరివర్తనము ప్రారంభమైనది. బ్రహ్మ సమాజ స్థానపము జరిగినది. ఇందువలన నీ మానసిక పరివర్తనము వంగదేశ మందంటను ప్రత్యక్షమయ్యెను. వంగదేశమందలి ఉన్నత కుటుంబాలు కొన్ని క్రైస్తవ మతమును గూడ స్వీకరించెను. మరికొన్ని ఉన్నత కుటుంబాలు బ్రహ్మసమాజ మత

మవలంబించెను. బ్రహ్మ సమాజము దేశీయాచార, సంప్రదాయాలపైన నిరసన కలిగించిన తిరుగుబాటు ఉద్యమము. దీనిపైన పాశ్చాత్య వ్యామోహము స్పష్టముగా పడినది. దీనికి విరుగుడుగా పాశ్చాత్య విద్యతో వచ్చిన అనార్య సంప్రదాయములను, విపరీత సిద్ధాంతములను నిరోధించి, అవసరమైనంత వరకు సంఘమును మన సంస్కృతి కనుగుణముగా సవరించు ఉద్దేశ్యముతో ఆర్యసమాజము, దివ్యజ్ఞాన సమాజములు బయలుదేరినవి. దివ్యజ్ఞాన సమాజము ప్రాచ్యవిజ్ఞాన పునరుద్ధరణకు పనిచేసినది. భగవద్గీత దానికి ఆదర్శగ్రంథమైనది. అనిబిసెంటుగారు కాశీలో ఈ యుద్దేశముతోనే ఒక కళాశాలను స్థాపించిరి. ప్రపంచములో పాశ్చాత్యులే ఆధునికులను భావము తొలగించి వారు నేర్చుకోవలసినది ప్రాచ్యఖండమున చాల కలదని తెలిపినదీ దివ్యజ్ఞాన ఉద్యమము. ఇదే సందర్భమున వంగదేశమున రామకృష్ణ పరమహంస అవతరించి, భారతజాతీయ వికాసానికి తోడ్పడి రామకృష్ణ మఠమును స్థాపించెను. ఈ యుద్యమము సకల ప్రపంచమున ఆధ్యాత్మిక రంగమునందు భారతదేశాధిక్యతను ఋజువుచేసినది. రామకృష్ణ పరమహంస శిష్యుడైన వివేకానందుడు భారతీయ సంస్కృతియందలి మహత్తును సభ్యజగత్తుకు ఎలుగెత్తి చాటినాడు. ఇట్టి వాతావరణములో భారత జాతీయ మహాసభ అవతరించినది. దీని ఉద్దేశ్యము జాతీయైక్యతా భావాలను కేంద్రీకరించి పెంపొందించుట; క్రమక్రమముగా ఈ సంస్థ శాఖోపశాఖలతో ఆసేతు హిమాచల పర్యంతము విస్తరించి ఒక మహాసంస్థగా రూపొంది, మహోద్యమాలను నిర్వహించి భారత జాతికి స్వాతంత్ర్యము తెచ్చినది. కాంగ్రెస్ మహాసభ దేశీయుల భావములను కార్యములను ఒక్కచోట కేంద్రీకరించినది. భారత దేశమందలి లక్షలాది ప్రజలలో ఒక విధమైన ఆత్మచైతన్యమును పెంపొందించినది. వారికి ఆత్మ విశ్వాసము సంఘీభావము కల్పించినది. కాంగ్రెసు భారతీయుల భావములకు, కోరికలకు స్పష్టమైన జాతీయ స్వరూపమిచ్చి వారి సమష్టి భాషా సాహిత్యములను, సమష్టి శిల్ప పరిశ్రమలను, సమష్టి వాంఛాదర్శములను తిరిగి తెలుసుకొనుట కవకాశము కల్గించినది. ఈవిధముగా మనదేశములో నూతన భావోదయము, పునరుజ్జీవనము సర్వతోముఖముగా గోచరించినవి.

పాతకొత్తల సంధికాలము - నాటి తెలుఁగుదేశము

పైన వివరించిన అఖిలభారత ఉద్యమములన్నియు గూడ ఆంధ్రదేశమున నవతరించి, ఆంధ్రదేశ సాంస్కృతిక పునరుజ్జీవనమునకు దోహదము గావించినవి. పాశ్చాత్య వ్యామోహము, దానిపై తిరుగుబాటు, సంఘ సంస్కరణము, ప్రాచీనాచారాలపై మక్కువ, బ్రహ్మ సమాజము దివ్యజ్ఞాన ఆర్య సమాజాలు, వీనియన్నింటితోబాటు జాతీమోద్యమ వ్యాప్తి కాంగ్రెస్ ఉద్యమము ఆంధ్రదేశ ప్రజానీకమునకు నూతన చైతన్యమును కలిగించినవి. తెలుగు దేశములోని యీ పరిస్థితిని శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారిట్లు వర్ణించినారు. '........ 1857 నాటికి దేశీయులైన హిందూ ప్రభువుల, ముస్లిం నవాబుల స్వతంత్రాధికారమంతరించినది. వారందరు బ్రిటీషువారి సామంతులైనారు. ఇంగ్లీషు రాజభాషయైనది. ప్రభుత్వ ఉద్యోగాల నిమిత్తము జనము కావలసివచ్చి కుంపిణీవారు పాఠశాలలు పెట్టినారు. విద్య ఇంగ్లీషులో నేర్పినారు. ఆంగ్ల పాఠశాలలో చదువుకొనుటకు జనులందరికి సమానావకాశాలేర్పడినవి. ఆంగ్ల సాహిత్యమునకు దేశములో ఆదరణ హెచ్చినది. ఆంగ్లవాఙ్మయానికి ప్రచారమధికమయినది. ఆంగ్లభాష చదివిన వారికే ఉద్యోగాలు. ఇంగ్లీషువారి సంస్థలమీద, పద్ధతుల మీద నాంగ్లవిద్యాధికులకు గౌరవము, మోజు ప్రబలినవి. జనులలో భౌతిక శాస్త్రజ్ఞాన మతిశయించినది. హేతువాదుల మీద నభిరుచి కలిగినది'.

పరిపాలనలో ఁబూర్వపు కట్టుబాటు పద్ధతులు పోయినవి. గ్రామ పంచాయతీ పాలన శిథిలమైనది. దేశ పరిపాలనకు కలెక్టర్లు నియమితులైనారు. రైల్వేలు వచ్చి ప్రయాణము తేలికయైనది. పోస్టు సౌకర్యాలు లభించినవి. దేశమరాజకములో నుండి బయటపడినది. జనులు తాము సుఖపడుచున్నట్లనుకొని యొక నిట్టూర్పు విడిచినారు.

కులము, వర్ణముల యెక్కువ తక్కువ విభేదాలు క్రమ క్రమముగా సమసిపోయినవి. ఆదరణ పోషణలు లేని సంస్కృతి హిందూమతము నెదుర్కొనవలసి వచ్చెను; వేద విద్య లెండిపోయిన కాలమిది. ఈ కాలములో బ్రాహ్మణులకు వెనుకటి

ప్రాముఖ్యము పోయినది. సంఘములో నతనికి వెనుకటి పెద్దరికము తరిగినది. అనర్థకమైన యాచారాలు, అర్థములేని విశ్వాసాలు, చీడపురుగుల లాగున బట్టుకొని సంఘమును పీడించినవి. ఐనదియు గానిదియు మతమను పేరుతో సమర్థితమైనది. పాశ్చాత్యమన్న దానికెల్ల విలువ హెచ్చిన ఈ కాలములో బ్రాచీన జీవనము నిలుపుకొనుటకు పెనుగులాడినది. అది ప్రాచీన, నవీన ప్రాచ్య పాశ్చాత్య సభ్యతలకు, సంస్కృతులకు సంఘర్షణ రేకెత్తిన కాలము. ఈ పాత కొత్తల సంధికాలములోనే 1848 లో జన్మించినాడు శ్రీ కందుకూరి వీరేశలింగం.

ఆంధ్రదేశములోని సాంస్కృతిక పునరుజ్జీవనము వీరేశలింగం పంతులు గారి వాఙ్మయ వీరవిహారముతోనే ప్రారంభమైనదని చెప్పవచ్చును. భారత దేశములోని పరిస్థితులించుమించుగా అన్నియును ఆ కాలమున ఆంధ్రదేశమందు గూడ వ్యాపించి యుండెను. ఆంధ్రులు దేశములోని అన్ని ఉద్యమాలయందు నాయకత్వము వహించి, జాతి నిర్మాణ కార్యక్రమమును ముందడుగు వేసి యున్నారు. కాలదోషము పట్టిన పాతయాచారాలపై తిరుగుబాటు, పాశ్చాత్య నాగరికతపైన వ్యామోహము, ఇంగ్లీషు పరిపాలన యెడల మక్కువ, ప్రాచీన విజ్ఞాన పునరుద్ధరణాభిలాష, జాతీయోద్యమ ఫలితముగా అంకురించి మొలకెత్తిన స్వదేశాభి మానము, రెండు భిన్నాభిప్రాయాల మధ్య భావ సంఘర్షణ యీ కాలమున తెలుగు దేశమందలి యితర ఉద్యమాలన్నిటి యందువలె సాంస్కృతికోద్యమమందు గూడా ప్రస్ఫుటముగా గనబడుచున్నది.

అతిరథ మహారథుల యవతరణ

భారతదేశమున గడచిన శతాబ్దాంతము, మరియు ఈశతాబ్దాది కాలమును మేథావి యుగమని చెప్పవచ్చును. దిగ్దంతులైన అతిరథులన్నిరంగాల యందు కన్పట్టుచున్నారు. ఉద్దండులైన న్యాయవాదులు, న్యాయశాస్త్రమున నిష్ణాతులైన న్యాయమూర్తులు, గణన కెక్కిన విద్వాంసులు, ఆంగ్లభాష నరచేతి నిమ్మపండుగా ఆడించగలిగిన విద్యాధికులు, వక్తృత్వమునందు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రతివాది

భయంకరులు, జాతికి నూతన చైతన్యము ప్రసాదించగలిగిన రచయితలు, మేదానిధులైన విజ్ఞానులు, త్యాగము మూర్తీభవించిన దేశభక్తులు ఈ కాలమునందు అన్ని రాష్ట్రాలలోను ఉదయించిరి. బెంగాలులో ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు, బంకించంద్ర ఛటర్జీ, సురేంద్రనాథ బెనర్జీ, జగదీశ చంద్రబోస్, ప్రఫుల్లచంద్రరాయ్, చిత్తరంజన్ దాస్, అషుతోషుముఖర్జీ, అరవిందుడు, అవనీంద్రుడు, రవీంద్రుడు ఆవిర్భవించి వంగదేశము భారతదేశమునకు మార్గదర్శకమైన నాయకమణి యయ్యెను. మహారాష్ట్ర దేశమున గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధర తిలక్, మహాదేవ గోవిందరానడే, రామకృష్ణ భండార్కర్, కర్వే, సావర్కర్లు బయలుదేరి తమ రాష్ట్రమునకు జీవముపోసిరి. సంయుక్తరాష్ట్రమున మదనమోహన మాలవ్యా పండితుడు ముందుకు వచ్చి, కాశీ విశ్వ విద్యాలయమునకు రూపురేఖలుదిద్ది భారత జాతీయ రంగమున దేదీప్యమానముగ ప్రకాశించెను. మోతీలాల్ నెహ్రూ, తేజ్ బహద్దూర్ సప్రూ, మున్షీ, ప్రేంచంద్‌లు సంయుక్త రాష్ట్ర ప్రజాహిత జీవనమున అగ్రేసరులుగా నిలిచిరి. తమిళ దేశమునకు సేలం విజయరాఘవాచార్య, శ్రీనివాస శాస్త్రి, కస్తూరి రంగ అయ్యంగారు, రాజగోపాలాచార్య, చంద్రశేఖర్ వెంకట రామన్ ప్రభృతులు నవజీవనము ప్రసాదించిరి. పంజాబు రాష్ట్రమున లాలాలజపత్‌రాయ్, సరిహద్దు రాష్ట్రమున ఖాన్ అబ్దుల్ గప్ఫార్‌ఖాన్ గారలు నాయకత్వము వహించిరి. ఈ మహనీయుల వ్యక్తిత్వాల ప్రభావము రాజకీయ రంగమునందేకాక సాంస్కృతిక రంగమునందు కూడా స్పష్టముగా కనబడుచున్నది. ఇదేవిధముగా తెలుగు దేశమున కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, కాశీనాథుని నాగేశ్వరరావు, కొండా వెంకటప్పయ్య, టంగుటూరి ప్రకాశం, ముట్నూరి కృష్ణారావు, పట్టాభి సీతారామయ్య, డాక్టర్ రాధాకృష్ణ, కట్టమంచి రామలింగారెడ్డి, సి.వై. చింతామణి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు, దామెర్ల రామారావు. న్యాయపతి సుబ్బారావు, మాడపాటి హనుమంతరావు ప్రభృతులుదయించి ఆంధ్రజాతికి జీవముపోసిరి. తెలుగు దేశమునకు నూతన

చైతన్యము కలిగించిరి. తత్ఫలితముగా ఆంధ్రదేశములో నవోదయమైనది. సాంస్కృతిక పునరుజ్జీవనమునకు మార్గము సుగమము చేయబడినది.

జాతీయోద్యమము – ఆంధ్రాభిమానము

ఆంధ్రదేశములో సాంస్కృతిక పునరుజ్జీవనమునకు కొన్ని ఉద్యమములు కారణభూతములైనవి. లార్డు కర్జన్ చేసిన బంగాళదేశ విభజన ఫలితముగా వంగీయు లాగ్రహోదగ్రులై ఆందోళన మొదలిడిరి. అందువలన స్వరాజ్యవాంఛయు, జాతీయాభి మానము ప్రబలినవి. వంగనాయకుడు బిపిన్ చంద్రపాల్ ఇతర రాష్ట్రాలతో పాటాంధ్రదేశ పర్యటన గావించెను. శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు బిపిన చంద్రపాలును మచిలీపట్నమునకాహ్వానించి ఆయన దివ్యవాణి ఆంధ్రదేశమునకు పరిచితము కావించిరి. బంగాళా విభజనవలన కలిగిన రాజకీయ వాతావరణ మాంధ్రరాష్ట్ర వాంఛకు చేయూతనిచ్చినది. బ్రహ్మసమాజ మానాటి కొందరు విద్యార్థికుల నాకర్షించెను. రఘుపతి వెంకటరత్నం నాయుడు, వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు గార్లు బ్రహ్మసమాజ మతముచే ప్రభావితులైరి. ఇతర మత భాషా సాంస్కృతికాది ఉద్యమాలు కూడా ఆంధ్రదేశ సమాజ జీవనముపై ప్రభావము వేసినవి. ఆర్య సమాజము, దివ్యజ్ఞానము, వివేకానంద, రామకృష్ణ పరమహంసల ప్రబోధము ఆనాడాంధ్రదేశమున బహుళవ్యాప్తి గాంచినవి. వీనితోబాటు సంఘసంస్కరణోద్యమము విశేషించి వితంతు వివాహోద్యమము తెలుగు దేశమున ప్రధాన సాంఘికోద్యమముగా ప్రాముఖ్యము వహించినది. దీనిపైన పత్రికలలో వాదోపవాదాలు చెలరేగి పరస్పర దూషణ భూషణల వరకు గూడ వచ్చియుండెను.

ఈ యుద్యమములన్నిటిలో బలవత్తరమైనది జాతీయోద్యమము. ఈ జాతీయోద్యమము వెల్లువవలె పెల్లుబికి ఆంధ్రదేశము నంతటిని నుత్సాహ తరంగితము గావించినది. లోకమాన్యతిలక్, గాంధిమహాత్ముడు ప్రారంభించిన స్వాతంత్రోద్యమాలలో ఆంధ్రదేశీయులు ధైర్యముతో, త్యాగముతో అగ్రేసరులుగా నిలచి పోరాడినారు.

'మాకొద్దీతెల్లదొరతనము' అని కవులు సోదర దేశీయులను ప్రబోధించినారు. ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణుని వంటివారు తమ వక్తృత్వమును, సాహిత్యమును, ఉత్తమ సంస్కారమును, సర్వతోముఖ ప్రతిభను దేశీయులను నిద్రావస్థ నుండి లేపి కర్తవ్య పరాయణులనుగా జేయుటకు వినియోగించినారు. జాతీయవాదులు మన ప్రాచీన విజ్ఞానమును పునరుద్ధరించి జాతీయ విద్యను బోధించుటకై, సంస్కృత పాఠశాలలను జాతీయ కళాశాలలను నెలకొల్పినారు. కళారంగమున భారతీయ సంప్రదాయమునకు ప్రాధాన్యము నీయవలెనను అభిప్రాయాలు బలపడినవి. సమకాలిక సమస్యలైన హరిజనోద్ధరణ మొదలైనవి ఆనాడు వాఙ్మయమున ప్రధానేతివృత్తములైనవి; జాతీయ భావాల ప్రేరణవలన తెలుగుభాషలో రచనలు చేయబడినవి. కవులు, కళాకారులు, విజ్ఞానులు చెరసాలల కేగిరి.

ఆంధ్రోద్యమము, ప్రత్యేకాంధ్రరాష్ట్ర వాంఛ యీ జాతీయోద్యమముతో బాటు తెలుఁగు సీమయందు నలుమూలల వ్యాపించి అన్ని రాజకీయ పక్షాలవారి ఆదరాభిమానమునకు పాత్రమైనది. ఆంధ్ర ప్రశస్తిని గూర్చి, రాష్ట్ర ఆవశ్యకతను గూర్చి కవీశ్వరులు గానము గావించిరి. 'చావలేదు చావలేదు, ఆంధ్రుల మహోజ్వల చరిత్ర' యని ఉద్బోధించిరి. ఆంధ్రదేశ చరిత్రలోని వీరగాథలను భావనాపథమున స్మరించి తాము పులకితులై పాఠకులను తన్మయులను గావించిరి. తరువాత రాజకీయ రంగమున 1935 ప్రాంతమున కమ్యూనిష్టు పార్టీ తలయెత్తినది. ఈ పక్షానికి ప్రత్యేక రాజకీయ ఆదర్శాలు గలవు. తమ రాజకీయ సిద్ధాంతాలకు ఆదర్శాలకు అనుగుణముగా సాంస్కృతిక కార్యకలాపాలలో గూడ ఈ పక్షము వారు శ్రద్ధ వహించిరి. రచయితల సంఘాలు, వేసవి పాఠశాలలు , దిన పత్రికలు, వార పత్రికలు, బుర్రకథలు, నాటకాలు, పుస్తకాల ప్రకటన మొదలైన కార్యకలాపాలలో వీరి రాజకీయాదర్శాలు ప్రతిబింబితమగుచున్నవి. 1913 సంవత్సరమున ప్రారంభమైన ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమము, ప్రత్యేక విశ్వవిద్యాలయ వాంఛను రేకెత్తించినది. తత్ఫలితముగా కొంత ప్రయత్నము జరిగి, ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు 1926 లో అవతరించినది.

ఆంధ్రదేశమునందలి కళాశాలలు, (రాయలసీమవి తప్ప) ఆంధ్ర విశ్వవిద్యాలయమున కనుబంధములైనవి. విశ్వవిద్యాలయాలలో లేని కొన్ని కొత్త కోర్సులేర్పాటు చేయబడినవి. అందువలన వైజ్ఞానిక రంగమున నూతన పరిశోధనలకు అవకాశములు కల్గింపఁ బడినవి. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన విద్వన్మణులైన కట్టమంచి రామ లింగారెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణగారల నేతృత్వము యొక్క యదృష్టము లభించినది. ఆంధ్రరాష్ట్రమున ఉన్నత పాఠశాలలు, కళాశాలలు విరివిగా స్థాపింపఁబడినవి.

వాఙ్మయ పరిశోధనలు

రాజకీయ, సాంఘిక ఉద్యమాలతో బాటీకాలమున కొన్ని ముఖ్యమైన వాఙ్మయోద్యమాలు కూడ బయలుదేరినవి. చరిత్ర పరిశోధనోద్యమము మొట్టమొదట చెప్పదగినది. ఇంగ్లీషువారు వ్రాసిన వ్రాతలే మన చరిత్రకు వేదవాక్యాలవలె ఆధారములై యుండిన పరిస్థితిలో మన చరిత్ర గ్రంథాలలో దక్షిణదేశము యొక్క, అందు ముఖ్యముగా ఆంధ్రదేశ చరిత్రయొక్క వివరాలు మిక్కిలి తక్కువగా నుండెను. ఈ లోటుతీర్చుటకు మన పరిశోధకులు కృషి గావించిరి. ఆంధ్రదేశ చరిత్ర పరిశోధనారంగమున 19వ శతాబ్దమత్యంత ప్రధానమైనది. ఈ శతాబ్దమున కావలి వేంకట బొొ్ల్లయ్యయను విద్వాంసు డప్పుడాంగ్ల ప్రభుత్వాధికారిగా నుండిన మెకంజీదొర ధనసహాయముతో తెలుగుదేశములోని స్థానిక చరిత్రలను గొన్నిటిని సేకరించినారు. తరువాత ఆయన సోదరులీ కార్యక్రమమును నిర్వహించి యుండిరి. ఈ విధముగా ఆధునిక చరిత్ర పరిశోధనలకు శ్రీకావలి వేంకటబొల్లయ్య మూలపురుషుఁడని నిస్సందేహముగా చెప్పవచ్చును. మన కవుల జన్మస్థానాలు, వారి జీవితకాలము, మరియు ఇతర వివరాలను గూర్చి కందుకూరి వీరేశలింగం పంతులుగారు, ఆంధ్రదేశ చరిత్రను గూర్చి చిలుకూరి వీరభద్రరావుగారు, మన శాసనాలు, చరిత్ర రచనకు వినియోగపడు సాధన సామగ్రినిఁ గూర్చి కొమర్రాజు లక్ష్మణరావుగారు పరిశోధనలు గావించి ఉత్తమ రచనలు చేసి మార్గదర్శకులైరి. శాసనాల ప్రతిబింబాలు సంపాదించి ప్రకటించుట, జీర్ణమైపోవుచున్న తాళపత్ర గ్రంథాలు సేకరించుట, ఆనాటి పరిశోధకుల ముఖ్యకృషియై యుండెను.

ఆంధ్రసాహిత్య పరిషత్తు శ్రీజయంతి రామయ్య పంతులుగారి ఆధ్వర్యమున చరిత్ర పరిశోధనోద్యమమునకు గొప్పయండయై నిలిచినది. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, నేలటూరి వేంకటరమణయ్యగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, డాక్టరు శ్రీనివాసాచార్యులుగారు చేసిన కృషి యీ సందర్భమున ప్రత్యేక స్మరణీయము. ఆంధ్రదేశము, ఆంధ్ర వాఙ్మయములకు సంబంధించిన పరిశోధనా కృషి మన సాంస్కృతిక పునరుజ్జీవనానికి మహోపకారము గావించినది. రాజమహేంద్రవరమున ఆంధ్రదేశీయైతిహాసిక పరిశోధన మండలి యావిర్భవించినది.

ఆశుకవితలు - అవధానాలు

ముద్రణాలయాలు వ్యాపించి పత్రికలు ప్రారంభమై మనదేశమున సాంస్కృతిక కార్యకలాపాలకు అనుకూలమైన వాతావరణము కలిగినది. వావిళ్ళ మొదలైన ప్రచురణ కర్తలు పూర్వ గ్రంథాలను అచ్చు వేయుటే కాక ఆధునిక రచయితల పుస్తకాలను ప్రకటించి మన సాంస్కృతికోద్యమానికి దోహదము కావించిరి. ఈ మార్గమున మన పత్రికలు ముఖ్యముగా ఆంధ్రపత్రిక చేసిన సేవ యమోఘమైనది. అది స్వర్ణాక్షరములతో లిఖింపదగినది. తిరుపతి వేంకట కవుల మార్గదర్శకత్వమున అవధానాలు, ఆశుకవితా ప్రదర్శనలు ఆంధ్రదేశమున ఒక్కమారు గాలిదుమారము లేపినవి. తీవ్రమైన సాహితీ పిపాస కలిగించినవి. సాహితీ సమరములు వాఙ్మయాభిమానమును ఇతోధికము గావించినవి. ఊరూర అవధానాలు, ఆశుకవితా ప్రదర్శనలు తలయెత్తినవి. పల్లెపల్లెన జంటకవులు బయలుదేరిరి. అధిక్షేప రచనలు పత్రికలలోనే కాక, గ్రంథరూపమునఁ గూడ వెలువడినవి. నాటక ప్రదర్శనలు తెలుగుసీమ నంతటిని ఆకర్షించినవి. కవిత్వము అల్లనేర్చిన యువకులనేకులు నాటక రచనకు సాహసించిరి. నాటక సమాజములు అసంఖ్యాకములుగా బయలుదేరెను. కొన్ని నాటక సమాజములను స్వయముగా గ్రంథకర్తలే నిర్వహించి పాత్రలను గూడ ధరించిరి. ఉద్దండులైన పండితులీకాలమున నాటకాలు రచించి నాటక ప్రదర్శనల నభిమానించిరి. ఈ నాటక ప్రదర్శనల వలన

అవధానాల వలన, పరస్పరాధిక్షేప రచనల వలన ఆంధ్రదేశమున సారస్వతాభిరుచి, వాఙ్మయాభిమానము ప్రబలినవి. ఈ యాశుకవత్వావధానాలే, ఈ నాటక ప్రదర్శనాలే ఆ కాలమున రాజకీయముగా వేరుపడి పరస్పరము రాక పోకలు లేక, ఒకరినిఁ గూర్చి ఒకరికి సరిగాఁ దెలియక యుండిన ఆంధ్రతెలంగాణా ప్రజల మధ్య ఏకైక బంధముగా నుండెనని చెప్పినచో సత్యమునకు తలవంపులు కలుగజాలవు.

తెలుఁగుసీమలో కొన్ని ముఖ్యమైన విద్యాసంస్థలు వెలసి జాతీయ విద్య, ప్రాచీన విజ్ఞాన పునరుద్ధరణకు దోహదము కావించినవి. సంస్కృత కళాశాలలు పాఠశాలలు చాలా చోటులలో స్థాపితమైనవి. బందరులో జాతీయ కళాశాల యవతరించినది. గుంటూరులో శారదా నికేతనము స్థాపితమయ్యెను. జాతీయ విద్య యొక ఉద్యమముగా దేశములో వ్యాపించెను.

ఆంధ్రతెలంగాణాల సాంస్కృతిక సమైక్యతకు బీజావ్యాపన

ఆంధ్రదేశమందలి వైజ్ఞానికోద్యమంలో చెప్పఁదగినది గ్రంథాలయోద్యమము. తెలుఁగుసీమలో అప్పటికే గ్రంథాలయాలు కొన్ని అవతరించినప్పటికీ 1914వ సంవత్సరములో ఆంధ్రదేశ గ్రంథాలయ స్థాపనతో ఈ యుద్యమమునకు చాలబలము కలగినది. చాలకాలమీ యుద్యమమును సక్రమముగా గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు నిర్వహించినారు. గ్రంథాలయ సర్వస్వమను పత్రికను నడపి, గ్రంథాలయోద్యమ వ్యాప్తికి పాటుపడిన వారిలో అయ్యంకి వెంకట రమణయ్యగారిని ప్రత్యేకముగాఁ బ్రశంసింపవలసియున్నది. శిక్షణ తరగతులు నడిపి, పత్రికను నిర్వహించి, సమావేశాలు జరిపించి, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము వారీ యుద్యమమును సకలాంధ్ర దృక్పథముతో నడిపియున్నారు.

ఆంధ్ర తెలంగాణాల మధ్య సాంస్కృతిక సంబంధాల ఆవశ్యకత ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారు గుర్తించిరను సత్యము మనము గమనించవలసి యున్నది.

ఈ యావశ్యకతను మొట్టమొదటిసారి గుర్తించిన ఆంధ్ర విజ్ఞానులు కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావుగారు. ఆంధ్రదేశ గ్రంథాలయ స్థాపన కొక దశాబ్దమునకు ముందే లక్ష్మణరావుగారు విజ్ఞానచంద్రికా గ్రంథమండలిని, శ్రీకృష్ణదేవరాయ గ్రంథాలయము తోపాటు హైదరాబాదులో స్థాపించిరి. ఈ విధముగా విజ్ఞాన చంద్రికా మండలి వారు గ్రంథములను ప్రకటించుటయేగాక విజ్ఞాన చంద్రిక పరిషత్తు నేర్పరచి సాహిత్యము, చరిత్ర, ప్రకృతి శాస్త్రము అనుమూఁడు విషయాలను గూర్చి పరీక్షలు జరిపినారు. ఈ పరిషత్తునకు వీరేశలింగం పంతులుగారధ్యక్షులుగను, వావిలికొలను సుబ్బారావుగా రుపాధ్యక్షులుగను నుండిరి. పరిషత్తువారు పరీక్షలు జరిపి బంగారు పతకములు, రు. 116. రు.50లు బహుమతులు నిచ్చుచుండిరి. ఈ పరీక్షలో హైదరాబాదు వారుకూడ కొందరు కూర్చుండి యుండిరి. ఆంధ్రభాషలో పరీక్షలు జరిపిన మొట్టమొదటి ప్రైవేటు సంస్థ విజ్ఞానచంద్రికా మండలి. తెలుఁగులో ఈ పరీక్షావిధానమునకు మూల పురుషులు లక్ష్మణరావుగారే. తర్వాత హైదరాబాదులో ఇట్టిపరీక్షలను జరుపవలసినదని ఆదిరాజు వీరభద్రరావు గారు ఆంధ్రమహాసభలో కోరి యుండిరి కాని ఆంధ్రమహాసభ కార్యరూపము నీయలేదు. తరువాత ఆంధ్ర సారస్వత పరిషత్తు పరీక్షలను నెలకొల్పి జయప్రదముగా నిర్వహించు చున్నదని యీసందర్భమున మనము గమనించవలసి యున్నది.

విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి వారాంధ్ర చరిత్రకు సంబంధించిన నవలా రచన పోటీ పరీక్షలు పెట్టియుండిరి. ఇది కూడా ఇటువంటి ప్రయత్నాలలో మొట్టమొదటిదే. రాయచూరు యుద్ధము, విజయనగర సామ్రాజ్యము, పాతాళభైరవి యను పోటీ నవల లీ గ్రంథమాలలో ప్రకటితమైనవి. లక్ష్మణరావుగారాంధ్ర విజ్ఞాన సర్వస్వ రచనకుఁగూడ మార్గ దర్శకులు. వారు విజ్ఞాన సర్వస్వము మొదటి సంపుటము తమ జీవిత కాలములోనే సిద్ధముచేయించిరి. లక్ష్మణరావుగారి ఆదర్శాలు రెండు. చరిత్ర పరిశోధన, విజ్ఞాన వాఙ్మయ నిర్మాణము. ఈ యుద్యమముల ద్వారా లక్ష్మణరావుగారాంధ్ర తెలంగాణాల మధ్య నొక దృఢమైన సాంస్కృతిక బంధము

ఏర్పాటుగావించి, తెలుగు సీమకు వెలుగుబాట చూపిరి. అందుచేత విశాలాంధ్రోద్యమమునూహించి, ఉద్ధేశించి, సాంస్కృతికముగా బీజావ్యాపన గావించిన గౌరవము లక్ష్మణరావుగారికి చెందుచున్నది. ఆంధ్రదేశ మహాపురుషులలో లక్ష్మణరావు గారికి విశిష్టమైన ప్రత్యేక స్థానము కలదు. యువకులలో నివురుగప్పిన నిప్పువలె దాగుకొనియున్న ప్రతిభను గుర్తించి తద్వికాసమునకు సకల విధముల సహాయము గావించిన వారిలో తెలుగు సీమయందు లక్ష్మణరావుగా రగ్రగణ్యులు. వారి విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి ప్రచురణలను పరిశీలించినపుడు చిలుకూరి వీరభద్రరావు, కట్టమంచి రామలింగారెడ్డి, అయ్యదేవర కాళేశ్వరరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, డాక్టరు ఆచంట లక్ష్మీపతి, గోటేటి జోగిరాజు, వేమూరి విశ్వనాథ శర్మ మొదలైన పెద్దల రచనలు అందు కనిపించు చున్నవి. అనగా ఆనాఁడు యువకులుగా నున్న యీ పెద్దలకు లక్ష్మణరావుగారి ప్రోత్సాహము లభించినదని తెలియుచున్నది. ఆంధ్ర విద్వన్మణులలో దివ్యమణియై ఆంధ్రదేశ చరిత్ర పరిశోధకులలో నగ్రేసరులై బ్రకాశించిన మల్లంపల్లి సోమశేఖరశర్మగా రానాఁడు లక్ష్మణరావుగారి సాహచర్యముచే ప్రభావితులైన వారే. అఖిలాంధ్ర కవిలోకమునకు ఆచార్యులై, ఆంధ్రుల యశోగానము చేసి, సకలాంధ్రమును ఉత్తేజితము గావించిన రాయప్రోలు సుబ్బారావుగారు లక్ష్మణరావుచే ప్రభావితులైన మరొకరు.

మచిలీపట్నములో ఆంధ్రభాషాభివర్ధనీ గ్రంథమాల, విజ్ఞాన చంద్రిక వలెనే బహుశా విజ్ఞాన చంద్రిక ఆదర్శము ననుసరించియే స్థాపితమై మంచి గ్రంథములను బ్రకటించినది. ఈ గ్రంథమాల ప్రచురణలలో డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారు రచించిన పుస్తకాలు కలవు.

వ్యావహారిక భాషావాదము –పండిత మండలిలో అలజడి

వ్యావహారిక భాషోద్యమ మీ కాలమున వచ్చిన ఉద్యమాలన్నింటిలో మిక్కిలి ప్రధానమైనది. భాషోద్యమముపైన గూడ కొంత పాశ్చాత్యుల ప్రభావము కలదు.

కాడ్వెలు ద్రావిడ భాషాసంప్రదాయ సిద్ధాంతమును బ్రతిపాదించెను. వాడుకభాషలో రచనలు గావించవలెనని శబరవాగనుశాసనులు, సంస్కృతాంధ్ర భాషా సముద్రములను ఆపోశనము పట్టిన అగస్త్యులునైన గిడుగు వెంకటరామమూర్తి పంతులుగారుద్ఘాటించి, పాంచజన్యమును పూరించిరి. గురజాడ అప్పారావు గారు 'ముత్యాల సరాలు', 'కన్యాశుల్కము' లను రచించి వ్యావహారిక భాషలో రచనలకు మార్గదర్శకులైరి. ఇది తెలుఁగు పండిత ప్రపంచములో గొప్ప యలజడిని, ఆంధ్రవాఙ్మయమున తీవ్రసంచలనమును కలుగజేసినది. కొక్కొండ వెంకటరత్నం పంతులు గారు, జయంతి రామయ్యపంతులుగారు మొదలైన పెద్దలు వ్యావహారిక భాషోద్యమమును ప్రతిఘటించి విశ్వవిద్యాలయము చేత వాడుకభాషలో రచించిన పాఠ్య గ్రంథములను నియమించ గూడదను తీర్మానము చేయించిరి. గిడుగు రామమూర్తి పంతులుగారు, వేదము వెంకటరాయ శాస్త్రులు గారివంటి పండితులు వ్రాసిన పుస్తకాలలో తప్పులు నిరూపించి, ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజమును లోకానికి తెలియజేసిరి. కాలక్రమమున వ్యావహారిక భాషోద్యమము సజీవమైన ఉద్యమముగా రూపొంది పండితులు, రచయితలు, రామమూర్తి పంతులుగారి వాదనలోని సత్యము గ్రహించిరి. చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారి వంటివారు వ్యావహారిక భాషలో రచనలు గావించిరి. ఆ నాడంత తీవ్ర ప్రతిఘటనకు గురియైన యుద్యమము నేఁడు సకలాంధ్రము యొక్క ఆమోదము పొందినది. ఆనాడీ మనీషుల స్పర్థలవలన ఆంధ్రవాఙ్మయమునకు విలువలేని రత్నములు లభించినవి.

పునరుజ్జీవనానికి పునాదులు వేసిన సంస్థలు

ఆంధ్రదేశములో సాంస్కృతిక పునరుజ్జీవనమునకు బలమైన పునాదులు వేసిన సంస్థల నీ సందర్భమున పేర్కొనవలసి యున్నది. పిఠాపురము మహారాజావారి పోషకత్వమున స్థాపించబడి, నిర్వహింపబడిన ఆంధ్రసాహిత్యపరిషత్తు చేసిన సాంస్కృతిక సేవ మిక్కిలి గొప్పది. ఈ సాహిత్య పరిషత్తుకు జయంతి రామయ్య

పంతులుగారు జీవగఱ్ఱయై యుండిరి. ప్రతి సంవత్సరము వార్షికోత్సవాలు జరిపి ఒక సారస్వత మాసపత్రికను ప్రకటించి. తాళపత్ర గ్రంథాలను సేకరించి ముద్రించి, చరిత్ర పరిశోధన సామగ్రిని శ్రద్ధతో సంపాదించి, తరువాత సూర్యరాయాంధ్ర నిఘంటువును ప్రచురించి యీ సంస్థ నిరూపమానమైన సేవ చేసినది. ఆనాడాంధ్ర దేశమున ఈ సంస్థ యొక గొప్ప సాంస్కృతిక కేంద్రముగా నుండెను. కాని కాలప్రభావమున వచ్చిన మార్పులను స్వీకరించలేక పోయినందున, భాషా విషయమై రచనవిషయమై క్రొత్తదనమును వ్యతిరేకించినందువలన ఈ సంస్థ యువకులకు, నూతన మార్గాన్వేషకులకు, కాలము మార్పులను గుర్తించిన సహృదయులైన విద్వాంసులకు దూరమైనది. దీనిపై తిరుగుబాటుగా నవ్యసాహిత్య పరిషత్తు ఉదయించినది. నవ్యసాహిత్య పరిషత్తుకు కొంచెము ముందుగా సాహితీ సమితి స్థాపితమై తెలుగు వాఙ్మయరంగమున క్రొత్త దారులను వేసినది. ఆంధ్ర ఐతిహాసిక పరిశోధక మండలివారు వార్షిక సభలను జరిపి, చాళుక్య, కాకతీయ శాతవాహనాది సంచికలను ప్రకటించి, పరిశోధనోద్యమమును బలపఱచిరి. అభ్యుదయ రచయితల సంఘము స్పష్టమైన ప్రత్యేకాదర్శములతో ముందుకు వచ్చినది. నవ్యసాహిత్య పరిషత్తు స్థాపనకు పూర్వమే ఆంధ్రప్రచారిణీ, సరస్వతీ, వేగుచుక్క గ్రంథమాలలు స్వతంత్రములు, మరియు భాషాంతరీకరణములైన నవలలు ప్రకటించి మనదేశమున భాషాభిరుచి కలుగజేసినవి. ఇంతకుముందే వావిళ్ళవారు మద్రాసు నగరము నుండి మన ప్రాచీన వాఙ్మయ ప్రచురణ ప్రారంభించి, భాషావ్యాప్తికి వాఙ్మయాభిరుచికి అత్యంత సహకారులైరి. ఇతరాంధ్ర ప్రకాశకుల ప్రచురణలు కూడ ఆంధ్రదేశములోని సాంస్కృతికోద్యమానికి బలమైన ఊతమిచ్చినవి. ఇటీవల వచ్చిన సంస్థలలో తెలుగుభాషా సమితిని ప్రత్యేకముగా ప్రశంసింపవలసి యున్నది. ఇది 1947 వ సంవత్సరములో స్థాపితమైనది. తెలుగు విజ్ఞాన సర్వస్వ సంపుటాలను ప్రకటించు ఈ సంస్థ చేయుచున్న కృషి ప్రశంసనీయమైనది.

పునర్వికాసానికి ఆటపట్టులైన కొన్ని పట్టణాలు

ఈ సాంస్కృతిక పునరుజ్జీవనమునకు ఈ కాలమున తెలుఁగు సీమలో పట్టణాలాటపట్టులై వెలసియున్నవి. రాజమండ్రి ఆంధ్రదేశములో నవయుగోదయ భానుడైన వీరేశలింగం పంతులుగారి నివాసస్థానమై వారి వివిధ కార్యక్రమాలకు రంగస్థలమైనది. ప్రకాశంపంతులు గారికి కూడా ఈ పట్టణమే కొంతకాలము కార్యరంగమైనది. శ్రీ దామెర్ల రామారావుగారిక్కడనే చిత్రకళాసుందరి నారాధించిరి. ఆంధ్రదేశీయైతిహాసిక పరిశోధక మండలికి ఇదియే యునికిపట్టు. మహాభారత గ్రంథకర్తయైన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రుల వారి నివాసస్థలము రాజమండ్రి. చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులుగారికి, వడ్డాది సుబ్బారాయుడుగారికి, న్యాపతి సుబ్బారావు పంతులుగారికి గూడ రాజమహేంద్రవరమే కాపురమైనది. కొక్కొండ వెంకటరత్నం పంతులు గారిక్కడనే నివసించిరి. చిలుకూరి వీరభద్రరావుగారి రచనలిక్కడనే జరిగినవి. గిడుగు రామమూర్తి పంతులుగారు రాజమహేంద్రవరములోనే కొంతకాలము కాపురము చేసిరి. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి గారికి రాజమండ్రి ప్రాంతమే స్వస్థలము.

రాజమహేంద్రవరమునకు దగ్గరగా నున్న కాకినాడ, పిఠాపురము పట్టణాలు కూడ ఆంధ్ర సంస్కృతికి కేంద్రములై యొప్పినవి. ఆరోజులలో ఒక విధముగా రాజమహేంద్రవరము, కాకినాడ పోటీ పడినవని చెప్పిన నతిశయోక్తి కాజాలదు. కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తుకు ప్రధాన కార్యస్థానమైయుండెను. పిఠాపురము రాజాగారాంధ్ర సారస్వత వికాసమునకు జేసిన పోషణ మిక్కిలి గొప్పది. ఆంధ్ర సాహిత్య పరిషత్తుకు వారే పెట్టనికోట. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారిని వారు విశేషముగా ఆదరించిరి. ఆంధ్ర నాటక రచనలో అద్వితీయమైన ప్రతిభను జూపించి తెలుఁగు వచనరచనలో అసమానులుగా కీర్తిగాంచిన పానుగంటి లక్ష్మీనరసింహా రావుగారికి పిఠాపురం రాజాగారే ముఖ్యపోషకులై యుండిరి. బళ్లారి నగర మాంధ్ర సంస్కృతీ వికాసమునక మరొక ముఖ్యకేంద్రముగా నుండెను. ఆంధ్రనాటక రచనకు

పుట్టినిల్లు బళ్ళారినగరము. నాటక రచనకు ప్రదర్శనములకు ఈ బళ్ళారియే మార్గదర్శి. స్వయముగా నాటకములో నభినయించిన బహునాటక పితామహులైన ధర్మవరము కృష్ణమాచార్యుల వారికి బళ్ళారియే కాపురమైనది. కోలాచలము శ్రీనివాసరావుగారికి బళ్ళారియే నివాసస్థలమై యొప్పినది. బళ్ళారి రాఘవాచార్యులు మున్నగు మహనీయులు బళ్ళారిలో వెలిగించిన దీపము సకలాంధ్రదేశమును ప్రకాశవంతము గావించినది.

నెల్లూరు నెఱజాణలకేకాక ఉద్దండ పండితులకును నివాసస్థానమైనది. జంకు కళంకులేని కవిచంద్రుడు, తోషిత కోవిదేంద్రుడు, బహుభాషాప్రవీణుడు నైన వేదం వెంకటరాయశాస్త్రులవారు నెల్లూరు నుండియే తెలుగు తల్లికి మేలిసొమ్ముల నర్పించిరి. ఆముక్తమాల్యద, నైషధ గ్రంథాల వ్యాఖ్యలతో బాటు ప్రతాపరుద్రీయమను ఉత్తమ నాటకము రచించి, నాటక ప్రదర్శనమును ప్రోత్సహించి వెంకటరాయ శాస్త్రులవారు నెల్లూరు నుండి సారస్వతజ్యోతిని ప్రకాశింపజేసి తెలుగుదేశమును కాంతివంతము గావించిరి. పూండ్ల రామకృష్ణయ్యగారు అముద్రిత గ్రంథ చింతామణి నెల్లూరులో స్థాపించి సుమారిరువది సంవత్సరాలు నడిపి స్తవనీయమైన సారస్వత సేవచేసిరి. విజయనగరము సాహిత్యము మరియు కళలపోషణకు పేరుపొంది, నిజానికి విద్యానగరమై విలసిల్లెను. మహామహోపాధ్యాయ తాతా సుబ్బారాయశాస్త్రుల వారి వంటి మహాపండితులకు ఈ విజయనగరమే కాపురమైనది. ద్వారం వేంకట స్వామి నాయుడువంటి సంగీత విద్వాంసులకు ఈ విజయనగర మాశ్రయము నిచ్చినది. గురజాడ అప్పారావు గారి వ్యావహారిక భాషోద్యమమునకు విజయనగరము ఉనికిపట్టయినది. విజయనగర సంస్థానాధీశులైన ఆనంద గజపతి మహారాజుగారు స్వయముగా పండితులై – కళోపాసకులై రసికులై వదాన్యులై, ప్రాచీన విజ్ఞానమును మన సాహిత్యమును కళలను పోషించి సాంస్కృతిక పునరుజ్జీవనమునకు అనుకూలమైన వాతావరణము కలిగించిరి.

గుంటూరు పట్టణము దేశభక్త వేంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతుల గార్ల నివాస స్థానమై ఆంధ్ర సంస్కృతీ వికాసమునకు ఆటపట్టైనది. సాహితీ

సమితి వంటి సంస్థలు బయలుదేరి తెలుగు భాషలో కొత్త పోకడలను తీసుకొని వచ్చినవి. అభినవాంధ్ర కవి పండితులకు గుంటూరు, తెనాలి నగరాలు కేంద్రములైనవి. శివశంకర స్వాములవారు తమ పీఠము ఈ ప్రాంతముననే నెలకొల్పినారు. బందరులో డాక్టర్ పట్టాభి సీతారామయ్య, కోపల్లె హనుమంతరావు, ముట్నూరి కృష్ణారావు గారలు త్రిమూర్తులవలె శోభించి ఆంధ్రదేశములో సంస్కృతీ వికాసమునకు దోహదము గావించిరి. కృష్ణారావు గారి కృష్ణాపత్రిక ఆంధ్రదేశమందలి పల్లె పల్లెకు వెళ్ళి, అసంఖ్యాకుల నుత్తేజితులను గావించినది. అనేకులకు రాజకీయ శిక్షణనిచ్చి సాంస్కృతికాభిరుచులను అలవడ జేసినదీపత్రిక. నిజానికాంధ్రదేశములో కృష్ణాపత్రిక సంప్రదాయ మొకటి బయలుదేరినదని చెప్పిన అతిశయోక్తి కాఁజాలదు. అఖిలాంధ్ర కవులకు కళాకారులకు, చాలామందికి భావనాగురువైనదీ పత్రిక. ఇంతకుముందే చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రుల వారు కొంతకాలము బందరులో నివసించి, యువకులనేకులలో క్రొత్త జీవనము పోసి, బందరు ప్రాశస్త్యము నినుమడింపజేసిరి. అభినవాంధ్ర కవి పండితులనేకులు బందరులో వెంకటశాస్త్రులగారి వద్ద శశ్రూష గావించి, తమ భవిష్యత్ సాహితీ జీవన వల్లికలకు పాదులను కల్పించుకొనిరి.

మద్రాసు పట్టణము గూర్చి వేరుగా చెప్పవలసిన అవసరములేదు. మద్రాసులో నాగేశ్వరరావుగారి ప్రవేశ మాంధ్ర సంస్కృతీ చరిత్రలో ఒక చరిత్రాత్మకమైన ఘట్టము. వారి ఆంధ్రపత్రిక మద్రాసునుండి వెలువడి మొత్తము తెలుగు దేశములో చీకటిని తొలగించి, వెలుతురును వ్యాపింపజేసినది. ఆంధ్రపత్రిక సారస్వతానుబంధములు, సంవత్సరాది సంచికలతో బాటు భారతి తెలుగుదేశమునకు జేసిన సేవ అమోఘమైనది. ఆంధ్రకవి పండితులు ఆంధ్రనాయకులు కొందరు మద్రాసు నగరమునకు వచ్చి కొంతకాలము నివసించి తెలుగు వెలుగును ప్రసరింపజేసిరి. వీరేశలింగం పంతులుగారు, కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు, వేదం వేంకట రాయశాస్త్రి గారు, కొమర్రాజు లక్ష్మణ రావుగారు, వావివికొలను సుబ్బారావుగారు మ్మొదలగువారు మద్రాసు నగరముతో సంబంధము కల్పించుకొనిరి. సుమారు నూరు సంవత్సరముల క్రిందట మద్రాసులో

నుండిన యేనుగుల వీరాస్వామయ్య, వనప్పాకం శ్రీనివాసాచార్యులు, పరవస్తు చిన్నయసూరి మొదలైన పండిత ప్రకాండులును తరువాత ప్రసిద్ధికెక్కిన బహుజనపల్లి సీతారామాచార్యులు, తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్య, బరూరు త్యాగరాయశాస్త్రులు మున్నగు విద్వాంసులును ఆంధ్ర భాషా వ్యాప్తికి ఉదాత్తమైన కృషిచేసిరి. ఆ కాలములో మదరాసునగర మాంధ్రసంస్కృతికి కేంద్రమై యుండినది. ఎనుబది సంవత్సరములకు ముందునుండియే తెలుగు ముద్రణా యంత్రములు మద్రాసులో నెలకొని యపూర్వమైన సేవను జేసినవి. తరువాత వావిళ్ళ రామస్వామి శాస్త్రుల వారు మద్రాసులోనే తమ గ్రంథప్రచురణలను ప్రారంభించిరి. వావిళ్ళవారి తరువాత తెలుగు ప్రకాశకులలో ఎన్నదగిన వారైన వేమూరి వెంకటకృష్ణ శెట్టి ఆనంద ముద్రాక్షరశాల మద్రాసులోనే స్థాపితమైనది.

విశాఖ పట్టణమున ఆంధ్ర విశ్వకళాపరిషత్తు స్థాపన జరిగెను. మారేపల్లి రామచంద్ర కవిగారు; తరువాత శ్రీరంగం శ్రీనివాసరావుగారు విశాఖపట్టణమున నివసించి కవితా సమితి పేరుతో సాంస్కృతిక కార్యకలాపాలకు దోహదము గావించిరి. జయపురం మహారాజా వారైన విక్రమదేవవర్మ గారు స్వయముగా పండితులు, భాషోపోషకులు; ఆంధ్ర ఉత్కళ విశ్వవిద్యాలయాలకు వీరు భూరివిరాళాలిచ్చి యనేక కవి పండితుల నాదరించిరి. ఈ కాలమున జమీందారులలో కవులైన వారును ఉండిరి. వారిలో మంత్రిప్రగడ భుజంగరావుగారిని పేర్కొనవలసియున్నది. బొబ్బిలి, వెంకటగిరి, పిఠాపురం, సంస్థానాధీశ్వరులీ కాలమునందలి భాషాపోషకులలో పేర్కొనదగినవారు. రాయలసీమయందు, కడపలో జనమంచి శేషాద్రిశర్మగారును, అనంతపురంలో డాక్టర్ చిలుకూరి నారాయణరావు గారును, ఒంటిమిట్టలో వావిలకొలను సుబ్బారావుగారును సాహితీ దీపములను వెలిగించిరి. ఆంధ్ర దేశములో అన్ని కార్యక్రమాలకు వలెనే సాంస్కృతిక వికాసమునకు గూడ విజయవాడ ముఖ్యకేంద్రమైనది. ఈనాఁడు విజయవాడ ఆంధ్రదేశము యొక్క హృదయముగా నున్నది. ఈ పట్టణాలతో బాటీ సందర్భమున వనపర్తి, గద్వాల సంస్థానాల సన్మానాలు కవి పండితులకు కళాకారులకు గొప్ప గౌరవముగా ఉండెను. ఈ పట్టణాలు తెలుగుభాషను ఆంధ్ర సంస్కృతిని

పోషించినవి. దోమకొండ, జటప్రోలు సంస్థానము లాంధ్ర సంస్కృతీ వికాసమునకు తమ వంతును చెల్లించి కీర్తిగాంచినవి.

ఈ విధముగా ఆంధ్రదేశములోని ముఖ్యపట్టణాలలో ఆంధ్ర సంస్కృతీ వికాస కార్యక్రమములు ప్రారంభమై తెలుఁగు దేశమున నవయుగోదయము గావించినవి.

౮. పానుగంటి లక్ష్మీనరసింహారావు
(1865-1940)

'సాక్షి' వ్యాసరచయితగా, విశిష్ట నాటకరచయితగా చిరయశస్సు నార్జించిన ప్రతిభావంతులు పానుగంటి లక్ష్మీనరసింహారావు. 1865 ఫిబ్రవరి 11వ తేదీన రత్నమాంబ, వేంకటరమణయ్యలకు సీతానగరంలో (రాజమండ్రి) జన్మించిన పానుగంటి వివిధ సంస్థానాలలో దివానుగా, పిఠాపురం సంస్థాన ఆస్థాన కవిగా కొనసాగారు. పత్రికల్లో ధారావాహికంగా ప్రచురితమైన 'సాక్షి' (6 సంపుటాలు) వ్యాస పరంపర ఆయనకు పెద్ద పేరు గడించింది. నాటక రచనా శిల్పంలో కూడా అద్వితీయమైన ప్రతిభను ప్రదర్శించారు. రాధాకృష్ణ, విప్రనారాయణ, ప్రచండ చాణిక్యము, కఠాభరణము, ముద్రిక, పూర్ణిమ మున్నగు పెక్కు నాటకాలు రచించారు. నాటక రచనకు అభినవ కాళిదాసు, ఆంధ్రాషేక్స్‌పియర్ బిరుదులు లభించగా – వచన రచనకు ఆంధ్రా ఎడిసన్ అన్న బిరుదు పొందారు. భాషావిషయంలో గ్రాంథిక భాషను అభిమానించినా, సంఘ విమర్శలో ఆయన ఆధునికుడుగా గోచరిస్తారు. నాటకాలలో, సాక్షివ్యాసాలలో సంఘంలోని అవినీతిని, మూఢ నమ్మకాలను దుయ్యబట్టారు. నాటకాలలో గీత పద్యాలకు, హాస్యరసానికి ప్రాధాన్యం ఒసగారు. ప్రౌఢమైన సౌష్ఠవమైన గ్రాంథిక భాషా శైలికి 'సాక్షి' వ్యాసాలు తార్కాణాలు. తెలుగు భాషా సారస్వతాభిమానానికి ప్రతిబింబాలు.

౨. స్వభాష

- పానుగంటి లక్ష్మీనరసింహారావు

నేను సభాభవనమున కేగుసరికి జంఘాలశాస్త్రి దేనిని గూర్చియోకాని యుపన్యసించుచున్నాడు. అదివఱకేమాటలు చెప్పియుండెనో నే నెరుఁగనుగాని నేను సభాప్రవేశ మొనర్చినపిమ్మట నిట్లు చెప్పెను.

'మీ కసత్యముగాఁ దోఁపవచ్చును-నాయనలారా! అసత్యము కాదు. ఆయన యాంధ్రుఁడు - కృష్ణాతీరమునఁ బుట్టినవాఁడు. శుద్ధ శ్రోత్రియకుటుంబములోని వాఁడు. ఎం.ఏ.బి.ఎల్., పరీక్షలలో నుత్తీర్ణుఁడైనవాఁడు. న్యాయవాదివృత్తిని నిరాఘాటముగా నిరంకుశముగా నిర్వర్తించుచున్నవాఁడు. అట్టివానినాహ్వానించి యాదరించి యాంధ్ర బాలకసంబంధ మగు నొక్కసభలో నధ్యక్షుడుగా నుండుఁ డని పాఠశాలా బాలకులు ప్రార్థింపగా నుండెదనని యొప్పుకొని తుదకుఁ జేసినపని యిది! 'నా కాంధ్రభాష రాదు. నే నాంధ్రమున మాటలాడలేను. మీ యిష్టమగునెడల నాంగ్లేయభాషలో మాటలాడుదును' అని యర్థమిచ్చుమాటల నాతఁ డాంగ్లేయభాషలోఁ బలికెను. తెల్లఁబోయి తెలివి తప్పి నిల్వుగ్రుడ్లు వైచికొనిన పసిబాలు రప్పుడేమి చేయఁ గలరు? కొంతసేపు మాటలాడలేక నిరుత్సాహులై దీర్ఘనిశ్వాసము లిచ్చి 'మీ యిష్టమెటులో యటులే' యని యనిష్టతతోఁ బలికిరి. అప్పు డాయధ్యక్షుఁ డొక్క పావుగంటకాల మాంగ్లేయభాషలో దేహసాధన విషయమును గూర్చి యుపన్యసించి తన యుపన్యాసమున కుపసంహారమును జెప్పి 'విల్ ఎనిజంటిల్మెన్ కం ఫార్వర్డు టు స్పీక్' అని సభవారిని బ్రశ్నించెను. బాలకులు భగ్నోత్సాహులై యుండుటవలనఁ బ్రత్యుత్తర

మీయక యూరకుండిరి. అయ్యా నేను మాటలాడెదనని లేచితిని. 'మనము చూడనేలేదయ్యా! మన జంఘాలశాస్త్రియే యయ్యా' యని వారిలో వారనుకొనుచు 'ఎప్పుడు వచ్చినారు? ఎక్కడి నుండి వచ్చినారు? ఈనడుమ రెండు పర్యాయములు కాఁబోలు 'సాక్షి' రాలేదేమి? మీరు సభకు వచ్చిన తరువాతనైనను మాకుఁ దెలియఁ జేయ నక్కఱ లేదా? ఏమి న్యాయమయ్యా.' యని యేవేవో యగ్రము నంతయు లేని యనురాగసూచకములగు నసందర్భాలాపములాడి న న్నుపన్యాసరంగమునొద్దకుఁ దీసికొని పోయిరి. నే నిట్లుపన్యసించితిని.

'హరహరా! మహాదేవశంభూ! మహాదేవశంభూ! ఎంతమాట వినఁబడెను. ఎంతమాట వినఁబడెను. నాయనలారా! మీరుకూడ వింటిరి కాదా? నే నొక్కఁడనే వింటినా? ఏదో విని మఱియేదో యని భ్రమపడితినా? నాయనలారా! అట్లే యగునెడల నదృష్టవంతుఁడనుగదా! నే నొకఁడను మాత్రమే యదృష్టవంతుఁడనా? ఆంధ్రులంద ఱదృష్టవంతులే కదా? ఆంధ్రదేశమంతయు నదృష్టవంతమైనదేకదా? ఆంధ్ర దేశమునఁ బుట్టి, యాంధ్ర మాతాపితల కుద్భవించి, యాంధ్రసంప్రదాయము లభ్యసించి, యాంధ్ర జాతీయతత్త్వ సంపత్తిచే నభివృద్ధినొంది, యాంధ్రభాషలోఁ బండితులై యాంధ్ర గ్రంథముల రచించి యాంధ్ర భాషాదేవి కమూల్యాలంకారములుగా నర్పించి, యాంధ్ర దేశసేవ నాచరించి తమ యంగములు నసువులు నాత్మలు పవిత్రములుగఁ జేసికొని, ప్రాణములను బాసి పరమపదమును జేరిన ప్రాచీనాంధ్రులందరు కూడ నదృష్టవంతులు కదా? అయ్యయ్యో! అంత యదృష్టము పట్టునా? పట్టదు. వింటిని–నిజముగా వింటిని–నాది భ్రమము కాదు తాత్కాలికోన్మాదము కాదు. మీరు గూడ నాతోపాటు వింటిరి. వినక యేమి చెవులు చిల్లులుపడినవా? మతి మందగించినదా! వినక పోవుట కూడనా? గుండెలు పగిలిపోవ వింటిమి–మనస్సు మండిపోవ వింటిమి–సిగ్గు చిమిడిపోవ వింటిమి–ప్రాణములు పైకెగిరిపోవ వింటిమి. నాయనలారా! 'బ్రదికియుండిన సుఖములు పడయవచ్చు' నని కవి చెప్పినాఁడే ఇంకను జీవించియున్నందుల కిదియా ఫలము–ఇదియా సుఖము.

ఆహోహో! ఇంతవఱకు జీవింవకుండ నిదివఱకే దేహములు చాలించుకొనిపోయిన దేశీయులు దివ్యభాగ్యాన్వితులు కారా. వారిట్టి మాటలను వినియుండకపోవుట వలన వారి భాగ్య మింతంత యనవచ్చునా? మాటయన్న మాటయా? మాణిక్యముల మూఁట–మౌక్తికముల పేట–మకరందప్రవాహపుఁ దేట–పరబ్రహ్మమునుండి ప్రణవము బయలుదేఱినట్లు బయలుదేరినదే. ఆహోహో! ఏ మని? ఏమని? మన యధ్యక్షభగవానుని యాలాపకలాపమేది; వారు సాయించిన శ్రీసూక్తియేది; వారి యాస్యగహ్వరము నుండి యవతరించిన యాగమ సూత్రమేది? చెప్పనా? ఆంధ్రుఁడు వచింపఁదగినదికాదే? చెప్పనా? చెప్పక తప్పునా? మన యగ్రాసనాధిపతి దేవుని కాంధ్రభాష రాదఁట–ఆయన యాంధ్రమున మాటలాడనే లేరఁట. అయ్యయ్యో? ఆంధ్రమున మాటలాడలేకపోవుట యేమి? మూఁగవారు కారే–నంగినంగి మాటలవారు కారే–మెమ్మె పెప్పె యనువారుకారే–ఆంగ్లేయ భాషా పండితాగ్రగణ్యులే–బర్కు సిసిరో డెమాస్థెనీసు గ్లాడ్స్టనిత్యాది మహావక్తృవావదూకతావైభవమును గబళించి, నమలి, చప్పళించి, మ్రింగి, జీర్ణించుకొని రక్తమాంసములఁ గలుపుకొనినవారే. ఇదిగాక బి.ఎల్. పరీక్షలోఁ గడతేరి, కాలాంబర కవచధారియై న్యాయమూర్తుల యెదుటఁ గాకిని గ్రద్ధను, గ్రద్ధను గాకిని జేయఁజాలిన కర్కశతర్క వాగ్వాహినీ మోహినీకరణ దక్షులే. అట్టి వాగ్ధోరణీధీరులగు వీర లాంధ్రమున మాటలాడ లేకపోవుటయేమి? లేకపోవుట యనఁగా నాకేమో బోధపడలేదు. మ్యావు మని కూయలేని పిల్లి య్చొటనైన నుండునా? కిచకిచలాడలేని కోఁతిని మీ రెచటనైనఁ జూచితిరా? ఈఁత రాని కప్ప యేదేశమందైన నుండునా? పుట్టగానే క్యారుమనలేని బిడ్డ చచ్చిన దనుట కేమైన సందేహమా? ఆంధ్రదేశమునఁ బుట్టిన పక్షులైన ననవరత శ్రవణమున నాంధ్రమున మాటలాడు చుండఁగా–అయ్యయ్యో! మనుజుఁడే–అంత మనుజుఁడే–ఆంధ్ర మాతాపితలకుఁ బుట్టినవాఁడే–ఆంధ్రదేశీయ వాయు నీరాహార పారణ మొనర్చినవాఁడే–అధమాధమ మారు సంవత్సరముల యీడువఱకైన నాంధ్రమున మాటలాడిన వాఁడే–అట్టివాఁ డాంగ్లేయభాష నభ్యసించినంత మాత్రమున నాతనిని మాటలాడకుండఁ జేసినది అశక్తికాదు. అనిష్టత–అసహ్యత–అది శిలాక్షరమైన మాట.

మాటలాడుట కిష్టమేల లేకపోవలయును? తెలుఁగు బాసయంత దిక్కుమాలిన బాస లేదనియే యీ యాంగ్లేయ తేజస్సు నమ్మకము. తెలుఁగు మాటలాడినవాఁడు విధము చెడినవాఁడు, విద్య రానివాడు, గౌరవములేనివాఁడు, గతిలేనివాఁడు, తెలివిమాలినవాఁడు, దిక్కుమాలినవాఁడు! ఆఁ ఆఁ ఆయన కట్టియభిప్రాయమున్నది. అట్లె కాకున్న యెడల మాటలాడకపోవుట యేమి? అయ్యయ్యో! తెలుఁగులో మాటలాడుట సిగ్గు సిగ్గు! అంత సిగ్గున కిది యేమంత యకార్యకరణము? రిఫ్రెష్మెంటురూములో గొడ్డు మాంసము తినుటయా? విస్కి త్రాగుటయా? సభలోఁ దూలి పడిపోవుటయా? అయ్యయ్యో? ఇప్పుడివి యకార్యములే కావు. ఇవియే యిప్పుడు తఱచుగా నిత్యవిధులగుచున్నవి. పట్టణములలో నేమి పల్లెటూళ్ళలో నేమి వానివైభవమును తఱచుగా వీక్షించుచున్నాము. వీని యన్నింటికంటే నాంధ్రము మాటలాడుట సిగ్గు సిగ్గు – తప్పు – నీచత – అధమత కులహీనత–స్పష్టముగా చెప్పితినా? అట్టి యభిప్రాయము మన యధ్యక్ష శార్దూలమునకు దేశీయుల దౌర్భాగ్యమున దాపురించినది. అందుచేత వా రాంధ్రమున మాటలాడలేదు. మాటలాడిన యెడల మైలపడుదుమేమో, సచేలస్నాన మాచరింపవలయునేమో, యజ్ఞోపవీత విసర్జన మొనర్పవలయునేమో, జీవప్రాయశ్చిత్తము చేయించు కోవలయునేమో యని యాయనకు భయము కాఁబోలు. నా వెఱ్ఱియే కాని, భాష పరమాసహ్యమైన వానికిఁ బ్రాయశ్చిత్తకాండమందు భక్తియుండునా? అదియు లేదు. ఇదియు లేదు. పుట్టుకనొసఁగిన మాతృదేవతను బూజింపనివాని కగ్రజునాజ్ఞయం దాదరమా? తండ్రినిదన్నిన తనయుఁడు మామగారి మొగమునకు మంగళపుటారతి యిచ్చునా?

కంఠాభరణ మనునాటకములోని నబాబుగారు 'తెలుగుబాస వట్టి గడ్డి బాస– ఉస్ మే రస్ నహిఁ ఔర్ జీవ్ నహిఁ యని యాంధ్రభాష నధిక్షేపించినారు. మాతృభాషాభిమానముచే మహమ్మదీయుఁ డట్లనిన ననుఁగాక–మనవారే యట్టి యభిప్రాయులై యుండుట మాతృద్రోహము కాదా? అయ్యయ్యో! ఇట్టి

మహాదురవస్థాగ్రగణ్యము-ఇట్టి మహాఘోరపాపము-మహీస్థలి నెచ్చట నైనఁగలదా? అయ్యయ్యో! మన భాషయే-మకరందబిందుబృంద రసస్యందనసుందరమగు మాతృభాషయే-మహానందకందళ సందోహ సంధాన తుందిలమగు మాతృభాషయే-కమ్రతకుఁ గమ్రత, కఠినతకుఁ గఠినత-వదలునకు వదలు, బిగికి బిగి – జోరునకు జోరు, నెదురెక్కున కెదురెక్కు-మందతకు మందత-ధాటికి ధాటియు-నన్నివన్నెలు, నన్ని చిన్నెలు-నన్నివగలు, నన్నివద్దికలు-నన్ని తళుకులు, నన్ని బెళుకులు-నన్నిహొయలు, నన్నియొయ్యారములు-గలిగిన మన మాతృభాషయే – వ్యాసమునకు నుపన్యాసమునకుఁ గవిత్వమునకు గానమునకు సంపూర్ణార్హత గల భాషయే-పైవారే యాభాషను బట్టుదలతోఁ బ్రయత్నమున నభ్యసింపవలసి యుండగా-మనవారే దానినంత యధమాధమముగాఁ జూచుట తగునా?

సరే. మీ రిట్టిభాషను బరిత్యజించి పైభాషను బఠించినారు-ఇన్ని మాన్యము లమ్ముకొని, యింతసొమ్ము వ్యయపఱచి, యిందఱ నాశ్రయించి, యింత చిత్తక్లేశమంది సంపాదించిన మీ యాంగ్లేయభాషా పాండిత్య మేమాత్రమో కనిపెట్టెదము. ఆంగ్లేయగ్రంథము లెన్నియో వ్రాయుచున్నారు. ఆంగ్లేయోపన్యాసములెన్నియో యిచ్చుచున్నారు. మీకేమాత్రము భాషా సౌకర్యము కలిగినది? ఏమాత్రపు భాషా సౌలభ్యము సిద్ధించినది? గ్రంథజ్ఞానశూన్యుఁడగు జన్మమాత్రాంగ్లేయునికి 'ఇంగ్లీషు యిడియం' లో నున్న సౌలభ్యములో సాఁబాలైన నర్ధశతాబ్ద మాంగ్లేయభాష నభ్యసించిన మీ కలవడినదా! సంపూర్ణమైన భాషోచ్చారణ సౌష్టవమైన బట్టు పడినదా! ఏల పట్టుపడును? పైభాష యెన్నఁటికిఁ బరభాషయే. మీ రేవో యాంగ్లేయ గ్రంథములను వ్రాయుచున్నారని యాంగ్లేయోపన్యాసము లిచ్చుచున్నారని విశేషజ్ఞులమని యనుకొనుచున్నారు కాఁబోలు. అవి యేమో యుపజ్ఞాసహితములగు వ్రాఁతలని వాగ్ధోరణులని యనుకొనుచున్నారు కాఁబోలు. అవి వట్టితలవిఱుపులు-చిలుకపలుకులు-కల్లకెంపులు-గాజుఱాలు. అవియన్నియుఁ బ్రతిఫలనములు, పాఠాంతరములు. అవియన్నియు మక్కికి మక్కులు, వెక్కిరింపులు, వానికి స్వతంత్రశక్తి

లేదు. వెన్నెముకబలము లేదు. వానిలో 'ఒరిజినాలిటి' అనునది లేదు. మీ లెక్క యేమి? మీ తలలపై దాఁటిపోయిన ధీమంతులకే లెక్క లేదు. 'పారడైజు లాస్టు' వ్రాసి యాంగ్లేయవ్యాస పీఠాధిపత్యమున కర్హుఁడనిపించుకొనిన మిల్టన్ వ్రాసిన లాటిను పద్యములు లాటిన్ భాషయే స్వభాషగాఁగల దేశీయకవులలో నధములగువారు వ్రాసిన పద్యములకుఁ దీసిపోవుచున్నవని వారి పరిశోధకులే వ్రాసినారు. మిల్టన్ లాటిన్ వ్రాఁతలకంటె మీ యింగ్లీషు వ్రాతలు ఘనములా? తల్లి స్తన్యముతోఁ గూడ నేభాష మనము త్రావుదుమో యా భాషలోనే మన మెన్నఁటికైనఁ గఠినప్రయత్న మొనర్చిన యెడల నుపజ్ఞాసహితమగు నుత్తమ గ్రంథమును వ్రాయఁగలము. కాని పరభాషలో నెన్నఁడును వ్రాయలేము. పరభాషలో నెన్నఁడును దద్భాషావేత్తలు మెచ్చునట్లు మాటలాడలేము.

మన రాజధానిలో నున్న యొక్క కాలేజిలో– 'వర్నాక్యులర్ సూపరిం టెండెంటు'గా సంస్కృతభాషాపండితుఁడగు నొక్క యాంగ్లేయుఁడు వచ్చియుండెను. అతఁడు 'యంబ్రహ్మ వేదాంత' మున్నగు శ్లోకములను 'అయాంబికుమీటరు'లోఁ జదువుట నే నెఱుఁగుదును. 'ది వెల్నోను టెలుగు స్కాలర్' అని ప్రఖ్యాతి నొందిన బ్రౌనుదొరగా రాంధ్రమున నేమాత్రపుఁ బఁడితులో మన మెఱుఁగక పోవచ్చును గాని యప్పటివా రెఱుంగరా? ఆంగ్లేయుఁడు పదునెనిమిది సంవత్సరములు సంస్కృత భాషను సంతత దీక్షతో నభ్యసింపనీ అభ్యసించినంత కాల మనవరత మననము ఊపిడి పెట్టనీ– 'హగుంసశ్యుచిష' న్మంత్రమును బొడుగు పొట్టి పలుకుబడి పరిపాటిని మాని–సిసలైన యుచ్చారణతోఁ జదువఁగలఁడేమో పరిశీలింపుఁడు. ఇఁక మీరు 24 సంవత్సరము లింగ్లీషుభాష నభ్యసింపుఁడు. 'ఇన్మెమోరియం' లో నున్నదని చెప్పఁ బడిన 'మ్యూజిక్' మీరు కనిపెట్టఁగలరా? అది వానివలనఁ గాదు. ఇది మీవలనఁ గాదు. వానినోటికది చిక్కదు– మీ చెవికిది యెక్కదు. పరభాషా పదముల కర్థము తెలిసినంతమాత్రమునఁ బరభాషా పాండిత్యము లభించినదని భ్రమపడకుఁడు. భాషలోని కళను బ్రాణమును తత్త్వము నాత్మను గనిపట్టవలయును. అది మీ కసాధ్యము.

తుదకిన్ని యీనాముల నమ్మి-యమ్మమెడలోని పుస్తెపూసలమ్మి-వంటయింటి పాత్రల నమ్మి-దైన్యపడి-వారములు చేసికొని-ముష్టియెత్తి సంపాదించిన-యాంగ్లేయభాషలోని పాండిత్యపుఁబస యీ రంగులోకి దిగినది. ఈవిధముగా బ్రద్దలైనది. స్వభాష యిదివఱకు మీచేతఁ జావనే చచ్చినది. మీగతి యెంత యుభయభ్రష్ట మైనదో చూచుకొంటిరా? మీరు వెచ్చించిన ధనములోఁ బడినశ్రమములో వినియోగపఱచిన కాలములోఁ బొందిన దైన్యములో నేడ్చిన యేడ్పులలోఁ బదునాఱవ వంతైన నక్కఱలేకుండ మీరు దేశభాషాపండితులై యుందురు.

స్వభాషను మీరు నేర్చుకొనుట కేమంత శ్రమమున్నది? అక్షరాభ్యాస దినమునుండియె మీరు స్వభాష నభ్యసించుచున్నారని యనుకొనవలదు. మీ తల్లికడుపులో నున్నప్పుడే నేర్చుకొనుట మొదలు పెట్టినారు. ఆమె భుజించిన పదార్థముల రసమును నాభీనాళద్వారమున మీలోఁబ్రవేశపెట్టుచున్నప్పుడే యాంధ్రభాషా జ్ఞానమును గూడ దానితో జోడించినది. తరతరముల నుండి వంశానుక్రమముగా మీ రక్తములో జీర్ణమై, మీ మాంసమునకు మాంసమై, శల్యమునకు శల్యమై, మెదటికి మెదడై మీతత్త్వముతో నైక్యమొందిన యాంధ్రభాషను, మీరిప్పుడు క్రొత్తగ నేర్చుకొనుటయేమి? ఉపాధ్యాయుఁ డైన నక్కఱలేకుండ గ్రంథములూరక చదువుకొనుచుఁబోయిన యెడల భాషాజ్ఞానసంపాదన మీ కెంతసేపు? నా కాంధ్రభాష రాదని మన యధ్యక్షుఁడు కంఠోక్తిగాఁ బలికినాఁడు. మా భాష మాకు రాదను ననర్థవాక్య మాంధ్రుని నోటనుండి వెడలఁదగదు. ఏజాతివారి నోటినుండియు నంతే. ఆంధ్రదేశము పుట్టి యెంతకాలమైనదో, ఆంధ్రజాతి పుట్టి యెంతకాలమయినదో, ఇట్టి యనుచితవాక్యము నేఁడు బయలు వెడలినది. అనుచిత మను మాట నిస్సందేహము. పోనిండు దీనికేమి? అనుచితతకు నసందర్భతకు - నవకతవకకు -ననేక సంవత్సరముల నుండి యలవాటు పడియేయున్నాము. భాష మీకు రాదేమి? అబ్బా! మీరేప్రయత్నము చేసినారని రాదనుచున్నారు? భాష తనంతతాను మీకు వచ్చుననియే యనుకొనుచున్నారా? మహమ్మదుగారి యొద్దకుఁ గొండ రాకపోయినప్పుడు మహమ్మదుగారు కొండయొద్దకు

వెళ్ళినారా లేదా? మీకు భాష రాకపోవుట భాషలోపమా? మీలోపమా? భాషను గొంచెము దీక్షతోఁ బఠించిన యెడల నది రానివాఁడుండునా? పఠింపకుండ భాష రావలయునన్న నది యంత పైపైన నున్నదా? భాష యందు మీకు నిర్లక్ష్యత యైనప్పుడు భాషకు మీయందభిమానముండునా? భాషాగ్రంథము మీకుఁ దలక్రింద నెత్తునకైనఁ బనికిరానప్పుడు భాషాజ్ఞానము మీతలలో నెట్లు దూరును? చదివినను భాషరాని వాఁడెవ్వఁడు? ఎవ్వఁడో, వ్రేలు మడఁచి యొక్కని పేరెత్తి చెప్పుఁడు. భాషలోఁ బుట్టి భాష నేర్చుకొని భాషరాక భ్రష్టుఁడైన ప్రపంచాతీత పురుషుఁడెవ్వఁడో చూతము. చూచి యథార్థముగ స్వభాషాజ్ఞానమున కర్హుఁడు కాని యద్భుతాజ్ఞానతత్త్వమే యగునెడ-నన్నయభట్టు కాలము నుండి యిప్పటివఱకున్న భాషా గ్రంథములన్నియు గట్టకట్టి బంగాళాఖాతములోఁ బారవేయుదము. మనకు రానిభాషతో మనకేమి పని?

అయ్యయ్యో? రవంతకష్టమైనఁ బడనక్కఱలేదా? నోరు మెదలుపనైన నక్కఱలేదా? 'క్రిమినల్ ప్రొసీజర్కోడ్' చేతఁ బట్టకుండనే మన యధ్యక్షశిరోమణికి శిక్షాశాస్త్రసిద్ధి యయినదా? 'ట్రాన్స్ఫర్ ఆఫ్ ప్రాపర్టీ' ఆక్టు తలఁగొట్టుకొని వల్లెవేసిన వారే-తారాశశాంకవిజయము రవంత చదువలేరా? సరదా తీరును. శబ్దజ్ఞానము వచ్చునే. ఊరకే రమ్మన్న నేదైనా వచ్చునా? అట్లెవ్వనికైన వచ్చినదా? కడుపు నిండుటకు నోటిలోఁబడినదానిని మ్రింగనైన వలదా? ఆమాత్రపు శ్రమమైనఁ బడనక్కఱలేదా? 'మెయిన్సు పీనల్కోడ్' మడతవేయుటలో మెదడు చింపుకొన్నవాఁడవే-మనుచరిత్రమున నొక్క యాశ్వాసమును విలాసముకొఱకైనను జదువుటకు నీ కోపిక లేకపోయెనా? తీరిక లేకపోయెనా? శక్తి లేకపోయెనా? బుద్ధి లేకపోయెనా? చంద్రబుల్లి నామూలాగ్రముగ నెఱుఁగుదువుకాని చంద్రమతి పేరైన నెఱుఁగవే! 'కన్నింగ్హామ్సు ఎవిడెన్సు' ఆక్టు వలన నీ కడుపే నిండును గాని కంకంటివారి రామాయణము వలన నీ మనస్సు నిండునే! 'జస్టిసు హోలోవే' గారి జడ్జిమెంటు నొప్పజెప్పఁగలవు కాని జనకచక్రవర్తి ప్రపంచమునకు బోధించిన నీతి నెఱుఁగవే? 'సివిల్ ప్రొసీజర్కోడు లేటెస్టు ఎడిషన్' కుఁ గర్తయెవ్వఁడో యెఱుఁగుదువు కాని సీతారామాంజనేయకవి

యెవఁడో యెఱుఁగవే? భారత భాగవతములను బఠింపని నీవు బారిస్టరు వైననేమి- ప్రభూత్తముఁడ వైననేమి? ఆంధ్రుడవై యేల పుట్టితివో నాయనా! నీవాంధ్ర దేశమున కెందులకోయి నాయనా! నాకు బోధపడక యడుగుచున్నాను. క్షమింపుము. నీ వే పుస్తకములను జదువనక్కఱలేదు. దినమున కొక్కసారి పావుగంట తెఱపిచేసికొని రాత్రి భోజనమైన తరువాత నిల్లాలిని బిల్లలను నీచుట్టు కూరుచుండఁ బెట్టుకొని తాంబూలచర్వణ మాచరించుచు నడుమ నడుమ నాన్కో ఆపరేషను ముచ్చటలఁ జెప్పుకొనుచు నాంధ్రపత్రికను జదువరాదా? నాలుగుమాసములట్లు చదువుము. నీ కాంధ్ర భాషాజ్ఞానమెంత వృద్ధియగునో. తెలుఁగు బాసలో నేదైనపస యున్నదని నీ కప్పటికిఁ దెలిసిన యెడల భాషా గ్రంథములను జదువవచ్చును. అందఱు తెలుఁగు మాటలాడవలసిన యిందఱిలో నీ వొక్కఁడ వింగ్లీషుతో మాటలాడితివి! కావు కావు మని యనవలసిన కాకులన్నిటిలో నొక్కకాకి కొక్కొరొకోయని యఱచిన యెడల మిగిలిన కాకులు దానిని ముక్కుతోఁ బొడిచివేయక మానునా? మేము నీవంటి యనేక ప్రకృతుల కలవాటు పడినవారము కావున సరిపోయినది. కాని లేకున్న నేమి కాఁ దగినది?

ఆంగ్లేయభాష యేల చదువుకొంటివని నేనధిక్షేపింపను. ఇంతకన్న నధిక జ్ఞానమును గూడ నీవాభాషలో సంపాదింపుము. నాకుమఱింత యిష్టము కాని నీ యాంగ్లేయ భాషాజ్ఞాన మెందులకో నీవెఱుగుదువా? ఆంగ్లేయభాషయే కాదు, ఇంక ననేక భాషలు కూడ నేర్చుకొనుము. నీవు సంపాదించిన పరభాషా జ్ఞానమంతయు నీ భాష నభివృద్ధిపఱచుటకే. నీ భాషను భాగ్యవత్తరము జేయుటకే-నీభాషను బరభాషా గ్రంథ ప్రశస్తాభిప్రాయములతో వన్నె పెట్టుటకే. ఆంధ్రుఁడవై యుండియు నాంధ్రభాషలో 'ఆ' యని నోరు మెదలుపలేనివాఁడవు కదా! నీ యాంగ్లేయ భాషా జ్ఞానమును దేశమున కెట్లుపచరింప దలఁచితివో చెప్పుము. నాయనా! నిన్ను గ్రంథములు వ్రాయుమని కోరుచున్నా ననుకొంటివేమో? నీవు వ్రాయునదేమి? పార్టీలనెత్తిని పేఁడ - ఏ గ్రంథమును నీవు వ్రాయవలదు - ఏగ్రంథమును

జదువవలదు. రేపటి నుండియే యాంధ్రపత్రిక నామూలాగ్రముగఁ జదువుచుండుము. తెలిపిలేదని సందేహించుచుంటివా? క్లబ్బులో గంటన్నర చీట్లాటకుఁ దెలిపియుండఁగా, టెన్నిసుకోర్టులో రెండుగంటల లోకాభిరామాయణమునకుఁ దెలిపియుండఁగా దేశభాషాపత్రికారాజమును జూచుట కొక్క యరగంట తెలిపి లేకుండునా? తెలిపి లేకపోయిన యెడలఁ జేసికో.

నాయనలారా! మన కింగ్లీషు మాటలతోఁ జెప్పినఁ గాని యే యంశము కూడ మనస్సున కెక్కదు. అట్టి యభ్యాసము చిరకాలము నుండి యస్తిగతరోగమై యున్నది. ఆయుర్వేదవైద్యుఁడు వచ్చి 'అయ్యా! కరివేపాకుపొడుముతోఁ బథ్యము పుచ్చుకొనుమని నీతోఁజెప్పఁగ నీ కామాట నచ్చదు. నాన్సెన్సు కరివేపాకు పొడు మెందులకయ్యా యని నీవా యాయుర్వేద వైద్యు నధిక్షేపింతువు. ధనియాలు 'డైజెషన్‌కు' మంచివి. మిరియాలు 'లివర్' మీద 'ఆక్టు' చేయును. కరివేపాకు 'గాల్ బ్లాడర్'కు సత్తువ నిచ్చునని యెవఁడో ఎల్.ఎం.పి మనవాఁడే చెప్పిన యెడల నీ కది శ్రుతి ప్రమాణము. నాయనలారా! మనమెంత లక్షాధిపతుల మైనను గోటీశ్వరులమైనను మన బ్రదుకులు ముష్టిబ్రదుకులు కాని మఱియొకటి కాదు. ఈ ముష్టిదేవులాటలో నింగ్లీషుమాటలు కూడ నెందులకు? ఆయేడుపేదో మాతృభాషతోడనే యేడ్చిన మంచిది కాదా? మన యేడుపు సహజముగాను సాఫుగాను స్వతంత్రముగాను నుండునే . ఏడుపులోఁగూడ మన కస్వతంత్రత యేమి కర్మము? అందుకు సర్వస్వ స్వతంత్రులము నంపూర్ణాధికారులమే కాదా? ముష్టి బ్రాహ్మణుడు నీ యింటికి వచ్చి యాయావారపుబ్రాహ్మణుఁడ నయ్యాయని యఱవక 'బాయ్, రూములోనున్న పాట్‌లో రైస్ యేమైన నున్నదేమో, కైన్‌డ్లీ గెటిట్ హియర్; థాంకు యూ ఇన్ ఆంటిసిపేషన్' అని నీతో సంభాషింపఁగ, నీ వాతనికి ముష్టి వేయుదువా? మూఁతిమీఁద నీడ్చి యొక్కటి వేయుదువా? అలాగే మన ముష్టిలోని యీ యింగ్లీషుమాటలు కూడ నంత గౌరవప్రదములే యని నిశ్చయముగా నమ్ముడు-నమ్ముడు.

నాయనలారా! మీసభాకార్యక్రమము నంతయుఁ జెడఁగొట్టితిని. నన్ను మీరు క్షమింపవలయును. మరి యెప్పుడైన నీసభ తిరుగఁ జేసికొనుఁడు. (అప్పుడు మీరధ్యక్షులుగా రావలయునను కేకలు). నాయనలారా! అటులే-మీరంత యాంధ్రభాషాభిమానముతోఁ బ్రవర్తించుచున్నప్పుడు నాచేతనైన సేవను నేను జేయనా? ఇఁక నాల్గుమాటలు మాత్రము చెప్పుదును. ఆంధ్రభాష బొత్తిగ రానివానితోడనే కాని మీ రాంగ్లేయమున నెన్నఁడు మాటాడవలదు. మీరు మీ మిత్రుల కుత్తరము వ్రాయునప్పుడు 'డియర్ఫ్రెండ్'తో నారంభించి 'యువర్సు ట్రూలీ' తోఁ బూర్తిచేయక 'బ్రహ్మశ్రీ' తోడనో 'మహారాజశ్రీ' తోడనో యారంభించి, 'చిత్తగింపవలయును'తో బూర్తిచేయవలయును. ఆంధ్రభాష వచ్చినవాని కాంగ్లేయభాషతో నుత్తరమెన్నఁడును వ్రాయకుఁడు వ్రాయకుఁడు. ఈ నియమములను మీరు చేసికోఁగలరా?(అభ్యంతరమేమి యనుకేకలు) నూతనముగా నచ్చుపడుచున్న యాంధ్రగ్రంథము లెల్లను విమర్శబుద్ధితోఁ జదువుఁడు.తొందరపడి యధిక్షేపింపకుఁడు. శనివారాదివారములందు రాత్రి తప్పకుండ రెండు గంటలు పురాణపఠనమునఁ గాలక్షేపముచేయుఁడు. స్వభాషాపత్రికలను జూడకుండ నావలఁ బాఱవేయకుఁడు. ఆంగ్లేయభాషా గ్రంథములు మీరు చదువుచున్నప్పుడు వానిలో 'మన భాష కక్కఱకు వచ్చునంశము లేమియా' యని తదేకదృష్టితోఁ జూచుచు వానిని మెదటిలోఁ బదిలపఱుపుఁడు'.

మీరీ నియమము లొనర్చుకొని పట్టుదలతోఁ బాటించి పుట్టుక చేతనే కాక, బుద్ధిచేత, స్వభావముచేత, యోగ్యతచేత, నాంధ్రులని యనిపించుకొనుఁడు."

10. అక్కిరాజు ఉమాకాంతం

(1889-1942)

గుంటూరు జిల్లా గుత్తికొండలో లక్ష్మమ్మ, లక్ష్మీనారాయణలకు జన్మించిన ఉమాకాంత పండితులు మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల అధ్యాపకులుగా, త్రిలిఙ్గ పత్రిక సంపాదకులుగా కొనసాగారు. వంగదేశంలో సంస్కృత వ్యాకరణము, తర్కశాస్త్రము అభ్యసించి విద్యాశేఖరుడైన ఈ కవి ఆంగ్లభాషలో కూడా నిష్ణాతుడు. టిప్పుసుల్తాను, షేక్స్‌పియర్ నాటక కథలు, త్రిలింగ చిన్న కథలు, నైషధతత్త్వ జిజ్ఞాస, నేటి కాలపు కవిత్వం మొ॥నవి వీరి రచనలు. ఆంధ్ర చంద్రాలోకవివరణము, సంస్కృత వ్యాకరణ ప్రదీపము, తెలుగు భాషా వ్యాకరణము ఆయన వ్యాకరణాలంకార శాస్త్ర పరిజ్ఞానానికి నిదర్శనలు. సంప్రదాయవాది అయిన ఉమాకాంతం గారు 'నేటి కాలపు కవిత్వం' (1928)లో భావకవిత్వాన్ని తీవ్రంగా నిరసించారు. సరళ సుందరమైన వ్యావహారిక భాషలో తర్కయుక్తంగా కొనసాగిన ఈ గ్రంథం నవ్య కవిత్వం లోని గుణాలను గ్రహింప లేకపోయిందన్న కొందరి విమర్శలకు గురి అయింది.

10. దేశభాషాస్థానము

- అక్కిరాజు ఉమాకాంతం

"Neither English nor any foreign Language (tongue) appears to have the slightest chance of becoming the vernacular speech of any portion of the inhabitants of Southern India. The indigenous Dravidian languages which have maintained their ground for more than two thousand years against sanskrit, the language of a numerous powerful and sacerdotal race may be expected to resist successfully the encroachments of every other tongue".

- Bishop Caldwell

(దక్షిణ హిందూదేశము నందలి జనులలో నే భాగపువారికి నింగ్లీషుగాని మఱి యేదైన బరభాష గాని దేశభాష యగుట కవకాశము కాన్పింపదు. మతాచార్యులుగ నధికారవంతులుగ నుండిన యార్యుల సంస్కృతము తోడనే రెండు వేల సంవత్సరముల నుండి పోరాడుచు స్వపదభ్రష్టములు కాని ద్రావిడ భాషలు మరియొక విదేశ భాషకు జోటిచ్చి తా మదృశ్యములగునని తలంపరాదు.)

మనదేశము (తెలుగు దేశము) నందిప్పుడు మూడు భాషలు పోరాడు చున్నవి. అవి సంస్కృతము, తెలుగు, ఇంగ్లీషు. సంస్కృతము మనబుద్ధి కందరాని పూర్వకాలమున నార్యులు వ్యవహరించిన భాష. ఇంగ్లీషు విదేశీయులైన మన ప్రభువుల భాష. తెలుగు మనభాష. కేవలము సంస్కృతము చదువుకొనిన యాతనివద్దకు వెళ్ళి 'ఏభాషయందు మన మెక్కువ యభిమానము చూపవలయును? ఏది వృద్ధి యగుటకు మనము పాటుపడవలెను? అని యడుగుడు.'

"నాయనా! నామాట లెందుకు పనికొస్తాయి? సంస్కృతం దేశభాష. దాన్ని చూచేవాడే లేడు. ఈ నడమంత్రపు భాషలన్నీ యిప్పుడొచ్చాయి. ఇవ్వన్నీ పొట్టకూటిభాషలుగాని వాట్ని చదువుతే ఒక మోక్షమున్నదా ఒక ముక్తి వున్నదా!" అని చెప్పును. ఇంగ్లీషు పండితునడుగుడు. " I love my mother tongue more than anything else and I believe in the statement that vernacular should be made the medium of thought in our country". అని ఇంగ్లీషులోనే చెప్పును. మరియొక ఘనుడు "Why do you trouble yourself with the insignificant vernaculars which are going to disappear within a quarter of a century?" అని యీసడించును. శాస్త్రుల వారి కంటికి దెలుగొక భాషయే కాదు. తెలుగు వ్రాయుట, తెలుగు మాటలాడుట మఱచిన వారు కడపటి యిద్దరు మహానుభావులు. ఈ మూడు తరగతుల మనుష్యులకే మన తెలుగువారిలో జదివికొనిన వారని పేరు.

సంస్కృతమా? తెలుగా? ఇంగ్లీషా? మనకిప్పుడు ప్రధానము అనునది యొక యనల్ప ప్రశ్నగా నున్నది. 'హిందూదేశమున నైకమత్యము కలుగవలయునేని నేకభాషనే జనులుపయోగింపవలయును. అందరకును సమానమైనది సంస్కృతమే కావున నిదియే హిందూదేశమునకును సామాన్యభాషగా నుండవలయునని కొందఱు వాదించుచున్నారు. జనసంఖ్యలో జాలా భాగమునకు హిందీ తెలియును గాన హిందీయే సామాన్యభాషగా నుండవలయునని కొందరందురు. 'అదికాదు, ఇదికాదు ఇంగ్లీషే మనకు సామాన్యభాషగా నుండవలయు'నని మఱికొందరనుచున్నారు. కాని యివి అన్నియును గేవల భావప్రప్రంచంబున మెలంగువారి యూహలు. బిషపు విల్కిన్సుమొదలగు పాశ్చాత్యపండితులు కొందరిట్లే తమ గదులయందలి పడకకుర్చీలలోఁ గూర్చుండి సర్వప్రపంచ సామాన్యభాషలను గూర్చి కలవరించిరి. మాక్సుమూలరునకు గూడ నీమైకము సోకినట్లే తోచుచున్నది. కలలు నిజమగుదినములు వచ్చినప్పుడు మనదేశభాషలన్నింటికి బదులొక వింతభాష యాదేశముగా వచ్చునేమో యూహింపజాలను.

వైదిక భాషనుండి సంస్కృతము, సంస్కృతము నుండి గౌడభాషలు, నుత్పన్నములైనవిధమున మొదటి వ్యాసములో గన్పరిచితిని. ద్రావిడభాషలు మార్పుచెందిన విధము కూడ గొంత వివరించితిని. హిందూదేశమునం దీభాష లుండక తప్పవు. ఇవి స్వాభావికముగ నేర్పడినవి. వీనిని దీసివేయ మనుష్యుడు సమర్థుడు కాడు. ఇది మూఢ విశ్వాస మందురా? కాదు. తర్కసాధ్యంబు. ఒకవేళ రాజశాసనముచే హిందూదేశమున కంతటికి నొక్కభాషను దేనినైన బ్రవర్తింపఁజేయఁ జూచిన యెడల నా భాష కొన్ని తరములు గడచునప్పటికి వివిధము కాక మానదు. స్వరభేదముచేత, వస్తుభేదము చేత ననేకములైన మార్పులు కలుగక మానవు. అప్పుడు ముల్లుదీసి కొఱ్ఱుడిచిన చందమగును. ఏవో యమానుష తంత్రములు పన్ని మహాశక్తితో నేక భాషను సుస్థిరముగా జేయగలరనుకొనుడు. మనకవుల గానములు, పూర్వుల చరిత్రలు కోల్పోవుట యెంత యపాయకరము? ఈ యపాయము సంభవింప గూడదని సంభవింపదని నమ్మవలసి యున్నది.

భారతమాత మహాక్షమావతి. గ్రీకులు, హిందూసిథియనులు, హూణులు మన హిందూదేశమున దండయాత్రలు సల్పిరి. మహ్మదీయులు మొఘలులు చిరకాలము రాజ్యము చేసిరి. ఒకజాతివా రేదేశమునైన నాక్రమించుకొన్నప్పుడు బలహీనులైన యా దేశవాసులపైఁ దమభాషలను, మతమును విధించుటకు బ్రయత్నించుట మనము చరిత్రయందు చూచుచున్నాము. అది మనుష్యునికి స్వాభావికము. ఆర్యు లనార్యులమీదను, మహ్మదీయులు హిందువుల మీదను తమ భాషామతములను విధించుటకు జేసిన యత్నములు హిందూదేశచరిత్ర చదివినవారందరు నెరుగుదురు. కాని ఈ ప్రయత్నములు మతముమీద సాగినట్లు మన భాషమీద సాగలేదు. ఆర్యులు తమ మతమును మాత్ర మనార్యులలో గొంతవరకుఁ జొప్పించిరి. భాషను జొప్పింప గలిగిరా? లేదు. లేదు. 'కావలసిన యెడలఁ గొన్ని పదములు మాత్రము తీసికొందము. అవసరమైన యెడల నెత్తిని బెట్టుకొని గౌరవింతము. కాని నిన్ను మా స్థానములోని కేనాటికి రానీయము' అని ద్రావిడభాషలు

సంస్కృతము నెదిరించి యాపినవి. వరరుచి ప్రాకృత వ్యాకరణ నిర్మాణమునందును, గుణాఢ్యుని బృహత్కథారచన యందును దేశభాషలకును సంస్కృతమునకును జరిగిన పోరాటమును గనుగొనవచ్చును. అనార్యులు కొందఱింకను సంస్కృత భాషా సంపర్కములేని తమ మాతృభాషనే వాడుకొనుచున్నారు. తమిళభాషా వ్యాకరణము సంస్కృతమున కిప్పటికి నేమాత్రము చోటిచ్చుచున్నది?

మహ్మదీయులును దమ మతమును గొంతవఱకు నెలకొల్పిరి కాని యేడెనిమిది వందల సంవత్సరములు ప్రభుత్వము చేసినను మన భాషాసత్వములు వినాశనము చేయఁగలిగిరా? లేదు. దానికి బదులుగ మన పల్లెటూళ్ళయందలి పీరుసాహెబులకు, జానుసాహెబులకుఁ దెలుఁగే మాతృభాష యగుచున్నది. ఐనదని కూడఁజెప్పవచ్చును.

ఎఱుకల, కోయ, సవర, లంబాడి మొదలగు నడవిజాతులవారు నాగరికతను బొంది జనులలోఁ గలిసిమెలిసి యుండుకాలమున వారి భాష లాయాప్రాంతముల యందలి ప్రధాన భాషలో గలిసిపోవును గాని యిదివరకే నాగరికతను బొంది దాదాపు రెండు కోట్లమంది జనులేకదేశస్థులై వ్యవహరించుచున్న మన తెలుగు బాసవంటి బాసలు మాత్రము దేనిలోను గలసిపోజాలవు. సుస్థిరములుగా నాఁటికొనిన దేశభాషలకు బరభాష లాదేశములు కానేరవు. ఇంగ్లీషునకింత రాజాదరణము కలిగియుండినను మనదేశమునం దిది స్వల్పసంఖ్యాకులైన జనులలో మాత్రమే వ్యాపించియున్నది. 1811 వ సంవత్సరపు జనాభా ప్రకారము తెలుగుదేశములో 200 మందికొక్క డింగ్లీషు తెలిసిన వాడున్నాడు. ఈ కొద్దిమందిలో నాల్గవ తరగతి వరకు జదివి చాలించినవారు మొదలు యం.ఏ. పరీక్షయందారి తేరినవారు పర్యంతము నందరు చేరి యున్నారు. ఈ కొలదిమందిలోనైన నీ యింగ్లీషెంతవఱకు ఫలప్రదమైనది? అని చూచినచో నిరాసయే కలుగుచున్నది. ఉద్యోగము, గౌరవము, కీర్తి వీనికొఱకు గాక దేశహితార్థము విద్యనభ్యసించువారు గాని విద్యను వినియోగించువారు గాని మనదేశమునందు నల్వురైదుగురైన గలరో లేరో యనుమానమే.

రాజకీయ వ్యవహారములు తెలుసుకొనుటకు ప్రభువుల భాషను నేర్చుట మనకు మహ్మదీయుల కాలమునుండి యలవాటైన పనిగనే యున్నది. కాని జీవితమంత మేధావంతులు పరభాషలోఁ గడపుట దేశమునకు శ్రేయస్కరము కాదు. జీవితమంత పరభాషయందే గడపిన కొందఱు మహానుభావులకు దేశభాషయన్నఁ దృణప్రాయముగ నున్నది. దానిపై ద్వేషముకూడ కొందఱకు గలుగుచున్నది. చెన్నపురి పచ్చయ్యప్ప కళాశాలలోఁ బ్రకృతిశాస్త్ర పండితులుగా నుండి గొప్పపేరు పొందిన లక్ష్మీనరసునాయుడుగారి వంటి శాస్త్రవేత్తల పరిజ్ఞానము మాతృదేశమున కజాగళస్తనముగా నున్నదిగదా యని చింత కలుగుచున్నది.

జనులకు పరభాషలయందు శాస్త్రజ్ఞానము వర్ధిల్లనేరదు. అది ఫలవంతమును గాదు. సంస్కృతము వ్యవహృతభాషగా నత్యున్నత దశయందుండిన కాలమున దర్కవ్యాకరణాది శాస్త్రంబులు బయలుదేఱినవి. నూతన సిద్ధాంతములు పుట్టినవి. పూర్వ పక్షములు వెంబడించినవి. సంస్కృతము వాడుకనుండి తప్పిన తరువాత జనించిన నూతన శాస్త్ర మొక్కటి వ్రేలుమడిచి చూపుఁడు. ఇప్పటి పండితులా శాస్త్రములను జదివి గర్వించి యొకరితో నొకరు కలహించుట తప్ప శాస్త్రచరిత్రమున కొక్క పుటయైనఁ గ్రొత్తగఁజేర్చిన వారొకరేనిఁ గలరా? ఇఁక ఇంగ్లీషు వంటి పరభాషల యందు మనము స్వతంత్రించి శాస్త్రమును విస్తరింపఁ జేయఁగలమా యని విచారింపనేల? ముమ్మాటికినిఁ జేయఁజాలము. కావున విద్య మనకు దేశభాషయందే యుండవలయును. పాశ్చాత్యుల ప్రకృతి శాస్త్రముల జ్ఞానము జనులయందు దేశభాషల మూలముననే వ్యాపింపవలయును. దేశభాషదే ప్రధానస్థానమని మనము గ్రహింపవలసి యున్నది. సంస్కృతమునకు బ్రధానస్థానము చాలాకాలము క్రిందటనే పోయినది. పాఠశాలలయం దిప్పుడింగ్లీషు ప్రధానముగా నున్నది. ప్రధానస్థానము నాక్రమించవలసినది దేశభాషయేకాని యింగ్లీషు కాదు. అయితే యుండవలసిన గ్రంథములన్ని దేశభాషయందేర్పడిన తరువాత దానికిఁ బ్రధాన స్థానమీయవలయునా? లేక యిచ్చిన తరువాత నేర్పడునా యని విచారింపవలసి యున్నది. ఇతర దేశభాషా

చరిత్రల నవలోకించినచో భాషలన్ని మొదట ప్రధానస్థానము వహించియుండ పిమ్మట సమగ్రములైనట్లు తెలియఁగలదు. జపాను భాష యివ్విధమునఁగాదా వర్ధిల్లినది. ప్రభువు లీధర్మసూక్ష్మమును గ్రహించి మన దేశభాషను ప్రధానముగఁ జేయుదనుక మనము చేతులు ముడిచుకొని యూరకుండరాదు. భాషకేవిధమైన యపాయములు వచ్చుచున్నను వెంటనే వానిని నివారించు చుండవలయును. గరుడాచల నాటకము, కుసలాయికములలో నున్నట్టి యపభ్రంశపు గూఁతలు గలకొన్ని గ్రంథములు విద్యార్థులు పారాయణము చేయవలసిన గతి సంభవించినది. ఇంగ్లీషు వ్రాయుట, యింగ్లీషు మాటలాడుటయే గౌరవచిహ్నమైనది. ఇట్టి మహాపాయములు మన భాషకు సంభవించినవే యని యధైర్యము చెందనక్కరలేదు. తగిన ప్రయత్నములు చేసినచో నీ ముప్పులు తొలఁగిపోఁగలవు.

ఉద్గ్రంథములు, శాస్త్రములు తెలుగులో రచింపవలసియున్నది. కొలఁది దినముల క్రిందటనే సుమతిశతకము సంస్కృతములోనికి మార్చిన యతనిని నేను స్వయముగ నెఱుఁగుదును. ఇట్టి నిష్ప్రయోజక కార్యములు మాని మంచి గ్రంథములు తెలుఁగులోనే వ్రాయఁ గడంగవలయును. ఈ మధ్యమునఁ దెలుఁగుదేశమును గుఱించిన యొక పుస్తకమును గుంటూరిలో నొక రింగ్లీషు భాష యందు వ్రాసిరఁట! వీరి భాషాభిమానము, దేశాభిమానము స్తుతిపాత్రములు! తెలుఁగువారందఱు చదువవలసిన యా గ్రంథమును దెలుఁగులో వ్రాయకుండ స్వల్పప్రయోజనమును బురస్కరించుకొని యింగ్లీషులో నేల వ్రాయవలయునో తెలియకున్నది. ఆంధ్రోద్యమమును గూర్చి తెలుఁగువారి యెదుట నింగ్లీషులోఁ గొంద ఱుపన్యాసము లిచ్చుచున్నారఁట! ఈ దురభ్యాసములు మనవారియం దింక ఎన్నిదినము లుండునో తెలియదు. ఒకప్పుడు తెలుఁగు వ్యాకరణములు సంస్కృతమందును దెలుఁగుకవుల చరిత్రము లింగ్లీషునందును వ్రాయుచుండిరి. ఆ కాలము పోవుచున్నదని దృఢవిశ్వాసము కలిగియున్నాను. అంధకారము విరియుచున్నది. తూర్పురేఖలు కాన్పించుచున్నవి. దిఙ్మండలమునందు వెలుఁగు పొడకట్టుచున్నది. ఆశాబింబ ముదయించుచున్నది.

(ఆంధ్ర భారతి III – 7, 1913 జనవరి)

11. గిడుగు వేంకట రామమూర్తి పంతులు

(1863-1940)

వ్యావహారిక భాషోద్యమ ప్రవర్తకులైన గిడుగు రామమూర్తి పంతులు శ్రీకాకుళం సమీపంలోని పర్వతాల పేటలో వెంకమ్మ, వీరరాజు దంపతులకు 1863 ఆగస్టు 23న జన్మించారు. గంజాం జిల్లాలోని పర్లాకిమిడిని స్థిరనివాసం చేసుకొన్నారు. 30 సం॥లు (1881-1911) పాఠశాల ఉపాధ్యాయులుగా, పర్లాకిమిడి రాజా కళాశాలలో చరిత్రోపన్యాసకులుగా పనిచేసిన గిడుగు రామమూర్తి ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా పర్లాకిమిడి ఒరిస్సా రాష్ట్రంలో విలీనమైన (1936) రోజు ఆస్థలాన్ని వదిలిపెట్టి రాజమండ్రికి తరలివచ్చారు. సంస్కృతాంగ్ల భాషలలో నిష్ణాతులైన గిడుగు సవర భాషను అధ్యయనం చేసి ఆభాషలో వ్యాకరణం, నిఘంటువు, వాచకాలు మొ॥నవి వ్రాశారు. ప్రాచీనాంధ్ర కావ్యభాషాసంప్రదాయాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొన్న రామమూర్తి గారు ఆధునిక యుగంలో వ్యావహారిక భాషా ప్రయోగాన్ని సమర్థిస్తూ దానికి ఉద్యమరూపం కల్పించారు. వాడుక భాష అవసరాన్ని విశదీకరిస్తూ పెక్కు వ్యాసాలు గ్రంథాలు రచించారు. గ్రాంథిక భాషలోని క్లిష్టతను నిరూపిస్తూ 'ప్రాదెనుగు కమ్మ', పండితులు సైతం ఆభాషా ప్రయోగంలో సఫలురు కాలేకపోయారని వాదిస్తూ 'ఆంధ్ర పండితభిషక్కుల భాషాభేషజం' ప్రాచీన కవుల వాడుక భాషా పదాలను ఉదహరిస్తూ 'బాలకవి శరణ్యం' మొ॥ గ్రంథాలు వెలువరించారు. 'గద్యచింతామణి'లో ప్రాచీన వచన రచనారీతులను ఉదాహరణ పూర్వకంగా పేర్కొన్నారు. 1919లో 'తెలుగు' మాసపత్రికను నెలకొల్పి భాషా సంబంధమైన వ్యాసాలు ప్రచురించారు. సంస్కరణ దృక్పథం కలిగిన రామమూర్తి గారు నిమ్నజాతుల కోసం పాఠశాలను నడిపారు. భాషా పరిశోధన కృషికి ఫలితంగా 'కైజరే హిందూ', రావు సాహెబ్, రావు బహద్దర్, శబరభాషా వాగనుశాసనుడు మొ॥ బిరుదులు పొందారు. సమకాలీన పండితుల భాషా ఛాందసాలను నిరసించి సజీవమైన భాషకు గిడుగు పిడుగు చేసిన సేవ ప్రశంసనీయమైనది. 1940 జనవరి 22వ తేదీన ఆయన పరమపదించారు.

11. నేటి తేట తెలుగు

- గిడుగు రామమూర్తి పంతులు

"అనావశ్యకములయిన నిర్బంధములను దీసివేసి భాషను సుసాధ్యముచేయుట పరమ ప్రయోజనకరము... భాషాభివృద్ధినిబట్టియే జనులనాగరికతయు నభివృద్ధి చెందుచుండును. కనుక జనులయభివృద్ధిని గోరు దేశాభిమానులందఱును ముందుగా నాంధ్రభాషను మంచిస్థితికి దీసికొనివచ్చుటకై ప్రయత్నింపవలెను. మనవారు దేశభాషలు మంచి స్థితిలో లేవాయని యడుగవచ్చును. లేవనియే మేము దృఢముగా చెప్పగలము... పండితులు తమ పాండిత్యమును కనబఱుపజూచుచున్నారే కాని జనులకు తెలివిని గరపుటకై లేశమయినను బ్రయత్నింపకున్నారు." కం. వీరేశలింగముపంతులుగారి బంగారపు పలుకులు.

మనదేశములో బ్రిటిషుగవర్నమెంటువారు సర్వజనసామాన్యముగా చదువు చెప్పించడానికి మొదలుపెట్టి రమారమీ అరవై సంవత్సరాలు అయినది. ఇంతకాలమూ పండితులు పాత తెలుగునే పుస్తకాలు వ్రాసి ఫస్టుక్లాసు మొదలుకొని ఎమ్.ఏ.క్లాసుదాకా చదివిస్తున్నారు. పండితులే తెలుగు పాఠాలు చెప్తుతున్నారు. పండితుల తెలుగు ఎంతమట్టుకు వృద్ధిపొందినది? ఈ పాత తెలుగు ఎంతమంది మాటాడగలరు? తెలుగువారిలో ఇంగ్లీషు పుస్తకముల వల్లనా, తెలుగు పుస్తకముల వల్లనా, వ్యాపించినంతమట్టుకయినా ఇప్పుడు విద్య వ్యాపించినదా? ఈ అరవై సంవత్సరములలో ఎంతమంది ఇంగ్లీషు అన్యభాష అయినా, చదవడము, వ్రాయడము, మాటాడడము కూడా నేర్చుకున్నారో చూడండి. పాత తెలుగు పండితులయినా పొరబాట్లు లేకుండా వ్రాయలేరే!

తెలుగు కాంపోజిషన్ గురించి సెనేటులో మొన్న మొన్న చర్చజరిగినప్పుడు ఏమన్నారు విద్యాధికార్లు? తెలుగు పరీక్షలో నెగ్గిన బి.ఏ.లు తెలుగున సలక్షణముగా ఒక కథ అయినా వ్రాయలేరట! మద్రాసుగవర్నమెంటువారున్ను తమ జి.వో.లో ఈ సంగతే చాటించినారు. ఇండియాగవర్నమెంటువారున్ను దేశభాషలలో విద్యవ్యాపించ వలసినంతమట్టుకు వ్యాపించలేదు అనిన్నీ, ప్రజలకు లోక వ్యవహారములో తెలివితేటలు కలిగించేవిద్యలు దేశభాషలలో చెప్పలేదు అనిన్నీ, ఇంతకాలమూ విద్యావ్యాపకమునకై చేసిన ప్రయత్నము, పెట్టిన ఖర్చు ఇంచుమించుగా వ్యర్థమైనది అనిన్నీ, ఇకమీదట వాడుకలో వున్న భాషలలోనే తెలివి కలిగించే విద్యలు నేర్పడానికి ప్రయత్నము చేయవలసినది అనిన్నీ, వ్రాసి రిజల్యూషన్ ప్రకటించి ఉన్నారు.

జనాభాలెక్కలలో వేసినట్టు, తెలుగున సంతకము చేయగల వారందరూ చదువువచ్చినవారే అని ఒప్పుకొన్నా, తెలుగువారిలో చదువుకొన్నవారు వేయింటికి 75 గురు మాత్రమే. అంటే, వేయింటికి 925 గురు తెలుగువారు సంతకమైనా చేయలేరు అన్నమాట. తెలుగువారి అందరిలో బ్రాహ్మణజాతివారు గదా విద్యాగురువులు. ఈ బ్రాహ్మలుతెలుగువారిలో నూటికి ముగ్గురే వున్నారు. వీరికి విద్య నేర్చుకోడానికి ఎన్నెన్నో సుళువులు ఉన్నవి. మొదటి సంగతి, అక్షరాభ్యాసము వారికి విహితకర్మ. ఇంతేకాక, బ్రాహ్మల పిల్లలకు ధర్మానికి అనేకమంది సాయము చేస్తారు. అనేక తరాల నుండి విద్యాభ్యాసము బ్రాహ్మణ వంశములో వేరునాటుకొని ఉన్నది. పిల్లలు తమ పొట్ట పోషించుకోడానికి కూలీనాలీ చేయనక్కరలేదు. స్వగ్రామము, స్వగృహము విడిచి దూరదేశములకు పోయి పదిపండ్రెండు సంవత్సరాలు వేరే చింత లేకుండా చదువుకోవచ్చును. ఇన్ని సుళువులు గల బ్రాహ్మలలోనే చదువురానివారు, ఇంకానూటికి అరవైమంది ఉన్నారు. ఇకను ఇతర జాతులమాట చెప్పేది ఏమున్నదీ? ఒక కార్డుమీద చిన్నఉత్తరమయినా వ్రాయలేనివారు, రెఇల్వేటికెట్ మీద ఏవూరి పేరున్నదో చదువుకోలేనివారు, వెయ్యింటికి 925 గురు ఉన్నప్పుడు తెలుగుజాతులవారు నాగరికులని చెప్పడానికి నాలుక తిరుగుతుందా? యూరపుఖండములో ఈకాలములో న్యూస్‌పేపరు

చదవలేనివారిని కిరాతులుగా ఎంచుకొంటారు. అంతమట్టుకు చదవడము వ్రాయడము సర్వసామాన్యమయినవి. నలుగురు పండితులు నాలుగు సంస్కృతపుముక్కలు, నాలుగు పాత తెలుగు ముక్కలు వల్లించి రెండు బండిరాలు, రెండు అరసున్నాలు, రెండు బండమాటలు, పెట్టి పాతగొడవలు, రెండు పురాణాలు తెలిగించగానే తెలుగు భాష వృద్ధిలోనికి వచ్చినట్లేనా? ఓనమాలయినా రాని కోట్లకొలది తెలుగు వారందరూ తెలివిగల వారున్ను నాగరికులున్ను అయినట్లేనా? అధమపక్షము నూటికి ఏభై మంది అయినా పుస్తకము చదివి అర్థము చేసుకోగలవారు తమ అభిప్రాయములను స్పష్టముగా వ్రాయగల వారు ఉండవద్దా.

నాగరికజాతిలో పూర్వకాలములో చదవడము వ్రాయడము అరుదే. అప్పటి లోకవ్యవహారమునకు ఇవి అంతగా ఆవశ్యము కావు. తెలివితేటలు కలిగించే ఇతర సాధనములు ఉన్నమట్టుకు అందరికీ సామాన్యముగా ఉండేవి. బహుస్వల్పముగా ఉండేవారు చదువువచ్చినవారు, ఎవరో నలుగురు దేవతలలాగు, పురాణము చెప్పినావారే, పంచాంగము చెప్పినా వారే. తక్కిన జనులలో విద్యవల్ల కలిగే ఎక్కువ తక్కువలు ఆ కాలములో ఏవీ లేవు. ఇప్పటిలోకవ్యవహారమయితే ముక్కాలు మువ్వీసము కాగితము మీదనే జరుగుతూ ఉన్నది. వ్రాయలేనివారు, వ్రాసినది చదువలేనివారు, ఎంత వెనకపడుతున్నారో, ఎంత నష్టము పొందుతున్నారో చూడండి. పూర్వకాలంలో రామావధానులు, రామినాయుడు, మంగలి గురవడు, గొల్లకోనారి, మాదిగవెంకడు అందరూ ఒకటే. ఎవరయినా ఉత్తరాలు వ్రాయనూ అక్కరలేదు, చదువనూ అక్కరలేదు. రసీదులూ లేవు, సంతకాలూ లేవు. మునుపు అధికార్లు నోటిమాటలతోనే వ్యవహారాలన్నీ పరిష్కరించేవారు. ఇప్పుడో? అర్జీలు, సమనులు, ప్లెఇంటులు, వాజ్మూలాలు, నోటీసులు, డిక్రీలు, నకళ్ళు, మనిఆర్డర్లు, రెఇల్‌వేటికెట్లు, మందుల కేటలాగులు, ధరవరల పట్టీలు, ట్రేడుడైరెక్టరీలు, రిపోర్టులు, గెజట్‌లు, మ్యూనిసిపల్ కౌన్సిలు ప్రొసిడింగ్సు, న్యూస్‌పేపర్లు, పాంప్లట్లు, పుస్తకాలు, బులిటిన్లు మొదలైనవి ఎన్ని ఉన్నవో చూడండి. కొంచెము చదవడము, వ్రాయడము వస్తే, లోకవ్యవహారములో ఎన్ని సంగతులు తెలుసుకోవచ్చునో

చూడండి. తెలివే ప్రధానమైతే నేటి తేట తెలుగులోనే తెలివి సులభము కాదా?

ఈ కాలములో రామావధానులుగారి మనుమడు బి.ఏ.బి.ఎల్. అయి ప్లీడరీ చేస్తాడు. లేదా స్కూల్‌ఫైనల్ దాకా చదువుకొని హెడ్ గుమాస్తా అవుతాడు. రామినాయుడు మనుమడు డిప్టికలక్టరు అవుతాడు. లేదా పోలీసు ఇన్‌స్పక్టర్ అవుతాడు. (తెలుగులో పాండిత్యము చేత కాదు సుమండి). అయితే మంగలి వెంకడు, గొల్లగోపాలుడు, చాకలి సరవడు ఇప్పటికీ రామావధానులు, రామినాయుడు తాత ముత్తాతలంత సత్యకాలపు వాళ్ళే. ఇప్పుడు ఇంగ్లీషు బళ్ళలో జాతిభేదము లేకుండా అందరికీ సరిసమానముగా చదువు చెప్పబట్టిగాని, బ్రాహ్మణ పండితులకే విద్యాధికారము ఉంటే బ్రాహ్మణేతరులలో విద్య ఈ మాత్రమయినా వ్యాపించునా? తెలుగు దేశములో విద్య ఇంత తక్కువగా ఉన్నప్పుడు విద్య ఎడల నిజమైన అభిమానము గల వారు చేయవలసినపని ఏమిటి? విద్యవల్ల కలిగే ఫలము, లోక వ్యవహారానికి పనికివచ్చే జ్ఞానమా? లేక కేవలము శబ్దజాలమా? ఏదో ఒకటి వల్లించడమా? వల్లించినదానిలోని విషయము తెలుసుకోడమా? జ్ఞానము కలిగించే సాధనము ఎంత సుకరముగా ఉంటే అంతమంచిది గదా! మాటకు, ఇప్పుడు కాశీయాత్రచేసేవారు రెఇల్‌బళ్ళు ఎక్కిపోతున్నారు కారూ? రెఇల్ బండికంటె ఎడ్లబండి ఎక్కిపోతే ఎక్కువ పుణ్యమని, అంతకన్న కాలినడకను పోతే మరింత పుణ్యమని, ఇంకా రోడ్లమీద దొర్లుతూ పోతే మరీ ఎక్కువ పుణ్యమని, మన పౌరాణిక పండితులు మనకు హితోపదేశము చేసినా, ఎంత పుణ్యము దొరికితే అంతే ఆయెను అని వారూ మనమూ మెఇల్ బండిమీదనే పోతున్నామా, లేదా? పైకిమాత్రం అంటారు శాస్త్రిగారు బుగ్గిలో దొర్లుతూపోతే బొందెతోనే స్వర్గానికి పోతామని. వ్యవహారములో ఆమాటమీద విశ్వాసం మనకూ లేదు, వారికీ లేదు. వాదానికి మాత్రం శాస్త్రం ఒప్పుకోవలెనట! అలాగునే ఉత్తవాదానికి పాత తెలుగు, నిత్యమూ వ్యవహారములో నేటి తేట తెలుగు!

పూర్వము వేదములలోని భాష లోకులు మాటలాడుకొనే రోజులలో, ఇప్పుడు

బొబ్బిలి పాటలాగు, వేదములు బోధపడేవి. రాను రాను ఆ భాష మారి, తుదకు వాడుక లేక, ఎవరికీ తెలియకుండా అయినది. ఇట్లా మారి ఏర్పడిన క్రొత్తభాషే సంస్కృతము. భారతము పంచమవేదమని చెప్పి, పూర్వపు ఇతిహాస ములు అన్ని ఇమిడ్చి, అందరికీ తెలిసేటట్టు అందరూ వాడుకొనే భాషలోనే తర్వాత తేడాగా వ్రాసినారు. ఆ భాషను వ్రాసినవారు, పూర్వ భాషతో కలపక, తమకాలపు వాడుకను అనుసరించే వ్రాసినారు. వాడుకలో ఉన్న భాషకు మార్పు కలగడము అనివార్యము గనుక ఆ సంస్కృతము కూడా కాలక్రమమున మారి, ప్రాకృతభాషలు ఎన్నో ఏర్పడినవి. ఆ భాషలలో గ్రంథాలూ పుట్టినవి. అయితే ప్రాకృతములూ, సంస్కృతమూ కలిపి ఏకభాషగా ఎవరూ చేయలేదు. సంస్కృతములో వ్యాకరణము వ్రాసినవారు అయినా వాడుకలో ఉన్నభాషనే పరీక్షించినట్లు అనేక నిదర్శనములు ఉన్నవి. శబ్దముల రూపభేదముల అంగీకరించినారు. స్వరము ఏర్పరచినారు. తూర్పు దేశమువారు ఈలాగు ఉచ్చరిస్తారని, ఉత్తరదేశమువారు ఈలాగు ఉచ్చరిస్తారని, లోకములో వాడుక ఈలాగు ఉన్నది. ఛందస్సు (అనగా వైదికభాష)లో ఈలాగు ఉన్నది అని ప్రత్యేకముగా పాతభాష, కొత్తభాష అని రెండు భాషలు ఉన్నట్లుగా చూపించినారు.

పాతవి పట్టుకొని పాకులాడేవారు కొందరు, కొత్తవి కొనియాడేవారు కొందరు ఎప్పుడూ ఉంటారు. పాతగిల్లినకొద్దీ పరిచయము తక్కువ. గౌరవము ఎక్కువ? దూరమైనకొద్ది సూక్ష్మము అవుతుంది. రామాయణము కన్నా, శాస్త్రముకన్నా వేదము గొప్పది. శాస్త్రిగారికన్నా అవధానులు గొప్పవారు. తెలుగు రామాయణముకన్న సంస్కృతరామాయణము చదివితే పుణ్యమెక్కువ. తెలుగు పండితులకన్న సంస్కృత పండితులు ఎక్కువ గొప్పవాళ్ళ మనుకుంటారు. తెలుగు పండితులుకూడా తమకు సంస్కృతములో పాండిత్యము ఉన్నా లేకపోయినా ఉన్నట్టే నటిస్తారు. పాత తెలుగు పండితులు కవిత్రయమును ప్రమాణముగా ఉంచుకొని సంకర తెలుగు వ్రాసేవారిని తక్కువగా చూస్తున్నారు. కొత్త తెలుగు వ్రాసేవారిని చూచి వారూ వీరూ ఆక్షేపిస్తున్నారు. పల్లెటూళ్ళలో రవిక తొడుక్కొంటే సాని, పట్నములో కోటు తొడుక్కొంటే దొరసాని అని ముసలమ్మలు అన్నట్లే.

ప్రస్తుత విషయమునకున్ను మీదచెప్పినమాటలకున్ను సంబంధ మేమిటంటే; మొదటి తెలుగు కవులు తమ వ్యవహారములో ఉన్న తెలుగు భాషను వ్రాసినారు. వారి తెలుగు కాలక్రమమున మారినది ఎంతోకొంత. దానికిన్ని ఇప్పుడు వాడుకలో ఉన్న తెలుగుకున్ను భేదము ఉండబట్టి పాత భాషలో చెప్పిన వాక్యముల అర్థము, ఆ భాష బాగా చదువుకొన్న పండితులకు గాని స్పష్టముగా తెలియడములేదు. పాత భాషలో కల్పించిన వేదములలోని సారము కొత్త సంస్కృతములో భారత రామాయణములు వ్రాసి చెప్పినట్లుగా, పాత తెలుగులో వ్రాసిన పుస్తకములలోని విషయములు సర్వసామాన్యముగా తెలిసేటట్లు చేయవలెనంటే, కొత్త తెలుగు అనగా ఇప్పుడు వాడుకలో ఉన్న భాషలో తిరిగి చెప్పవలెను గదా! కొత్త విద్యలు నేటి తేటతెలుగులో కాగితము మీద వ్రాస్తే సులభము కావా? ఈ లాగు చేయడము అన్ని దేశములలోను అన్ని భాషలలోను జరుగుతున్నది కదా? పది పదిహేనుమార్లు పాతగిల్లిన ఇంగ్లీషులో క్రీస్తుమత గ్రంథములు మాటిమాటికి కొత్త కొత్త ఇంగ్లీషులో వ్రాస్తున్నారు కారా? మన దేశములో కూడా పూర్వము అదే సంప్రదాయము గదా! ఇందులో వైపరీత్యము ఏమి ఉన్నదని పండితులు రణగొణధ్వనిచేసి ఆకాశము బద్దలు కొట్టుతున్నారు.

విద్యలు కూడా కలకాలము ఒక్కరీతిని ఉండవు. ఉండలేదు. విద్యలు అన్నీ అందరికీ సామాన్యముగా ఉండవు. లోకవ్యవహారము మారినప్పుడు దానిలో కూడా అందుకు ఉపయోగించే విద్యలూ మారుతవి. ఇప్పుడు సివిల్‌కోర్టులోను, క్రిమినల్ కోర్టులోను, పూర్వపుస్మృతులు పనికివస్తవా? పూర్వపుధనుర్విద్య ఈ కాలపు యుద్ధమునకు పనికివస్తుందా? పూర్వపునియమాలు ఈ కాలములో చెల్లుతవా? లోకవ్యవహారము లక్షవిధములు, నాగరికత ఎక్కువ అయిన కొద్దీ ఈ లోకవ్యవహారము శాఖోపశాఖలుగా భిన్న భిన్నమై దుర్బోధము, దుర్లభము అవుతుంది. శాస్త్రములు, కళలు లెక్కకుమీరి పెరుగుతవి. ఇవి అన్నీ నేర్చుకోడము అందరికీ సాధ్యమా? సర్వజనసామాన్యమైన విద్య వల్ల తెలిసేవి–వ్రాయడము, చదవడము, కొంత గణితము, దేశచరిత్ర,

భూగోళవివరణము, జగత్తు ఉత్పత్తివృద్ధి బోధించే శాస్త్రము, రాజ్యపాలన, ప్రజలనడవడి, దేహారోగ్యము మొదలయినవి. ఈ విద్య ఎంతో కొంత వచ్చిన పిమ్మట ప్రజలు తమ తమ వ్యాపారమునకు ఉపచరించే విద్యను గ్రహించవలసి ఉన్నది. కడుపుకూటి కోనము దినమంతా శ్రమపడవలసినవారి అందరికీ అన్ని శాస్త్రవిద్యలు స్వాధీనమవుతవా? పాత తెలుగు పాండిత్యము పౌరాణికులకు పాత తెలుగు కవులకు కావలెను. లేదా భాషాతత్త్వము తెలుసుకొనే వారికి కావలెను గాని, అందరికీ ఎందుకు? అందరూ సంస్కృతము నేర్చుకోరేమీ? వేదములు బ్రాహ్మలయినా చదవరేమి? దేవభాష అయిన సంస్కృతము కన్న మ్లేచ్ఛభాష అయిన తెలుగు ఎందులో తక్కువ?

పూర్వకాలమున మనదేశములో పుట్టిపెరిగిన విద్యలలో ఎన్నో రూపు మాసిపోయినవి. నిలిచినవయినా అన్నీ ఇప్పటి లోకవ్యవహారమునకు అనుకూలముగా లేవు. లోకముతోకూడా మార్పుచెందనిది ఏదీ వృద్ధి పొందదు. లోకమును అనుసరించి మారినవి వృద్ధిపొంది, మారనివాటిని అణగద్రొక్కి నిర్మూలముచేయక మానవు. ఇది లోకధర్మము. మనుష్యులు, మృగములే కాదు, చెట్లు, చేమలున్ను రాజ్యములు, వ్యాపారములు, భాషలు, విద్యలుకూడా కాలానుగుణముగా మారని ఎడల వృద్ధి పొందవు. మార్పునుబట్టే వృద్ధి. పుట్టినవాడు పుట్టినట్టే కఱ్ఱబొమ్మవలె ఉండునా? జంతువులకు జీవము ఎటువంటిదో అటువంటిదే భాషకు నోటివాడుకా, విద్యకు లోకవ్యవహారముతో సంబంధమున్ను.

పూర్వకాలమున మనదేశములో ద్విజులేగదా విద్యలు నేర్చుకొనేవారు. వారిలోనయినా అందరూ కాదు. సర్వసామాన్యముగా ప్రజలందరికోసము ఉద్దేశించి ఏరాజున్ను బడులు పెట్టించి విద్యలు చెప్పించలేదు. బ్రిటీషువారి పరిపాలనవల్లనే మనకు కలిగినది ఆ భాగ్యము. అయితే దురభిమానముచేత పండితులూ, పండితమ్మన్యులున్నూ, నిజము తెలియక విద్యాధికారులున్నూ ప్రజలకు అందరాని పండుగా చేసినారు విద్యను. పండితులు కవనము కోసము కల్పించుకొన్న కృత్రిమ

భాషలో బాలబోధలూ, కథలూ, చరిత్రలూ వ్రాస్తూ పిల్లలు చదువలేకుండాను చదివినా అర్థము కాకుండాను చేసి, ఫస్టుక్లాసు మొదలు కొని బి.ఏ. దాకా తెలుగు చదివినా, ఇంగ్లీషు చదివినా, పండితులు వేదాలు, శాస్త్రాలు చదివినట్లు, ప్రతిదీ బండవల్లన వల్లించడము మప్పి పిల్లల బుద్ధి వికసించకుండా మాడ్చి పాడుచేసినారు. తెలివి పుట్టడానికి తేటగా తెలిసే మాటలతో విద్య చెప్పవలెనన్న సంగతి ఆలోచించరు. ఇదే కారణము మనదేశములో విద్యవ్యాపించక మనము వెనకపడడానికి. యూరపు ఖండములో కూడా మూడు, నాలుగువందల సంవత్సరముల కిందటవరకు కృత్రిమ భాష అయిన లాటిన్‌లో గ్రంథములు వ్రాయడము, విద్య చెప్పడము ఆచారమయి ఉండేది. అందుచేత, ఆ కాలములో సంసారులలో విద్యావంతులు అరుదు. సన్యాసులుగా ఉండేవారు మాత్రము చాలాకాలము పట్టుదల కలిగి పూని వల్లించి, ఆ కృత్రిమ భాషా, అందులో వ్రాసిన గ్రంథాలు నేర్చుకోగలిగేవారు. మనదేశములో పూర్వ సంప్రదాయము ప్రకారము తెలుగు భాష నేర్చుకొనేవారు ఓనమాలు నేర్చుకొన్న వెంటనే సంస్కృతంలో వ్రాసిన బాలరామాయణము, తర్వాత అమరము, ఆంధ్రము, శబ్దాలు, సంస్కృతకావ్యాలు, నన్నయ భట్టీయము ఈ వరసను చదువుకొని ప్రబంధాలు ఆరంభించేవారట! ఇదే అనులోమమార్గమట! వేదము వేంకట రాయశాస్త్రి గారు గ్రామ్యాదేశనిరసనములో ఈ పద్ధతిని ఎంతో కొనియాడుతూ వ్రాసినారు. ఈ చొప్పున తెలుగు చెప్పకపోవడముచేతనే నట తెలుగు పిల్లలకు తెలుగు భాగా రాకపోవడము! భళాభళీ! నిజము! శాస్త్రిగారు సెలవిచ్చిన సంగతి వాస్తవమే! ప్రతి తెలుగువాడు తెలుగుపండితుడు కావలెనంటే ఇదే ఉత్తమమయిన పద్ధతి. అయితే ఇప్పుడు 'గ్రాంథికశైలిని', 'వ్యాకరణ శైలిని' నిర్దుష్టముగా వ్రాస్తున్నామని ప్రగల్భాలు పలుకుతూవున్న ఎమ్,ఏ. పండిట్లు బి.ఏ. పండిట్లు ఎఫ్.ఏ. పండిట్లు అనులోమముగా శాస్త్రిగారు చెప్పినపద్ధతిని తెలుగు అభ్యసించినట్టు కనపడదు. అంతా హుళక్కిపండితులే. పండిట్ వావిలికొలను సుబ్బారావు పంతుల వారంతటివారు. 'సందేహనివర్తి' అని 'నిరోగము' అని సంస్కృతములున్ను 'ఋజువు చేయుట', 'మాటలధోరణి', 'అట్టైన వారిని మీకు

జక్కగ దెలియునా?' మేము విజయు నీళ్ళు ద్రోచియుఁ జావడయె', 'త్రోపెడిపిల్లి', 'తీసివైచినది', 'తిగిచి వేయము' అని అసంస్కృతాలు, సంకరాలు, పాతకొత్తతెలుగులు కలిపి, పిసికి, ప్రయోగించినారు. వీరు గుండెలు కుళ్ళ వల్లించినారట సంస్కృత నిఘంటువులున్ను వ్యాకరణములున్ను! నేను ఈలాగున వ్రాయడము వీరి దోషములు ప్రకటించడానికి కాదు. ఎంతో అభిమానము, పూనిక కలిగి రాత్రింబగళ్ళు పడవల్లించి, పుట్టినది మొదలు సంస్కృతము తెలుగు చదువుతూ, గ్రంథములు రచిస్తూ, అధ్యాపకవృత్తిలోనే కాలక్షేపముచేస్తూ ఉన్న వీరికే చక్కగా స్వాధీనము కాలేదే భాష! ఈ కాలపు బడులలో చదివే పిల్లలకు పట్టుపడడము కష్టము కదా అని అడుగడానికి. లెక్కలు, హిస్టరీ, జిఆగ్రఫీ, నేచర్‌స్టడీ, డ్రాయింగ్, ఇంగ్లీషు మొదలగునవి ఎన్నో నేర్చుకొంటూ పదింట నొకటిగాఉన్న తెలుగుపాఠములు అనులోమపద్ధతిని వల్లించడము బడిపిల్లలకు ఏలాగున వల్లపడుతుంది? సంస్కృతవిద్యార్థులను చూస్తున్నాము కామూ ఎలాగు రఘువంశము వల్లిస్తున్నారో? దినానికి ఒకశ్లోకము చొప్పున వ్యాఖ్యానముతో కూడా చదివి ఒప్పచెప్పుతారు గురువుగారికి. ఈలాగున చెప్పమంటే మన పండితులు తెలుగువిద్య చెప్పి తెలివి పుట్టిస్తారట మన తెలుగు పిల్ల లందరికీ! దినానికి అరవైగడియలు 'గ్రామ్య' తెలుగు వాడుతూ, వాదానికి గ్రాంథికతెలుగు మంచిదని చిందులు తొక్కుతున్నవారు, తమ పిల్లలకు ఈరీతిగానే చదువులు చెప్పించి లాభము చూపించరాదూ? ఒక్కొక్కకాలేజీకిన్ని, ఒక్కొక్క హైస్కూలుకున్ను, ఒక్కొక్క తెలుగుపండితుడే కదా ఉన్నాడు. తక్కినమాస్టరులలో ఒక్కడయినా తెలుగు టెక్స్టు పాఠము చెప్పలేదు గదా! ఏమిగతి? ఈ మాస్టర్లందరు తాము నేర్చుకొన్న మరి ఏసబ్జక్టు పాఠము చెప్పమన్నా చెప్పడానికి తయారుగా ఉంటారు. తెలుగు చెప్పమంటే మాత్రము తమకు రాదని వెనకతీస్తారు. కారణము ఏమిటి? తెలుగు గ్రంథాలలోని తెలుగు ఈ తెలుగు మాస్టర్లు నిత్యమూ వాడుకొంటూ ఉన్న తెలుగుకాదు. అది వేరే భాష. ఇంగ్లీషుగ్రంథాలలో ఉన్న ఇంగ్లీషు బోధపడని ఇంగ్లీషు మాస్టర్లను చూచినారా ఎక్కడయినా? లక్షల కొలది అచ్చు పడుతున్నవి ఇంగ్లీషుపుస్తకాలు. ఏవో ఫిజిక్స్ కెమిస్ట్రీ వంటివి తప్ప, సాధారణముగా ఏ

పుస్తకము పడితే ఆ పుస్తకము చదవగలడు ప్రతి ఇంగ్లీషువాడున్ను. ఇంగ్లీషువారి దాకా ఎందుకు? ఇంగ్లీషు నేర్చుకొన్న తెలుగువారే చదవగలరు. తెలుగు బి.ఏ. గారు తాను పరీక్షకు చదవని పుస్తకము ఒకటి స్వతంత్రముగా చదవగలరా? ఒక కొత్తపద్యానికి 'పదచ్ఛేదము' చెప్పగలరా? నామాటలు అతిశయోక్తులు ఉత్ప్రేక్షలు అనేరు కొందరు గాని నా అనుభవమును బట్టి నాకు వాస్తవముగా తోచినసంగతులే వ్రాస్తున్నాను. వేదము వేంకటరాయశాస్త్రి గారిని అడగండి; ఆయన నామాట కాదనరు చూడండి. ఇప్పుడు గ్రంథకర్తలుగా పేరుపొందిన వారు అనేకమంది ఎంత తంటాలు పడి గిజగిజ గింజుకొంటున్నారు కారు! వారి తెలుగు పూర్వపు వ్యాకరణ సూత్రములను అనుసరించి ఉన్నదని భ్రమపడుతున్నారు గాని దోషములు ఎన్నో ఉన్నవి. ఇప్పటి గ్రంథములలో నిర్దుష్టమైనది ఒకటి అయినా నాకు కనబడలేదు. మధ్య కవులు, ఆధునిక కవులు వ్రాసిన కావ్యముల లోనే అనేకమయినవాటిలో లక్షణవిరుద్ధములయిన ప్రయోగములు ఉన్నవి అని రాయబహద్దరు వీరేశలింగము పంతులుగారే విమర్శించి చెప్పినారు. ఆ పంతుల వారి గ్రంథములలోనూ ఉన్నవి కొన్ని పూర్వలక్షణాలకు విరుద్ధమైన ప్రయోగములు, ఇంతమందికి ప్రమాదము కలగడానికి కారణము ఏమిటంటే; బాగా పరిచయము గల స్వభాషలో గ్రంథములు వ్రాయక పరిచయము లేనట్టిదిన్ని, పాణినివ్యాకరణము వంటి విపులమయిన లక్షణములు లేనట్టిదిన్ని, పూర్వకవుల కావ్యములే శరణుగా గలదిన్ని అయిన ఒక కృత్రిమభాషలో వ్రాయడమేను. స్వభాషలో వ్రాయడము స్వగ్రామములోను, స్వగృహములోను తిరుగడమువంటిది గదా. బొంబాయి వంటి పెద్దపట్నములో కొంతకాలము కాపురమున్న తర్వాత కూడా, మన వ్యవహారముతో సంబంధించిన స్థలముతో మాత్రము పరిచయము కలగవచ్చును గాని, తక్కినభాగములు కొత్తగానే ఉంటవి. మాపుగాని, ప్లానుగాని పట్టుకొని చూస్తే నలుగురూ గొప్పవనుకొనే స్థలములు మాత్రము పోల్చుకోవచ్చును. గాని తక్కినవి అన్నీ తెలియవు. వ్యాకరణము ప్లానువంటిది. నిఘంటువు పట్నములోని వస్తువుల పట్టి వంటిది. ప్లాను, పట్టి పట్నము స్వరూపము తెలియజేసినా పట్నములో కాపురముండి

నాలుగు మూలలా తిరిగేవారు వ్యవహరించినట్లు స్వేచ్ఛగా స్వతంత్రించి తోవ తప్పకుండా కొత్తవాళ్ళు తిరగలేరు గదా?

అట్లే భాషలో మనోభావములు వ్యక్తపరచడము కూడాను. 'నాకు ఆకలి వేస్తున్నది', 'నాకు ఆకలి అవుతున్నది', 'నాకు ఆకలిగా ఉన్నది' అనే వాక్యములు వాడుకలో ఉన్నవి. అందరమూ వాడగలము 'నాకు ఆకలి గదిరినది', 'నాకు ఆకలి వొడమినది', 'నేను క్షుత్పీడితుండను' – అనే వాక్యములు చెవులకు కొత్త. 'నాకు ఆకలి వేస్తున్నది' అనడానికి మారుగా 'నాకు ఆకలి వైచుచున్నది' అని ప్రయోగించడము హాస్యాస్పదముగా ఉంటుంది. ఏ గ్రంథములలోనూ అట్టి ప్రయోగములు కనబడవు. అట్టివి కల్పించి వాడినందుచేత నైజధర్మము చెడి భాష కృత్రిమమైనది అవుతుంది. కర్రబొమ్మకూ జీవముతో ఉన్నమనిషికీ ఎంత భేదమో అంత భేదముంటుంది అట్టి కృత్రిమభాషకున్నూ వాడుకలో ఉన్న భాషకున్నూ: కంటి చూపులో కనబడేటట్లు నోటిమాటలో వినవడవలెను మనోభావము.

ఎంతో శ్రమపడితే గాని కృత్రిమభాష పట్టుపడదు. పోనీ, ఇంత శ్రమపడీ నేర్చుకుంటే, లాభమేమైన ఉన్నదా? ఈ కృత్రిమభాష లోకవ్యవహారములో ఎవరైనా మాట్లాడుతున్నారా? లేదు. సభలలో వాడుతారా? లేదు. కోర్టులలో ప్లీడర్లు ఈ భాషలో వాదప్రతివాదములు చేస్తారా? లేదు. అసెసర్లకు అడ్రస్ ఈ భాషలో ఇస్తారా? లేదు. జడ్జీలు, మునుసబులు ఈ భాషలో విమర్శ చేస్తారా? లేదు. తీర్పులు కాని, రాజీనామాలు కాని ఈ భాషలో వ్రాస్తారా? బడిలో మాస్టర్లు పాఠాలు బోధపరిచినప్పుడు ఈ భాష వాడుతారా? లేదు. పౌరాణికులు ఈ భాషలో పురాణములకు అర్థము చెప్పుతారా? లేదు. గనుక ఈ భాషలో పాండిత్యము లోకవ్యవహారానికి ఎందుకూ బనికిరాదు. పండితులకే అది ప్రయోగించడములో ప్రమాదము సంభవిస్తూంటే, సాధారణులు ఈ భాష నేర్చి కంపోజిషన్, కవిత్వము కూర్చగలరా? ఇంత దుస్సాధ్యమైన భాషను ప్రతి తెలుగుపిల్లవాణ్ణి నేర్చుకొమ్మని బలవంతపెట్టడము చేతను, అందులో వ్రాసిన పుస్తకములే చదువమనడము చేతను

ప్రజలలో విద్య వ్యాపించదము లేదు. ప్రైమరీస్కూళ్ళలో మాస్టర్లకే కాదు, హైస్కూళ్ళు కాలేజీలలో ఉన్న మాష్టర్లకైనా ఈ గ్రాంథిక తెలుగు రానప్పుడు వారివద్ద చదువుకొనే పిల్లలకు ఆ భాష ఎట్లువచ్చేను? ఇంగ్లీషు కథలపుస్తకము కులాసాగా చదువుతాడు గాని విజయవిలాసము, మనుచరిత్రము ఎవ్వడూ ముట్టుకోడు. తెలుగంటే అసహ్యము గదా! బాగా ఆలోచించండి. దురభిమానము విడవండి. నిజము కనుక్కోండి. తెలుగు పుస్తకమంటే తెలుగు పిల్లలకే అసహ్యమెందుచేత? తొమ్మిదిఏళ్ళు ఈడుగల తెలుగుపిల్లలు నూరు ఇంగ్లీషు కథలపుస్తకాలు చదివినారు. అతిశయోక్తి కాదు.

అవిచ్ఛిన్నముగా సంప్రదాయానుసారము కవులు అందరూ నన్నయకాలము మొదలుకొని నేటివరకూ వాడుకచేస్తూ వచ్చిన భాషను విడిచి గ్రామ్యభాషను గ్రంథములు వ్రాయడము ఉచితము కాదని వాదించేవారి వాదములో అనేక దోషములున్నవి. భాష మారదు అని వాదిస్తారా? ప్రత్యక్షముగా కనబడుతున్న దానికి విరుద్ధము గదా! భాష మారకూడదని వాదిస్తారా? ఈ విధి ఎక్కడ నున్నదో మొదట చెప్పవలెను. వ్యాకరణము చదువుకుంటే భాష చక్కగా వస్తుందంటే అనుభవానికి విరుద్ధము. ఏదేశములో అయినా గొప్పకవులు వైయాకరణులు కారు. వ్యాకరణములోని సూత్రము ఒకటి అయినా రాకుండా చక్కగా వ్రాయగలవారు అనేకులున్నారు. గ్రామ్యమనగా అధమజాతుల వాడుక. ఇప్పటి ఉత్తమజాతుల వాడుక గ్రామ్యము అనకూడదు. ఒకవేళ గ్రామ్యమనగా పూర్వభాషాసంప్రదాయమునకు విరుద్ధము అయినది అంటే నన్నయ వాడుకకు భిన్నంగా నున్న తిక్కన వాడుక, నన్నయ తిక్కనల వాడుకకు భిన్నముగా ఉన్న పెద్దన వాడుక, ఇట్లు పూర్వ కవుల వాడుకకు భిన్నముగా ఉన్న తర్వాతికవుల వాడుక గ్రామ్యమని చెప్పవలెను. అప్పుడు గ్రామ్యమందు దోషమే ఉండదు. మంచిగాని చెడ్డగాని ఔచిత్యముగాని అనౌచిత్యముగాని ఏ శబ్దమునకూ శాశ్వతమైన లక్షణము కాదు. ఒక ప్రదేశములోగాని, కాలములోగాని అనుచితమైనది మరియొక ప్రదేశములోగాని, కాలములోగాని, ఉచితమవును. ఇది అన్ని భాషల చరిత్రములలోను కనబడుతున్నది. మాటలకు గౌరవము ఆ మాటలు ఆడేవారిని బట్టి ఉంటుంది.

'సాని' ఏమి పాపము చేసుకున్నది? 'ఇల్లాలు' ఏమి పుణ్యము చేసుకున్నది? 'కూడుకుడవడము' ఎందుచేత గ్రామ్యమైనది? 'మనుగుడుపుల' కు అంత గౌరవమేల? కట్టెలకోసము కాటికిపోయినా, 'కాటికి పోయినాడు' అనకూడదు గదా. నెల్లూరిలో 'బొక్క' అంటే తప్పులేదు గాని, ఉత్తరజిల్లాలలో అశ్లీలము. ద్రౌపది నడిచినడిచి అలసిపోయివుంటే, 'అలసినది, దానిని మోచికొని తెమ్ము' అని ధర్మరాజు తమ్మునితో చెప్పినట్లు ఇపుడు ఎవడైనా 'ఆవిడను మోసుకొని తెచ్చినాడు' అనవచ్చునా.

అయితే వాడుకలో ఉన్న భాష ఒక్కలాగు ఉన్నదా? ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్కమాదిరి ఉంటుందే. అది అందరికీ తెలుస్తుందా? అని కొత్త తెలుగు కోసము కొట్టుకొనేవారిని కొందరు ఆక్షేపిస్తున్నారు. గ్రాంథిక భాషమాత్రము ఒక్క మాదిరిని ఉన్నదా? చూడండి. 1. సంధివిషయములో కొన్నిచోట్ల బహుళము కొన్ని చోట్ల వైకల్పికమట. కొన్నిచోట్ల తరచట. 2. సరళాదేశము పండితుల ఇష్టము, విహితము కాదు. వాడుసూ(చూ)చె, వాడువో(పో)యె. 3. ఉయ్యెల మొ. రమారమీ పది భిన్నరూపములు; ఒకరిత మొ. రమారమీ అరవై; తెప్ప, తేప మొ. వాటికి ఎన్నిటికో రెండేసి ఉన్నవి రూపములు. 4. బహువచన రూపములు అనేక రీతులు; కొడవండ్లు మొ. 5. ద్వితీయావిభక్తిరూపములు, ఉ. కంసునిన్, కంసునిఁ, కంసుని, కంసున్, కంసుఁ, కంసుం. చతుర్థీ విభక్తి ప్రత్యయములు కి, కిని. 6. వర్తమాన కాలము, భవిష్యత్కాలము, తద్ధర్మకాలము, అన్నీ ఒక్కటే. 7. నన్ను నలిగి, నాపై నలిగి అని సకర్మక అకర్మక అర్థములు. 8. వ్రేలును-వ్రేలాడును అని అనుభంధము కలిగిగాని లేకగాని, 9. అనియెను, అనెను, అనితిని, అంటిని, 11. ఒకేమాటకు అనే అర్థములు, 12. శబ్దపల్లవములు-ఇటువంటి వ్యత్యాసములు ఎన్నో ఉన్నవే గ్రాంథిక భాషలో! వీటిలో పదోవంతు అయినా ఉండునా ఈ కాలపు నాగరికుల తెలుగు భాషలో భేదములు? పోనీ, తక్కువ కాదు, ఎక్కువే ఉన్నది వ్యత్యాసము అని ఒప్పుకొన్నా లోకవ్యవహారములో ఉండి, నోటను పలుకుతూ, చెవికి వినబడుతూ ఉన్నభాష ఏదైనా గ్రహించడము, మాటలాడడము బహుసులభము. బరంపురములో తెలుగుపిల్లలు

ఓఢ్రము మాట్లాడగలరు. చెన్నపట్టణములో అరవలకు తెలుగు వస్తుంది. బళ్ళారిలో తెలుగులకు కన్నడము వస్తుంది. అందరికి ఇంగ్లీషు వస్తుంది. అలాగునే గుంటూరు తెలుగువారు, కర్నూలు తెలుగులో భిన్న రూపము వాడుకలో ఉంటే నేర్చుకొంటారు, నేర్చుకొంటున్నారు. బొత్తిగా ఒకరిమాట ఒకరికి తెలియనంత వ్యత్యాసము ఉన్నదా గుంటూరి తెలుగుకూ, కర్నూలు తెలుగుకూ? ఉంటే ఇక్కడివారు అక్కడా, అక్కడివారు ఇక్కడా ఉద్యోగాలు చేస్తున్నారు గదా! ఏలాగు కార్యాలు నిర్వహించుకొని వస్తున్నారండీ? నా అనుభవాన్ని బట్టి చూస్తే తెలుగుదేశమంతటా చదువు నేర్చినవారందరూ మాట్లాడేభాష ఇంచుమించుగా ఒకటే భాష. దిగువజాతులవారికి చాలమందికి ఈ భాష వాడుక భాష కాకపోయినా బాగా తెలుస్తుంది. ఇది సులభముగా మాటలాడడము నేర్చుకోగలరు, నేర్చుకొంటున్నారు కూడా. గొప్పవారిళ్ళలో నౌకర్లుగా ఉన్నవాళ్ళు చాలా మంది తమయజమానులు మాట్లాడినట్లే మాటలాడుతున్నారు. ప్లీడర్ల వద్దకు తరుచుగా వెళ్ళే క్లయింట్లు నాగరిక భాష మాటలాడడము అలవాటు చేసుకొంటున్నారు. ఇట్లే ఆఫీసులలోను, కోర్టులలోను, దేవుడిగుళ్ళవద్ద, బజారులోను, మీటింగులలోను, అన్ని జిల్లాల తెలుగు మాటలు అన్ని జాతుల తెలుగుమాటలు కలిసి సాపెక్కుతున్నవి. ఉత్తమజాతుల వాడుకభాషకు గౌరవము సహజము గనుక అది వ్యాపిస్తున్నది. భేదాలుంటే నేమి? రైలుబండిలో అరిగిపోతున్నవి ఎగుడుదిగుళ్ళు అన్నీ. ఇదే కొత్త తెలుగు నేటి తేటతెలుగు; వ్రాస్తూ ఉన్న నా తెలుగు; చదువుతూ ఉన్న మీ తెలుగు.

తేట తెలుగు భాష అన్ని విధములా యోగ్యమైనది. అందరికీ సాధ్యమైనది. మాదిగ వెంకడు మొదలుకొని వెంకటావధానుల వరకున్ను వెయ్యింటికి 75గురు మాత్రమే ఓనమాలు వచ్చినవారున్నప్పుడు గ్రాంథిక భాష వచ్చినవారు 5గురైనా ఉందురో, ఉండరో! అయితే నాగరికుల తెలుగు, తేటతెలుగు లోకవ్యవహారములలో ఇప్పుడు వాడుతూ ఉన్నవారే వెయ్యింటికి అధమపక్షము నూరుగురైనా ఉంటారు. అది తెలుసుకోగలిగినవారు వెయ్యింట మున్నూరుగురైనా ఉంటారు. క్రమ క్రమముగా వాడుక ఎక్కువయి అంతకంతకు దిగువ జాతులకు అది వ్యాపిస్తుంది. తేటతెలుగులో

తెలివికలిగించే విద్య అందరికీ సర్వసాధారణముగా చెప్పితే సరస్వతి తెలుగుదేశములో తాండవమాడదా? కొద్ది కాలములోనే తక్కినదేశములతోపాటు మన తెలుగు దేశము కూడా నాగరికముకాదా?

ఎవరికీ సాధ్యముకాని, పస లేని పాతతెలుగులోనే అభిప్రాయాలు వ్యక్తపరచవలెనన్న పిచ్చిప్రయత్నాలు చేస్తూ ఉండబట్టి భాషకు ఏవిధమైన అభివృద్ధి లేకుండా ఉన్నది. గాని మనకు సులువుగా బోధపడుతూ వున్న మన తెలుగునే ఆదరించిన ఎడల ఎంత ఉపకరిస్తుందో చూడండి. ఇండస్ట్రియల్ రిఫార్మర్లు, పొలిటికల్ రిఫార్మర్లు, సానిటరీ రిఫార్మర్లు, అగ్రికల్చరల్ రిఫార్మర్లు, ఎడ్యుకేషనల్ రిఫార్మర్లు, లిటరరీ రిఫార్మర్లు ఈ తేటతెలుగు లెక్చర్లు నోటను ఫెళ్ళుమని ఉరిమించవచ్చును గదా! పాంప్లట్లు పుస్తకాలు కురిపించవచ్చును గదా. విద్యలు పారించవచ్చును గదా. తెలుగు వారి బుద్ధి సారవంతమై ఎట్టి పంట పండునో ఎవరు చెప్పగలరు?

పండితులారా! మీ దురభిమానము విడిచిపెట్టిండి. దేశమంతా విద్యకావలెనని మొరపెట్టుకొంటూ ఉన్నది. సులభముగా వచ్చే తేటతెలుగులోనే విద్య నేర్పడము సులభమైనప్పుడు పాతభాష నేర్చుకొంటేనే గాని విద్య సంపాదించడానికి వల్లకాదు అని మీ రెందుకు అడ్డుపెట్టుతారు? మీరు గ్రామ్యులు కారు గదా? మీ నోటను వచ్చేమాట అశ్లీలము కాదు గదా! మీరు నిత్యమూ వాడుకొనే భాష శంఖములో పోసిన తీర్థము వంటిది. అదే అందరికి ఇచ్చి ఉద్ధరించరాదా!

(ఆంధ్రపత్రిక ప్రమాదీచ సంవత్సరాది సంచిక - 1913)

12. వేటూరి ప్రభాకరశాస్త్రి
(1888-1950)

. భాషా వాఙ్మయ పరిశోధకులుగా ప్రఖ్యాతి గడించిన విద్వాంసులు వేటూరి ప్రభాకర శాస్త్రి. కృష్ణా జిల్లా పెదకళ్లేపల్లిలో 1888 ఫిబ్రవరి 7 వ తేదీన శేషమ్మ, సుందరశాస్త్రి దంపతులకు జన్మించిన ప్రభాకరశాస్త్రి ఉద్యోగరీత్యా మద్రాసు, తిరుపతిలను కార్యస్థానంగా చేసుకొన్నారు. శాసనాలు, తాళపత్ర గ్రంథాల పరిశోధకులుగా, కావ్య పరిష్కర్తగా, పీఠికారచయితగా విశిష్ట స్థానాన్ని సముపార్జించారు. శతాబ్దాలుగా మరుగున పడివున్న అన్నమయ్య పదాలను తొలిసారిగా వెలుగులోనికి తెచ్చింది శాస్త్రిగారే. బసవ పురాణం, రంగనాథ రామాయణం, క్రీడాభిరామం, సుగ్రీవ విజయం వంటి ప్రాచీన కావ్యాలను పరిష్కరించి వాటికి ప్రామాణికమైన పీఠికలు కూర్చారు. అజ్ఞాతంగా ఉండిన తెలుగు కవుల పద్యాలను, చాటుపద్యాలను సేకరించి ప్రబంధరత్నావళి, చాటుపద్య మంజరిగా ప్రకటించి భాషా ప్రియులకు మహోపకారం చేశారు. శాసన పాఠాలు, పదాల వ్యుత్పత్తులు, దేశికవితలు, బాలసాహిత్యం మున్నగు వివిధ సాహితీ ప్రక్రియలపై సూక్ష్మ పరిశీలనతో వెలువరించిన వ్యాసాలు తెలుగు మెఱుగులు, మీగడ తఱకలు, సింహావలోకనము అన్న సంపుటులుగా ప్రచురితమైనాయి. అరసున్న, ఆంధ్ర లిపిసంస్కారము, వింత నిఘంటువులు మున్నగు అంశాలపై వారి అభిప్రాయాలు గణింపదగినవి. కడుపుతీపు, కపోతకథ, మూన్నాళ్ల ముచ్చట మొ॥నవి వీరి ఖండకావ్యాలు. బాసుని నాటకాలను అనువదించారు. కనకాభిషేకము, శృంగార శ్రీనాథము, తంజావూరి యాంధ్రరాజుల చరిత్ర వారి పరిశోధనా పటిమకు, విమర్శనా శేముషికి నిదర్శనాలు. 'ప్రజ్ఞాప్రభాకరము' శాస్త్రిగారి యోగజీవిత విశేషాలు తెలిపే ఆత్మకథ. 1950 ఆగస్టు 29న ఆయన పరమపదించారు.

✷

12. దేశిసాహితి సొంపు

- వేటూరి ప్రభాకరశాస్త్రి

ఆంధ్రజాతి యాచారవ్యవహార ప్రవాహములో అంతర్లీనములయిపోయినవి ప్రాచీన కాలపు దేశిరచనా ప్రభేదములు. అవి యెంతగా అంతర్లీనము లయినవీ అంటే వాని ఆనుపానులు సరిగా ససిగా నేటివారు అనుమానించడానికైనా సాధ్యపడనంత వింతగా అంతర్లీనములయినవి. నేటికాలపు తెలుగుపాండితి వాటి వాసననైనా యెరుగనక్కఱలేనంత యవనతితో ఉన్నది. మన ప్రాచీనకవీశ్వరులు ఈ దేశిరచనా ప్రభేదములను బాగా యెరిగినవారై ఉండేవారని, రచించగలవారై కూడా ఉండేవారని చెప్పడాని కాధారములున్నవి. నాచన సోమన వసంత విలాసమను గ్రంథము రచించినాడట. అది దొరకలేదు గాని దానిలోని రచన మొకటి లక్షణ గ్రంథాలలో ఉదాహృతమై ఉన్నది.

"వీణాగానము వెన్నెలతేటా
రాణ మీఱగా రమణులపాటా
ప్రాణమైన విన బ్రాహ్మణువీటా
జాణలు మెత్తురు జాజరపాటా."

ఈ జాజరపాట దేశిరచనా ప్రభేదమే. వసంత విలాసము యక్షగాన మేమో! అల్లసాని పెద్దన చతుర్విధకవితా విశారదుడు. ఆశు, మధుర, చిత్ర, విస్తరములని చతుర్విధ కవితల పేళ్ళు. అందు దేశిగేయరచనలకు మధుర కవితలని పేరు. దేశిరచనలు ఆచారవ్యవహారములలో అంతర్లీనమై ఉండడం కొంత వివరిస్తాను.

"వాడు నన్ను ఎగతాళి చేస్తున్నాడు" అన్న నానుడి ఆంధ్రదేశం అంతటా ఉన్నది. ఇందులో 'ఎగతాళి' పదం పుట్టుపూర్వోత్తరాలు ఎట్లాంటివో ఎరిగున్న వారెందరో ఉండరు. ఎగతాళి అన్నది ఒక దేశిరచనా ప్రభేదము. 'ఎకతాళి' 'ఎగతాళి' రూపభేదములే. సాతవాహమలనాటిదగు బృహద్దేశి, చాళుక్య సోమేశ్వరుని మానసోల్లాసము, చాళుక్య జగదేకమల్లుని సంగీతచూడామణి, కాకతీయులనాటి జాయసేనాపతి నృత్తరత్నావళి యీ 'యెకతాళి'ని పేర్కొన్నవి.

"తాళాఖ్య తాళేన గేయా స్యా దేకతాళికా" అని సంగీతచూడామణి.

యక్షగానములలో కొన్నింట ఎకతాళి రచనలున్నవి.

'వాడు చిందులు తొక్కుతున్నాడు. ఆవీథిలో వంకాయలు వాలలాడుతున్నవి' ఇత్యాది వ్యవహారములలోని 'చిందులు' దేశిరచనా ప్రభేదములే'.

"వేడుకతో చిందు పాడంగ నుబ్బి
కోణంగియాటల గునిసెడివారు."

అని చిందుపాటను పాల్కురికి సోమనాథుడు పేర్కొన్నాడు.

'గీతార్థాభినయోపేతై ర్ద్విపదై శ్చిందు సంజ్ఞకైః' అని చిందులు రెండేసి పదములు గలవిగా జాయ సేనాపతి చెప్పినాడు. యక్షగానములో కొన్నింట చిందురచనలు కానవచ్చును. అవి ఆంధ్రదేశము నుండి అరవదేశమునకు కూడా ఎగప్రాకి అక్కడ లక్ష్యలక్షప్రయోగప్రసిద్ధి పడసియున్నవి. 'కావడిచిందు' 'నొండి' (=కుంటి) చిందు' ఇత్యాదులు అక్కడి ప్రభేదములు.

"వాడు 'తందనా' లాడుతున్నాడు" అన్న వ్యవహారములోని 'తందనాలు' తందనాపదము లన్నపేర ప్రసిద్ధి గాంచిన పదములే. వాటిలో తందానే అన్నది ఆ పదముకు పల్లవిగా–అంటే ఊతపలుకుగా ఉంటుంది.

"ఇదేమిటో పెద్ద 'రగడ'గా నున్నదే" అన్న పలుకుబడిలోని 'రగడ' గేయరచనా ప్రభేదమే. రగడలు కొంత మార్పు పొంది, పొందకుండా కూడా తెలుగులో ఎన్నో రకాల గేయరచనలయినవి.

"ధవళాలు పాడుతున్నారు" అనే నానుడిలోని 'ధవళాలు' వివాహాది శుభకార్యములలోను, యక్షగానములలోను ప్రసిద్ధిగాంచి యున్నవి.

"కథాసు షట్పదీయోజ్యా వివాహే ధవళస్తథా" అని చాళుక్య సోమేశ్వరుడు చెప్పినాడు. 'నీకే వచ్చు సువాలయున్ ధవళ మింతీ' 'అల్లోనేరళ్ళు గౌరీ కల్యాణము' ఇత్యాదిగా పాంచాలీ పరిణయమునను,

"ఆ లలనామణి కాగ
య్యాళి యొకానొక్క వేళ నక్కరతో ను
వ్వాలలు సోబానలు ధవ
ళాలున్ మొదలైన పాట లాదట నేర్పున్"

అని 'శుకసప్తతి' లోనూ ధవళాలు పేర్కొనబడినవి. యక్షగానములలో ధవళములు అధికముగా గానవచ్చును.

ఇంకా ఏలపాటలు అనేవి కూడా దేశిరచనా ప్రభేదములే. చాళుక్య జగదేక మల్లుడు సంగీతచూడామణిలో కర్ణాట లాట గౌళాంధ్ర ద్రావిడ భాషలలో ఏలలు కలవనీ అందులో ఆంధ్రుల 'ఏలలు' మిక్కిలి మనోజ్ఞములనీ చెప్పియున్నాడు. యక్షగానములలోను, సామాన్యజనవ్యవహారములలోను ఎన్నో రకాలైన ఏలలు సర్వాంధ్రదేశమునను వ్యాపించియున్నవి.

సువాలలు, ఉయ్యాలలు, ఓలలు కూడా అట్టివే.

'అల్లోనేరేళ్ళు' అనే పేరు గేయరచనలకు వింత తీరుగా వచ్చినది. అల్లోనేరేళ్ళల్లో 'వెలది రుక్మిణి సమర్తవేడుకలాయె' అని ఉపక్రమము గల పాతకాలపు పాట ఫణితిని

రచితములైన గేయములన్నింటికీ 'అల్లోనేరేళ్ళు' అన్న పేరైంది. 'ఆల్లోనేరేళ్ళ'ల్లో పాటలు వెన్నెల రాత్రులందు ఆరబైట కన్యకలు రెండు వరుసలుగా వేరుపడి ఆడుతూ పాడే పాటలు. ఇది మిక్కిలి ప్రాచీనమైనది.

'వెన్నెల దినముల, నల్లోనేరేళ్ళు గాక యావల గలవే' అని రామాయణ సుందరకాండములో గలదు. యక్షగానములలో గేయభాగములుగాను, ఇంకా అనేక కథాప్రధానగేయములుగాను ఈ అల్లోనేరేళ్ళున్నవి.

'వాడు కూనరాగాలు తీస్తున్నాడు' అన్న నానుడి సర్వాంధ్రవిదితము. ఈ కూనరాగాలు 'కూనలమ్మ పదాలు' అనే వింతతీరు పదరచనలు.

ఇంకా 'శోభనాలు', 'కొట్టాలపాటలు', 'గౌరీకల్యాణము', 'అర్ధ చంద్రికలు', 'జంపెలు', 'కురుచజంపెలు', 'త్రిభంగులు', 'వెన్నెల పదాలు', 'తుమ్మెదపదాలు', 'చిలుకపదాలు, 'త్రిపదలు', 'షట్పదులు', 'సప్తపదులు' మొదలైన పదాలెన్నో లక్ష్య లక్షణస్వరూపాలలో వున్నవి. మార్గశిరమాసము వస్తున్నది. ఆ నెలలో ఆంధ్రదేశ మంతటా కన్యకలు 'గొబ్బిళ్ళు' అని పేడ బొమ్మలు పెట్టి గొబ్బిపాటలు పాడే సంప్రదాయమున్నది. 'గొబ్బియలు', 'గొబ్బిళ్ళు' అనే పదము 'గోపికలు' అన్న పదమునుండి పుట్టినది. గొబ్బిళ్ళయాట రాసక్రీడానృత్యమే. గొబ్బిళ్ళపాటలు పెక్కు తీరులవి కలవు. పై వాటిలో కొన్నిటికి మాదిరులు వినండి.

గొబ్బిపాట :

కొలనిదోపరికి గొబ్బిళ్ళో, యదు
కులస్వామికిని గొబ్బిళ్ళో, కొండ
గొడుగుగా గోవులఁగాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్ళో
దుండగంపు దైత్యుల కెల్లను తల
గుండు గండనికి గొబ్బిళ్ళో

పాపవిధుల శిశుపాలుని గొట్టిన
కోపగానికిని గొబ్బిళ్ళో
ఏపుఁన గంసుని యిడుమల బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్ళో
దండివైరులను తఱిమిన దనుజుల
గుండెదిగులునకు గొబ్బిళ్ళో
వెండి పైఁడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్ళో.

ఉయ్యాల పాట :

అలర ఁజంచలమైన ఆత్మలం దుండని
అలవాటు సేసే నీ వుయ్యాలా...
పలుమారు నిశ్వాసపవనమం దుండ నీ
భావంబు చెలిపె నీ వుయ్యాలా...
ఉదయాస్తశైలంబు లొనర గంభములైన
ఉడుమండలము మోచె నుయ్యాలా
అదన నాకాశపద మడ్డదూలంబైన
అఖిలంబు నిండె నీ వుయ్యాలా
పదిలముగ వేదములు బంగారు చేరులై
పట్ట వెరుపై తోచె నుయ్యాలా
వదల కిటు ధర్మదేవత పీఠమై మిగుల
వర్ణింప నరుదాయె నుయ్యాలా...

అల్లోనేరేళ్ళు :

(అల్లోనేరేళ్ళలో వెలది రుక్మిణి సమర్త వేడుకలాయె.. అనే మట్టుతో)

అల్లోనేరేళ్ళల్లో చెలువ కృష్ణుం
డనుచు చెప్పరే మీరు అల్లో...
అల్లోనేరేళ్ళల్లో కరివేల్పు
మనదొరకు కలిగెనే నేడూ
అల్లోనేరేళ్ళల్లో గిరివరుని వలె నితడు
చెలగుచున్నాడూ
అల్లోనేరేళ్ళల్లో తరుణీ యశోదకూ
తనయుడైనాడూ
గురికానివలె నితడు గునియుచున్నాడూ
మింటపూవుల వాన మెలత కురిసేనే
వింటిరే భేరీలు వేడ్క మొరసేనే. అల్లో...

వెన్నెల పదము :

ఎన్నాడు వానికి నే లలననైతినో
వెన్నెలారో, వాడు
నన్నెద దలచడు,
నే నేమి చేతును, వెన్నెలారో
చాలగా నమ్మి తా చక్కని చెలిమికి
వెన్నెలారో, నా
మేలును నింతైన మనసు
నుంచడాయె వెన్నెలారో
వలపు నిల్ప నాదు వశము కాదు
ఇంక వెన్నెలారో.

చిలుక పదము :

మనవి నొక్కటీ చెప్పేనే రామచిలుకా, నా
మనవి గైకోవే వో రామచిలుకా...
వజ్జరం గొట్టేనే వో రామచిలుకా, వాని
బుజ్జగించి తోడితేవే రామచిలుకా.

ధవళము :

జయ జయా జ్ఞానసంపన్నా
జయ జయా నిన్ను బుధు లెన్నా
జయము నీ పదములూ గన్నా
జయ మౌను ఒడయ నంచెన్నా.

ఏల (తత్త్వము) :

నీవూ నేనూ గూడీ భావనా కొలదీ
కేవల బ్రహ్మను గీలుకొల్పుదమూ – నీవూ,
సారె సారెకు వారీ సరససంగములా
తీరుగా జగముల ద్రిప్పుచుందామె,
మానవీగణముల మమత నొందించీ
పూని భ్రాంతులలోన పొరలజేయు
దమూ – నీవూ. (జ్ఞానకురవంజి)

సువాల :

మానసంహరుండు తొల్లి
దారువనములో మునుల
చారుముఖులతో రమించు జారవిద్యలన్

తేటగ నేనే సువాల పాటగా రచించువాడ
పాటలాగంధు లెల్లఁ బ్రౌఢి బాడఁగా
హరుడు నొక్కనాడు తారకాచలంబునందు తనకు
నర్హమైన రత్నసింహాసనంబు నందునా. (దారువనక్రీడనము)

తుమ్మెద పదము :

అదినాథుడ రావె తుమ్మెదా, అ
ల్లతడే వూరికి పోయె తుమ్మెదా, నా
వద్ద నెవ్వరు లేరు తుమ్మెదా, వచ్చి
వాలలాడి పోవె తుమ్మెదా.

వెన్నెల పదము :

అక్కలమ్మకు సారెపోయ వెన్నెలారో, ఇపుడు
లెక్కలేని కదుపు లాయె వెన్నెలారో
కుందులమ్మ పుణ్యాన వెన్నెలారో
నందునికి కొడుకు కల్గె వెన్నెలారో
పొంగళ్ళు పెట్టుదము వెన్నెలారో మంచి
బోనాము ముద్దె లంది వెన్నెలారో.

(పరిశోధన – 1954 ఆగస్టు, సెప్టెంబరు)

13. తాపీ ధర్మారావు

(1887-1973)

తాతాజీగా, సాహితీ భీష్మాచార్యులుగా గణుతి కెక్కిన తాపీధర్మారావు పత్రికా సంపాదకులుగా, సాంఘిక విమర్శకులుగా, కావ్యవ్యాఖ్యాతగా ప్రసిద్ధులు. 1887 అక్టోబర్ 9వ తేదీన విజయనగరంలో జన్మించిన ఆయన మద్రాసు, తర్వాత హైదరాబాదులో నివాసం ఏర్పరుచుకొన్నారు. కాలేజీ ట్యూటర్‌గా, బొబ్బిలి సంస్థానం దివానుగా, యుద్ధకాలంలో పబ్లిసిటీ రిక్రూటింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగాలు చేశారు. 1936లో సినిమారంగంలో ప్రవేశించి సుమారు 50 చలన చిత్రాలకు సంభాషణలు, స్క్రీన్‌ప్లే వ్రాశారు. సమదర్శిని, కాగడా, కొండెగాడు, జనవాణి పత్రికలు నిర్వహించి పెక్కు కలంపేర్లతో రచనలు చేశారు. 'వేగుజుక్క గ్రంథమాల' సంపాదకులుగా గ్రంథాలు ప్రచురించారు.

తొలిరోజుల్లో గ్రాంథిక భాషావాదిగా ఉండి వ్యావహారిక వాదాన్ని ఖండించిన ధర్మారావు తర్వాత తన దృక్పథం మార్చుకొని వ్యావహారిక భాషలోనే రచనలు చేశారు. దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు, పెళ్ళి–దాని పుట్టు పూర్వోత్తరాలు ఆయన సామాజిక పరిశోధన దృష్టి, హేతువాదానికి నిదర్శనాలు. విజయవిలాసానికి హృదయోల్లాసవ్యాఖ్య, పారిజాతాపహరణానికి భావప్రకాశిక వ్యాఖ్య, పాతపరిశీలనలు సాహిత్యవిమర్శలో ఆయనకు విశిష్ట స్థానాన్ని గడించాయి. 'ఉషఃకాలము' గ్రాంథికభాషలో విరచితమైన ఆంధ్రభాషా స్వీయచరిత్ర. పాతపాళీ, కొత్తపాళీ భాషావిషయక వ్యాసాల సంపుటులు. తెలుగు అక్షరాలు, ఉచ్చారణ, పదాల వ్యుత్పత్తి గురించి పరిశోధనాత్మక వ్యాసాలు వ్రాసిన తాపీ ధర్మారావు 1973 మే 8వ తేదీన తనువు చాలించారు.

13. తెలుగు పలుకుబడులు

- తోపే ధర్మారావు

మానవుడిని పెద్ద చేసింది మాట. మాట ద్వారా మనుష్యులు భావాలను ప్రకటిస్తారు. భావాల హెచ్చుతగ్గులను బట్టి అనేవాడి సామర్థ్యాన్ని బట్టి మాటలు బయటపడతాయి. వినడానికిష్టము లేనప్పుడు 'ఊరుకో' అంటాము. ఇంకా చికాకైనప్పుడు 'నోర్మూయ్' అంటాము. అలాగే, అటునుంచి ఇటు, మాటలను బట్టి మనిషికూడా బయటపడతాడు. ఆ మనిషి ఏ భాషవాడో, ఏ ప్రాంతం వాడో, ఏ వ్యాసంగం వాడో, అతడాడిన తీరును బట్టి అనిన మాటలను బట్టి తెలుసుకోవచ్చును. 'మాకీ అదీ పస్కీరాదూ' అని ఉచ్చరించిన మనిషికి తెనుగు మాతృభాష కాదని స్పష్టమౌతుంది. 'చారు ఉన్నాయా' అన్న మనిషి కృష్ణా, గుంటూరు జిల్లాల వాడని గ్రహించగలము. 'ఈ కాలపు గుంటలను నమ్మరాదు' అన్నవాడు గంజాం విశాఖపట్న ప్రాంతాలవాడని చెప్పనక్కరలేదు.

'చుట్టత్రాగుట' అనడం తెలుగువారి అలవాటు. 'పొగత్రాగని వాడు దున్నపోతై పుట్టున్' అన్నాడు మహాకవి గురజాడ.

"మీరున్ పొగత్రాగెదరా
వారిజభవ, వామదేవ, వైకుంఠపతీ!
ఓరీ నారద వినరా
ఈ రేడు జగంబులందు నిది ముఖ్యమురా!"

అని చాటువు. ఓఢ్రులు 'పిక్కాఖైబూకీ' అంటారు. దీనిని తెలుగు చేస్తే 'చుట్టతింటావా' అనాలి. తెలుగువారికి హాస్యాస్పదంగా ఉంటుంది. మనము ఒరియా భాష నేర్చుకొని 'పిక్కాపీబూకీ'(త్రాగుతావా) అని అంటే ఒరియావారు నవ్వుతారు. అందులో తప్పున్నదని కాదు. ఆ భాషలో అలా అనరు. వారికా అలవాటులేదు. అంతే! అదే వారి ప్రత్యేక పద్ధతి. మాటతీరు, పలుకుబడి, నుడికారమన్నా, ప్రాంతీయమన్నా, దేశీయమన్నా, జాతీయమన్నా, ఆ ప్రత్యేకతే!

పలుకుబడి అంటే పలికే తీరు; ఆ భాష మాతృభాషగా కలవారు అలవాటుపడి పలికిన పద్ధతి. తప్పైనా ఒప్పైనా సకారణమైనా, అకారణమైనా ఆ భాషవారు అలాగే అంటారు. ఇంకొకలాగ మార్చి అంటే, ఆ అర్థం రావచ్చును గాని, ఆ భాషగుణము రాదు. ఏదో పరాయిభాష వాడు మాట్లాడుతూన్నట్లే ఉంటుంది. ఈ మార్చి అనడం నిర్దుష్టమైనా, ఆ భాష వారికి అదినచ్చదు.

కాబట్టి మన పలుకుబడులకు తెలుగుతనం ముద్ర ఉంటుంది. వాటి ప్రయోగమువల్ల తెలుగుతనం స్పష్టంగా కనబడుతుంది. తెలుగువారి హృదయాలకు సూటిగా నాటుతుంది. ఆ రూపంగా సంభాషణకు గాని, రచనకు గాని ఒక అందం. ఒక రససిద్ధి సమకూరుతుంది. ఆ అందం ఉండబట్టే దానిని మనం నుడికారం అని కూడా అంటున్నాం.

ఈ నుడికారం గురించి ఒక్క చిన్న సందేహం:

> ***"ప్రౌఢి పరికింప సంస్కృతభాష యండ్రు,***
> ***పలుకు నుడికారమున నాంధ్రభాష యండ్రు;***
> ***ఎవ్వరేమైన నండ్రు నాకేమి కొదవ***
> ***నా కవిత్వంబు నిజము కర్ణాట భాష"***

అన్న శ్రీనాథుని పద్యముంది కదా! ఇక్కడ నుడికారమన్న మాటకు 'పలుకుబడి'

అని అర్థము చెప్పి, 'పలుకు నుడికారము' అంటే 'పలుకునట్టి పలుకుబడి' అని వ్యాఖ్యానిస్తామా? కాక 'పలుకు నుడికారము' అంటే 'పలుకులందుగల నుడికారము (గుణము, అందము)' అని అర్థం చెప్తామా? పెద్దలు నిర్ణయించవచ్చు.

ఏమైనా మాటలో కారమున్నా, నుడికారంలో ఒక మాధుర్యముంది. ఆ నుడికారం ఎంత సమృద్ధిగా ఉంటే రచన అంత హృదయంగమంగా ఉంటుంది.

తల్లి మదేక పుత్రిక, పెద్ద, కన్నుల
గాన, దిప్పుడు మూడు కాళ్ళ ముసలి;
ఇల్లాలు కడుసాధ్వి ఏమియు నెరుగదు
పరమ పాతివ్రత్య భవ్యచరిత;
వెనుక ముందరలేదు నెనరైన చుట్టంబు
లేవడి యెంతేని జీవనంబు;
కానక కన్న సంతానంబు శిశువులు
జీవన స్థితికేన తావలంబు;........

అన్నప్పుడు ఆ ముసలితనము, ఆ దిక్కులేనితనము, ప్రత్యక్షముగా కనబడకతీరదు. 'మూడుకాళ్ళ ముసలి' అనడానికి బదులు 'బాగా నడుము వంగిపోయిన ముసలిది' అనినా, 'వెనుక ముందరలేదు' అనకుండా 'ఆదరించే వారెవ్వరూ లేరు' అనినా ఆ బలమే ఉండదు; ఆ అందమూ రాదు. అందుచేత నుడికారాలు శక్తిమంతములైనవని అంటాము.

వీటి పుట్టుక :

ఈ నుడికారాలు ఎప్పుడు ఏపరిస్థితులలో ఎవ్వరు మొదట ఉపయోగించారో చెప్పలేము. కాని అవి చాల పురాతనమైనవని, జనసామాన్యం లోనుంచి వచ్చాయని, ప్రజలలో వ్యాపించి నాటుకు పోయాయని మాత్రం మన మంగీకరించక తప్పదు.

'జనసామాన్యం లోనుంచి వచ్చాయి' అన్నప్పుడు నా ఉద్దేశం 'పాండిత్యం వల్ల ఏర్పరచినవి కావు' అనే. ఎవడో ఒకడికి – నిరక్షర కుక్షే కావచ్చును – బాగా కోపం వచ్చినప్పుడు, తన ఒళ్ళంతా మండుతూన్నట్లు అనిపించింది. ఆ భావాన్నే వాడు 'ఆమాటే అనకు, నా ఒళ్ళు మండుతూంది' అని అంటాడు. మాటలవల్ల అతని కోపం ఎంత అధికంగా ఉందో, విన్నవారికి అచ్చొత్తినట్టు తెలుస్తుంది; మనస్సులో నాటుకుపోతుంది. అవసరం అనిపించినప్పుడు ఇతరులు కూడా అలాగే అంటారు. అది ఒక పలుకుబడి అవుతుంది. ఈ పలుకుబడిలో ఉన్నమాటలు రెండు! ఒళ్ళు మండడం. కాని భావం అధిక కోపం అని. ఇక్కడ ఒళ్ళులేదు. మండడం లేదు. అలాగే యాచించాడు అన్న అర్థంలో చేయిచాచాడు అంటాం. యాచించినవాడు చేయి లేనివాడు కావచ్చును. ఉన్నా, చేయి ముడుచుకునే ఉండవచ్చును. అయినా ఆ అర్థంలో తెలుగువాడు ఆ నుడికారాన్నే ప్రయోగిస్తాడు. ఒళ్ళు మండుతూంది అనడానికి 'దేహం దహించుకు పోతుంది' అని అనగలం కాని, దానిని విన్న తెలుగువాడు అర్థం చేసుకోవాలంటే, మొదట దానిని ఒళ్ళుమండడంగా మార్చుకొని, ఆ తరువాతనే కోపతీవ్రతను గ్రహించాలి. ఈ మార్చుకోవడం ప్రయత్నపూర్వకంగా కావచ్చు. అప్రయత్నంగా, అభ్యాసరూపంగా కావచ్చు. కాని ఆ మార్పు జరగక తీరదు. ఎందుచేతనంటే తెలుగునుడికార ముద్ర ఆ ఒళ్ళు మండడానికే ఉంది. ఆ రూపమే ప్రజా సామాన్యంలో వ్యాప్తిపొందింది. అదే ప్రసిద్ధమై స్థిరమయింది. మార్చడమంటే ఒప్పుకోరు. మార్చి చెప్పినవాడు తాత్పర్యాన్నే ప్రకటిస్తాడు కాని పలుకుబడిని పలుకడు. 'తెలుగు తెలుగు' మాట్లాడడు. అనగా పలుకుబడులు సాధారణంగా భాషాంతరీకరణానికి లొంగవన్నమాట. వెనుకాడుట (అంటే సంకోచించుట, తప్పించుకొనుట) అని ఒక పలుకుబడి మనకుంది. 'ఆనాడు చెప్పాడు కాని ఇప్పుడు వెనకాడుతున్నాడు' అని వాడతాం. దీనిని 'వెనుకనాడుట' అని మార్చామా, ఆ పలుకుబడి పాడైపోవడమే కాదు, అర్థం కూడా మారిపోతుంది.

అవలబోయిన వెన్కనాడు టెన్నడు లేదు
మొగము ముందరనంట మొదలె లేదు
చనవిచ్చి చవుక చేసినది యెన్నడు లేదు
వదరి హెచ్చించుట మొదలె లేదు.....

(విజయ విలాసం)

ఇక్కడ 'వెనుకనాడుట' అంటే, 'వెనుకాడుట' అని అర్థం చెప్పలేము. వెనుకనాడుట అంటే 'దూషించుట' అనీ 'మొగము ముందరననుట' అంటే ముఖ ప్రీతికోసం మాట్లాడడం అనీ, నుడికారార్థాలు చెప్పుకోవాలి.

'పలుకుబడులు సాధారణంగా జనసామాన్యంలో నుంచే వస్తాయి; పాండిత్యం వల్ల ఏర్పడినవి కావు' అని అన్నాను. దీనికి పండితులు కోపించనక్కరలేదు. కొంచం పరిశీలించి చూస్తే, మహావ్యాప్తిలోనున్న కొన్ని నుడికారాల రూపాలు, అగమ్యగోచరంగా ఉంటాయి. 'కాదారి మాదారి పొద్దు' (చాలా చీకటిగా ఉన్న సమయము) అంటారు. ఈ కాదారి మాదారిని సమర్థించడానికి మన వారు ప్రయత్నించి, 'కాని దారి మాని దారి' అని వ్యాఖ్యానించారు. ఇక్కడ మాని దారి అంటే సరియైన దారి అని అర్థం చెప్పుకోవాలి. కాని దారిని కాదారి చేసి, మాని దారిని మాదారి చేసి అన్వయించుకోవడానికి వ్యాకరణం ఒప్పుకోవాలి. ఆ తరువాత ఈ రెండు దారులూ ఏర్పరచుకోలేనంత చీకటి అని అధ్యాహారంగా చెప్పుకొని, 'పొద్దు'లో అన్వయించాలి. ఇంత గందరగోళం ఉన్న రూపం పండిత శాఖనుండి వచ్చిందనడం మనకు గౌరవ ప్రదం కాదు. పలుకుబడులలో అనేకం వ్యాకరణానికి విరుద్ధంగా ఉంటాయి. ఇంకెన్నో తర్కానికి లొంగవు. ఎన్నిటిలోనో అతి వ్యాప్తి, అవ్యాప్తి దోషాలుంటాయి. ఇలాంటివన్నీ భాషా సంస్కారం కలిగిన వారు నిర్మించారనడం ధర్మంకాదు.

అంతేకాదు. ఈ పలుకుబడులలో నూటికి తొంభై అయిదుపాళ్లు అత్యంత సాధారణంగా, అందరు తెలుగువాళ్ళ నోళ్లకు వచ్చినటువంటి, పదహారణాల తెలుగు

మాటలే. మన 'పదబంధ పారిజాతం' లో ఏ నాలుగు పుటలైనా చూస్తే, ఈ సత్యం తేటపడక మానదు. ఈ కారణంచేతనే వీటికి తెలుగు ముద్ర లభించింది. వాటినలా ఉపయోగించే మన పండితులు, కవులు తమ తెలుగుతనాన్ని ప్రకటించుకొన్నారు. తమ వాక్యాలకు వన్నె తెచ్చుకొన్నారు. పదాలను మార్చి భావాన్నే ప్రకటించినవారికి ఈ తెలుగు ముద్ర లభించదు. ఈ విధంగా పలుకుబడి తెలుగు ప్రజలలో పుట్టి, తెలుగు ముద్రను పొంది, తెలుగు దేశంలో వ్యాపించి, తెలుగు జాతీయమన్న గౌనవం సంపాదించుకొని తెలుగు కవిత్వానికి ఒక అందాన్ని కలిగించింది.

పండితులూరుకున్నారా ?

ఇన్ని చదువులూ చదివిన పండితులు, పలుకుబడులను నిర్మించకుండా ఊరుకున్నారా అంటే, ఊరుకోలేదనే చెప్పాలి. పలుకుబడుల వల్ల రచనకు కలుగుతూన్న ఆదరాభిమానాలను గుర్తించారు. వాటిని విశేషంగా తమ రచనలయం దుపయోగించి, తెలుగువారి మెప్పును పొందారు.

"చిన్ని వెన్నెలకందు వెన్నుదన్ని సుధాబ్ధి
పొడమిన చెలియ తోబుట్టు మాకు....
ననవిల్తు శాస్త్రంపు మినుకు లావర్తించు
పని వెన్నతోడ బెట్టినది మాకు......."

అని అల్లసాని పెద్దన్న ఎంతో హాయిని కలిగించాడు. 'వెన్నుదన్ని' 'వెన్నతోడ పెట్టినది' అన్న జాతీయాలను ప్రయోగించి, వాని లాభం అపారంగా పొందాడు. వెన్నెలకందు అని ఒక పదబంధంకూడా నిర్మించాడు. దీనిలోనూ చక్కని అర్థం ఉంది. తెలుగుతనమూ ఉంది. కాని ఇది ప్రజల్లో వ్యాప్తి పొందలేదు. ప్రజాముద్ర ఇంకా దీనికి చిక్కలేదు.

కెలకులనున్న తంగెటి జున్ను గృహమేధి,
యజమాను డంకస్థితార్థ పేటి;
పండిన పెరటి కల్పకము వాస్తవ్యుండు,
దొడ్డి పెట్టిన వేల్పుగిడ్డి కావు;
కడలేని యమృతంపు నడబావి సంసారి,
సవిధ మేరునగంబు భవనభర్త;
మరుదేశ మధ్యమప్రపా కులపతి,
ఆకటి కొదవు సస్యము కుటుంబి;....

అన్నాడు అల్లసాని కవి. అనాయాసంగా కావలసినప్పుడు సులభంగా దొరకడానికి వీలైన గొప్ప విషయం అన్న భావం ప్రకటించడమే కవి ఉద్దేశం. దీనికోసం తంగెటి జున్ను, అంకస్థితార్థపేటి, పెరటి కల్పకము మొదలైన ప్రయోగాలు చేశాడు. శక్తిమంతమైన ఉపమానాలు, చక్కని పదబంధాలు, కాని వీటికి నుడికార ముద్ర దొరకలేదు. అంటే అవి ప్రజలలోనికి ప్రాకలేదు. ప్రజలకు తెలిసిన నుడికారం, ఈ అర్థంలో 'కొంగు బంగారం' .

చేమకూర కవి –

'కోప మొకింత లేదు బుధకోటికి కొంగు పసిండి'.

అన్నాడు సూటిగా. దానిలో ఇదే భావము. ఇంతకంటే తెలుగు జాతికి అందుబాటులో ఉన్న పలుకుబడి. అల్లసాని పదబంధాలకు ఆ గౌరవం రాదు.

దీనిని బట్టి చూస్తే 'పదబంధాలన్నీ పలుకుబడులు కావు' అని అనవలసి వస్తుంది. తర్క శాస్త్రంలో "All 'S' is "P'; but some 'P' is not 'S' అన్నట్టు, పలుకుబడులన్నీ పదబంధాలైనప్పటికీ పదబంధాలన్నీ పలుకుబడులుకావు. పద్మము పంకజము అయినా, పంకం (బురద) లో పుట్టినవన్నీ పద్మములు కావు కదా.

"పెట్టనికోట నీకు హరి భీముడు నర్జునుడున్ విరాటుడున్
చుట్టపు మేరువు.. "

అన్నాడు తిక్కన. పెట్టని కోట, చుట్టపు మేరువు రెండూ భావస్ఫూర్తికల పదబంధాలే, కాని పెట్టనికోటకు వచ్చిన నుడికార గౌరవం చుట్టపు మేరువుకు రాలేదు కదా.

తార్కాణ:

"పెట్టని కోటకాదె గజబృందము లెందును రాజధానికిన్" (విజయవిలాసం)

వజ్రకవచ మన్న పదబంధముంది కదా. పెద్దన్న – "నిజ భుజాశ్రితధారుణి వజ్రకవచంబు" అన్నాడు. దీనినే విజయవిలాసకర్త, 'హితశిష్టవ్రాత సంతోషణ శ్రీవజ్రాంగి' అని ప్రయోగించాడు. వీటిలో నుడికార లక్షణాలున్నాయి. కాని పలుకుబడి గౌరవం వాటికి రాలేదు. అలా అనటానికి–

తార్కాణ :

ఆనందావారి మనుచరిత్రకు శ్రీ కోమాండూరి అనంతాచార్యులవారు టీకాతాత్పర్యాలు వ్రాశారు. శ్రీ తేవప్పెరుమాళ్ళయ్యగారు పీఠిక వ్రాశారు. శ్రీ బులుసు వేంకట రమణయ్య గారు పరిష్కరించారు. వీరిలో చిన్న వారెవ్వరూ లేరు. ఆ వ్యాఖ్యానంలో, 'నిజ భుజాశ్రిత ధారుణి వజ్రకవచంబు' అంటే; 'తనదైన బాహువును పొందిన భూమికి వజ్రమణులతో చేయబడిన కవచము వంటివాడు' అని వ్యాఖ్యానం వ్రాశారు. 'వజ్రకవచమును' పలుకుబడిగా వారు గ్రహించలేదు. కాబట్టే ముక్కకు ముక్క అర్థం చెప్పారు. కఠినాతి కఠినమైనది వజ్రము. కాబట్టి లోహకవచం కన్న వజ్రకవచం ఎక్కువగా రక్షిస్తుందని భావము. అందుచేత పైమాటలకు అర్థము, 'చేతి కిందికి వచ్చిన దేశాన్ని బాగుగా రక్షించగలవాడు' అని చెప్పడం న్యాయం. అలా చెప్పకపోవడమే 'వజ్రకవచం' అన్న పదబంధము ప్రజా వ్యాప్తి పొంది పలుకుబడి కాలేదనడానికి నిదర్శనము. కాబట్టి పలుకుబడుల కోశాన్ని 'పదబంధ పారిజాతం' అనడం కొంచెము అతివ్యాప్తిపాల పడుతుందేమో.

వీటి ప్రయోజనం :

సముచితమైన పలుకుబడుల ప్రయోగంవల్ల మన కవులు తమ కావ్యాలను రసవంతంగా చేసుకోగలిగారు. మనుచరిత్రలో, మనోరమ ఘట్టములో–

"ఓయి దయావిహీనమతి ఊరక ఈ పసిబిడ్డ గొట్టగా
చేయెటులాడె నీకు? నిది చేసిన దేమి? వృథా శపింతురే?
బోయవె, యాడుతోడునను బుట్టవె? శావనిమిత్తమే తవం?
బీ యెడనున్న శాంతివరు లేమనువారిక నీ చరిత్రకున్ ?"

అన్న పద్యం ఉంది. నాగబెత్తము పట్టుకొని, మనోరమను కొట్టిన మునితో చెలికత్తెలంటున్నారు. దీనిలోని 'పసిబిడ్డ' పలుకుబడి నాలుగైదేళ్ళ బిడ్డ అని కాదు. ఏమియు నెరుగనిది అని అర్థము చెప్పాలి. ఎందుచేతనంటే ఆ మనోరమను.

"తిమిరంపు వయసు గుబ్బల
కొమరాలవు నీకు దగిన గోవాళ్ళ మహిన్
నెమకి నగరాదె ముదిసిన
మము జెనకిన నేమిగలదు మద మేమిటికిన్"

అని అనడానికి అవకాశం కలగాలి. దీనిలో 'తిమిరంపు వయసు' ఎంత అందమైన నుడికారము: ఆ పద్యంలో చేయెటులాడె నీకు అన్నది కూడా నుడికారార్థములోనే. మనస్సెలా ఒప్పిందీ అన్న భావం.

"ఉద్రేకంబున రారు శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు
చిద్రోహంబును నీకు సేయరు, రణోత్సేకంబునన్ పుత్రులన్
భద్రాకారుల పిన్న పావల రణప్రౌఢక్రియాహీనులన్
నిద్రానక్తుల నంహరింవ నకటా నీ చేతులెట్లాడెనో."

అని ద్రౌపది తన కొడుకులను ఘోరంగా చంపిన అశ్వత్థామతో అంటుంది.

'నీ చేతులెట్లాడెనో' అన్న పలుకుబడివల్ల ఈ వాక్యాలలో ఒక ఆడుతనము కనిపిస్తుందనడానికి సందేహము లేదు.

పలుకుబడులు జనసామాన్యంలో పుట్టి బ్రతకాలి కాబట్టి, అవి జనసామాన్యానికి అందుబాటులో ఉన్న విషయాన్ని గురించే ఉండాలి. అంతే కాదు జన సామాన్యం నోళ్ళకు వచ్చిన మాటలలోనే ఉండాలి. అందుచేతనే ఈ పలుకుబడులలో శరీరావయాలకు సంబంధించినవి, పశుపక్షులకు సంబంధించినవి, ప్రకృతి విషయాల గూర్చినవి, వ్యవసాయాది వృత్తులకు సంబంధించినవి, ఇలాంటివనేకం ఉంటాయి. నగనట్ర ఏండ్లుపూండ్లు వంటి జంట పదాలు ఉంటాయి. అందులో కొన్ని పదాలకి ప్రత్యేకంగా అర్థమే ఉండదు. నోరు చెయ్యడం కాలు త్రొక్కడం లాంటి శబ్దవల్లవాలు అనేకం పలుకుబడులయినాయి. వీటిని గురించి మన పదబంధ పారిజాత సంపాదకులు పీఠికలో విపులంగా వ్రాశారు. ఇక్కడ పునరుక్తి ఎందుకు?

పలుకుబడులు కొన్నింటిలో వ్యాకరణమూ, తర్కమూ కనబడదని మనవి చేశాను. చూడండి. 'ఊరికి ఊరే తగులబడి పోయింది' అని అంటాం. అర్థం 'సంపూర్ణంగా' అని. ఈ 'కి' షష్ఠిని ఏ వ్యాకరణం కాపాడుతుందో తెలియదు.

'ఇంటికి నిల్లు గట్టుకొని యేగగవచ్చు మురారి వెంట? నా
ఇంటికి వచ్చి పూజగొని యేగుట నన్ను కృతార్థుచేత'

అని కకుత్స విజయం. దీనిలో పలుకుబడి అనదగినది 'ఇంటికి ఇల్లు' అన్నంతవరకే కాని 'ఇంటికి నిల్లు గట్టుకొని యేగు' అన్నంతవరకూ కాదు. ఇంటికి ఇల్లు అంటే ఇంటిలోని అందరూ, కట్టుకొని యేగుట అంటే కూడి జట్టుగా వెళ్లుట అనేగాని మరొకటి కాదు. ఇటువంటి సందర్భములో 'ఇంటిల్లిపాది' అని కూడా అంటారు. ఈ 'ఇలపాది' 'వేలుపాది' అవుతుందేమో! అలాగే అయితే ఈ రూపాన్ని పండితులెలాగ సాధిస్తారో తెలియదు.

అర్థం చేసుకోవడం :

తరువాత పలుకుబడులు జనసామాన్యంలో నుంచి కలిగినవి కాబట్టి వాటిని చక్కగా గ్రహించాలంటే మనకు ఆ జనసామాన్యంతో సంబంధముండాలి. లేకపోతే ముక్కకు ముక్క అర్థమయినా చెప్తాము. లేదా తప్పు అర్థమయినా చెప్తాము. అదే ఒక పండితుడూ పరిష్కర్తా అయితే అర్థం చేసుకోలేక ఆ పలుకుబడిని దిద్ది, రూపుకూడా మాపుతాడు.

'చెలువ నిను రాజకీరంబు చెట్టబట్టె
కలికి నిను రాజహంసంబు కాలు ద్రొక్కె
మంచి శకునంబు; లిదిగో! నా మాట చూడు
కన్నె ఈ లోన పెండ్లి కాగలదు నీకు.'

అని విజయ విలాసంలో పద్యం. త్రిదండి వేషంలో ఉన్న అర్జునుడు, శుశ్రూష చేస్తూ ఉన్న సుభద్రతో అంటాడు. ఈ పద్యంలో మెల్లగా వివాహ ప్రసంగం మొదలుపెడతాడు. ఆసమయంలో ఆమె–

'కంగుల్ దీర్చిన పైఠీనీ రవికె చన్గట్టంటి రాణింపగా
చెంగల్వల్ నెరిగొప్పునందు నొరపై చెంతన్ గుబాళింపగా
బంగారందియ ముక్కునన్ గమిచి పైపై నంచ యెల్గింపగా
సింగారంబగు ముద్దుచిల్క తనకున్ చేదోడువాదోడుగాన్.'

నిలబడ్డది. చేతిమీద ఒక చిలుక, కాలు త్రొక్కుతూ ఒక హంస ఉన్నవి. వాటి నాధారం చేసుకొని, రాజకీరంబు చేయిబట్టి ఉంది కాబట్టి రాజశ్రేష్ఠుడు నిన్ను చెట్టబట్టుకొని (పాణిగ్రహణము) చేయును అనీ, రాజహంసము కాలుత్రొక్కుతూ ఉంది కాబట్టి రాజశ్రేష్ఠుడు నిన్ను కాలు త్రొక్కును, (పెండ్లి చేసుకుంటాడు) అని శకున ఫలం చెప్తా డర్జునుడు. దీనిలో 'చెట్టబట్టు', 'కాలుత్రొక్కు' అన్న రెండు మాటలకు, 'వివాహము చేసుకొను' అన్న అర్థమే ఉంది. అదే చేమకూరివాని చమత్కారము. శ్లేష.

ఆ సంగతి మన వ్యాఖ్యాతలకు తెలియలేదు. 'కాలుద్రొక్కు' అంటే 'కదియు(సమీపించు)' అన్న మరొక పలుకుబడి అర్థము పట్టుకున్నారు. శబ్దరత్నాకరములో ఈ అర్థమొక్కటే ఉంది. దానితో జేసిన వ్యాఖ్యానానికి సందర్భశుద్ధి ఎలా వస్తుంది? కొన్ని తెగల వివాహములలో భర్తచేత భార్య కాలు త్రొక్కించడం ఆచారం. మంగళసూత్రధారణ జరిగినా, ఈలాగు కాలు త్రొక్కుకున్నంత వరకు వివాహము పూర్తి కాదు. ఈ లోగా భర్త చనిపోతే ఆ పెళ్ళికూతురు విధవకాదు. కాలు త్రొక్కి కంకణం కట్టడం కత్తికి కంకణం కట్టడం అని పెళ్ళి పద్ధతులున్నాయి. ఈ విషయం తెలియకే, శ్రీనాథుడు వ్రాసిన పద్యాన్ని దిద్దివేయడానికి కూడా, మన పండితులు, పరిష్కర్తలు సాహసించారు.

"అమరవతిన్ వరించెదవొ
హవ్యవహున్ చరణంబు ద్రొక్కెదో
శమనుని చెట్టపట్టెదవొ
సాగరవల్లభు బెండ్లి యాడెదో."

అని దూతగా వచ్చిన నలుడు దమయంతితో అంటాడు. ఇది కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణ సారసంగ్రహములో చూపిన పాఠము. శ్రీనాథుడి అభిప్రాయము ఈ నలుగురిలో ఎవరిని పెండ్లి చేసుకుంటావు అని. పెళ్ళిచేసుకోడానికి నాలుగు మాటలుపయోగించాడు. వరించెదవో, చరణంబు త్రొక్కెదో, చెట్టపట్టెదవో, పెండ్లియాడెదవో, వీనిలో చరణంబు త్రొక్కెదో (కాలు త్రొక్కెదవో, పెండ్లి చేసుకొందువో) అన్న అర్థములో వాడాడు. కాలు త్రొక్కడం శుభక్రమాకలన, సప్తపదులు కావు. కాబట్టి వివాహార్థం అని చెప్పడానికి వ్యాఖ్యాతలకు వీలులేకపోయింది. అందుచేత 'చరణంబు త్రొక్కెదో' అను దానిని వరణం బొనర్చెదో అని దిద్దారు మన పరిష్కర్తలు. ఈ దిద్దుబాటులతో శ్రీనాథునికే పెళ్ళి చేశారు.

ఏకార్థము గల నాలుగు వేరు వేరు పలుకుబడులు చెప్పడానికి శ్రీనాథుడు

చేతగాని వాడయాడు. చేతనైతే ఒకచోట వరించెదవో అని క్రియారూపమును వాడి, యింకొకచోట దాని కృదంతరూపముతో వరణంబొనర్చెదో అని ప్రయోగిస్తాడా అనవలసి వస్తుంది. జనసామాన్య పరిచయం లేనందువల్లనే ఇలా జరిగింది.

సారంగధర చరిత్రలో రాజనరేంద్రుడు వేటకు బయలుదేరుతూ 'డేగ పదునుగ' భోజనం చేసినట్టు కవి వర్ణించాడు. ఆ డేగ పదును ఏమిటో తెలుసుకోలేక మనవారు చాలా తికమకలు పడ్డారు. పడుతున్నారనే అనవచ్చునేమో! ఈ పదబంధము డేగవేట వారిలో నుంచి వచ్చినా ప్రజలలో వ్యాపించి పలుకుబడి అయి తంజావూరు రఘునాథరాయల ఆస్థానములోనికి కూడా పోయింది. డేగను వేటకు తీసుకు పోయినప్పుడు దాని కడుపునిండా మేతపెడితే అది భుక్తాయాసంతో కదలమన్నప్పుడు కదలదట. అలా అని తిండి పెట్టకుండా తీసికొని వెడితే ఎగరమనకుండానే, చూచిన పిట్టనల్లా పట్టుకోడానికి ఉరుకుతుందట. అందుచేత దానిని పదునుగా, అర్రాకలితోనే తీసుకుపోతారు. వేట కోసం వెడుతూన్న రాజనరేంద్రుడు, దానికి తగినట్లు లఘుభోజనం చేశాడని అర్థము.

అలాగే భటుల సంభాషణలలో 'రేకమోయుట' అన్న పలుకుబడి ఉంది. చేమకూరకవి స్త్రీముఖవర్ణన సందర్భంలో–

కన్నె నగుమోము తోడన్
వున్నమచందురుని సాటి వోలువ వచ్చున్
నెన్నుదురు తోడ మార్కొని
మున్నందరు జూడ రేకమోవక యున్నన్.

అని అన్నాడు. పద్యములో ఉన్న మార్కొని అన్న పదం వల్ల కవి అభిప్రాయంలో యుద్ధము ఉందని అనడానికి సందేహము లేదు. ఆ యుద్ధంలో మున్ను ఒకనాడు చంద్రునికి అవమానమో, అపజయమో కలిగి ఉండాలి. ఆ కారణంచేత ఈనాడు ఆ చంద్రుడు సాపంక్తి గౌరవం పొందానికి అనర్హుడౌతాడు. ఇది కవి కల్పన. ఆ అవమానమో,

అపజయమో తెల్పడానికి 'రేకమోవక యున్నన్' అని కవి ఉపయోగించాడు. అతనికి ఆ భటుల పరిచయమూ, సంపర్కమూ ఉంది. తాను క్షత్రధర్మములో ఉన్న వాడేకదా! దీనికి వ్యాఖ్యానము వ్రాసన్తా బ్రౌనుదొరగారి ఆంధ్రవ్యాఖ్యాత జూలూరు అప్పయ్యపండితుడు రేక మోవకయున్నన్ – హర్కారా పని చేయకుండా ఉండి ఉంటే అన్నట్లు అర్థం వ్రాశారు. ఆ అర్థాన్ని అంగీకరించే కీ.శే. వేదం వేంకటరాయ శాస్త్రిగారు రేకమోయుపని – తపాల నౌకరీ చేయకుండినట్టయితే అని వ్యాఖ్యానించినారు. మార్కొనుట (యుద్ధము) లో కలుగదగిన అవమానము తపాలా నౌకరీ అవుతుందా అని వారు శంకించలేదు. ఆ ప్రజలతో సంపర్కము లేకపోవడమే దీనికి కారణం. ఆ కాలపు వాఙ్మయము కొంచం శ్రద్ధగా చూచి ఉండినా ఆ పలుకుబడికి యీలాంటి అర్థం చెప్పడానికి సాహసించి ఉండరు. తారాశశాంక విజయంలో–

'సుత్రామాదుల్..... శశిమీదన్ రేక రానిత్తుమే' అని

శేషం వేంకటపతి ప్రయోగం ఉంది. ఇక్కడ తపాలాపనికి తావేలేదుకదా! అంతదూరం కూడా పోనక్కరలేదు. విజయవిలాసంలోనే అర్జునుడు సుభద్రను తీసికొని ఇంద్రప్రస్థానికి పోతూంటాడు. బలభద్రునికి తెలియకుండా తీసికొని పోతున్నాడని అపోహపడి ఆ పురరక్షకుడు తన సైన్యంతో అర్జునుడ్ని ఎదిరిస్తాడు. సుభద్ర, 'నేను రథము తోలుతాను, నీవు యుద్ధము చేయుమని' అర్జునుడ్ని ప్రోత్సహిస్తుంది. అలాగే అర్జునుడు వారిని తరిమివేస్తాడు. తరువాత కావ్యంలోని వచనం:

యిత్తెరంగున జయాంగనా సంగమంబునన్ బొసంగియు, చెక్కుచెమర్పక అక్కురువీరుడు సారథ్య నిపుణత్వమునకు మెచ్చి అచ్చిగురుబోడి నవారిత ప్రేమాతిశయం బునన్ గౌగిలించి, 'యొక్కించుక రేకమావని నా యురస్థలంబున నీకుచకుంకుమ రేక లంటించి మీ వారికి సూడు దీర్చితివి' అని నవ్వుచు....

యీ విధంగా ఉంది. ఎందుచేతనో వెంకటరాయశాస్త్రిగా రీవచనానికి అర్థాలే వ్రాయలేదు. ఆ ఆలింగనములో సుభద్ర వక్షస్థలమున పూసుకొనిన సుగంధ

కుంకుమములోని రేకలు (గీటులు) ఎఱ్ఱగా అర్జునుడి వక్షస్థలానికి అంటుకొని, కత్తివల్ల కలిగిన గాయాలలాగ కనబడుతున్నాయని కదా అర్థం చేసుకోవాలి. తపాలా నౌకరీ అనగలమా? హర్కారా పని అనగలమా? బలభద్రుడి సైన్యము ఏకాకిగా ఉన్న అర్జునుడి నెదిరించి, చివరకు పారిపోయిందే కాని, ఆ అర్జునుడికి ఒక గంటుకూడ కలిగించలేకపోయింది అన్న అపకీర్తి (సూడు) సుభద్ర బంధువులకు కలుగకుండా, కుచకుంకుమ రేకల నెపముతో సుభద్ర తన భర్తను రేకమోపే లాగ చేసింది అని తాత్పర్యము.

రేకమోయుట అనగా గంటు, గాయపడుట. ఆ గాయమే మచ్చగా చంద్రునిలో ఉందనీ, ఆ మచ్చలేకపోతే ఆమె నగుమోముతో పున్నమి చంద్రుని పోల్చవచ్చుననీ చక్కనిధ్వని ఉంది కదా! ఈ రేక మోయుట ఆనాటి భట సామాన్యములోని నుడికారము. వారి సంపర్కము లేనందువల్లనే వ్యాఖ్యాతలలో ఇలాంటి అవకతవకలు.

పలుకుబడులూ శ్లేషలూ :

మరొక్క విషయం. పలుకుబడి అంటే రెండు మూడు పదాలు కలిపి, ఆ పదాలన్నింటితో గాని, కొన్నింటితో గాని సంబంధములేని ఒక విశిష్టార్థాన్నిచ్చేది అని అనుకున్నాము. నాకుద్యోగం వస్తే వాడికెందుకురా కడుపుమంట అంటాము. ఇక్కడ కడుపుమంట నుడికారము. దీని అర్థము అసూయ – కాని కడుపు అన్నమాట కొక అర్థము ఉంది. మంటకు ఒక అర్థము ఉంది. అసూయ అన్నది ఈ రెండింటితోనూ సంబంధం లేని అర్థం. ఇలాంటి అవకాశం ఉండడం వల్ల భాషలో ఒక విచిత్రమైన విషయమేర్పడుతుంది. పలుకుబడికి నుడికారార్థ మొకటి, స్వతస్సిద్ధంగా చెప్పగల అర్థమొకటి మొత్తం రెండర్థాలకు వీలుంటుంది. అనగా శ్లేషకు మంచి అవకాశం కలుగుతుందన్నమాట.

కొందరు కవులు కేవలం నుడికారార్థంలోనే సంతోషించి వ్రాస్తారు. పెద్దన్న కటికచీకటిని వర్ణించిన పద్యంలో –

మృగనాభి పంకంబు మెయినిండ నలదిన
మాయాకిరాతు ఛాయ దెగడి,
నవపింఛమయ భూషణ లవధరించి నటించు
పంకజాక్షుని చెల్వు సుంకమడిగి

... ...

కటిక చీకటిలో రోదసి గహ్వరమున కలిసె.

అన్నాడు. తెగడి అంటే తిరస్కరించి, మించి అని అర్థము. ఆ అర్థములోనే సుంకమడిగి, కాకుసేసి అన్న పలుకుబడులను తక్కిన పాదాలలో ఉపయోగించాడు. వీటిని కేవల నుడికారార్థములోనే వాడాడనడానికి సందేహములేదు, ఏమంటే దీనిలో సుంకం (పన్ను) నుండి గాని అడగడానికి గాని అర్థము లేదు.

ప్రకట శ్రీహరి యంఘ్రిఁబుట్టి హరిమూర్ధం బెక్కి యాపాద మ
స్తకమున్ వర్ణన కెక్కు దేవి......

అని చేమకూర కవి గంగాభవానిని వర్ణించాడు. గంగానది త్రిజగములలోనూ ప్రవహిస్తోందని ఏ చోటనైనా అది పాపహారిణేనని వాడుక. అంటే సర్వత్రా– ఇక్కడా అక్కడా అనకుండా అంతటా పావనమైనదనే ప్రఖ్యాతి. ఆపాదమస్తకము అన్న నుడికారానికి అదే అర్థము. దీనికి తోడు మరొక సొగసుకూడా ఉంచాడు కవి. గంగ విష్ణుమూర్తి పాదమున పుట్టిందని, ఈశ్వరుడి తలమీది కెక్కిందని చూపించాడు. ఆ (విష్ణు) పాదము మొదలు ఈ (ఈశ్వర) మస్తకం వరకూ అని చమత్కారం కనబరిచాడు. సహృదయులకు ఎంతో ఆనందము కలుగుతుందనడానికి సందేహముంటుందా?

ఉలూచి అర్జునుడిని తన లోకానికి తీసుకొనిపోతుంది.

"కాముకుడ గాక వ్రతినై
భూమి ప్రదక్షిణము సేయఁబోయెడు వానిన్

కామించి తోడితేదగు
నా మగువ వివేక మించుకైనన్ వలదా?"

అని అర్జునుడు చిన్న నాటకమాడుతాడు. 'కాముకుడ గాక' అన్న మాటను ఖండిస్తూ ఉలూచి –

నిను గీతి సాహితీ మో
హన వాణులు చెవులువట్టి యాడింవంగా
గనియుండి 'కాముకుడగా'
నని వల్కిన నాకు నచ్చుకౌనె నృపాలా!

అంటుంది. నిన్ను సంగీతము, సాహిత్యమూ అన్న ఇద్దరు కాంతలు చెవులు పట్టి యాడిస్తూ ఉండడం అనగా స్వాధీనునిగా చేసుకొని, చెప్పినట్లు చేయించుకోగలగడం చూచిన తరువాత 'నేను కాముకుడను కాను' అంటే నమ్ముతానా అని దాని భావము. ఇక్కడ నుడికారార్థం ఉపయోగించాము. మంచి సంగీతము, చక్కని సాహిత్యము , చెవులుపట్టినందువల్ల (వినడం వల్ల) మెప్పుతోనో, ఆనందంతోనో తల ఆడించడం సహజం. అర్జునుడు అలాంటి సరసుడు సంగీత ప్రియుడు అని భావము. చమత్కారంగా పలుకుబడి అర్థముతో, మరొక అర్థము కూడా అమర్చి కవి మనోహరంగా వ్రాశాడు.

ఇలాంటి దేవతల పై నెక్కించుకోవడం, నుడికారంగా చూస్తే దీని అర్థము ఎక్కుడుగా (తెలివి తక్కువగా గూడా) గౌరవించడం. సాధారణార్థం చూస్తే తలమీద పెట్టుకోవడం అవుతుంది. ఈ రెండర్థాలు జోడించి కవి –

తాసైరింప కవర్ణయుండగ భవద్గర్భంబునన్ దాల్చి తే
జోనహ్యాన్ శరజన్ముగాంచి యల నీహార క్షమాభృత్కుమా
రీ సాపత్న్యముగన్న మోహావు పురంధ్రీరత్నమౌ దీవ కా
వే, సర్వజ్ఞుడు నిన్ను నేల తలపై నెక్కించుకో జాహ్నవీ!

అని గంగానదిని వర్ణించాడు. నీహారక్షమా భృత్కుమారి (రాచకూతురు) అపర్ణ

(తపస్విని) అయిన పార్వతి చేయలేని ఘనకార్యము చేసి, ఈశ్వరుడికి పుత్రప్రాప్తి కలిగించిన 'మోహపు' కుటుంబిని అని గంగను ఈశ్వరుడు అపారమైన గౌరవంతో చూచాడని భావము. భార్యను తలపై నెక్కించు కోవడం కొంచెం తెలివి తక్కువ పనిగా భావిస్తాము. ఈశ్వరుడు అలా తెలివి తక్కువగా చేసి ఉండడు. సర్వజ్ఞుడు కాబట్టి చాలా సకారణంగా, సముచితంగానే తలమీద నెక్కించుకున్నాడు. ఈ సొగసుకు తోడు ఆ నుడికారంలోని మాటల్ని బట్టి నెత్తిమీద పెట్టుకున్నాడు అన్న అర్థం వస్తుంది కదా! అది కూడా నిజమే! ఈశ్వరుడు గంగాధరుడు. జటా జూటములో గంగ నిముద్చుకున్నాడు. ఆహ్లాదకరమైన శ్లేష అనక తప్పదు.

చిత్తజు డల్గి తూపు మొనచేసిన చేయగ నిమ్ము, పై ధ్వజం
బెత్తిన నెత్తనిమ్ము, వచియించెద కల్గిన మాట గట్టిగా
నత్తరళాయతేక్షణ కటాక్షవిలాన రసప్రవాహముల్
కుతుకబంటి తామరలకున్ తలమున్కలు గండుమీలకున్.

అని ఆ కవే అన్నాడు. పద్యం నిండా పలుకుబడులే. పసందైన శ్లేష. మొన చేయుట కత్తి నూరుట లాంటిది. ధ్వజం బెత్తుట దండెత్తుట. రెండూ క్రోధ సూచనలే. కలిగిన మాట అంటే యథార్థము. కుత్తుకబంటి అంటే మిగుల ప్రమాదకరమైనది. తలమున్కలు అవమాన సూచన. తామరలకు ఈ (విలాసరస) ప్రవాహము కుత్తుక బంటి – మెడవరకు ఉంటుంది. అది కలిగిన మాట. అలాగే గండుమీలకు ఈ ప్రవాహము తలమున్కలుగానే ఉంటుంది. ఇదీ కలిగిన మాటే – మన్మథుడికి ఆ తామర బాణము. ఈ మీను ధ్వజము. ఈ కలిగిన మాట – తన వస్తువులకు అవమానకరము అన్నమాట. అని చెప్పినందుకు మన్మథుడు తూపుమొనచేసినా, ధ్వజము ఎత్తి వచ్చినా సరే, అనక తప్పను అంటాడు కవి. తామర నెంత మొన చేసినా, మీను నెంత యెత్తినా ఆ రస ప్రవాహము కుత్తుకబంటి, తలమున్కలు, తప్పించలేదు అని భావము.

చిన్న తారతమ్యం :

కేవల నుడికారార్థముతో చెప్పిన పద్యానికి రెండర్థాలను చాకచక్యముతో జోడించి చెప్పిన పద్యానికి అర్థ గౌరవంతో ఉండే తారతమ్యం చూపడానికి ఒక్క పద్యము 'అమ్మకచెల్ల' అని ఆశ్చర్యార్థకమైన నుడికారం ఉంది. దీనిలో అమ్మడం, చెల్లడం రెండు విడి విడి అర్థాలున్నాయి. అల్లసాని పెద్దన్న ప్రవరాఖ్యుని వర్ణనలో -

కమ్మని కుందనంబు కనుగందని మే, నెలతేటి దాటులన్
బమ్మెర వోవదోలు తెగబారెడు వెంట్రుక, లిందుబింబమున్
కిమ్మననీదు మోము, గిరి క్రేవులు మూపులు, కౌను గానరా
దమ్మక చెల్ల! వాని వికచాంబకముల్ శత పత్ర జైత్రముల్.

అని ఒక పద్యం వ్రాశాడు. ఇక్కడ 'అ్మకచెల్ల' అంటే 'ఓహోహో' అని ఆశ్చర్యాన్నే అర్థం చేసుకుంటాము. మరి విశేషం లేదు.

ఈ 'అమ్మకచెల్ల' ను ఉపయోగిస్తూనే చేమకూర కవి ఒక పద్యం చెప్పాడు. అల్లసాని వాడిలాగనే తన పద్యం మొదటి చరణం 'కమ్మని' అని ఆరంభించి చివరి చరణం 'అమ్మకచెల్ల' అన్న పదంతోనే మొదలుపెట్టాడు. మూడు వంతులు మనుచరిత్ర పద్యాన్ని మనస్సులో పెట్టుకొనే తన పద్యం వ్రాసి ఉంటాడు. ప్రత్యక్షంగా తన నేర్పు చూపించడానికే అలాగు చేశాడేమో అనిపిస్తుంది.

ఆ పద్యంలో ఉలూచి అర్జునుడ్ని గూర్చి తన భావాన్ని వ్యక్తం చేస్తుంది.

కమ్మని జాళువా నొరయ గల్గిన చెక్కుల టెక్కువాడు, చొ
క్కమ్మగు జాతికెంపు వెలగాగొను మోవి మెరుంగువాడు, న
త్యమ్మగు రూవనంవద ధనాధివసూనుని ధిక్కరించు వా
డమ్మకచెల్ల! నా హృదయ మమ్మకచెల్లదు వీని కియ్యెడన్.

ఇక్కడ ఆశ్చర్యాని కాశ్చర్యం. అమ్మకానికి అమ్మకం రెండూ ఉన్నాయి. పైగా

తన హృదయం ఒక మంచి రత్నాభరణము అన్న అందమైన ధ్వనికూడా కానవస్తుంది. స్త్రీలలో పరాక్రమ విక్రీతలు లాగానే (పరాక్రమానికి అమ్ముడుపోయిన వారివలెనే) సౌందర్య విక్రీతలు కూడా ఉంటారు కదా! ఈ పద్యంలో ఉలూచి హృదయము సౌందర్యానికి అమ్ముడుపోయింది. ఆ హృదయం కెంపులు తాపిన బంగారు నగ. దీనిని అమ్మడానికి మొదట బంగారము గీటుపెట్టి వన్నె తేల్చుకోవాలి, ఆ తరువాత పై రెండు పరీక్షల వల్ల తేలినంత ధనము యిచ్చి కొనగలవాడిని చూచుకోవాలి. ఈ మూడు ఒక్కచోటనే సమకూరినప్పుడు, ఆ రత్నాభరణాన్ని అక్కడే, ఆ మనిషికే అమ్మకతప్పదు. లేకపోతే అది చెల్లక పోవచ్చును కదా!

ఈ భావాన్నే మహా చమత్కారంగా పద్యంలో ప్రకటించాడు. పెద్దన్న పద్యములో లాగానే, ఈ పద్యంలోకూడా (అర్జునుడి) సౌందర్య వర్ణన ఉంది. నున్నగా నిగనిగలాడుతూ గీటురాయి (ఒరగల్లు) లాగ నల్లగా ఉన్న చెక్కులు కలవాడు, జాతికెంపును కూడ మించిపోయిన ఎర్రతనం గల పెదవులు కలవాడు సుప్రసిద్ధ సుందర రూపుడైన నలకూబరుని కూడ ధిక్కరించగల రూప సంపదగలవాడు అన్న ఆశ్చర్యానికి (అమ్మకచెల్ల అనుటకు) ఏలాంటి లోటూలేదు. ఈ పాటి అర్థంతోనే చివరి చరణం 'అమ్మకచెల్ల నా హృదయ మమ్మక చెల్లదు వీని కీయెడన్' అని అన్వయించుకొనినా సంతోషించవచ్చును. కాని చేమకూరవాడు అంతటితో తృప్తి పొందలేదు. అందుచేతనే ఈ చెక్కుల టెక్కువానిచేత (అందమైన చెక్కులుగలవాడి చేత) బంగారాన్ని ఒరగల్లు మీద పెట్టి గీటుపెట్టించి దాని వన్నెను నిర్ణయించాడు. ఆ 'మోవిమెరుంగు' వాడిచేతనే జాతికెంపుల నిర్ణయించేలా చేశాడు. దీనితో ఆ అమూల్య రత్నాభరణం వెల తేలింది. అంత ధనమూ యిచ్చికొనడానికి అతడే రూపసంపద (ను) ధనాధిపసూనుని ధిక్కరించువాడు అయాడు. ఇన్నీ ఒక్కచోట కలిసివచ్చినప్పుడు కాక ఇంకెప్పుడు ఆ ఆభరణం చెల్లుతుంది. ఈ విశేషార్థాన్ని అరటిపండు ఒల్చిపెట్టినట్లు యిమిడ్చాడు. సహృదయులకు అద్భుతానందమును కలుగచేశాడు.

జనసామాన్యమున ప్రచారంలో ఉన్న పలుకుబడులు శక్తిమంతములు. వాటికి ప్రసిద్ధమైన రూపు, నిర్దిష్టమైన జీవం ఉంటుంది. వాటిని ఉచితజ్ఞతతో ప్రయోగించి నప్పుడు రచన అర్థగౌరవం గలిగి రసవంతంగా ఉంటుంది. వాటి సహాయంతో సిద్ధహస్తులు చక్కని శ్లేషలనల్లి తలలూపించే రచనలు చేసి కీర్తి నార్జించగలిగారు. రచనలలో ఉపయోగించడానికి రచయితలకు గాని రచనలను అర్థం చేసుకోవడానికి పాఠక వ్యాఖ్యాతలకు గాని ఈ నుడికారాల విలువలు తెలుసుకోవడం చాల అవసరం. అందుకే ఈ పదబంధ పారిజాత సంపుటములు ఆంధ్రులకు పెరటి కల్పకములాగ ఉండగలవు. వీటిని ప్రచురించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీవారు అభినందనీయులు.

14. గిడుగు వెంకట సీతాపతి

(1885-1969)

ప్రసిద్ధ భాషావాఙ్మయ పరిశోధకులు, వ్యావహారిక భాషోద్యమ నాయకులైన గిడుగు వెంకట రామమూర్తి పుత్రులైన గిడుగు సీతాపతి విశాఖజిల్లా భీముని పట్నంలో 1885 జనవరి 28న జన్మించి పర్లాకిమిడిని (ఇప్పుడు ఒరిస్సా రాష్ట్ర భాగం) నెలవుగా చేసుకొని సాహితీ వ్యవసాయం కొనసాగించారు. కొంతకాలం చరిత్రాధ్యాపకులుగా పనిచేశారు. స్వయంగా వ్యావహారిక భాషా వ్యాప్తికి కృషి చేశారు. సంస్కృతం, గ్రీకు, లాటిన్, ఇంగ్లీషు, సవర భాషలలో నిష్ణాతులైన సీతాపతి వివిధ భాషా గ్రంథాలు విరచించారు. తెలుగు ప్రబంధాలలోని రసవద్ఘట్టాలను, చాటువులను సంస్కృతీకరించి 'కవితోదయ చంద్రిక' వెలువరించారు. గిరిజనులైన సవరల భాష, ఆచార వ్యవహారాలపై విశేష పరిశోధన సల్పి (1932 - ఆంధ్రవిశ్వవిద్యాలయం) పెక్కు వ్యాసాలు రచించారు. 'సవరా సాంగ్స్' అన్న ఆంగ్ల గ్రంథానికి 'డాక్టర్ ఆఫ్ లెటర్స్' గౌరవ బిరుదు పొందారు. ఆంగ్లంలో తెలుగు సాహిత్యచరిత్రను వ్రాశారు. వీరు రచించిన 'కట్టబొమ్మ' నాటకం, 'తెలుగు ఛందోరీతులు' అన్న పరిశోధనా గ్రంథం రాష్ట్ర సాహిత్య అకాడమీ బహుమతులు పొందాయి. భారతీశతకము, కువలయావళి నాటిక, రాయల నీతి కథలు మొ॥నవి సీతాపతి గారి రచనల్లో పేర్కొనదగినవి. సూర్యనారాయాంధ్ర నిఘంటువు పునర్ముద్రణలో వారు పాల్గొన్నారు.

14. తెలుగు నుడికారము

- గిడుగు వెంకట సీతాపతి

పాశ్చాత్యదేశము లందలి భాషలలో ఇటాలియన్ భాష ఎంత మధురముగా ఉంటుందో అంత మధురంగా ఉంటుంది తెలుగు భాష. తూర్పు దేశము లందలి భాషలలో అనే అర్థములో Telugu is the Italian of the East అని అనేక భాషలు విన్న పాశ్చాత్య పండితులు మన తెలుగు భాషా మాధుర్యమును కొనియాడినారు. ఆ మాధుర్యము భాషిస్తూ ఉన్నప్పుడు వారు వీనులవిందుగా విని గ్రహించినదే కాని పుస్తకములలో నున్నది చదివి తెలుసుకున్నది కాదు. ఆడిన మాటలకు అర్థము తెలిసినా తెలియకపోయినా అవి చెవిన పడినంతనే అందులోగల మాధుర్యము గోచరిస్తుంది. అనగా ఆ మాటల ఉచ్చారణలోనే సహజసిద్ధమైన తీయందన మున్నదన్నమాట. ఈ విషయమే కృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యదలో నున్నది. ఈ రాజకవికి ఆంధ్రవిష్ణువు కలలో కనబడి ఒక ప్రబంధము తెలుగు భాషలో కూర్చవలసినదని కోరుతూ అన్నమాటలు –

'తెలుఁ గదేల యన్న దేశంబు దెలుఁ గేను
దెలుఁగు వల్లభుండఁ దెలుఁగొ కండ
యెల్లనృపులు గొల్వ నెఱుఁగవే బాసాడి
దేశభాషలందు దెలుఁగు లెస్స."

ఇక్కడ కండ అనగా పులకండ. పులకండ వలెనే తీయనిదని భావము.

ప్రసంగిస్తూ ఉన్నట్లు చేమకూరి వేంకటకవి విజయవిలాసములో అచ్చతెలుగున రచించిన పద్యము చూడండి; ఎంత హృద్యముగాను, శ్రావ్యముగాను ఉన్నదో!

"చిలుకల కొలికిది నాతోఁ బలుకంగాఁ గొంతసిగ్గు వడియెడు ముంజే
చిలుకా నీతోనైనను బలుకంగారాదె? వలుకు బంగారటవే?"

ద్విపదగా రచితమయిన నలచరిత్రలో దమయంతి నలునకై పరితపించు నప్పుడు:

"కటకట! యని లేచుఁ గన్నీరు నించు
చలిగాలి విసరినం జాలవడంకు
ఒక చోట గోరి వేఱొకచోటఁ జేరు
ఒక చెలిపేర వేఱొక చెలిఁ బిలుచు
ఒక పని కనుచు వేఱొక పనిఁదలచు
ఒక మాట యాడి వేఱొకమాట యాడు
ఒక వరిఁ దెగడు వేఱొక వరి బెగడు
ఒక వరి వెఱగందు నొకవరిఁ గుందు".

అని యామె దుస్థితిని తెలియజేయు మాటలు ఎంత పొందికగలవో! ఇవి కూడ యింపైన తెలుగులో ఉన్నవి. ఇట్లనుటచేత సంస్కృత పదములు కలిసిన యెడల తెలుగు మాధుర్యము తగ్గుతుందని నా యభిప్రాయము కాదు. సారంగధర ద్విపదలో సారంగధరుని తల్లి అతని పాటునకు దుఃఖిస్తూ ఉన్నపుడు ఆమె నోదార్చుతూ పలికిన మాటలలో సంస్కృత శబ్దాలున్నా రచన శ్రావ్యముగానే నడచినది. చూడండి –

"భావింప సుఖదుఃఖ ఫలములు రెండు
కావటి కుండలు కావటే తల్లి!
వినుమమ్మ చీకటి వెన్నెల నమము

ఓడలు బండ్ల బండ్లోడల వచ్చు
వేడుక కొన్నాళ్లు వెతలు కొన్నాళ్ళు".

ప్రభావతీ ప్రద్యుమ్నంలో ప్రభావతి తన లజ్జ పెంపున తన విరహబాధ పైకి తెలియజేయకుండా ఉన్నప్పుడు, ఆమె సఖి రాగవల్లరి –

"ఏ రీతిం బెనcగిన నె, వ్వారెరుగరు నీదు గుట్టు వనితామణి! రో
ల్లా రోకళ్లం బాడిన, కూరులిపుడదెంత దాcచుకొన్న నడcగునే ?"

అని ఎంత ముద్దుగా తెలుగు నుడికారపు సొంపులతో పలికినదో చూచారా?

అయితే, తెలుగు పదములలో గల లాలిత్యమునే ఎక్కువగా కొని యాడతాను. రాజశేఖరకవి కర్పూరమంజరిలో :

వరుషాః నంన్కృత గుంఫాః
ప్రాకృత గుంఫన్తు భవతి నుకుమారః
పురుష మహాళానాం యావ
దిహాంతరం తేషుతావత్ (ఇది ఛాయ)

ప్రాకృత పదములకంటెను సుకుమారములయినవి తెలుగు పలుకులు.

ఏ భాష అయినా రెండు విధములుగా పెరుగుతూ ఉంటుంది. 1.సహజముగా దానికి గల శక్తిని బట్టీన్నీ; 2.ఇతర భాషల ప్రభావము, సంపర్కమును బట్టీన్నీ, సహజశక్తి అనగా క్రొత్త భావములను వ్యక్తము చేయుటకు అదివరకున్న మాటలకు ప్రత్యయములను గాని అనుబంధములను గాని చేర్చుకోగల శక్తి. అది అణు మాత్రమయిన విత్తనము అంకురించి పెద్ద వృక్షము కాగల శక్తి వంటిది.

"అణుమాత్రంబగు మఱ్ఱి విత్తనము మొల్కెలేచు ఏపార చ
క్కని చెట్టై ననలెత్తి కాచు నురుశాఖల్ సాచు నందుండి నే

లను దాఁకన్ బడు నూడలన్ విడుచు; వేళ్లన్ జాచు; అట్లేకదా
తనరున్ భాషయుఁ బ్రాణ మున్నవరకున్ దప్పేమియో భారతీ!" అన్నాను.

ఇతర భాషల సంపర్కము వల్లను గాని ప్రభావము వల్లను గాని భాషాభివృద్ధి ఎట్లు కలుగునంటే - చిన్న జెలగా పుట్టిన ఊటగడ్డ మహానదిగా ప్రవహించుటకు శాఖానదులు తోడ్పడును. అట్లే విదేశీయ పదములు భాషాభివృద్ధికి తోడ్పడుతవి.

"జెలలై పుట్టి స్రవించిన వర్షములకున్ జెన్నొంది శాఖానదుల్
కలియన్ బెంపును బొంది, పుష్కల తరంగశ్రేణి నృత్యంబుతో
నలరన్ బాతెడు నమ్మహానదుల సామ్యంబొంది భాషానదుల్
విలసిల్లున్ భువి నెల్ల కాలమును నిర్విఘ్నంబుగా భారతీ!" అన్నాను.

భాష ఏవిధముగా పెరుగుటకయినా ముందుగా భావనాభివృద్ధి ఆ భాష మాతృభాషగా నున్నవారికి కలుగవలెను. సంస్కృతి లేక కూపస్థ మండూకమువలె నున్నవారికి క్రొత్త భావనలు కలుగవు. క్రొత్త మాటలు పుట్టవు. సంస్కృతి ఎక్కువగుతున్న కొలదిని క్రొత్తభావనలున్న వాటితో క్రొత్త పదముల అక్కరయున్ను కలుగుతూ ఉంటవి. ఈ యక్కరతీర్చుకొనుటకే పైన చెప్పిన రెండు శక్తి సాధనములున్ను వినియుక్తములగుతూ ఉంటవి. తెలుగువారికి యీ రెండునూ అలవడినవి. అందులో ఆర్య సంపర్కము వలన సంస్కృత ప్రాకృత భాషా పదములు - తత్సమములుగానో తద్భవములు గానో తెలుగు భాషలోనికి ప్రవేశించినవి. తెలుగుభాష పుట్టుక వలన ద్రావిడ భాషా కుటుంబములోనిదే అయినను ఈ తత్సమ తద్భవములు వేలకొలదిగా చేరుటవలన ఈ తెలుగు భాష ఆర్యభాషా కుటుంబములోనిదేమో యను భ్రమ పుట్టించినది. కాని తెలుగువారు తమ భాషా నైజమును గోల్పోలేదు. పండితులు అయినవారికంటే పాండిత్యము లేని జానపదులే తెలుగు నుడికారమును తెలుగు తీయందనమును ఎక్కువగా నిలబెట్టుకొన్నారు. పండితుల ప్రభావము వలననే కొన్ని తెలుగుమాటలకు క్లైబ్యము కలిగినది. ఆ మాటల స్థానములో సంస్కృత పదములకు గౌరవము హెచ్చినది.

ఉదాహరణములు: 'పెద్దచెట్టు' అని ఉచ్చారణములో ఎంత నొక్కిచెప్పినా 'మహావృక్షము' అన్నప్పుడు కలిగిన తృప్తి కలుగుట లేదు. ఆవిధముగానే 'పెద్దకొండ', 'పెద్దనది', 'పెద్దప్రోలు' అనుటకు మారుగా 'మహాపర్వతము', 'మహానది', 'మహానగరము' అన్నప్పుడు ఎక్కువ ఆనందము కలుగుతున్నది. 'ముక్కంటి కంటి వెచ్చకు మన్మథుడు కాలిపోయెను' అన్నప్పుడు 'వెచ్చ'కు గల తీవ్రత అణగారిపోయినది. సముద్రమనే అర్థములో నుండిన 'కడలి' శబ్దము చిన్న కోనేరు వంటిదిగా మనదృష్టికిప్పుడు కనబడుతున్నదేమో! 'పదబంధపారిజాతము'న కున్న గొప్పతనము 'నుడికడలి' కి కలుగుదు. మా యింటికి దేవతార్చనకు దయచేయండి, భోజనానికి దయచేయండి అంటే గౌరవముగా ఉంటుంది. 'మా యింటికి తిండికి రండి, కూడు కుడువడానికి రండి' అంటే పేలవముగాను, అంతేకాదు అసభ్యముగాను ఉంటుంది. సంస్కృత పదములలో కూడా తెలుగువారు సభ్యా సభ్యతలు పాటిస్తారు. అన్న ప్రాశనములో అశనమన్న పదమున్నా మా యింటికి అశనమునకు రండంటే అవమానకరంగా ఉంటుంది. పోరు, కయ్యము, జగడము అని అంటే సవతుల దెబ్బలాట లాగున జరిగేది కాబోలు అనిపిస్తుంది. ఇప్పుడు ఆంగ్లభాషలో 'battle' కున్ను 'war' కున్ను గల వ్యత్యాసము వ్యక్తపరచవలెనంటే battle కు యుద్ధమనిన్ని war కు సంగ్రామమనిన్ని great world war కు ప్రపంచ వ్యాప్తమైన మహా సంగ్రామనిన్ని చెప్పవలెను.

మాట

సంయోగాది సాధనముల వలన ఒకేమాట ఎన్నెన్ని అర్థములలో వాడుకలోనికి వచ్చినదో చూడండి. అందుకు 'మాట' అనే మాటనే ఉదాహరణముగా ఎత్తుకొని మాటలకు గల శక్తి తెలిసికొందాము.

కాస్త దూరముగా ఉన్న మిత్రుణ్ని చూచి 'మాట' అనగానే అతడు మన వద్దకు వస్తాడు. అదేదో అంత బిగ్గరగా అరచి చెప్పవలసినది కాదనిన్ని, కాస్తయినా రహస్యంగా చెప్పవలసినదనిన్ని గ్రహించి మనం చెప్పదలచినది వినడానికి

సిద్ధపడతాడు. "వెయ్యి మాటలేల? ఒక్క మాటలో చెప్తాను" అంటే అధిక ప్రసంగం చేయకుండా చెప్పవలసినదంతా సంగ్రహించి చెప్తానన్నమాట. ఊరకే అదే ధోరణిలో మాటలాడే వాణ్ణి మాటల పోగంటాము. మాటలు పట్టుకుంటే మరి వదలడంటాము. మాటలకు లోటు లేదు. అంటే మాటలాడుతాడే కాని పనిచేయడని అర్థము. ఇటువంటి అర్థంలోనే 'మాటలు కోటలు దాటుతాయి కాలు గడప దాటదు' అంటాము. మాటలు తీయగా ఉంటవే కాని మనసు మంచిది కాదు. అంటే పెదవుల తీపి ఎదలో విషము అని అర్థమవుతుంది. చమత్కారంగా మాటలాడే వానిని 'బలేమాటకారి' అంటాము. ఆ మాటలు విసుగుపుట్టిస్తే మాటల మారి అంటాము. మా పాపాయికి యిప్పుడిప్పుడే మాటలు వస్తున్నవంటే మాటలాడే శక్తి వస్తున్నదన్నమాట. గుమాస్తా మూలంగా మా ఆయనకు 'మాట' వచ్చిందండీ అంటే ఏదో అవమానం కలిగింది; అపనింద వచ్చిందన్నమాట. మాటపడడం కష్టమన్నా ఆ అర్థాలూ సూచిస్తుంది. అతనికి మాటకు అడ్డు లేదు అంటే అందరూ వినవలసిందే; తిరుగు చెప్పడానికి వీలులేదు అన్నమాట. అతడి మాటకు చెలామణి సాగుతున్నదంటే అందరూ అతడు చెప్పింది వింటున్నారు; అతని పలుకుబడి ఎక్కువగా ఉన్నదన్నమాట. 'నా మాట విను నాయనా' అని తల్లి అనునయంతో అంటుంది. 'నా మాట వినకపోతే జాగ్రత్త' అని తండ్రి కోపంతో అంటాడు. ఇప్పుడతని మాట సాగడం లేదంటే పలుకుబడి పోయిందన్నమాట. వాడికీ నాకూ మాటలు లేవంటే మేము విరోధులమైనాము; మాటలాడుకోవడం కూడా మానివేశామని అర్థము. ఒక మాట అన్నామంటే సరా? పది మాటలు పడాలి. అనడమెందుకు పడడమెందుకు అని హెచ్చరిక చేసుకుంటాము. 'తుది మాట చెప్పండి యిస్తారా? యివ్వరా' అని ఏమీ తేల్చకుండా గొడవలు పలికేవారిని చూచి అంటాము. పాపం! ఆ మూగదాని మాట తల్చుకుంటే దుఃఖం వస్తుందంటే; దాని విషయం అన్నమాట; అంతే కాని మూగది పలికినది కాజాలదుగదా? ఆ మాటకువస్తే నే నసలే రాను; అంటే అట్టి విషమ స్థితి సంభవిస్తే రానని అర్థము. చిన్న పిల్లడి మాట పట్టుకుని మీరు అలుగడం బాగుగా లేదండీ అంటే వాడు చిన్నవాడు గనుక వాడన్న మాటలు

పాటించకూడదని అర్థం. నీ పెండ్లి మాట నిశ్చయమైనదా? నీ అన్నయ్యకు పెండ్లి అయినదన్నమాట నాకు తెలియదు. ఏమిటి నీ సంగతి? రేపు నీవుండే మాటో వెళ్ళే మాటో నిశ్చయంగా చెప్పు అన్నప్పుడు నోటి మాట ప్రసక్తిలేదు. ఆడిన మాట తప్పకూడదు సుమా? తప్పితే, పద్యం విన్నావా? నాకు తెలుసును. 'ఆడిన మాటందప్పిన గాడిదకొడుకంచు దిట్టఁగా విని అయ్యో వీడా నా కొడుకని యొక గాడిద యేడ్చెను గదన్న కవిచౌడప్పా' ఈ పద్యం జ్ఞప్తికి తెచ్చినందుకు క్షమించు. ఎంత మాట! మనం స్నేహితులంగదా? సరేకాని మరొక్క మాట. మనలో మాటగా చెప్తున్నాను. 'రామారావు పరీక్ష పోయింది. ముందుగా ఎవరితోను చెప్పకు. రెండు రోజులలో అదే వెల్లడవుతుంది'.

ఈ యువకుల మాటలలో మాట అనేమాట ఎన్నివిధాలుగా ప్రయుక్త మైనదో చూచినారుగదా! కొన్ని సామెతలలో గూడ ఈ మాట నుడికారపు సొంపులతో ప్రయుక్తమవుతుంది. కొన్ని ఉదాహరణములు :-

'**వేటుకు వేటు, మాటకు మాట,** (a blow for a blow, a word for a word)'.

మనిషికొక మాట గొడ్డుకొక దెబ్బ.

నమ్మకే వాడన్న మాట, అది నీటిపై వ్రాత, నీళ్ళ మూట.

మాటకు మాట తెగులు నీటికి నాచు తెగులు(words and weeds choke speech and streams).

మాటకు మల్లి వనికి యెల్లి(Miss Bud never becoms Miss Blossom).

ఎవరి కూడు తింటే వారి మాట ఆడాలి(He who pays the pipe calls the tune).

కన్ను

కంటికి సంబంధించిన నుడికారాలెట్లున్నవో చూడండి. నెమలిపురి కన్ను, గవ్వలాటలో కన్ను, శీతకన్ను, క్రేగన్ను, వాలుగన్ను (వాల్గంటి), కన్నులు పొడచుకున్నా

నిద్రరాదు, కన్నుకొట్టు, కన్నువేయు, కన్నుపెట్టి చూడు. కన్నులు నెత్తికెక్కినవి. కన్నులు తేలవేశాడు. ఒడలెల్లా కన్నులు చేసుకొని నీ కోసం చూస్తున్నాడు. ముసిలిది కొడుకును చూచినదాకా చావదు, కన్నులలో ప్రాణాలు నిల్పుకొన్నది.

గంగ కనుఁగొంటి, కన్నుల కరవుతీర; కంజాక్షు జూచితి కన్నులార. ఇంకా కన్నూ ముఖమూ ఏర్పడలేదు. కన్నుల ముత్యాలు రాలు, నీలాలు కారు, నీరు కారు. కన్నులు వేయి దాల్పవలె గౌతము నింటను కోడి గావలెన్. వేయి కన్నుల వేల్పు, కన్నుల నద్దుకొని స్వీకరిస్తాను. కన్నియ కన్నెఱింగి. కన్నుండగనే కనుపాప తీయగల నేర్పు. నీ కన్ను కుట్టిందా? ఎందుకీ కన్నెఱ్ఱ? కంటి చలువ. నోటి మాటలేదు, కంట చూపులేదు. కన్నూమిన్నూ తెలియకుండా ఉన్నావు. ఈ కంటికి రెప్ప దూరమా? కంటికి రెప్పా నోటికి చేయీ దూరమయినాయి. కంటికి, మంటికి ఒకటే ధారగా ఏడ్చాడు. కన్నీరు మున్నీరై పాఱఁగ నేడ్చె. కనుభ్రామ. కన్ను లార్చు, ఇంత కనువేదురు చెల్లునటవ యింతికిన్. కనుపండుగ, కనువిందు, నాకీ కథ కనువిప్పయినది. కనుచూపు మేర నా కెవరూ కనబడలేదు. నన్ను కని పెంచినవారు గతించినారు. తాతను కనిపెట్టుకుని ఉండు. కానని వాని నూతగొని కానని వాడు (the blind leading the blind). తోడి కోడలి సంపద చూచి అది కంట్లో నిప్పులు పోసుకుంటున్నది. నా కంట్లో కారం జల్లి నా భర్తతో తిరుగుచున్నది. నీ తూపులని కదా నెత్తమ్మి ఱేకుల గారవమ్మునఁ గప్పికొందు. నేటికిని నీ రూపు కన్నులఁ గట్టినట్లు తోఁచు. నీ రాకకు ఎదురు చూచి, చూచి, నా కన్నులు ఉబ్బినవి. కాయలు కాచినవి, వాచినవి. కనుసన్న మెలగు. లేని కన్ను కన్న మెల్ల కన్ను మేలు. రాజును చూచిన కన్నులను మొగుణ్ణి చూస్తే మొత్తబుద్ధి.

నోరు

నోరు అనే మాటతో ఎన్నెన్ని వలుకుబడు లేర్పడినవో చూడండి :

నోరు చేయకు. నోరు పారేసుకోకు. వాడు నోరుపెట్టుకొని బ్రదుకుతున్నాడు. వాడి నోటిలో నోరు పెట్టుకొని నేను వాదించలేను. వాడు నోటికి వచ్చినట్లు

ప్రేలుతున్నాడు. వీడికి నోట మాటలేదు. నోరార పలికి మురిసిపోయింది. వాడి నోటికి అద్దూ పద్దూ లేదు. వీడి నోరు పెగలదు. నోరు మూసుకొని పనిచెయ్యి. తల పరువు నోరు చెడుపుతుంది. నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది. నోటిలో నాలుక లేదూ? మాటాడవేమి?

కొను

అనుబంధక్రియలతో ఎట్లు పలుకుబడులు ఏర్పడుతవో చూడండి! కొను అంటే purchase అన్నమాట, కొనుబడి అంటే cost price అని అర్థము. కొనుక్కొను అన్నప్పుడు రెండవ కొను సహాయ క్రియగా ఉన్న అనుబంధము. వాడు తనకు దుస్తులు లేకపోయినా సరే కాని పుస్తకాలు కొనుక్కుంటే చాలు ననుకొన్నాడు. ఇంగ్లీషులో సులువుగా he denied himself clothes to buy books అంటారు. అమ్మబోతే అడవి, కొనబోతే కొరవి. రెండు విధాలా నష్టమే అని సూచించే నానుడి–అనుబంధక్రియ స్వార్థమందు వాడుతారు. ఇల్లు కట్టిరి–ఇల్లు కట్టుకొన్నారు. వంకాయలు అంగడిలో కొని తీసికొని రా(తీసుకురా). నాకది కొనిపెట్టు. నీకు కావలసింది నీవు కొనుక్కో. దొంగలు దోచుకొన్నారు. తద్దినం కొని తెచ్చుకొన్నట్టయినది. ఇతరుల వ్యవహారాలు చూస్తాడు. తన వ్యవహారం చూచుకోడు (కొనడు). హత్య చేసినాడు. హత్య చేసుకున్నాడు. వాడు తన మేనమామ కూతుర్ని చేసుకొన్నాడు. మేనరికము చేసుకొన్నాడు. పని మానుకొన్నది. దాచుకో. తలకు దెబ్బ తగిలించుకోడానికా గుమ్మం పొట్టిగా కట్టించుకున్నావు? I understand a man knocking his head against a wall by an accident I can never understand a man building a wall for that purpose అన్నట్టుంటుంది. పెళ్లికొడుకు తాళికట్టినాడు. పెళ్ళి కూతురు సంతోషముతో కట్టించుకొన్నది. స్వార్థమందేకాక – జాలికొను, అంటుకొను, పనిగొను, ఆఁకొను, ఆకలిగొను, ఊరకొను మొదలయిన నుడికారాలతో కూడా ఈ అనుబంధ క్రియ కనబడుతుంది.

కొట్టు : కంపుకొట్టు; దిష్టికొట్టింది; దెయ్యంకొట్టిన కొబ్బరికాయ; చెడగొట్టు, తెగగొట్టు (తెగ్గొట్టు), దిగగొట్టు (దిగ్గొట్టు), భోజనము ముందుగా చేసి లేచిన అబ్బాయి నీ మీద కొండ కొట్టానంటాడు. కన్నుకొట్టు, గుండెలు కొట్టుకుంటున్నవి. కడుగొట్టు బిడ్డ, పిసిని గొట్టు, వాపిరి గొట్టు.

కట్టు : వాకట్టు, తాకట్టు, ఆకట్టు, మొలకట్టు, చనుకట్టు పయిన్ బడనేల యేడ్చెదో? మీసకట్టు, కందికట్టు, వాడికోసం ఆకట్టు (set apart), వెండికట్టు పొడుంకాయ, కట్టుచారు (చేరు), జాతికట్టు, కులకట్టు, సమ్మె కట్టు, కట్టుకట్టు, రాతికట్టు గోడ, తలకట్టు, ఆనకట్టు, నడికట్టు, ఒడికట్టు, మణికట్టు, వలకట్టు, ఇంటిముందరి కట్టు బాగున్నది గాని వెనుకటి కట్టు బాగుగా లేదు. దీనికి వెలకట్టు, ధరకట్టు, పద్యము కట్టు, పదంకట్టు, కడుపుకట్టుకొనియైనా దివాణానికి కట్టవలసిన కట్టుబడి చెల్లించాలి. నోరుకట్టుకో, చేతికట్టు, అంటుకట్టు. ఆనాటి దృశ్యము ఈ నాటికి గూడా కన్నులకు కట్టినట్టున్నది. భామా వేషం కట్టినాడు. గడ్డ కట్టుకొన్నది. మబ్బు కట్టింది, వాన పడేటట్టున్నది. రొట్టె పెచ్చుకట్టింది. మామిడి టెంక పీచు కట్టింది. నా ఉసురు నీకు కట్టి కుడుపక మానదు. దెబ్బ తగిలినచోట నెత్తురు గూడుకట్టినది. కట్టుబాటు చేయి. కట్టు తప్పినపిల్ల. ధర్మానికి కట్టుబడ్డాడు. కట్టుబట్టతో పరుగెత్తుకొని వచ్చాడు. కట్టుమ్రాను. మడి కట్టుకొన్నాడు. ముట్టుకోకు, లెక్కకట్టు.

పట్టు : ఆయువుపట్టు, పట్టుపట్టుకొని కూర్చున్నాడు. మంకుపట్టు, మొండిపట్టు, పట్టినపట్టు విడువడు. కథ మంచిపట్టులో ఉన్నది. ఉనికిపట్టు, గ్రహణం పట్టినది. పట్టుస్నానం, విడుపుస్నానం. పట్టు విడుపులు రెండు ఉండాలి. (give and take). కూతపట్టు దూరము. పట్టుదల, చుట్టుపట్ల తిరుగక ఇంటి పట్టున ఉండు. పట్టుమని పది దినాలయినా ఉండలేదు. పట్టుగొమ్మ, నా జీతంలో పది రూపాయలు పట్టుకొన్నారు. నాకు నీ వేషాలు పట్టవు. ఈ కాయలు నీ కాబడితే తీసుకో. ఊపిరి బిగపట్టు. దమ్ముపట్టు. చేబట్టు. చెట్టబట్టు (marry). నే చెప్పినది వంట (ఒంట) పట్టించుకోడు.

ఈ సమాసాలు వాడికి నోటబట్టవు. తలోదారి పట్టినారు. కాళ్లుపట్టు, అతని కాళ్లు పట్టుకో, నీకేం పిచ్చిపట్టినది? ఈ కత్తి సానపట్టు. వరిగింజలు నేతులు పట్టినవి. పిట్టకుకూత పట్టింది. నాకేం పట్టింది వాడిని సాకడానికి. ఏదుం పట్టేగంప. దీనికెంత పడుతుంది? నా చొక్కాకు ఎన్ని గజాల గుడ్డ పడుతుంది? పట్టి పట్టి మాటలాడతాడు. వాడు పట్టిన దెల్ల బంగారము. వీడికింకా యోగం పట్టలేదు. ఈ కత్తి తుప్పు పట్టిందిరా? చలి జ్వరం, చలి కుదుపు పట్టుకొన్నది. ముసురు పట్టినది. నాకు నిద్రపట్టకుండా ఉన్నది. నా నోటికి కారం పట్టదు. పట్టెడు మెతుకులు పెట్టవమ్మా. బూజుపట్టినది. బల్లకు చెదపట్టినది.

ఈ విధముగా అనేక పదములకు అనుబంధములయిన ఉపపదముల వల్లను, ప్రత్యయముల వల్లను శబ్దపల్లవాలు, క్రొత్త క్రొత్త అర్థాలతో నుడికారాలు, పలుకుబళ్ళు ఏర్పడుతవి. సంస్కృత భాషలో ఒక్కొక్క ప్రధాన పదానికి ఉపసర్గల వల్లను, అనుబంధాల వల్లను, వందల కొలదిగా నూతన పదములు వేర్వేరు అర్థములలో కొద్ది కొద్దిగా మార్పు చెందిన అర్థ విశేషాలతో ఏర్పడుతూ ఉంటవి. అలాగుననే Prefixes, Suffixes, (affixes) వల్లను, నూతన పదజాలం వృద్ధి పొందుతుంది. కొన్ని భాషలలో infixes అంటూ ఉన్నది. అవి పదమధ్యమందు దూరి అర్థ విశేషములను కలిగిస్తూ ఉంటవి. నూతన భావార్థకములుగా ఉంటవి. తెలుగులో కాని, సంస్కృతములో గాని, ఇంగ్లీషులో కాని లేని infixing ఆదివాసులయిన సవర, ముండారీ, సంతాళీ భాషలలో ఉన్నవి. ఉదాహరణములు: సవర భాషలో తిడ్ అనే క్రియకు కొట్టుట అని అర్థము. జేన్ అమన్ తిడ్తమ్ అంటే నేను నిన్ను కొడతాను అని అర్థము. ఈ పదంలో తకారమునకు ఇడ్ కున నడుమన అన్ అనే infix (ప్రత్యయము) దూర్చితే తనిడ్ అవుతుంది. దాని చివరను నామవాచక ప్రత్యయము అన్ కలిపితే తనిడన్ అవుతుంది. అది కొట్టుట అనే భావార్థకరూపమవుతుంది. దెబ్బ అనిన్ని అర్థము. గిజ్ అంటే చూచు. గనిజన్ అంటే చూచుట, దృశ్యము అని అర్థము. అడ్ అనే infix ఆ క్రియా కార్యమునకు కావలసిన సాధనమును వ్యక్తపరుస్తుంది. తరిడ్ అంటే కొట్టుటకు

సాధనమైన, కొట్టుటకు కావలసిన అని అర్థము. కొట్టుటకు ఉపకరించే కర్రకు తరిడ్ – డాంగన్ అంటారు. ఆ ఉపకరించేది తోలుతో చేసిన కొరడా అయితే తరిడ్– సాలన్ అంటారు. పేపబెత్తముగాని, వెదురు బద్దగాని అయితే తరిడ్ – ఉరన్ అంటారు. ఇటువంటి సాధనాలతో క్రొత్త వస్తువులు చూచినప్పుడును క్రొత్త భావనలు పుట్టినపుడును ఉన్నమాటలతోనే భాషాభివృద్ధి చేసుకుంటారు. సాధ్యమయినంతవరకు విదేశీయ శబ్దములను స్వీకరింపరు. స్వీకరింపక తప్పదన్నప్పుడు తమ భాషాలక్షణమునకు అనుకూలముగా ఆ శబ్దమును కొద్దిగానైనా మార్చి వాడుకుంటారు. అవి కూడా నుడికారపు సొంపులే.

మన తెలుగు భాషలో యిటువంటి చిత్రాలు కనబడతవి. ఉదాహరణము: రూళ్ళకర్ర అన్నది విదేశీయ శబ్దమని ఇప్పటి పిల్లలకు తోచనే తోచదు. ఇంగ్లీషులో rule, rules, ruler అనే శబ్దాలున్నవిగదా? నేను లోపలికి రాకూడదన్న rule ఎక్కడున్నది? అంటాము. ఇంగ్లీషు బహువచన ప్రత్యయమే ఉంచి 'నీకు రూల్సు మహా తెలిసినట్లు మాట్లాడుతున్నా' వంటాము. మన తెలుగు బహువచన ప్రత్యయము చేర్చి 'నీవు వంకర టింకరలు లేకుండా తిన్నగా రూళ్ళు గీయగలవా' అంటాము. ఆ అర్థములో యీ మాట యీ అర్థములో ఆ మాట ప్రయోగించము. ఒక్కొక్కప్పుడు విదేశీయ భాషలోగల శబ్దాల తుదనున్న వర్ణము బహువచన ప్రత్యయ మనుకొని పొరపాటు కూడా చేస్తూ ఉంటాము. ఇంగ్లీషు శబ్దాలలో కొన్నిటను చివరనున్న S చూచి అవి బహువచన రూపాలనుకొని తప్పుగా ప్రయోగిస్తాము. Summons ఏకవచనము. దీనికి బహువచన రూపము Summonses. Summons బహువచన రూపమనుకొని సమ్మను వచ్చిందా? సమ్మనులు అందినవా? అంటారు కొందరు. News అనే పదము ఇంగ్లీషులో వాస్తవముగా బహువచన రూపమే కాని, యిప్పుడు ఏకవచనముగా వాడుకొంటారు. It is bad news అంటారు. రేడియోలో తెలుగు న్యూజ్ తిన్నగా వినబడదు అంటారు.

ఆయా భాషల నుడికారాలు అవి మాతృభాషగా గలవారికి చక్కగా బోధపడతవి. మన తెలుగు భాషను గూర్చి చెప్పినప్పుడు ఆ విషయము నేటి వ్యావహారిక భాషకే వర్తిస్తుందిగాని వాడుకలో నుండి తప్పిపోయిన కావ్య భాషకు వర్తించదు సుమండీ. ఒక ఉదాహరణము – ఓహరి నాహరి అంటే తండోప తండములు అని కీ.శే. మధురకవి నాళము కృష్ణారావు గారు తాము ప్రకటించిన తెలుగు జాతీయములు (A Dictionary of Telugu Idioms) అనే తెలుగు గ్రంథమందు తెలియజేసినారు. మన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ప్రకటించిన పదబంధ పారిజాతములో ఓహరి నాహరిగా అంటే హోరాహోరీగా అని వ్యాఖ్యానము చేసినారు. ఈ గ్రంథ సంపాదకులు రెండింటను 'ఓహరి నా హరి నుయ్యాల చేరుగా వెనుకొంచు దెరలుచుఁ బెనఁగు నెడలు' అనే ప్రయోగము (భార.విరా 3. 165) లో నిదికనబరచినారు. దానిని బట్టి తండోపతండములుగా అని కాని హోరాహోరిగా అని కాని అర్థము చెప్పుటకు ఆధారము కనబడదు. బ్రౌణ్యములో నున్నట్లు వెనుకకు ముందుకు అనే అర్థము పొసగుతుంది. Pursuing and being routed or scattered or dying హోరాహోరీగా యుద్ధము జరిగినప్పుడే, తండోప తండములుగా సైనికులున్నప్పుడే ఈ పనులు జరుగుతవని సమర్థించుకోవచ్చునుగాని ఓహరి నాహరి పదములకు ఈ సంపాదకులు చెప్పిన అర్థము లేదు. ఈ పదములు సంస్కృత పదకోశము లందు కనబడవు. అచ్చతెలుగు పదములు కాజాలవు. ఈ విషయమును గూర్చి యిక్కడ ఎక్కువగా చర్చించుటకు అవకాశము లేదు.

ఊడనిబాడు : అర్ధానుస్వారములు పాటించేవారు ఊడనిఁబాడు అని వ్రాస్తారు. అప్పుడు చివరి శబ్దము పాడు. వీనికి పాఱు అని అర్థమున్నది. వాస్తవముగా పాఱు, పాడు రూపాంతరాలు. ఈ శబ్దమువల్లనే పాఱిపోవు అను అర్థము విశదమగుతూ ఉండగా ఊడనిఁబాడు అంటే పాఱిపోవు అని అర్థము వ్రాసే ద్రుతాంతముగా ఉన్న 'ఊడనిఁ'కి నిరర్థకమా ఊడ్ (ఊఱ్హుత్) ధ్వన్యనుకరణ శబ్దాలు అప్పుడు అని 'అను' క్రియకు క్త్వార్థకరూపమవుతుంది. అది ద్రుతాంతము కాదు. ఊడనఁ (౯) అయి

ఉండవలెను. మేము చూచిన తాళపత్ర గ్రంథములో ఊడనఁబాడు, ఊడనఁబాఱు అను పాఠములు కనబడినవి.

కట్టువకానులు : శబ్దరత్నాకరములో ఉన్న ఈ పదమును చూచుకొని శూరులు అనే అర్థము వ్రాసి పదబంధ పారిజాతములోని కెక్కించుకొనుట ప్రమాదకరము. ఈ శబ్దస్వరూపములోను అభిప్రాయభేదములనేకముగా ఉన్నవి. మేము చూచిన తాళపత్ర గ్రంథములలో 'గట్టువకాసులై' 'కారులై' కనబడుతున్నవి. బ్రౌణ్యములో గట్టువకాడు, గట్టువకాసు అనే రూపములు గ్రహింపబడినవి. దీనికి అర్థము మాత్రము శూరుడు అని ఉన్నది. అయినా ఆ పట్టులోనే గట్టువసేతలు అనగా కపట కృత్రిమంబులు అని అర్థము చూపించినారు. వేదం వేంకటరాయశాస్త్రి గారు తాము సంప్రతించిన శృంగార నైషధములో గట్టువకారు అనే పాఠము కలదని సూచించినారు. గట్టువఁకాడు అనే పదమునకు గట్టువకారు బహువచనరూపము కాబోలు? ఇతమిత్థమని చెప్పుటకు తగిన ఆధారములు లేవు.

ఇట్టిదే 'బాడుదల' శబ్దము. శబ్దరత్నాకరములో (బాడు తలఁగించుట) అవమానించుట అని అర్థము కలదు. కాని యిది తప్పు. భారతము కర్ణపర్వములో బాడుదల నొండెఁ బట్టుము పాండతనయముఖ్యు అనిన్ని, శల్య పర్వములో 'సంజయ బాడుదల వట్టికొనిదెచ్చి' అనిన్ని భారత ప్రయోగాలు. సంస్కృత భారతములో 'జీవగ్రాహమానయ' అని ఉన్నది. చంపకుండా ప్రాణములతోనే పట్టుకొని తెమ్ము అని అర్థము. తెలుగులో యీ నుడికారము పోయినది. 'బాయిదలై' తమిళములో కూడా ఉన్నది. మనుదలై వంటిది. ఇంతకంటే ఎక్కువగా యీ విషయమును గూర్చి చర్చించుట కిక్కడ యిప్పుడవకాశము లేదు. ఈ మాత్రమైనా ఎందుకు చెప్తున్నానంటే ఇటువంటి పదాలు పదబంధ పారిజాతములోనికి ఎక్కిస్తున్నారు. ఆంగ్లపదకోశములలో origin uncertain అని హెచ్చరిక ప్రదర్శిస్తున్నారు. మనము నిశ్చయించి తేల్చినట్లుగా అర్థవివరము వ్రాయడము సాహసమని నామనవి.

నుడికారము వాడుకలో ఉన్నదే పిల్లలకైనా అలవడుతుంది.

తలలో నాలుక మాతృభాష అది
పలవరించినా తప్పులు కలుగవు
తలక్రిందుల పడి తపము చేసినా
తప్పులు తప్పవు తెలియని వ్రాతకు.

'తెంచు' అనే అనుబంధ క్రియ నన్నయాది ప్రాచీనకవుల కాలంలో ఉండేది. 'ఏ నేఁడు లగుదెంచె నర్జునుండేఁగి ఇంత కేతెంచు' (భారతం). అంటే అయిదేండ్లు కావచ్చినది అర్జునుడు వెడలి, ఇంతలో వస్తాడు అని అర్థము. ఏఁగు, ఏగుఁదెంచు, ఏతెంచు, అరుగు, అరుగుదెంచె, గాలి వీచినది, వీతెంచినది అంటే మనవైపు వస్తున్నది అని అర్థము. పక్షులెగసెన్ – భీముడు నీరిలోన నుండి నెగయఁదెంచె – మన level కు వచ్చెను. పుచ్చిరి, పంపించిరి, పుత్తెంచిరి. ఈ రూపమేమిటి? అగుట, పోవుట, వచ్చుట, – సెబాస్ – అన్నట్లు ఇప్పుడు మనలో కొందరికైనా తోస్తుంది గదా? నన్నయ వాడుకలో నున్నది చూడండి. తక్షక విషాగ్నిచేఁ బరీక్షితుడు దగ్ధుడు కాబోయే సమయ మందు మునిశాప దినంబులు పోయినవా? అంటే అయిపోయినవా? అన్న మాట; పూర్తిగా గడిచిపోయినట్లే కదా? అన్న ప్రశ్నకు ప్రత్యుత్తరముగా పూర్తిగా పోలేదు. 'పోవుదెంచె' అని ప్రయుక్తమయినది. ఈ నుడికారమును లెస్సగా గుర్తింపక బహుజనపల్లి సీతారామాచార్యుల వారు – తెంచు స్వార్థ మందువచ్చు అనుబంధక్రియగా గ్రహించిరి. శబ్దరత్నాకరమందు చెప్పిన దానిని బట్టి తక్కిన పండితులును సూర్యరాయాంధ్ర నిఘంటు పండితులున్ను అట్లే గ్రహించినారు. నేటి వాడుకలో ఈ 'తెంచు' వినబడదు. దాని స్థానే 'వచ్చు' వచ్చినది. చూడండి, ఎట్లు వాడుకుంటున్నామో. అధ్యక్షులవారు వచ్చే మాసము మన ఊరు వస్తారట. 10వ తేదిని బయలుదేరి ఆ రాత్రి కలకత్తాకు వస్తారు. 11వ తేదీని షిల్లాంగు వెళ్ళి ఆ మరునాటికే కలకత్తాకు వచ్చి అక్కడ నుండి కటక్ వస్తారట. అక్కడనుండి భువనేశ్వరము వెళ్ళి ఆ మరునాడే

అనగా 13వ తేదీకి ఖుర్దాకు 14వ తేదీకి బరంపురం వస్తారు. అక్కడనుండి రసూల్ కొండ వెళ్ళి 15వ తేదీని బరంపురం చేరుకొని అక్కడ 16వ తేదీని బయలుదేరి తిన్నగా విశాఖపట్టణం వస్తారు. అక్కడ రెండు దినాలు ఆగి 18వ తేదీని బయలుదేరి విజయవాడకు వస్తారు. వచ్చినవెంటనే బందరు వెళ్ళి ఆ మరునాడే విజయవాడ చేరుకుంటారు. అక్కడ రెండు దినాలాగి 20వ తేదీకి వూరికి వస్తారు. చూచినారా? మనకు చేరువవుతూ ఉన్నప్పుడు వస్తారని అంటాము. చిన్నపిల్లలయినా ఎప్పుడు వచ్చు అనాలో ఎప్పుడు వెళ్ళు అనాలో నుడికారం తప్పకుండా ఎప్పుడు ఏది ఉపయోగించాలో గ్రహించగలరు. నాన్నా! నాన్నా! రాత్రి నాటకానికి వెళ్తున్నారా? నేను రావద్దా? రా! అమ్మను కూడా రమ్మను, ఇద్దరినీ తీసుకు వెళ్తాను. 'అమ్మ యీ రాత్రి రాదుట. రేపు వెళ్తుందట. అయితే నేను అమ్మతో రేపు వెళ్తాను. నీవుకూడా రేపు మాతోనే రారాదూ? నీ వొక్కడవే ఈ రాత్రి వెళ్ళడమెందుకు?' అంటాడు బాలుడు.

'ఏమే వంట అయినదా?' అని భర్తంటే 'కావచ్చింది' అంటుంది భార్య. ఆఫీసుకు వెళ్ళడానికి వేళ కావచ్చింది అంటాడు భర్త. వచ్చిన స్నేహితులు వెళ్ళిపోతూ 'వెళ్ళివస్తాను' అని గాని, 'వేళయింది వస్తాం' అని గాని అంటారు. పోతామంటే శుభం కాదని.

మీ యింటికొస్తే ఏమిస్తావు? మా యింటికొస్తే ఏం తెస్తావు? అని ఎప్పుడూ స్వలాభం కోరేవాళ్ళనుగూర్చి అంటారు. అన్నయ్య రమ్మని వ్రాస్తున్నాడు. వెళ్లాలి. కొద్దిరోజులలో వస్తున్నానని వ్రాశాను. ఇదే ఇంగ్లీషులో I wrote that I would go there in a few days. తెలుగు నుడికారమునను సరించి,When shall I come there అంటే తప్పు. ఎవరయినా పెద్దవారు మన యింటికి వస్తే దయచేయండని ఆదరిస్తాము. ఇందులో దయలేదు. చేయడములేదు. మాటకు మాటగా ఇంగ్లీషులోనికి అనువదిస్తే Make kindness అవుతుంది. అది ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో చూచారా? We shook hands అంటే కరచాలనము చేశాము అంటున్నారు

కొందరు. చేలాగు ఇచ్చేనా? ఆదరించేనా? అన్నాడు క్షేత్రయ్య మువ్వగోపాల పదాలలో. He gave me a cold reception, ఇంగ్లీషువారి దేశము శీతల ప్రదేశము కనుక cold reception మంచిది కాదు. మన దేశము ఉష్ణమండలము గనుక నీ కడుపు చల్లగా అంటే, చల్లని మాట చెప్పవమ్మా అంటే మంచిదే. చావు కబురు చల్లగా చెప్పావురా అన్నపుడు దుఃఖంతో చెప్పవలసిన మాట సంతోష వార్తలాగున చల్లగా చెప్పావేమిరా అని నిందిస్తాము. ఒక భాషలో ఉన్న మాటలు మరియొక భాషలోనికి అనువదించినప్పుడు, ఆ మాటలలో గల భావము తీసికొని రావాలి. "జాగర్తిలోకోజ్వలతి ప్రదీపః, సఖీజనం పశ్యతి కౌతుకేన ముహూర్తమాత్రం కురుకాంత ధైర్యం బుభుక్షుకః కిం ద్వికరేణ భుజ్క్ష్య." ఇందులో ధైర్యం కురు అంటే ధైర్యం చేయి అంటే అనువాదం తప్పవుతుంది. ధీరత్వం చూపుమని అర్థం.

మరియొక విషయం.

పదమునకు గల అర్థమును నిర్ణయించుటకు సంయోగాది సాధనములు 15 కలవని భర్తృహరి వివరించి చెప్పినాడు. వాటిలో స్వరముకూడా పేర్కొన్నాడు. అయితే ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణ కర్తలయిన శ్రీ చెలమచర్ల రంగాచార్యులుగారు 'ఉదాత్తానుదాత్త స్వరములు వేదములోనే అర్థ నిర్ణయ సాధనములు, లౌకిక వాక్యములలో లేవు' అని వ్రాసినారు. కాని లౌకిక భాషలన్నింటను ఉంటవి. మన తెలుగులో ఎట్లు ఉన్నవో చూడండి. ఎంత పెద్ద చెట్టు! ఎంత పెద్ద చెట్టు? (అబే) ఎంత పెద్ద చెట్టు. What a big tree......... అడయార్లో ఉన్న మఱ్ఱిచెట్టు నీవు చూడలేదు కాబోలు, దాని ముందర ఇది ఎంత? ఒక్క 'రా' అన్న ఏకాక్షర పదము స్వరభేదముల వల్ల అర్థభేదములను పొందుతుంది. నీవు వస్తే యిస్తాను రాకపోతే ఏలాగివ్వగలను? ఇటువంటి మాటలకున్న వాక్యాలకున్న అర్థ భేదం సూచిస్తూ ఆంగ్ల భాషావేత్తలు into nation curves చూపిస్తున్నారు. ఈ విషయంలో మనవారు కృషిచేయడం లేదు.

శ్లేషను మన కవులు చక్కగా అభ్యసించారు. ఒక భాషలో గల శ్లిష్ట పదములను

మరియొక భాషలోకి అనువదించలేము. An ambassador is one that lies in a foreign country to lie for his country అని lie అనే పదము రెండర్థములు కలదిగా ప్రయుక్తమయినది. దీనిని మరియొక భాషలోనికి యథాతథంగా అనువదించలేము. కువలయావళి నాటకములో 'వసంతం మాధవం' అనే పదములను శ్లిష్టపదములుగా సింగభూపాలుడు ప్రయోగించినాడు. అందులో వసంతం అంటే వసంతుణ్ణి అనే అర్థమున్ను, ఉన్నవానిని అనే అర్థమున్ను కలవు. ఈ రెండర్థములను తెలుగులోనికి ఎట్లు తేగలము? మన తెలుగులోగల శ్లిష్టపదానికి ఒక ఉదాహరణము చూడండి. వదినె తన ఆభరణములను వరాహరోమములుగల కుంచెతో శుభ్రం చేసుకొంటున్నది. మరిది వచ్చి, 'వదినా! వదినా! పందివా?' అన్నాడు. అనగా యీ కుంచెలోగల రోమములు పంది తాలూకువా? అనే అర్థములో అన్నానని సమర్థించుకోవచ్చునన్న ధైర్యముతో 'నీవు పందివా?' అనే అర్థము ధ్వనించేటట్టు చమత్కారంగా అన్నాడు. అది ఆమె గ్రహించి 'అవును మరదీ. ఊరుబందివో, అడవిబందివో తెలియదు గాని పందివేను' అన్నది. ఆ మరది తాను తీసుకున్న గోతిలో తానే పడ్డాడు.

కీ. శే. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు –

భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగయఁగట్టి.

అన్నారు. తెల్లవారు + అను the whites అనగా ఇంగ్లీషువారు అనే అర్థము ధ్వనింపజేస్తూ తెల్లవాఱను, తెల్లవాఱుచున్నప్పుడు అనే అర్థమునందు ప్రయోగించినారు. అప్పకవి వంటి లాక్షణికులు రేఫసాంకర్యము కలిగినదని ఆక్షేపించవచ్చును గాని ఈ సాంకర్యమునకు అలవాటుపడిన మన చెవులకు బాధ కలుగదు.

'కియన్మానం జలం విప్ర?' అంటే ఒక పేద బ్రాహ్మణుడు 'జాను దఘ్నం నరాధిప!' అన్నాడు. ఎంతలోతు అన్న ఉద్దేశంతో రాజు ప్రశ్నించాడు. కియన్మానం అనుటవల్ల నీటి పరిమాణాన్ని అడిగినట్లు ఉంటుంది. ఆ బ్రాహ్మణుడు చదువుకొన్న పండితుడు గనుక రాజుగారి ఉద్దేశం గ్రహించి మోకాలు లోతు అని అర్థమిచ్చే జానుదఘ్నం అనే సరియైన మాటలతో చెప్పాడు. రాజు తన భావమునకు ఉచితమైన మాటలు అనగా సరియైన నుడికారం ప్రయోగించలేదని గ్రహించాడు. మరియొక రాజు పల్లకి మోస్తూ ఉన్న ఒకరిని చూచి 'త్వాం బాధతి కిం?' అన్నాడట. అప్పుడతడు 'నత్వియం వాహనాత్ పీడా యథా బాధతి బాధతే.' బాధతి ఆత్మనే పదంలో బాధతే అని ఉండాలి. ఈ చమత్కారాలు ఎట్లు అనువదించగలము?

నుడికారపు సొంపునుబట్టిన్ని స్వరమునుబట్టిన్ని ఎవరు ఎవరితో మాట్లాడుతున్నారో వారిని చూడకుండానే చెప్పగలము. 'ఏమే వంటయిందా' అన్న మాటలు వినబడగానే భర్త భార్యను ప్రశ్నిస్తున్నాడని వెంటనే గ్రహించగలము. 'ఏడవకు, అం కావాలా? బువ్వ పెడుతానుండు' అన్న మాటల వల్ల తల్లి పాపాయితో మాటలాడుతున్నదని గ్రహించగలము. 'అమ్మా! మాధవ కబళం' అన్న మాటలు చెవిని బడగానే అడుక్కొని తినేవాడు వచ్చాడని చెప్పగలము.

పరియాచకముగా 'వదినా! వదినా! (అప్పడం) నీవు కాల్చుకు తింటావా? వేపుకు తింటావా? (అన్నయ్య తెచ్చిన మామిడిపండు ఇదిగో) పీల్చుకు తింటావా కోసుకు తింటావా?' అంటుంది మరదలు. ఇటువంటివి మరియొక భాషలోనికి అనువదించలేము.

ఈ చమత్కారపు నుడికారమంతా జీవద్భాషలకే చెల్లుతుంది. ప్రాతబడ్డ మాటలు వాడుక చేస్తే వ్యవహారహాని కలుగుతుంది. ఎప్పుడు వచ్చావన్నప్పుడు 'రేపు వచ్చాను' అంటే మనకిప్పుడు అర్థము కాదు. రేపు అంటే ప్రాచీన భాషలో ఉదయమని అర్థము. ఇప్పుడు ఎల్లి tomorrow అని అర్థము. ఒక్కొక్కప్పుడు ప్రాచీన కాలమందలి అర్థములో

'ఓహో ఈ మల్లిపువ్వు ఎంతటి చక్కని కంపు కొడుతున్నది!' అన్నా, 'కొలువు కూటమందు పెద్దలందరు తలకు చీరెలు కట్టుకొని కూర్చున్నారు' అన్నా హాస్యాస్పదంగా ఉంటుంది.

కొన్ని కొన్ని మాటలలో చరిత్రాంశములు గోచరిస్తూ ఉంటవి. 'ఈ చదువులు కట్టిపెట్టు' తాళపత్ర గ్రంథాలు చదువుకొంటూ ఉండిన కాలములో పుట్టిన పలుకుబడి. వీడు వాడికోసం ఎగయదోస్తున్నాడు. ప్రమిదలో ఆముదముపోసి వత్తి పెట్టి దీపం వెలిగించే రోజులలో పుట్టిన మాట. అప్పుడప్పుడు ఆ వత్తి ఎగయదోస్తూ ఉండాలి. ఇప్పుడు భాగ్యవంతుల భార్యలు చెవులకు ఆభరణములుగా వేయి రూపాయలు ఖరీదు చేసే కమ్మలు ధరిస్తారు. ఈ కమ్మ శబ్దం ఈ ఆభరణానికి ఎట్లు వచ్చిందో చూశారా? ప్రాచీన కాలంలో తాటికమ్మల లేత ఆకు చుట్టగా చుట్టి మడచి చెవుల తమ్మలకు పెట్టుకొనే వారు. ఇప్పటికీ సవరస్త్రీలు పెట్టుకొంటారు. కొంతకాలానికి ఈ లేత కమ్మల స్థానంలో క్రమ క్రమంగా ఇత్తడివి, వెండివి, బంగారమువి, వజ్రపు పొడులు గలవి వచ్చినా మొదట నుండిన కమ్మ అనే మాట నిలచిపోయింది. ప్రాచీన కాలంలో ముదిరిన తాటి కమ్మలమీదనే లేఖలుకూడా వ్రాసుకునేవారు. కనుక కమ్మ పంపించాడు అంటే లేఖ, చీటి పంపించాడన్నమాట, ఇప్పుడు కాగితం మీద వ్రాసినా చీటీ అనే అర్థంలో కమ్మ వ్రాశాడు అంటాము. పూర్వకాలంలో నాలుగు పాకలు వేసుకున్న ప్రదేశం పాక్కమయింది. విల్లిపాకం, పుదుప్పాకం, నుంగంబాకం అలాగున వచ్చిన పేళ్ళే. ఇప్పటికీ మురపాక, తాళ్ళపాక , అలపాక అనే గ్రామాలు ఉన్నవి. ద్వివేదుల వారు, చతుర్వేదులవారు, సామవేదం వారు, వేదుల వారు, చిత్రకవివారు, శృంగారకవి వారు అంటే వారి పూర్వులు ఆయా విద్యలలో గడితేరిన వారని అర్థము. అవి యిండ్ల పేళ్లుగా వాడుకలోనికి వచ్చినవి. దేవులపల్లివారు అంటే వారి పూర్వులు మొదట దేవులపల్లిలో ఉండేవారని ఊహించవచ్చును. అట్లే ఓరుగంటివారు. ఈ విధముగా యింటి పేళ్ళను బట్టి కొన్ని వెనుకటి విషయములు తెలుసుకోవచ్చును. ఒకటి వకటిగాను, ఒద్ద వద్దగాను రూపాలు మారినవి. ఇవి గ్రామ్యరూపాలని వడ్డాది సుబ్బారాయుడుగారు ఒకసారి అంటే 'అయితే ముందుగా మీ యింటి పేరు మార్చుకోండి,

అది గ్రామ్యరూపము. ఒడ్డవాది అని ఉండాలి' అన్నాము. చిలకమర్తి వారితోకూడా ఈ విధముగా ప్రసంగించవలసి వచ్చినది. చిలుకంబఱ్ఱునుండి వచ్చిన రూపమది. పఱ్ఱు, కుఱ్ఱు, తుఱ్ఱు అనేవి ఆయా ప్రదేశము లందలి నైసర్గిక స్వరూపాన్ని తెలియజేస్తవి. వాటికి ఔపవిభక్తి రూపాలు వచ్చి పర్తి, కుర్తి, తుర్తి అవుతవి. కాకరపఱ్ఱు గ్రామంలో ఉన్నవారు కాకరపర్తివారు, సాకుఱ్ఱులో ఉన్నవారు సాకుర్తివారు, పులుకుఱ్ఱులో ఉన్నవారు పులుగుర్తివారు, పెనుతుఱ్ఱులో ఉన్నవారు పెందుర్తివారు. ఈ గ్రామ నామాల విషయం చెప్పాలంటే ఎంతయినా ఉంది.

సామెతలలో మాటలశక్తి, నుడికారపు సొంపులు, సంఘస్థితి, భావనా సంపద మొదలయిన సంస్కృతి విశేషాలు ఎక్కువగా గోచరిస్తూ ఉంటవి. కనుకనే ఒక భాష మాతృభాషగా గలవారి గొప్పతనము ఆ భాషలో గల సామెతలను బట్టి తెలుసుకోగలము. సామెతల గ్రంథము ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారు ప్రకటించారు గనుక, సామెతల విషయం నేను అట్టే ప్రసంగించను. అందులో చేరవలసిన సామెతలు యింకా ఉన్నవి. కొన్ని పాడిందే పాటగా పునరుక్తి దోషమునకు ఆస్పదమయినవి.

కొన్ని మాటలు అసందర్భంగా భాషలోకి ఎట్లు ప్రవేశిస్తవో చూడండి. ఆక్స్‌ఫర్డు నిఘంటు నిర్మాతలు ప్రపంచమందంతటను గల ఆంగ్లేయ మిషనరీలకు, ఉద్యోగులకు నివేదించుకున్నారు. మన ఆంగ్లేయులకు తెలియని జంతువుల పేళ్ళు వృక్షముల పేళ్లు పట్టికలు వ్రాసి వాటి లక్షణాలు తెలియజేస్తూ పంపండి అన్నారు. మెడగాస్కర్‌లో ఒక మిషనరీ అక్కడ ఉండే వింత జంతువుల పేళ్లు వ్రాస్తూ ఒక జంతువు పేరు ఇన్‌డ్రి అని వ్రాసి పంపించాడు. అది ఆ జంతువుపేరు కాదు. ఆమాట కర్థము 'అదిగో' '10'. అది ఎలాగు వచ్చిందంటే ఆ దొర అక్కడి స్థలజ్ఞుడ్ని ఒక వింత జంతువు కనబడగానే 'దాని పేరేమి?' అని అడిగాడు. ఆ స్థలజ్ఞుడు దానికోసం వెనుకకు తిరిగి చూచేలోపున అది పారిపోయింది. మరికొంత సేపటికి అది మరల వచ్చి ఆ స్థలజ్ఞునికి కనబడింది. ఆ జంతువు గురించేనా నీవు అడిగావు అన్నాడు. 'ఏదీ ఆ జంతువు?' అన్నాడు దొర.

'అదిగో' అన్న అర్థంలో 'ఇన్‌డ్రీ' అన్నాడు వాడు. అదే ఆ జంతువు పేరు అనుకుని ఆ దొర వ్రాసుకున్నాడు. అది నిఘంటువులలో నిల్చిపోయింది. ఇప్పుడందరమూ పాండుచేరీ, పాండీ అని అంటున్నాము. అది వాస్తవంగా పుదుచ్చేరి. కొత్తచేరి అని అర్థము. ఆ ఊరు మొదట ఆక్రమించుకొన్న విదేశీయులు ఫ్రెంచివారు. వారు తమ Spelling సంప్రదాయాన్ని అనుసరించి Pondicherry అని వ్రాసుకున్నారు. 'ఊ' అనే ఉచ్చారణ తెలియజేయుటకు on వ్రాస్తారు. మరి కొన్నాళ్ళకు on లో ఉన్న n అనే అక్షరము అనుకొన్నాడొక ఆంగ్లేయుడు. అతడు పాండిచేరి అని ఉచ్ఛరించాడు. ఇటువంటివే మద్రాసులో ఉన్న Barber's Bridge. అది కట్టించిన హామిల్టన్‌ను అంబట్టంగా తమిళులు ఉచ్చరించారు. అంబట్టం అంటే తమిళ భాషలో మంగలి. దానికి ఇంగ్లీషు అనువాదము Barber .

కొన్ని మాటలు చిత్రంగా పరిణమించినవి. వాడు చాలా పితలాటకం మనిషి అంటాము. తంటాల కోరు మనిషి అను అర్థములో, పిత్తలి హాటకం చేసే వాడని అర్థము. అనగా ఇత్తడిని బంగారంగా చేసే గారడీవాడని భావం. ముదరష్టం - మృతనష్టంలో నుంచి వచ్చినది.

కొన్ని సంస్కృత శబ్దాలకు సంస్కృతంలో లేని అర్థాలు కల్పించుకునీ మనం వాడుకొంటున్నాము. నాకు అభ్యంతరము లేదు అంటే నేనేమీ అడ్డు చెప్పను, అసమ్మతిని చెప్పను అన్న అర్థంలో వాడుతున్నారు. అభ్యంతరం అంటే మందిర మందలి లోపలిగది అన్నమాట. ముందరి గదిలో ఇంటి యజమాని కూర్చుని ఉండగా వారిని చూడడానికి వచ్చిన వారు 'మీతో ఒక ముఖ్యవిషయం మాటలాడడానికి వచ్చినానని చెప్తే' ఇక్కడ బహిరంగంగా చెప్పే విషయమా? లేక అభ్యంతరములో – రహస్యంగా చెప్పవలసినదా? అన్నప్పుడు 'అక్కరలేదండీ, అభ్యంతర మెందుకు, ఇక్కడనే చెప్పవచ్చును' అంటాడు. క్రమక్రమంగా అభ్యంతరమంటే ఆటంకమన్న అర్థం పరిణమించింది. 'మర్యాద' అంటే మొదట పొలిమేర హద్దు అని అర్థము బమ్మెర పోతరాజుగారి కాలానికి గౌరవమనే

అర్థం వచ్చింది. 'మర్యాదగాదంచు' పిమ్మట మర్యాదస్తుడు, మర్యాద గలవాడు అనే వాడుక వచ్చినది. మగ పెండ్లి వారికి జరుపవలసిన మర్యాదలు చక్కగా జరిగినవా? అంటే, సమ్మానం బాగా జరుగుతుందా అని అర్థం.

ఒక్కొక్కప్పుడు ముందు మాటలు విడిచిపెట్టి చివరిమాట అర్థం తెలుసుకోకుండా ప్రయోగిస్తూ ఉంటాము. ముహూర్తము రహితమయినదా? 'నిశ్చయమయినదా' అనే అర్థంలో ప్రశ్నిస్తాము. వర్జ్య రాహుకాలవిదోషం రహితమయినదా అనవలెను.

కొన్ని పదములు ఎట్లు పరిణమించినవో చూడండి. త్రగ్గు – తరగు – తగ్గు; మ్రగ్గు – మరగు – మగ్గు; క్రాగు – కరగు – కాగు. ఏమే 'అచ్చమ్మక్కా?' రావే బుచ్చమ్మక్క అంటారు. ఇద్దరు పొత్తుగా మాటలాడుకొను సంబంధమువల్ల పుట్టింది అచ్చిక బుచ్చికలు అనే సమాసము. ముందు కలుపుకోలు తనము మాటలు అనే అర్థములో పిమ్మట ముచ్చటలు అనే అర్థంలో వాడుకొంటారు. కల్లబొల్లి మాటలు అని అర్థము రాదు. 'అక్కఱఁజూడ' వేటికల యచ్చిక బుచ్చిక సేయునంచలన్ (విజయ విలాసం) అచ్చుగాఁదీర్తు మీ యప్పని కొన్ని యచ్చిక బుచ్చికలాడి (హంసవింశతి).

కొన్ని బాలక్రీడల పేళ్ళు గ్రంథాలలో కనబడుతున్నవి. అందులో కొన్ని మనకిప్పుడు తెలియవు.

దినముల్ కొన్ని ననంగ నంతఁ గడునర్థిన్ బొమ్మ పెండ్లిండ్లు గు
జ్జెనగూ ళ్ళచ్చన గండ్లు పింపిళులు కుచ్చీల్ గీరలునం గింజవా
మనగుంటల్ కనుమూసి గంతనలు కంబాలాట లోనైన ఖే
లనముల్ మీఱఁగ బోంట్లతో నలరె బాలారత్న మెల్లప్పుడున్. (కళా.)

ఇవికాక తొక్కిళ్ళు, బేడిసె తిరుగుళ్ళు, దాయాల వొళ్లు మొదలయినవి హంసవింశతి మొదలయిన తక్కిన కావ్యాలలో ఉన్నవి.

ఇప్పుడు మనపిల్లలు ఆడుకొంటూ ఉన్న ప్రాచీన కాలపు అటలలోని మాటలు అందరికీ తెలియవు.

కాళ్లాగజ్జా కంకాణమ్మ
వేగుల చుక్కా వెలగా మొగ్గా
మొగ్గాకాదు మోదుగనీడా.

ఇందులో కాళ్ళకు గజ్జి పట్టుకుంటే అందుకు కావలసిన ఓషధుల పేళ్లు కలవట.

కొండమీద వెండీ గిన్నా కొక్కిరాయీ
కాలూ విరిగే గానికేం మందు?
వెల్లుల్లి పాయ. . . . .

సారంగధరుని కాళ్లు పోతే అతకడానికి చెప్పిన మందుల పేళ్ళు గలవట!

ఉత్తుత్తి వండు, ఉత్తరేణి వండు
దానిమ్మ వండు, దబ్బవండు.

ఇందులో బాలికల వయస్సు, యువతుల వయస్సు ధ్వనించే పేళ్ళున్న వంటారు.

కొన్ని మాటలు ఇప్పుడు మనం గ్రామ్యాలనుకొంటున్నవి మునుపటి గ్రంథాలలో కవులు వాడుక చేసినవే. ఉదాహరణము 'పలకర సేసినావా? అంటే వేప పుడకతోనో కానుగు పుడకతోనో పళ్ళు తోముకొన్నావా? అని అర్థము. పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నంలో 'పలకర సేయక పసుపు రాచికొనక" అన్నాడు.

కొన్ని అసందర్భపు సమాసాలు గ్రంథాలలోనికి ఎక్కుతున్నవి. అల్లకల్లోలము ఇందులో అలలన్నా, కల్లోలాలన్నా ఒకటే. కెరటాలంటే కీ.శే. వావిలకొలను సుబ్బారావు గారికి బోధపడలేదు. అన్నదమ్ముడు అంటే వారు ఆక్షేపించారు. అన్నైనా కావాలి, తమ్ముడైనా కావాలి. ఒక్కడే రెండున్నూ ఎట్లు కాగలదు అన్నారు. అన్నో తమ్ముడో తెలియనప్పుడు అంటారు. శ్రీనాథుని నాటి రడ్డి నేడు రెడ్డి అయినది. ఆనాటి రడ్డీ – రాజూ అన్న పలుకుబడి నేటికిన్నీ నిలిచియున్నది. ప్రాచీనకాలపు అర్ధానుస్వారాలు గంజాం జిల్లా మారుమూల తెలుగు ప్రదేశాలలో ఇప్పటికిన్ని ప్రాణాలతో ఉన్నవి.

ఈఁగలు, తోఁకలు, ఈఁకలు నీళ్ళు కాఁగుతున్నాయి అంటారు అసలైన తెలుంగు కాఁపులు. ఆంబోతు, దాంగొన్నాడు మొదలయిన కొన్ని తెలుగు మాటలలో నిండుసున్న ఉంచికూడ మాటాడుతారు. కురుమాపు గడ్డము అన్నాడొక మంగలి కళింగపట్నంలో. కురుమాపు పుట్టంబులన్ గట్టి అన్నాడు నన్నయ. కురుమాపు – అల్పంగా మాసిన అని అర్థము. కంబారి. కోనారి (=గొల్ల), బైతారి (=అగనాలి) నొన్నారి, 'కని నొన్నారి కృతుల్ నగల్' అన్నారు చిలకమర్తివారు. నన్నయ అట్టిడు, అట్టిరు, అట్టిరే వేల్పులు అన్నాడు. అట్టిడుఅంటే అట్టివాడు అని అర్థము. దాని వంటివే పొట్టడు. కుఱ్ఱడు, గొల్లడు, పిల్లడు, ఒక్కడు, బిక్కడు మొదలయిన రూపాలు.

ఒక్క ప్రత్యయము ఒక మాటకు క్రొత్తగా చేరితే సాదృశ్యం బట్టి మరికొన్ని మాటలకు చేర్చుతారు. పెంకెతనం, మొండితనం, చిన్నతనం, పెద్దతనం, పెత్తనం, బెత్తుపెత్తనం, రాలుగాయితనం, కలుపుకోరుతనం మొదలయినవి. అరికం ప్రత్యయంతో కొన్ని భావార్థక రూపాలు ఏర్పడ్డవి– ఇల్లరికం, మేనరికం, కన్నెరికం, పెద్దరికం, చుట్టరికం మొదలైనవి. కారం అనే ప్రత్యయంతో నుడికారం, వెటకారం, కనికారం, కనికరం, పట్టికారం, వెలిగారం, నయగారం మొదలయినవి. కల్లు అంటే రాయి అన్న అర్థం ఇప్పుడు కొందరికి తెలియదు. అయినా సన్నెకల్లు, ఒరుగల్లు, ఓరుగల్లు, కుత్తుకల్లు (మునుపు చిన్నరాతి గోళమే పుణ్యస్త్రీలకు కంఠాభరణము) ఇప్పుడు బంగారంతో చేసినా కుత్తిగల్లు, కుత్తిగంటు అనేమాట నిల్చిపోయినది. కొన్ని మాటలు కుదించి వాడుతారు. బృహస్పతి వారం – బేస్తవారం అయింది. నన్నయనాటికే పూజించితివే – పూజించితే అయినది. ఋత్విజుండని విచారించి పూజించితే. అలాగునే చూచితివేనిన్ క్రమంగా తగ్గి చూస్తే అయింది. కొన్ని జంట మాటలు శబ్దాలంకారాలతో శ్రావ్యంగా ఉంటవి. వావీవరుస, ఊరూ పేరూ, అప్పూసొప్పూ, మడీమట్రా, దిక్కూ మొక్కూ అద్దూపద్దూ, మాటామంతీ, అడపాతడపా, ఏండ్లూపూండ్లు, కబురూ కాకరకాయా మొదలయినవి.

సింగినాదం జీలకర్ర అంటే సింగిణికి నాదం లేదు, జీలకర్ర కర్ర కాదు అన్న మాట. గాడిదగుడ్డు కంకరపాసూ - అంటే గాడిద గుడ్డు పెట్టదూ, కంకర పాచీ కట్టదన్నమాట. 'నా అప్పు ఎప్పుడు తీరుస్తావురా! అంటే ఎల్లుండి ఏకాదశినాడా?' అంటారు. ఇంగ్లీషులో at the Greek Kaleuds అన్నట్టు. కోతిపుండు బ్రహ్మరాక్షసి అయినది అంటే గోకడం చేత పుట్టిన కురుపు సెప్టిక్ అయి రాచపుండువలె అయినదన్నమాట.

కొన్ని నుడికారాలు హాస్యరసంతో వినసొంపుగా ఉంటవి. పనసకాయ దొరికినప్పుడే తద్దినం పెడతానని భర్త అంటే, ఐతే నులకమంచం దొరికినప్పుడే నేను నీళ్ళాడతా నన్నదట భార్య. అల్లుడు వచ్చిన దాకా అమావాస్య ఉంటుందా?

కొన్ని పద్యాలలో తెలుగు నుడికారం ఎంత సొంపుగా ఉంటుందో చూడండి:

"ఇదిరాయి రవ్వ వల్లంబిది మిట్టిది మాకుమట్ట యిది,
పామిదిగామిది యని వివరింపఁగఁ బెట్టిదమై
ఉన్నయట్టి అక్కటిక చీకటిలోనన్" (వంచ. వే)

శ్రీనాథుని శృంగార నైషధంలో నలుడు హంసను పట్టుకొన్నప్పుడు నలునితో హంస పల్కిన పల్కులలో తెలుగు తీయందనము, నుడికారపు సొంపులు ఎట్లున్నవో చూడండి: మూలంలోని ఒక చిన్న శ్లోకంలో -

మదేక పుత్రా జననీ జరాతురా,
నవప్రసూతర్వరటా తపస్వినీ.
గతిస్తయోరేష జనస్త
మర్దయన్ అహోవిధేత్వాం కరుణారుణద్ధినో"

అని ఉన్న అంశాలు శ్రీనాథుడు ఒక సీసపద్యంలో చక్కగా వివరించాడు.

"తల్లి మదేక పుత్త్రక, పెద్ద, కన్నులు గాన విప్పుడు మూడుకాళ్ల ముసలి
ఇల్లాలు కడుసాధ్వి, ఏమియు నెఱుఁగదు పరమ పాతివ్రత్య భవ్యచరిత!
వెనుక ముందర లేరు నెవరైన చుట్టాలు, లేవడి యెంతేని జీవనంబు
కానక కన్న సంతానంబు శిశువులు జీవస్థితికి నేన తావలంబు.
కృప దలంపఁగదయ్య యో నృపవరేణ్య
అభయ మీవయ్య యో తుహినాంశువంశ
కావఁగదవయ్య! అర్థార్థి కల్పశాఖి
నిగ్రహింపకుమయ్య యో నిషధరాజ!"

ఈ హంస దమయంతి వద్దకు పోయినప్పుడు అన్న మాటలు చూడండి:

"అడిగితి నొక్కనాఁడు కమలానను తేరికి వారువంబునై
నడచుచు ఉర్విలో నిషధనాథుని కెవ్వతెయొక్కొ భార్య య
య్యెడునని చక్రఘోషణము నించుక యించుక కాని యంత యే
ర్పడ విననైతి 'నీ' వనుచు బల్కిన చందము తోఁచె మానినీ!"

ఇటువంటి కమ్మని పద్యాలింకా మన కావ్యాలలో ఉన్నవి. ఇటువంటి పద్యాలు శబ్దకాఠిన్యానికి విద్వదౌషధమని పేరుపొందిన ఈ శృంగార నైషధంలో ఇంకా ఎన్నో ఉన్నవి. ఇతర గ్రంథాలలో వందల కొలదిగా కనపడతవి.

తెలుగు తీయందనము అర్థం సులువుగా గాని కఠిన సంస్కృత పదాల వల్ల చెడుతుంది. అంతే కాదు సంస్కృత పదాలు డంబంగా పలుకుతూ తిట్టినా విన్నవారు సులువుగా అర్థం చేసుకోలేరు. ఒక భట్రాజు పిసినిగొట్టు పిల్లజమీందారు వద్దకు పోయి ఎంత పొగడినా ఏమీ ఇయ్యలేదు. అప్పుడా భట్రాజు మనసులో మండిపోతూ ఆ జమీందారుకు అర్థం కాని సంస్కృత పదాలు గుప్పుతూ 'వైనతేయారి గ్రైవేయ వైధవేయా!' అని రాగవరుసను పాడగా ఆ జమీందారు పరమానంధభరితుడై సమ్మానించాడు. ఆమాటల కర్థం తెలిసికోలేకపోయినాడు. 'పాములను కంఠాభరణంగా

దాల్చిన వైధవేయా!' (ముండకొడకా) అని అర్థము. అచ్చు తెలుగైనా వాడుకలో లేని మాటలతో చెప్తే అర్థంగాదు.

కైరాకుత్తుకన్ జట్టువాక్షి మెరయున్ గట్టాణి పేరెంతయున్ అంటే కవిరాజుగారి మెడచుట్టును ముత్యాలపేరు ఎక్కువగా మెరుస్తున్నది అని అర్థము. "నిండునెల మూతిదాన" అన్నారు ఆదిభట్ల నారాయణదాసు గారు తద్భవమైనా లేని అచ్చు తెలుగులో. అంటే అర్థమేమి? 'పూర్ణచంద్రముఖీ' అన్నమాట.

విదేశీయ పదముల వల్ల భాషాభివృద్ధి ఎట్లు కలుగుతున్నదో సూచన మాత్రముగా చెప్పి నా ప్రసంగం ముగిస్తాను. ప్రపంచమందలి భాషలలో భావనా సంపత్తికి అందుకు తగిన పదసంపత్తికి పేరు పొంది అగ్రస్థానము పొందినది ఆంగ్లభాష. అది ప్రపంచమందలి అన్ని ముఖ్యభాషల నుండిన్నీ కావలసిన పదములను యథోచితముగా చేర్చుకొని జీర్ణించుకొన్నది. అందుచేత అది గౌరవము పొందినదే కాని లాఘవము పొందలేదు.

Boycott, Mackintosh, Fabian, August, Sandwich మొదలయిన మాటలు మనుష్యుల పేళ్ళ నుండి వచ్చినవి. అట్టివి మన భాషలో అజానేయాలు, ఆణిముత్యాలు, పెగ్గాలు, మైసూరుపాక్కులు, పూరీలు, భీష్మించుకొన్నాడు మొదలయినవి. కల్పిత సమాసాలు – tea - cup, tomfoolery, April - fool, easy chair, bore-dom, Bi-weekly, disbelief మొదలయినవి. అటువంటివే మన భాషలో నేరస్థుడు, అపనమ్మకము, వెర్రి వెంగళప్ప, దరిద్రగొట్టు దామోదరుడు, మరచెంబు, కంచు మరచెంబు, ఉత్తర జందెములు, లింగకాయ, జీవగర్ర, ప్రాణగొడ్డము, వట్టినామాలు మొదలయినవి.

విదేశీయాలు :

Latin-circus-deviate-exert - దీనారాలు – దీనారటంకాల తీర్థమాడించితి.

Greek - autonomy - orthodox - Trignometry - Jaronian - త్రికోణ యవనులు.

French - Bronze, Glaciar, Buffet - పరాసులు, బూచి, మదాం జాకీ (పేకాట – చీట్లాట).

Dutch - Ges, Skate - బలందులు – బత్తాయి.

Portuguese - Cobra, Zebra - బుడతకీచులు, ఫరంగీలు, చిట్లఫిరంగి.

Persian - Back - sheush, Durbar - దర్బారు.

Turkish - Bosh, Jackal - తురకలు.

Arabic - Amir, harem - అమీరు.

Chinese - tea - టీ, తేయాకు.

Indian languages - Chintz, Coolie, Khaki, loot, Pandit, rag, thug, tomtou, catamaran rice, aricanut, Zanana, Mangoose, Serpent, Sapiece, Cheroot etc.

ఈ విదేశీయ పదములు రావడమువల్ల భాషాభివృద్ధి కలుగుతుందన్నాడు Dryden. భాష చెడిపోయిందన్నారు Swift Johnsen లు. చెడిపోయేదేమీ లేదు. ఈ మాటలు మన సొంతం చేసికొని మన భాష పెంపొందించు కొంటామన్నారు ఆ తర్వాతి విద్యావంతులు.

అదే నేటి వివేకుల అభిప్రాయము.

15. తూమాటి దొణప్ప

(౧౯౨౬ - ౧౯౯౬)

భాషావేత్తగా, సాహితీ విమర్శకులుగా ప్రసిద్ధులైన తూమాటి దొణప్పగారు అనంతపురం జిల్లా రాయదుర్గం తాలూకా పాఠశాలలో స్కూలు విద్య, అనంతపురం ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేసి ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి బి.ఏ.ఆనర్స్, ఎం.ఏ.డిగ్రీలు పొందారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం లోని తెలుగు శాఖ ఉపన్యాసకులుగా, ఆచార్యులుగా ఉద్యోగం చేసి తదనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవిని పొందారు. ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణపై, తెలుగులో హరికథలపై వెలువరించిన గ్రంథాలు వారి పరిశోధనా వైదుష్యానికి నిదర్శనాలు. 1965లో డాక్టరేట్ పట్టం పొందిన సిద్ధాంత గ్రంథం "వైకృత పదస్వరూప నిరూపణము" భాషా శాస్త్రరంగంలో ఆయనకు కీర్తిని గడించింది. క్రీ.శ. 200 నుంచి ఆధునిక కాలం వరకు తెలుగులో సంస్కృతప్రాకృతముల నుంచి ప్రవేశించిన వికృత పదాల సమగ్ర పరిశీలనమైన ఈ గ్రంథం దొణప్ప గారి భాషా జిజ్ఞాసను వెల్లడిస్తుంది. ఇందలి మొదటి భాగంలో ధ్వని పరిణామం, అర్థ విపరిణామం, వైకృత పదాల రూపనిర్మాణం మున్నగు అంశాలు – రెండవ భాగంలో విపులమైన పద పట్టిక, వాని వ్యుత్పత్తి నిర్ణయము వివేచితమైనాయి. పూనాలో భాషాశాస్త్ర కేంద్రంలో వారు సల్పిన పరిశోధనలోని భాగమే మరాఠీపై తెలుగు భాషా ప్రభావ పరిశీలనము. మరాఠీ, తెలుగు భాషల పరస్పర ప్రభావం, ఆదాన ప్రదానాలు ఇందులో ఆసక్తి కరంగా చిత్రితమైనాయి.

15. మరాఠీలోని తెలుఁగు నుడులు

- తూమాటి దొణప్ప

'యద్వైవాజ్ నాభవిష్య
న్న ధర్మో నా ధర్మో వ్యజ్ఞానయిష్యత్
న నత్యం నానృతం నసాధు నాసాధు
న హృతయజ్ఞో నాహృదయజ్ఞో
వాగే వైత త్సర్వం విజ్ఞానయతి
వాచ ముపాస్స్వేతి.' – *ఛాందోగ్యోపనిషద్, 7-2-1.*

పదునాఱేండ్ల క్రిందటి మాట. 1954 లో పూనా దక్కన్ కళాశాల వారి ఆధ్వర్యమున నిర్వాహమయిన భాషావిజ్ఞాన విద్యాలయము లో ఈ వ్యాసకర్త విద్యార్థిగా శిక్షణము నందుచుండిన కాలము.

ప్రస్తావన :

1954 డిసెంబర్‌లో పాతికమంది మిత్రులతో పాటు అజంతా ఎల్లోరాలు దర్శించుట తటస్థించినది. ఆ బృందములో ఆంధ్రులేగాక ఓఢ్రులు, కన్నడిగులు, కాశ్మీరీయులు, తమిళులు, బెంగాలీలు, మలయాళీలు మున్నగు వారుండిరి. పూనా తిరుగుపయనములో సహాధ్యాయులు మిత్రులు శ్రీ కె.జి. గుజరాతి గారిని ఉబుసుపోకకు జ్ఞానేశ్వరిలోని కొన్ని ఓవీలు – మరాఠీ సాహిత్యములో ఓవీయను ఛందములో వ్రాయఁబడిన పద్యములు ఓవీలు – చదవి వివరింపుఁడని కోరుట జరిగినది. ఆ ప్రసంగ మాంగ్లమునందే సాగినది. అప్పటికి జ్ఞానేశ్వరిని గూర్చిన స్థూలమయిన

చారిత్రక జ్ఞానము వ్యాసకర్త కుండెడిది. ప్రసిద్ధమయిన భగవద్గీతకు మరాఠీ భాషలో భావార్థ దీపిక యనుపేర ఓవీఛందములో సంతరింపఁబడిన విపుల వ్యాఖ్యాన రూపమిది. కర్తృనామమును పురస్కరించుకొని భారవి మాఘముల వలె సంక్రమించిన పేరు జ్ఞానేశ్వరి. ఇది ఇంచుమించు పదివేల ఓవీల గ్రంథము. ప్రసిద్ధ భక్తకవి జ్ఞానేశ్వర కృతము. మహారాష్ట్రీయ భాగవత ధర్మపంథకు పరమప్రమాణము, అతిగహనమయిన వేదాంత తత్త్వరహస్యములను అరఁటి పండొలిచి చేతికందిచ్చిన రీతిగా అలఁతి యలఁతి పలుకులతో అమృతంపు గుళికలవంటి ఉపమలతో దిద్ది తీర్చిన రుచిన రచనము జ్ఞానేశ్వరి.

గుజరాతిగారు మొట్టమొదట చదివినది జ్ఞానేశ్వరి సంపాదకుఁడయిన ఏకనాథుని పద్యము, ఏకనాథుఁడు పదునాఱవ శతాబ్దివాఁడు. జ్ఞానేశ్వరి అనేకములయిన పాఠాంతరములతో, ప్రక్షిప్తములతో నిండియుండఁగా బహుప్రతులను పరిశీలించి కవి హృదయము నెఱిఁగి శాస్త్రీయముగా సాధుపాఠములను సవదరించిన సత్య సంశోధకుఁడు ఏకనాథుఁడు. గుజరాతిగారు పఠించిన ఆ పద్య మిది:

“జ్ఞానేశ్వరీ పాఠీ జో వోవీ కరీలా మరాఠీ
తేణేం అమృతాచియే తాటిమ్ జాణవరీటీ రేవిలీ”

“జ్ఞానేశ్వరి పాఠములో ప్రక్షిప్తములను ఇముడ్చు వాఁడు అమృత పాత్రమున కొబ్బెర చిప్పను చేర్చువాఁడు” అని దీని అర్థము. ఆయన వివరణము విన్న తరువాత ‘చాంగు భళా’ యను ప్రశంసాపదావళితో నా మెచ్చికోలును దెలిపితిని. ‘మీకు మరాఠీ వచ్చునా?’ యని గుజరాతి మహాశయుని ఆశ్చర్యభరితమయిన ప్రశ్న: ‘ఆరెబాస’తో నాకు బొత్తిగా పరిచయములేదని చెప్పితిని. ఆయన నమ్మలేదు. కారణమేమనఁగా ‘చాంగు భళా’ యను రెండును మరాఠీ మాటలు. పాల్కురికి సోమనాథుని రచనములలో ప్రశంసార్థకములుగా బహువారములివి ప్రయుక్తము. ‘ఏకనాథుని కెంత తెఁలుగు వచ్చునో నాకంత మరాఠీ వచ్చు’ నని చమత్కరించితిని. ‘ఏమి టేమిటి? ’ యని

ఆయన కూతూహలము. 'తాటిమ్'లోని 'తాట' తెలుఁగువారి 'తట్ట' యని వివరించితిని. మాతో పాటు పయనము సేయుచున్న సహవ్రతులు మంగ్రూల్‌కర్ మొదలగు మరాఠీ మిత్రులను, పూనాలో ఆచార్యబాపట్ మున్నగు పండితులను సంప్రతించి 'తాట' తెలుఁగువారి సొంత మాటయని తీర్మానించిరి. ఆ తరువాత కొంత కాలము మరాఠీమిత్రుల శుశ్రూషచేసి మరాఠీలో మిడిమిడి జ్ఞానమును సంపాదించితివి. నేఁటికిని ఆ భాషలో పరిమిత పరిచయము (Working Knowledge) తప్ప పరిగణింపదఁగిన ప్రవేశము నాకలవడలేదు. నాఁటినుండియు నేఁటిదాఁక ఆ చూపుతో జరిగిన పరిశీలనము వలని ఫలిత మీవ్యాసము. భారతీయ భావసమైక్యము ఆవశ్యకత ప్రబలుచున్న ప్రకృతయుగమున ఈ రెండు భారతీయ భాషల పరస్పర ప్రభావమును గూర్చి పరిమిత పరిధులలో ప్రదర్శించిన యీ వ్యాసము మున్ముందు జరుగవలసిన పర్యాప్త పరిశీలనమునకు ప్రస్తావనా ప్రాయము కాఁగలిగినచో వ్యాసకర్త ఉద్యమము ధన్యము.

తెలుగు – మరాఠీల సంబంధము

తెలుఁగు – మరాఠీ భాషలు భౌగోళికముగా పరిసరస్థ భాషలు. వ్యుత్పత్తి పరముగా పరస్పర విజాతీయములయిన ఈ రెండు భాషల మధ్యఁ గల కొన్ని సాదృశ్యములు చారిత్రక భౌగోళిక మత విషయక సాంస్కృతికాద్యనేక సంబంధముల మూలమున సంభావ్యములయిన ఆదాన ప్రదానములకు ప్రధాన నిదర్శనములు. మరాఠ్వాడా–తెలుగు నాడులకుఁగల ఇట్టి సంబంధ బాంధవములు ఇక్ష్వాకుల తాతముత్తాతల నాఁటివి. దక్షిణాపథ పతులగు శాతవాహన చక్రవర్తుల పరిపాలనా కాలమునాఁడు మరాఠ్వాడా – తెలుఁగు నాడులు ఇంచుమించు నన్నూ టేండ్లపాటు ఒక గొడుగునీడ కూడిమాడి యుండుట జగమెఱిఁగిన చరిత్రము. ప్రాకృత సాహితీక్షేత్రమున మధుర దర్శనమగు 'సత్తస ఈ' – గాథాసప్తశతి – పై గాఢమయిన తెలుఁగు ముద్రకలదని సాహితీ సుగతుల స్వగతము.

ప్రాక్కాలిక బాంధవము

మరాఠ్వాడాను ఏకాతపత్రముగా ఏలిన పశ్చిమ చాళుక్యవంశీయుల ఒక రెమ్మయేకదా సాగరాంధ్ర సీమల వేంగీ రాజమహేంద్రవరములు అలవాలములుగా ప్రాచ్యశాఖగా ప్రవర్తిల్లుట! ఆనాఁటి నుండియు ప్రాక్పశ్చిమ చాళుక్య ప్రభువంశముల మధ్య సాగిన నిరంతర జ్ఞాతి కలహములు చరిత్ర ప్రసిద్ధములు, పూర్వ చాళుక్య ప్రభువగు గుణగ విజయాదిత్యుని మహామాత్యుఁడును, సేనానియుననగు 'పండరంగు' ఈయదనున ముఖ్యముగా పేర్కొనవలసిన వ్యక్తి. ప్రభుపరముగా పండరంగు (క్రీ.శ. 849) నిర్వహించిన జైత్రయాత్రలు నేఁటి మధ్యప్రదేశము నందలి మరాఠీ మండలములకును విస్తరించినట్లు శాసన ఫలకముల కథనము. ధర్మవరము శాసనము ఎత్తుగీతియందు ప్రసక్తమయిన స్థలనామములనేకము మరాఠ్వాడాలోనివి.[1] కిరణ పురము మధ్యప్రదేశములోని 'బాలేఘాటు' మండలమునందలి కిరణపురమను గ్రామము. చేది మండలమునకు అర్వాచీన నామము డహలదేశము. ఈ డహలము మధ్యప్రదేశములోని బుందేలుఖండ ప్రాంతము. శాసనము సందలి 'డహలనిరుతము' డహల మండలములో నైరృతి భాగము. మధ్య ప్రదేశములోని నేఁటి 'ఏలిచ్‌పూర్' నాఁటి ఆచలపురమఁట;[2] మరాఠ్వాడా తూర్పుటెల్లలోని దత్తవాడ, బార్సూరు, బైరంఘడ్ (బస్తరు) ప్రాంతములు నాఁటికిని నేఁటికిని అధిక సంఖ్యాకులగు ఆంధ్రుల కావాసములు. పూర్వోక్త ప్రాంతములలో చోడ వంశోద్భవులు, కరికాలాన్వవాయులు నిలిపిన ఆంధ్రభాషామయ శిలాశాసనములు ఆ భూముల యందలి తెలుఁగు ప్రభుతకు శాశ్వతాశాసనములు. పశ్చిమ చాళుక్య ప్రభువగు సోమేశ్వర దేవుని 'అభిలషితార్థ చింతామణి' త్రిలింగ పరమేశ్వరులగు కాకతీయ చక్రవర్తుల రాజ్యతంత్ర నిర్వహణమునకు మార్గదర్శకముగా నుండినట్లు చరిత్రకారుల నిర్ణయము.

నెల్లూరి '..... మన్మవిభు పంపై చన్న సైన్యంబు...... మహారాష్ట్ర సామంతు..... సారంగున్ దోలి తురంగమున్ గొనిన సంగ్రామము.....(నిర్వచనో. 1-43) తెలుగు

– మరాఠీల సరాసరి సంబంధములకు చక్కని సాక్ష్యము. దేవగిరి యాదవరాజుల పరిపాలనము మరాఠ్వాడా చరిత్రములో స్వర్ణయుగము. రామచంద్రదేవుఁడు (క్రీ.శ. 1271 – 1309) ఈ యాదవ రాజులలో సుప్రసిద్ధుఁడు. ఇతని మహామాత్యుఁడే హేమాద్రి. క్రీ.శ. 1279 నాఁటి ఉణ్కకదేవ శిలా శాసనము (ఆదిలాబాదు మండలము) నను పరికీర్తితుఁడయిన మహాప్రౌఢ ప్రతాప చక్రవర్తి శ్రీరామ చంద్రదేవుని మహాప్రధాని యగు హేమాడియును, చతుర్వర్గ చింతామణికర్త యగు హేమాద్రి పండితుడును అభిన్నులని చరిత్రకారుల నిర్ణయము. వ్రత దాన తీర్థమోక్ష పరిశేషములను నైదుఖండములలో సంగ్రథితమయిన విజ్ఞాన సర్వస్వమీ చతుర్వర్గ చింతామణి. యాదవరాజుల దేవగిరికి, త్రిలింగ పరమేశ్వరుల ఓరుగంటికి గల రాజకీయ సంబంధములు చిరకాల సమీచీనములు.

రెడ్డిరాజుల కాలము

కాకతీయ పాలకుల కొలువులో మెలఁగి పాలకుల మెలఁకువ లెఱిఁగిన రాజనీతి కోవిదుఁడు ప్రోలయవేమారెడ్డి (క్రీ.శ. 1300–1356). ఓరుగంటి పతనములో మధ్యాంధ్ర మహీమండలమున స్వతంత్ర పతాకమెత్తిన ఈ రెడ్డిబిడ్డ రెడ్డి ప్రభువుల కుదురునకు మూలపురుషుఁడు. రెడ్డిరాజులకు ఒండు రెండు తరములు బూర్వుఁడయిన హేమాద్రి పండితుని చతుర్వర్గ చింతామణికి సాగరాంధ్ర సీమలో నుండిన ప్రశస్తి ప్రచార ప్రభావములు అనన్యములు. చతుర్వర్గ చింతామణి త్రిలింగరాజ పరమేశ్వరు (కాశీ. 3–248) లగు రెడ్డిరాజుల నిత్యానుష్ఠానముల యెడ ప్రమాణ గ్రంథముగా చెల్లుఁబడి యగుచుండినట్లును, అది వీరి విమల చారిత్ర శిక్షకాచార్యకము వహించినట్లును ప్రమాణములు బండ్లకొలఁది. రెడ్డిరాజులందఱును హేమాద్రి ప్రోక్త దానపరులు; హేమాద్రి దాన చింతామణి బిరుద విరాజితులు. ఈ బిరుదములు కేవలము కులక్రమాగతములని కొట్టివేయ వీలులేదు. ఇవి రెడ్డిరాజుల వితరణ గుణ ప్రదర్శకములయి ప్రతి పదసార్థకములయిన బిరుదములని వారి శాసనాదికములు

ప్రత్యక్ష సాక్ష్యము.[3] రెడ్డిరాజులు పెక్కురు 'ధారాపట్టణ సార్వభౌమ సురధాణ్దర్పాపహార క్రియా ధోరంధర్యము' కలవారు.[4] ధారానగరము రాజధానిగా మరాఠ్వాడాలోని ప్రాగ్భాగములందలి మాల్వామండలము నాకాలమున పరిపాలించిన సులతానులే ధారా పట్టణ సార్వభౌములు. బహమనీ సామ్రాజ్యము బద్దలగుదాఁక మరాఠ్వాడా తెలంగాణము లొక యేలుబడిలోని మాగాణములు. మహారాష్ట్ర విజృంభణముతో దాక్షిణాత్య సీమలపై జరిగిన మరాఠీ దండయాత్రలు చరిత్ర ప్రసిద్ధములు. టిప్పు సులతానుతో జరిగిన మైసూరు యుద్ధములలో విజయలక్ష్మిని చేపట్టుటకు ఇంగ్లీషు కుంఫిణీ వారికి బాసటగా నిలిచినందున పశ్చిమాంధ్ర ప్రాంతము (అనంతపురము, కడప, బళ్ళారి మండలములు) మహారాష్ట్ర పాలకులకు పసదనపు వాటాగా నిర్ణీతమయినను కొన్ని రాజకీయ కారణముల వలన ఈ నిర్ణయము ఆచరణము నందననూదితము; అనూదితమయి యుండినచో ఈ ప్రాంతము మీఁద మరాఠీ ప్రభావము ఇబ్బడిగా ముబ్బడిగా పడి యుండెడిది. ఆనంద రంగరాట్ఛంద కృతిస్వామియగు విజయానంద రంగపిళ్ళె 'తన పేరు విన్నంత దద్దరిల్లి మరాఠి పౌజు చీకాకుగాఁ బరువులెత్త... వాసి చెందిన' (రంగరాట్. పీఠిక, 119) వాఁడు. నిజాము హయాములో మరాఠ్వాడాలోని ప్రాగ్దక్షిణ సీమయును, ఉత్తరాంధ్ర భూమియును రాజకీయాది సంబంధములు కలవి. తంజావూరు నేలిన మహారాష్ట్ర ప్రభువుల ఆంధ్ర భాషాసేవ దక్షిణాంధ్ర యుగమున ఒక విశిష్ట లక్షణమునకు లక్ష్య భూతము.

ఆరె బాస

మరాఠీ భాషయును తద్వ్యవహర్తలును 'ఆరెము', 'ఆరె' అను నామములతో తెలుఁగునాట వ్యవహృతమగుటకు మధ్యయుగముల నుండియు ప్రమాణములు కోకొల్లలు. పండితారాధ్య చరిత్రమునందలి 'ఆరెపరుస' నడకలు సుపరిచితము (పండితా. పర్వత. పుటలు 381 – 387). '..... ఆరెలుఁ గన్నడీలరవలుఁ దెలుఁగులుఁదన బిరుదందియఁ దవిలికొలువ నెగడి...' (ద్వా. 1–42) న వాఁడు సనదప్రోలి

వెన్నయమంత్రి. నెలనాటి చోడవంశాలంకారుఁడగు గొంక నృపాలుని కూర్చు మంత్రియగు నీ వెన్నయామాత్యుఁడు పదుమూఁడవు శతాబ్దివాఁడు. సింహాసన ద్వాత్రింశికాకర్త యగు కొఱవి గోపరాజు (క్రీ.శ. 15వ శతాబ్ది) ఈ వెన్నయమంత్రి కనంతర మేడవ తరమువాఁడు. అమీనుఖానుని తనయుఁడగు గతాతఖానుఁడు 'అరబి పారసి గుజరాతి యారె మచ్చ తెనుఁగు కన్నోజి మొదలుగాఁదెలిసి వ్రాయ దారి గన్నట్టివాఁడు..... (యాయా. 1-47)'. అమీనుఖానుఁడు యయాతిచరిత్ర కృతి పతి గోలకొండనవాబు మల్కిభరాము (1550-1581) నొద్ద రాజకీయోద్యోగి. ఆఁనాటి రాచవారలలో అనేకులు 'ధీరులు సన్నుతింప బహుదేశ లిపుల్ బహుదేశ భాషలున్ సార కవిత్వ సౌష్ఠవ రసజ్ఞతయున్ దమసూక్ష్మ బుద్ధిచే నేరిచినట్టి....' (రామవిలాసము. పు.35) వారు.

పాండురంగ విఠలుని ప్రభావము

మరాఠ్వాడా నడిగడ్డలో పండర పురమున వెలసిన పాండురంగ విఠలుని యెడ తెలుఁగు వారికిఁ గల భక్తి ప్రపత్తులను గూడ ఈ సందర్భమున లక్ష్యీకరించుట ఆవశ్యకము. మరాఠ్వాడాలోని భాగవత పంథవారు విఠలేశ్వరోపాసకులు. ఈ పంథలో ముఖ్యుఁడగు జ్ఞానేశ్వరుఁడు (క్రీ.శ. 1275 - 1296) ప్రముఖవ్యాఖ్యాత. కాకతీయుల కాలమునాఁటి ద్విపద రామాయణకర్త బుద్ధారెడ్డి యొక్క తండ్రి విఠ్ఠలాధీశుఁడు పాండురంగ విఠలనాథనామ చిహ్నితుఁడని పెద్దలయభిప్రాయము.[5] బుద్ధారెడ్డి పుత్రులలో విఠ్ఠల భూపతి నామాంకితుఁడొకడు కలఁడు.[6] ద్విపదరామాయణ కర్తృత్వ వివాదమున బుద్ధారెడ్డికి ప్రతివాది యగు రంగనాథుఁడొకఁడు మన తెలుఁగు కవుల జాబితాలో చేరినాఁడు. మఱి, ఈ రంగనాథుఁడు భీమరథీ సరిత్తటమునందలి పాండురంగ విఠ్ఠలనాథుని పేరిటివాఁడో, ఉభయ కావేరీ మధ్యమునందలి శ్రీరంగనాథుని పేరిటివాఁడో చెప్పలేము. రెండవ యూహయే సత్యస్వరూపమునకు సమీపము కావచ్చు. పాండురంగ విఠ్ఠల నామధేయులగు శతాధికవ్యక్తు లానాఁడు తెలుఁగు నాట నున్నట్లా నాఁటి శాసనములు సాక్ష్యము.

తెలుఁగు సాహితి : పాండురంగ విఠలుని ప్రశస్తి

శిల్పకళాసీమ యనఁదగిన విఠలరాయ దేవాలయమును పాండురంగ సేవాసావధానులగు విజయనగరాధీశులు హంపి విజయనగరములో నిర్మించుట తెలుఁగువారికి క్రొత్తకాదు. తెనాలి రామకృష్ణుఁడు (క్రీ.శ. 1510-1580) పాండురంగక్షేత్ర మాహాత్మ్యమును ప్రబంధరూపమున పంచాశ్వాస పరిమితముగా నాంధ్రమునఁ బ్రపంచించినాఁడు. పాండురంగక్షేత్ర మూర్తుల ప్రసక్తి విడిగా ఆంధ్ర సాహిత్యములో లేకపోలేదు. 'పండరంగి నుండి వచ్చి.....' (తాళ్ళపాక. శృంగార సంకీర్తనలు, కీర్తన 26, పుట. 19). 'పాండురంగమందలి విఠలునకు సాష్టాంగంబు' (ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము. 880), 'వినోదకాఁడ వౌదువు విఠలేశ్వరా- వినుతించ నెట్టువచ్చు విఠలేశ్వరా ..... పాండురంగమునా చల్లగా నెలకొంటి జయ విఠలేశ్వరా (తాళ్ళపాక. అధ్యా. సంకీ. సంపుటి 10, సంకీర్తన-171)', 'పాండు రంగమునఁ బాటిలు విఠ్ఠలదేవునకు సదా దిగ్విజయములని' (హంస. 4-214). 'వసుధఁజూడఁ బిన్నవానివలె నున్నవాఁడు - వెస నన్నివిద్యలాను వెలసె విఠ్ఠలుఁ డు..... గట్టిగాఁబుండరీకుడు కడువేడుకఁ బెట్టిన - ఇట్టికపీటపై నున్నాఁడీ విఠ్ఠలుఁ డు (తాళ్ళపాక. అధ్యా.సంకీ.సంపుటి 6.సంకీ, 217). '...భైమిదక్షిణదిక్తట ప్రాంతభూమి సకలదివిజులతోడ సాక్షాత్కరించి పుండరీకుని మనిచిన పాండురంగ విఠలాధీశు (ఘటికా. 1-65)'.

మాహురమ్మ

కాకతీయుల కాలమున ఏకశిలానగరముననేగాక తెలుఁగు సీమలో పలుతావుల కాకతమ్మకు సైదోడుగా, మాహురమ్మక్కనాచిగా, ఎల్లమ్మదేవరగా బవనీల జవనికపాటల పరశురాముని కథలెల్ల పాడించిన ఏకవీరా మహాదేవిగా జాతరలలో తెలుఁవారి పూజలఁగొనిన (క్రీడా.పు.41-45) దేవతామూర్తి మరాఠావారికిని పరమదేవతామూర్తి మాహుర గ్రామ నివాసిని యగుటచే పరశురాముని తల్లి రేణుకాదేవి

మాహు(హూ)రమ్మగా వ్యవహరింపబడినది. ఈ మాహుర ఆదిలాబాదు మండలము కిన్వట్ తాలూకాలో నేఁటి 'మాహుర' యనుగ్రామము. మాతాపురము దీని పూర్వనామము. సమస్తలోక జనని శ్రీ ఏకవీరాంబికకు సంవాసస్థానమగుటచే మాతాపురనామము సర్వథా సార్థకము. క్రీ.శ. 1279 నాఁటి ఉణ్ణకదేవ (< ఉష్ణోదక దేవ = శ్రీరామచంద్ర) శిలాశాసనమున మాతాపుర నివాసియును, శరణనాయకుని కుమారుడును నగునొక శిల్పి పేర్కొనఁబడినాఁడు. మాతాపురమే మరాఠీ భాషలో మాహురగా మార్పు చెందినది. (మాతాపుర > మాఆవుర > మావుర > మాహుర). ఉణ్ణకదేవక్షేత్రమునకు పడమరగా పదికోసుల దూరమున మాహూర గ్రామమున్నది. పంచకృష్ణపంథ (మహానుభావ పంథ)కు చెందిన దత్తాత్రేయ భక్తకోటికి నేఁటికిని మాహూర ముఖ్యకేంద్రము.[7] 'మండపాకను బెనుఁబాక మాహురమున - నాగవరమున పోలాస ననిచె నింతి - ఓరుగంట వసించె నీలోత్పలాక్షి - కాకతమ్మకు సైదోడ ఏకవీర' (క్రీడా. పు. 42)అను క్రీడాభిరామ కర్తృ సాక్ష్యము సైత మిట అనుసంధింపఁ దగినది. 'నెయ్యంపుఁ గొడుకుచే ముయ్యేడుసారులు సుక్షత్రియ కులంబు నిక్షత్రముగఁ జేయించి హైహయరాజ దంతాస్థి పటలంబు గవడ పేరుగఁజేసికొన్న కోపకత్తె' కావున మాహురమ్మయే ఏకవీరాదేవి. మాహురమ్మయే నేఁటి తెలుఁగునాటి గ్రామదేవత యగు మారెమ్మ. ఏతద్దేవి ప్రభావ సూచకములగు మారెక్క, మారెప్ప, మారెమ్మ యను వ్యక్తి నామములు పశ్చిమాంధ్రమున అతి ప్రచురములు. తెలుఁగునాట బవినీంద్రు మొదలగువారు పాడు రేణుక కథ, పరశురామ పురాణములు కూడ నిందులకు ప్రజల నిదర్శనములు.

మరాఠీ సంస్కృతి ప్రభావము

తెలుఁగునాటిని చనిననాళుల ఉఱ్ఱూత లూఁగించిన నవనాథ సంప్రదాయ మునకు మరాఠ్వాడా జన్మభూమి. ఈ సంప్రదాయమున కాద్యులయిన మత్స్యేంద్ర గోరక్షనాథుల గాథలు, బోధలు ఆంధ్ర సాహిత్య క్షేత్రమున ఒకనాఁడు ముక్కారు

పంటలు పండించినవి. పత్తి కొండ సీమ (కర్నూలు మండలము) కు చెందిన అరెమరాఠీల కథయు, పానుగంటి సీమ (తెలంగాణా) కు చెందిన సూయల మరాఠి కథయు తెలుంగు పిల్లలకు సైతము కొట్టినపిండి. తెలుంగ దేశములో రెడ్డి (ముస సబు లేక పటేలు), కరణము (పట్వారీ), వెట్టి, తలారి మొదలగు పండ్రెండుగురు గ్రామోద్యోగులను 'బారాబలూతి' (< మరాఠీ - బారా = పండ్రెండు; బలుతేc = గ్రామోద్యోగుల స్వామ్యము) అని వ్యవహరించువాడుక మహారాష్ట్రుల నుండి సంక్రమించిన సంప్రదాయము. నిన్న మొన్నటిదాcక పశ్చిమాంధ్ర ప్రాంతముల ప్రబల ప్రచారములోనుండిన 'బాళబోధ్' లేక 'బాళ బంధు' లిపి సంప్రదాయము మహారాష్ట్ర సంస్కృతి ప్రభావమునకు మఱియొక మచ్చుతునుక.[8] ఇప్పటి తెలుంగువారు చాలమంది తమనామముల చివర తగిలించుకొను 'రావు' (< మరాఠీ. రావ, రావో< ప్రాకృత రాయ - < సంస్కృత. రాజ) మరాఠీ వారిది (జీవాజీరావు సిందియా, షీష్వా బాజీరావు, మురారి రావు ఘోర్పడే, యశ్వంతరావు హోల్కార్, సిద్ధోజిరావు ఘోర్పడే). ఆంధ్రదేశములో ముఖ్యముగా ఆవులన్న, కడమలకుంట, కర్నూలు, కాకినాడ, గుంతకల్లు, మాధవరము, రాయదుర్గము - పరిసరముల యందలి తోలుబొమ్మలాటలవారు మహారాష్ట్రులు. పశ్చిమాంధ్ర ప్రాంతములcగన్పించు హరికథాకథకులు చాలమంది మహారాష్ట్రులు. తెలుగు సీమలోని సంచార జీవు (Gypsy Tribes)లగు సుగాలీలు (= తండాలు, లంబాడీలు, బంజారాలు) మరాఠీ గుజరాతీభూములకు చెందినవారు. మరాఠి గుజరాతి భాషాసమ్మిశ్రముతో, స్థానికాంధ్ర మాండలిక సాహచర్యముతో వికృతి నొందిన వాగ్రూప వ్యవహారము వీరిభాష. మరాఠ్వాడాకు వలసపోయి స్థిరపడిన తెలుంగులు నేcటికిని నాగపురము, పూనా, బొంబాయి, షోలాపురము - మున్నగు నగరములలో లక్షలకొలcదిcగా గన్పట్టుచున్నారు. మరాఠీభాషా ప్రభావముచే మార్పాటొందిన తెలుగు మాండలికములు కామాటీ, కోంటావు, దేరాది, వడరి మున్నగునవి తెలుంగు - మరాఠీ భాషల పరస్పర ప్రభావమును మఱింత త్వరిత పఱిచియుండుటకు సుసంభవము.[9] తెలుంగు కన్నడిగల ఉగాదియును

మరాఠీల ఉగాదియును ఒకనాఁడే! ఏకారణము వలననో తెలుఁగులతోపాటు మరాఠీలును పంచద్రావిడులలో ఒకరుగా పరిగణితులు.

మరాఠీపై తెలుగు ప్రభావము

మరాఠీ బాలుర 'విటిదాండు' (గోడుంబిళ్ళ, చిల్లాకట్టె లేక బిళ్ళంగోడి) ఆట లెక్కింపునందలి వకట, లేండ, మూండ, నాల, ఆర, వైద – అను అంకెలు క్రమముగా తెలుఁగు నందలి ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఆరు, ఐదు అనువానికి వికృతులు. మరాఠీలో ఈ ఆటయందు 'ఆర' అనఁగా 'అయిదు' అనియు 'వైద' అనఁగా 'ఆఱు' అనియు వ్యవహారము. మూల భాషాపదముల అర్థము స్పష్టముగా తెలియక పోవుటయే పరిగణన క్రమమునందలి ఈ తబ్బిబ్బునకు మూలము. ఆఱేడు శతాబ్దముల క్రిందటిమాట! మరాఠ్వాడాలో పంద్రెండేండ్లు పెద్ద వఱపు పట్టి కఱవురాఁగా 'ఆరె' జనులు ఆబాలగోపాలము సుభిక్షమగు తెలుఁగు సీమకు వలసవచ్చి నిమ్మళముగా బ్రదికి బట్టఁగట్టిరఁట! తెలుఁగువారితోడి ఆ పంద్రెండేండ్ల సావాసము ఊరకపోలేదు. 'సొళాదొప్పియు నెత్తమున్ మొదలుగా జూదంబు' లలోని పరిభాష యంతయు మరాఠీవారి ఆటలనుండి తెలుఁగున దిగుమతి యయినది.[10] తెలుఁగు పిల్లల ఆటపాటలను మరాఠీ బిడ్డలు నేర్చిరఁట; తెలుఁగు అంకెల పరిభాషతోఁ గూడిన నేఁటి మరాఠీ బాలుర 'విటిదాఁడు' ఆట దీనికొక సాక్ష్యము. ఇది తెలుఁగువారి గొప్పకు ఆచార్యదేశీయులు చెప్పెడి అన్యోన్య ధన్యతా కథనము వంటిది కాదు. ప్రత్యక్షరమును ప్రమాణబద్ధము. విశేషించి మరాఠీ పండితులును, చరిత్రకారులును అంగీకరించిన యంశము.[11] " These words (Vaket, Lend, Mund, Nal, Ar, Vaid) are of Telugu Language as the game is supposed to have originated in Telangana, a province in Southern India.[12]

దంత్య చజల ఉనికి

మరాఠీభాష యందలి దంత్య చ,జ (చే, జే)ల ఉత్పత్తి వికాసములకు తెలుఁగు భాషతోడి సంసర్గ సంబంధమే హేతువని కాల్డ్వెల్, జాన్‌బీమ్స్, హోయర్నెల్, ట్రంప్- మున్నగు భాషతత్త్వ పరిశీలకుల నిర్ణయము.[13] భారతీయ భాషలలో తెలుగు మరాఠీలలో మాత్రమే దంత్య చజలు ప్రచురము. ఈ రెండు భాషలలోను దంత్య చజలు (దంత్య స్పృష్టోష్మముల) (tip alveolar affricates) తాలవ్య చజల (తాలవ్య స్పృష్టోష్మముల) (Blade alveolar affricates) కు సవర్ణములే (allo phones) కాని ప్రత్యేక వర్ణములు (phonemes) కావు. తాలవ్యాచ్చులు (Front vowels ఇ ఈ ఎ ఏ లు) పరముగా వచ్చినపుడు తాలవ్యములుగాను, తాలవ్యే తరాచ్చులు (non-front or Back vowels అఆ, ఉఊ, ఒఓ లు) పరముగా వచ్చినపుడు దంత్యములుగాను చజలు పరస్పర పరిపూరక సన్నివేశముల (complementary distribution) లో ప్రవర్తితములు. మరాఠీలో ప్రాచీన తద్భవము లందలియు, అవిజ్ఞాత ప్రకృతికములగు దేశజములందలియు చజలు తాలవ్యేతర స్వరఘటితము లయినపుడు దంత్యస్పృష్టోష్మములు. మరాఠీలోని ప్రాచీన తద్భవము లందలియు, అవిజ్ఞాత ప్రకృతికములగు దేశజములందలియు చజలు తాలవ్య స్వరఘటితములయినపుడు తాలవ్య స్పృష్టోష్మములు. స్పృష్టోష్మములనఁగా తెలుఁగున చవర్గీయధ్వనులు. మరాఠీ భాషావిజ్ఞాన చరిత్రకారుల పరిభాషలో ధ్వనులు అర్ధస్ఫోటకములు.[14] వీని యుచ్చారణమందు స్థానకరణముల సంపూర్ణస్పర్శ ఒక ముఖ్యలక్షణము. నిశ్వాస స్తంభన సమయము (on set) నందు స్పర్శస్వభావమును, నిశ్వాసస్ఫోటన సమయము (Re-lease, మోక్షణము) నందు ఊష్మస్వభావమును క్రమముగా నీధ్వనుల యుచ్చారణ రీతియందిమిడి యుండుటచే స్పృష్టోష్మములను పరిభాష వీని యెడల సార్థకము. చవరీ (=సవరము), చాఉడీ(=చావడి), చునా(=సున్నము). చోఖ (=చొక్కము), చోజ(=చోద్యము), చౌదా (= పదునాలుగు), జవక (=జంట), జాఇ(=జాజి), జువార (జూదరి), జూఁ (=జూదము), జోడీ(జోడు) - ఈ మరాఠీ మాటలయందలి చజలు

దంత్యములు, చిముటా (=మంగలివాని చిమ్మట), చేడా (=పిశాచి), జిణేఁ(=బ్రదుకు), జీభా(=జిహ్వా), జేథ (=ఎక్కడ, యత్ర) - ఇందలి చజలు తాలవ్యములు.

మరాఠీ కవుల పాత్రము

అనాదియును, అవిచ్ఛిన్నమును అయిన ఇట్టి సమీప సంసర్గ సంబంధముల వలన ఈ రెండు ప్రాంతములలోని వ్యవహారభాషలు పరస్పరము ప్రభావితమయి యుండుననుట నిర్వివాద విషయము, తొలినాళ్ళలో ఈ ఆదాన ప్రదానముల మహారాష్ట్రీ పాకృతము ప్రముఖ పాత్రము వహించినట్లు చరిత్రము, క్రీ.శ. పంద్రెండవ శతాబ్ద్యనంతరము మహారాష్ట్రీ ప్రాకృత పుత్రికయగు మరాఠీ భాష ఆస్థానము నాక్రమించుట సుస్పష్టము. ప్రగాఢమయిన ఈ సంబంధముల మూలమున తెలుఁగు నుడులెన్నియో మరాఠీ వారి నోళ్ళలో నలుగుడువడి వ్యావహారిక రూపములుగా మరాఠీకోశముల కెక్కియు, మరాఠ్వాడాలోని కవి పండితుల సమ్మతిని బడసి సాహిత్యస్థాయిని సంపాదించియు అక్షర రూపమున చిరస్థాయి యయినవి. చక్రధరుఁడు, జ్ఞానేశ్వరుఁడు, తుకారాము, నామదేవుఁడు, భాస్కరభట్టు, మోరోపంతు - మొదలగువారు మరాఠ్వాడాలో విశేషవ్యాప్తినందిన మహానుభావ పంథ, మహారాష్ట్రీయ భాగవత ధర్మపంథ, భక్తిమార్గము-లకు చెందిన భక్తకవులు. తెలుఁగునాట శివకవులవలె మరాఠ్వాడాలో వీరు మాన్యులు. ప్రబోధ వాహకముగా వీరు స్వీకరించినది ప్రజారంజకమయిన సమకాలీన వ్యావహారిక భాష, ఝటితిస్ఫూర్తిని, చమత్కార సమృద్ధిని దృష్టియందిడికొని మాతృభాషలో ప్రచుర వ్యవహారముగల అన్యభాషాపదములను సైతము సాహితీలోక శ్రీకములుగా తమ రచనములలో పొందుపఱిచి రససిద్ధిని, లక్ష్యశుద్ధిని సాధించిన కీర్తిమూర్తులు మరాఠీమహాకవులు.

పూర్వ పరిశీలకుల కృషి

ఇట్టి ఆదాన ప్రదానములు విదానముగా మరాఠీభాషలో మచ్చికపడిన తెలుఁగు మాటల తీరుతెన్నులను గూర్చి విశదీకరించుట ఈ యుద్యమము పరమార్థము.

ఆచార్య శ్రీ కృష్ణాజీ పాండురంగ కులకర్ణి - బొంబాయి ఎలిఫిన్స్టన్ కళాశాలలో మారాఠీభాషా శాఖాధ్యక్షులు - తమ మరాఠీ వ్యుత్పత్తి పదకోశము ప్రస్తావన (పు. 100) లో మరాఠీలోని తెలుఁగు పదములను గూర్చి చర్చించుచు, ఆడసణ, అనారస, అరవార, ఆర, ఓదు, కరధా, కాచకా, కుడుక, మిదుక, కోడీ, గజగా, చక, చావమ్యావ, చేక, జాడ, ఝూక్క టాలా (తాళా), నాలబరడ, బురగుండా, ముండ; లేండ, వకట, వయిద, శికేకాయి - ఈ యిరువదినాలుగును తెలుఁగునుండి మరాఠీవారు ఎరవుతెచ్చుకొనిన మాటలుగా పేర్కొనిరి. అదేమి మాయయోగాని ఇందులో ఆడసణ, అనారస, ఓదు, కాచక, కోడి, చావమ్యావ, చేక - ఈ ఏడును కులకర్ణిగారు కూర్చిన నిఘంటు భాగమున గైరుహాజరు. ఈ గైరుహాజరు బాపతు తెలుఁగు సరకు కూడ కాదు లెండి! అరవార (పు. 40), కరడా (పు. 140), కుడుక (పు. 172), గజగా (పు. 217), శికేకాయి(పు. 740) - ఇవి కన్నడ పదవికృతులని ఏతన్నిఘంటు భాగమున ఉట్టంకితము. జాడ (పు309) సంస్కృత జాడ, శబ్దభవముగా నిరూపితము. తాళ (ళా)(పు. 378) సంస్కృత 'తాళక' శబ్దజన్యమని ప్రదర్శితమయినది. దీని రూపాంత రముగా అంగీకృతమయిన టాళా (ళేఁ) (=తాళము) తెలుఁగు తాళమునుండి యని నిర్ణీతమగుట చింత్యము, బరడ (పు. 637) తమిళపదముగా నిర్ధారితము. చక (చకనామ, చకబంది) ఝూక్క ఇవి తెలుఁగుమాటలు కానేకావు. కాగా వీరి సూచనముల మూలమున ప్రకృత వ్యాసకర్త కృషిలో ప్రత్యక్షముగా ఉపకరించిన ఆరోపములు (entry words) అఱున్నొక్కటి మాత్రమే. తక్కినవి వ్యాసకర్త సుదీర్ఘ పరిశోధనము వలన నిర్ణీతములు. ఈ పట్టిక సమగ్రము కాకపోవచ్చు. వ్యాసకర్త చూపున కందని ఎరవుమాటలు మఱికొన్ని యుండవచ్చును. పదపట్టికలోని ప్రధానారోపములు (main entry words) ఏఁబది; ఉపారోపములు (sub-entry words)ఇరువది యెనిమిది. ఉపారోపములు ప్రధానారోపములకు రూపాంతరము (Variants) లగుటచే ప్రధానారోపములకు మాత్రమే పదపట్టికలో వరుస సంఖ్య ఈఁయబడినది. సమీప మాతృకను స్థాపించుటలో స్పష్ట ప్రతిపత్తి నిమిత్తము ఇతర భారతీయ భాషాపదము లావశ్యక స్థలముల నుద్ధృతములు.

పద పట్టిక (Etymological Index)[15]

అడకితా; చూ. అడకిత్తా(Candy). (పు.83/)[16]

1. అడకిత్తా ; అడకిత, అడకిత్తా – పోకలను ముక్కలు చేయుటకు వాడు కత్తెర వంటి సాధనము (కులకర్ణి పు.19) < తె. అడకొత్తు; క.అడకొత్తు అడకోతు, అడగత్రి.

2. అడాలు; భయము (జ్ఞానేశ్వరి). జ్ఞానేశ్వరిలో ఈ పదము ప్రయుక్తమని కులకర్ణి, కాని జ్ఞానేశ్వరిలో నిది మృగ్యము. అడదరు (=భీతి, కంపము) అనుపదము మాత్రము జ్ఞానేశ్వరి (అధ్యా. 1 ఓవీ, 107)లో ప్రయుక్తము. కులకర్ణిగారు పరిశీలించిన ప్రతిలో 'అడాలు' ఘటిత పాఠము కలదేమో?

< తెలుఁగు, అడలు; భయము, మరాఠీ మాట కన్నడము నుండి ఎరవు తెచ్చిన పదమని కులకర్ణి (మరాఠీ వుత్పత్తికోశ ఐతిహాసిక వ తౌలనిక. కృష్ణాజీ పాండురంగ కులకర్ణికృతము, కేశవభికాజీధవళే, ముంబఈ వారి ప్రచురణము. 1946, ప్రస్తావన, పు.99). కాని కన్నడము నందలి 'అడలు' నవీన మనియు, తెలుఁగు నుండి ఎరవు తెచ్చినది కానగుననియు ఆచార్య శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తిగారి ప్రతిపాదనము.[17]

3. అల్లడ : అల్లరి (కులకర్ణి 43) అమాయకత్వము
< తె. అల్లరి. ఆలరి=దుస్స్వభావము; కొంటెతనము.

4. ఆటపాట : బాలికల ఒక ఆట (కులకర్ణి 62)
< తె. ఆటపాట, ఆట+పాట (=ధ్వనివాచక శబ్దములు కానోపునని కులకర్ణి).

5. ఆటా : ఆట, క్రీడ (కులకర్ణి 62).
< తె.ఆట. కానడి నాటకాల ప్రభావము వలన 1841 లో

మరాఠీలో ఁజేరి యుండునని కులకర్ణి వ్యాఖ్యానము.

ఆడకిత్తా : చూ. అడకిత్తా (K.B. Dhavale పు. 220)[18]

6. అర : 'విటిదాండు' అను మరాఠీ బాలుర ఆటలో 'ఐదు'.

< తె. అఱు = అయిదు నొకటి. మరాఠీభాషలో శకటరేఫము లేదు గావున సాధురేఫ ఘటితముగా ఉట్టంకితము. విశేషించి తిక్కన్న నాఁటికే రేఫ సాంకర్యము కలుగుటచే శకట రేఫోచ్చారణము వ్యవహార విదూరమయి యుండనోపు.

ఉండ : చూ. ఉండా (కులకర్ణి పు. 95).

7. ఉండా : రూ. ఉండ, ఉండీ, గుంఁడ్రని వస్తువు; పిండిముద్ద (కులకర్ణి పు.95) < తె. ఉంట, ఉండ = గుంఁడ్రముగాజేయఁబడిన వస్తువు; కన్నడ. ఉండె; తమిళ; ఉండై, ఉరుండై, ద్రావిడీశబ్దము కానోపునని కులకర్ణి పు. 95.

ఉండీ : చూ. ఉండా. ముద్ద; గుళిక (జ్ఞా. 11-457).[19]

8. ఉరగుడేఁ : చూ. ఊరగుడేఁ, పల్లెటూరిలోని కోయిల, దేవళము (కులకర్ణిపు. 107) ఊరగుడేఁ : రూ. ఊరగుడేఁ 'జేణేఁ క్రైలాసదుర్గా పాడిలేఁ సత్యలోకేఁ ఘాతలేఁ సోన కానేఁ ఊరగుడేఁ ఘేతలేఁ వైకుంఠీచేఁ' శిశు. 160.[20]

< తె. ఊరగుడి : పల్లెటూరి దేవాలయము.

9. ఓనామా : ఆరంభము, మొదలు పెట్టుట (కులకర్ణి, పు. 119)

< తె. ఓనమాలు = 'ఓం నమఃశివాయ' అను షడక్షరితో మొదలయ్యెడి అక్షర సముదాయమున (alphabet) కు వాడుక పేరు, వర్ణ సమామ్నాయము. 'గిరిసుత దొలుపలుకుల సుస్వర మొదవగ నోం నమశ్శివాయ సదాస్మద్వరణాయ నమః శంకర శరణు మహాదేవ నీవ శరణనఁజొచ్చెన్' (కు.సం. 3-34). 'నన్నయ్యవార లోనామాలు దిద్దుకొమ్మనినచోఁ గడుపునొప్పునుచు నేడ్చి' (హంస 3-140), 'ఓనామాలు పఠించియుండునని లో నూహింపఁగా వచ్చు...' (హేమ సుందరోపాఖ్యానము, ప్రథమా) ఇత్యాదులు ఆంధ్ర కావ్య ప్రయోగములు.

10. ఓరకల : రూ.వరకల, వరఖల, వోరఖల, ఒరపట్టెడురాయి, గీటురాయి (కులకర్ణి, పు. 120)

< తె. ఒరకల్లు, ఒరగల్లు. కన్నడ, ఒరెగల్, ఒరెగల్లు; తుళు, ఉరెకల్లు ఒరెకల్లు, తమిళ, ఉరైకల్; మలయాళ, ఊరకల్లు, ఉరవుకల్లు కన్నడము నుండియని కులకర్ణి. పు. 120.

11. కట్టా: కొయ్యతోగాని, రాతితోగాని కట్టిన ఎత్తయినతావు, వేదిక (కులకర్ణి, పు. 128).

< తె. కట్ట = అరఁగు, వేదిక, చెఱువులోనగువానిగట్టు, ఎత్తయిన ఒడ్డు; కన్నడ. కట్టె.

12. కవ : ఆలింగనము, కౌఁగిలింత; ఏకత్వము (జ్ఞా. 13-61).

< తె. కవ = జోడు, జత, మిథునము; కవగూడు = జతగాకూడు; కవగొను = కవియు, జతగూడు, కవయు = కూడు; కవవాయు = జతవిడుచు.

13. కవళీ: కౌఁగిలించికొను 'తయావిరహ విషాచీ ఉకళీ' ప్రాణాతేఁకవళీ' (ఉద్ధవగీతా)[21] కౌగిలింత (జ్ఞా. 5-133) కవళణే (= కౌగిలించుకొను.)

< తె. కౌఁగిలించు, కౌఁగిలి; కవియు = పైకొను, పొదువు; సమీపించు; కవిదల = తాఁకుడు, స్పర్శ; కప్పు = ఆచ్ఛాదించు; పరివేష్టించు; వ్యాపించు; వ్యవహారాంధ్రమున 'కావిలించుకొను'; సంస్కృత. 'కవలయతి' నుండి పరిణతమని తుల్పుళే. పు.194.

14. కాలవా : కాలువ, ప్రవాహము (candy, పు. 123 కులకర్ణి, పు.162).

< తె. కాలవ. కాలువ; కన్నడ, కాలివె; తుళు, కాళివె; తమిళ, కాల్, కాల్‌వాయ్ = కాలువ; కాల్ = ప్రవహించు ; కాలువ.

15. కావ : కావిరంగు (< తె.కావి కులకర్ణి పు. 162)

< తె. కావి : ఎఱుపు; ఎఱ్ఱనిది; కన్నడ, తుళు, తమిళ, మలయాళ, కావి.కావడ: చూ. కావడీ (తుల్పు ళే, పు. 195)

16. కావడీ : కావడ, కావడి, నీళ్ళు లోనగునవి మోయుటకై రెండు కొనలయందును ఉట్లనో, త్రాళ్ళనో అమర్చినవెదురుబద్ద 'భరతి మధాచియా కావడీ' (వివేక సింధు, అధ్యా; 1 సం. 14; జ్ఞా. 16-77).[22]

< తె. కావడి. కావడికాలు, కావడికొమ్ము, కావడిఉట్లు, కావడిటప్పాలు, కావడిబద్ద, కావడిమోత, కావడించు = భుజము మీఁద మోయు; కావడి, కాండి, కాఁడి; కన్నడ. తుళు, కావడి; కన్నడ, కాగడి; తమిళ, కా= కావడి; మలయాళ కావు = కావడి; తమిళ, కావు = భుజము మీఁద మోయు; దేశీప్రాకృత - కాయ. కావ, కావడ, కావడి, కావోడి (పాఇఅ సద్దమహణ్ణవో, పు.240)కావడియా, 'కావడి' వాడు, (పైది).

కురల : చూ. కురళా (candy, పు. 205).

17. కురళా : రూ. కురల, కురళ = వంకరలు తిరిగి మొగముపై పడెడి వెండ్రుకలు, నొక్కుల జుత్తు.

< తె. కురులు = అలకలు; కన్నడ, కురుళు, కుడులు, కుర్ళు; తమిళ కుఱుళ్; మలయాళ, కురుళ్; దేశీప్రాకృత.కురూలో = వక్రకేశములు (దేశీనామమాలా, 2-63) కుటిలకుంతలములు (పాఇఅ. పు. 125); అలయాకురలా; (పాఇఅ లచ్ఛీనామమాల, 905; ధనపాలకృతము, శాదీ లాల్‌జైన్, బొంబాయి ప్రచురితము, 1960).

కురుళ : చూ, కురళా (candy, 205).

18. కైవార : రూ. కైవారా. పక్షాభిమానము, పక్షపాతము (జ్ఞా. 10.25) వాగ్దానము; స్వీకారము (candy, 286).

< తె. కైవారము = స్తుతి, పొగడ్త ; కైవారి = స్తోత్రపాఠకుఁడు; కైవారము సంస్కృత పదమని కొందఱ భ్రాంతి; అచ్చతెనుఁగు కృతులలోని వాడుకను వీరు గమనింపరు; వ్యుత్పత్తిపరముగా ఆలోచించు ఆసక్తి అల్పబోధనులకు అరుదు; కన్నడ. కెయ్‌వార = చేయెత్తి పొగడుట; తమిళ, కైవారమ్ = స్తుతి; ప్రశంస; మరాఠీ పండిత పరిశోధకులు రాజవాడే గారిచే 'కృపాకర' కింవారక కింవార; కింవారస్య భావః కైవారి అని నిరూపితము, ఇది పాండిత్య ప్రకర్ష కావచ్చును కాని, శాస్త్రీయ ప్రక్రియకాదని కులకర్ణి నిర్ణయము (కులకర్ణి. పు. 184). కన్నడమునుండి ప్రతిదేయమనినను తప్పులేదు. కైవారా : చూ. కైవార (ఉద్ధవగీతా, సం. 118).

19. కోడగా : నిర్లజ్జ, సిగ్గులేమి; బండ బాఱిన (కులకర్ణి, పు. 185).

< తె. కోడిగము = కొంటెతనము; పరిహాసము; కోడంగి, కోణంగి= విదూషక ప్రాయుఁడు; కన్నడ. కోడగ = కోతి.

20. కోమటీ : జాతి విశేషము; వ్యాపారి (కులకర్ణి. పు. 187).

< తె. కోమటి 'అంగడులఁ గోమటుల' (ఆంధ్రభారత. అది. 8-73). కోమటుల మాతృభాష 'ఏదేశమేఁగినా ఎందు కాలిడినా' తేటతెనుఁగు, కోమటులు అచ్చముగా తెనుఁగువారు. కన్నడ, తుళు. మలయాళ, కోమటి; తమిళ. మలయాళ, కోమట్టి.

21. కోంప : రూ. కోంపట, ఖోంప, గుడిసె, పాక (కులకర్ణి, పు. 186).

< తె. కొంప. 'కొంపం బోరుదయించి రావుగద నాకుంజెప్పుమా' (వేం.పంచ. 4-125), '..... అరిభయంకర లంక యంబేదకొంపయే.....' (రామా 7-7), 'దోసెడు కొంపలోఁ బసుల ద్రొక్కిడి . . . (శ్రీనాథుని చాటువు), మకరధ్వజుని కొంప ఒక చెంప గనిపింప చీరగట్టినదయా చిగురుఁబోణి; (శ్రీనాథుని చాటువు)' '. . . కొంప చెఱుపు. . .' (హంస 5-117) ఇత్యాది కావ్య ప్రయోగములేగాక, కొంపదీయు కొంప పీకు, కొంప మునిగినది, కొంపలకొఱవి, కొంపలంటుకొను, కొంపాగోడూ, పల్లెగొంపలు, 'సుపుత్రః కొంపపీకరః' 'హంపికి బోయెదాని కంటె కొంపలో వుండేది

మేలు' – మొదలగు పదబంధములు పలుకుబడులు తెలుఁగున ప్రసిద్ధము, కన్నడ, కొంపె = చిన్నగుడిసె, పల్లెటూరు; కొప్ప, కొప్పళ = పల్లెటూరు; తుళు. కొప్ప – హీనజాతులవారి గుడిసె ; తమిళ; కుప్పమీ = పల్లె; కుంపై = అస్పృశ్యులవాడ; కురంపైచిన్న గుడిసె; దేశీప్రాకృత ఖుంపా = వానజల్లు నుండి తప్పుకొనుటకై వాడు తృణమయోపకరణము (పా ఇ ఆ సద్దమహణ్ణవో, పు. 277)

కోంపట: చూ. కోంప. చిన్నగుడిసె (జ్ఞా. 14–218).

22. కోల (ణేఁ) : చిల్లీ కట్టెను దూరముగా చిమ్ము (కులకర్ణి, పు. 188)
< తె. కోల = కట్టె; కోలాటము = కోలలతో ఆడెడియాట; కన్నడ. తుళు. తమిళ. మళయాళ. కోల్ = కట్టె.

కోల (కాఠి) : దడికివేసెడి కొయ్య, ఒక రకమయిన ఆయుధము (జ్ఞా. 15–547) చూ. కోల (ణేఁ)

కోలదండా : పశువుల మెడలో కట్టిన గుదికోల (కులకర్ణి, పు. 188). చూ, కోల(ణేఁ).

ఖోంప: చూ. కోంప, గుడిసె. ఆశ్రయస్థలము, గుహ; రేవు (జ్ఞా. 7–103). పదాది యందలి అల్పప్రాణములు మహాప్రాణములగుట(aspiration) మరాఠిలో ప్రచురమగు లక్షణమని జాకోబి, బ్లాక్ మున్నగువా రంగీకరించిన యంశము ఉదా : సంస్కృత పాంశః –మరాఠీ – ఫాంశా (డా॥ మురళీధర్ గజాననపాంసే (Linguistic Pecularities of Jnaneswari, Deccan College Dissertation Series. 13 Samarth Bharat Press, Poona, 1953.పు. 45, 46)

23. గడ్డా : దుంప; ముద్ద (కులకర్ణి పు. 219).
< తె. గడ్డ ; కన్నడ. తుళు, గడ్డె, తమిళ, మలయాళ. కట్ట = ముద్ద.

24. గుంటా : రూ. గుంఠా భూపరిమాణము (కులకర్ణి. పు. 236)

< తె. గుంట = గుంద్ర; భూపరిమాణ విశేషము; క. గుంటే. ఎకరము లోనలువదియవువంతు.

25. చచ(ణేc) : చచ్చు మరణించు (కులకర్ణి), పు. 264.

< తె. చచ్చు. చా, చావు; కన్నడ సత్తు, సాయ్, సాయు; తమిళ. చా; మలయాళ. చా. సంస్కృత , చంచ్ = గతౌ? నుండి కానోపునని కులకర్ణి.

చండూ : చూ. చేండూ (జ్ఞా. 16-100)

చపల : చూ. చప్పల (కులకర్ణి. పు. 267)

చపలీ : చూ. చప్పల (ఫైది. పు. 753).

26. చప్పల : రూ. చపల. చపలీ, చేపలీ, పలుచని కాలిజోడు; ఆకుc జెప్పులు (కులకర్ణి. పు. 263).

< తె. చెప్పులు = పాదరక్షలు ; కన్నడ కెర, కెరవు కెర్పు; కాల్కెర్పు = కాలిచెప్పు; తమిళ చెరుప్పు = తోలుచెప్పులు; మలయాళ, చెరిప్పు; ధ్వన్యనుకరణ మని కులకర్ణి.

27. చంబూ= నీరు త్రాగెడిపాత్ర (కులకర్ణి, పు. 268)

< తె. చెంబు = నీరుత్రాగుటకువాడు రాగిపాత్ర; కన్నడ, చంబు చెంబిగె తామ్రపాత్ర, కన్నడ. తుళు. చెంబు = రాగిపాత్ర. ఈ కన్నడ పదము తెలుcగు నుండివచ్చిన ఎరవుమాటకావచ్చు. తమిళ. చెంపు=రాగి; బంగారు, ఎఱ్ఱని లోహము; పాత్ర; రాగిపాత్ర; మలయాళ. చెంపు=రాగి; రాగిపాత్ర. ఎఱ్ఱని అనునర్థముకల 'కెంపు' తాలవ్యీకరణమంది 'చెంపు. చెంబు' గా పరిణతము. సంస్కృత 'జంబూలక' శబ్దభవమని కులకర్ణి. ప్రాకృత, జంబూలయ = నీరు త్రాగెడిపాత్ర (పాఇఅ సద్ద మహణ్ణవో పు. 421) మరాఠీలోని 'జాంబ' (= నీరు త్రాగెడి పాత్ర) 'జంబూలయ' శబ్దజన్యము కానోపు. పశ్చిమాంధ్ర ప్రాంత వ్యవహారమునందలి 'జాము'(= tumbler) మరాఠీ నుండి ఎరవు తెచ్చినమాట.

చవ : చూ. చవీ, చవదార్ = రుచియయిన; చవ=ప్రీతి, సమ్మతి (Candy పు. 866), చవ (కులకర్ణి. పు. 270)

28. చవీ : రూ. చవ. రుచి 'కాపురకేళీ చాఁఘడీఁ – అమృతాచీ చవీలాగే పుడీ' కర్పూరపు టరఁటి ఫలములు అమృతము వంటి రుచికలిగినవి (మూర్తి ప్రకాశ; జ్ఞా. 15-272).[23]

< తె. చవి =రుచి, చప్పరించు, చవిగొను, చవిసూపు, చవులుదప్పు, చవులూరు, చవులొలుకు; కన్నడ, సవి, సవె, తుళు, సవి, సబి; సంస్కృత. చమ్ ధాతువు నుండి యని తుల్పుళె (vide : Prof. S. G. Tulpule, An Old Marathi Reader, Venus Prakashan, Poona, 1960. page.202) సంస్కృత. చమ్ – అదనే అని కులకర్ణి పు. 270.

29. చిక్కూ : కృపణత్వము ; లోభి (కులకర్ణి. పు. 278)
< తె. చిక్కు = ఆపద, బాధ; కార్శ్యము; కన్నడ. సిక్కు

30. చిల్లర : చిలుకు నాణెముల మొత్తము; చిల్లర సామానులు, సంచారవస్తువులు (కులకర్ణి ; పు. 284).

< తె. చిల్లర : మిగిలినది ; సామాన్యపు సరుకు; చిలుకు; శేషము, సత్రకాయ బాపతు; (అల్లరి. చిల్లరి; చిల్లరమల్లర, చిల్లర వెచ్చములు; చిల్లర సీవాఁ లిచ్చిమి (శ్రీమహాలక్ష్మి).

31. చుట్టా : పొగచుట్టు, బీడివంటిది (Candy పు. 139; కులకర్ణి, పు.285) < తె. చుట్ట = పొగచుట్ట; కన్నడ చుట్ట, చుట్టి; తుళు. చుట్ట; తమిళ. మలయాళ. చురుట్టు కన్నడము నుండి యని కులకర్ణి ప్రస్తావన, పు. 99; ఆంగ్లమునందలి 'cheroot' కు తమిళ 'చురుట్టు' మాతృక.

చేండు : చూ. చేండూ. 'మగశ్రీ కృష్ణచక్రవర్తీ సంఘాథేఁ చేండుఫళి ఖేళోఁ

లాగిన్వలే' 'శ్రీకృష్ణునితో 'చేండుఫళీ' ఆటను మొదలిడిరి' (శ్రీకృష్ణ చరిత్ర).[24]

32. చేఁడూ : రూ. చండూ, చేఁడు, బంతి; బంతి యాట శ్రీకృష్ణ చక్రవర్తి గోపాళాంసి చేండూఫళీ ఖేలత' గోపాలురతో శ్రీకృష్ణుడు చేఁడూఫళీ ఆటను ఆడుచుండఁ గా' (శ్రీకృష్ణ చరిత్ర జ్ఞా. 11–580); చేండూఫళీ = బంతియాట.

< తె. చెండు = బంతి; కన్నడ. సెండు; తుళు. చెండు; తమిళ. మలయాళ. చెంటు = బంతి; మలయాళ. చెంటు = దారపు బంతి. సంస్కృత, 'కందుక' – భవమగు ప్రాకృత 'చండుఅ' జన్యుమని కులకర్ణి వ్యుత్పత్తి. చూ. పు. 289; కాని ప్రాకృతములలో 'చండుఅ' మృగ్యము; కందుక – ఫలికా జన్యమని తుల్పుళే. పు. 204. చేపలీ: చూ. చప్పల (Candy పు. 753)

33. డావ (వా) : ఎడమ. సవ్యము (జ్ఞా. 7–126); – డావీబూజో = ఎడమవైపు; డావకా. డావఖురా, డావరా = ఎడమచేయి వాటముగల; డావ్యా హాత్ చా = ఎడమ చేతిలోనున్నది (Candy పు. 477) డావియే శ్రీకరీ చేయా=ఎడమచేతి (పూజావసర),[25] డాపా డోళానిముటే = ఎడమకన్ను అదిరినప్పుడు (రసకౌముది).[26]

< తె. డా. విణ. సవ్యము, ఎడమ, డాకడ, డాకాలు, డాకెలను. డాకేలు, డాచను, డాచేయి. డాతొడ, డాపల, దాపలకేలు, డాపలిసున్న, డా మూపు. మరాఠీలోని ఈ 'దావా' వ్యుత్పత్తి అనిశ్చితము, సందిగ్ధము అని ఆచార్య తుల్పుళే అభిప్రాయము (vide. పు. 208). దేశీప్రాకృత. డావో= ఎడమచేయి (దేశీనామమాల, 4–6); టర్నరు దొరగారి నేపాలీ నిఘంటువున,[27] దేబ్రే (=ఎడమ) ఆరోపము క్రింద ప్రదర్శితములయిన పదము లన్నియు ద్రావిడ మూలకములని ఆధునికుల సోపపత్తిక నిర్ణయము[28] (ద్రావిడ భాషలలో పదాది డకార ఘటితములు ముఖ్యముగా తెలుఁ గునకే పరిమితము).

34. తాట : భోజన పాత్రము, పళ్ళెరము (జ్ఞా. 5–107, 6–2, 13.423); తాటభర = తట్టెఁడు (స్మృతిస్థళ);[29] తాటకేలేఁ (పైది).

< తె. తట్ట = పళ్ళెరము, కంచము; తాట[30] = బల్లపరపు. కన్నడ తట్టె తమిళ. తట్టం, తట్టు; తుళు. తట్టుగ; కన్నడము నుండి యని కులకర్ణి. పు. 372; సంస్కృత 'తత' - నుండి యని తుల్పుళే, పు. 209.

35. తాటీ కంచె, వెలుగు (జ్ఞా. 2-310); వెదురుబద్దల చట్రము (కులకర్ణి - 372)

< తె. తట్టి = దడి; తట్టిగోడ = ఊరి చేరువ పొలము చుట్టు కట్టెడి రాతి కంచె; కన్నడ. తట్టి, తడికె; తమిళ. తట్టి.

తుక : చూ. తూక. బరువు (జ్ఞా. 14-141; 18-640)

తుక (ణేఁ) : తూకముచేయు (కులకర్ణి, పు. 382) చూ, తూక.

36. తూక : రూ. తుక. బరువు. తూఁచి నిర్ణయింప వలసిన పరిమాణము (జ్ఞా. 9-261).

< తె. తూకము = బరువు, భారము; తూకు = కొలఁది, ప్రమాణము. బరువు; తూకువ = భారము, తెలుఁగు నందలి తూకము మొ.వి. వ్యుత్పత్తి పరముగా సబిందుకములగుట శాస్త్రీయము; ఇవి తూఁగు ధాతుజన్యములు, కన్నడ. తూక, తూకు. తూంకు.

37. తేలగూ : ఒకానొక ద్రావిడ భాష నామము (కులకర్ణి.పుట. 387).

< తె. తెలుఁగు. ప్రాకృత. తేలంగ.

38. దిండ : బట్టలమూట (Candy పు. 67, కులకర్ణి,పు. 460)

< తె. దిండు : కన్నడ. దిండె: తమిళ, మలయాళ, తింటు.

39. నాల : 'విటిదాండు' ఆటలో పరిగణన క్రమములో 'నాలుగు' (కులకర్ణి. పు. 596; ముజుందార్. పు. 85). < తె. నాలుగు.

40. పైకా : డబ్బు, సంపద. '. . . నానా భక్తమాలి ఆందత్త పైకాచా వివరు. . . . .' (= నానా భక్తులచే సమర్పితమయిన పైకము వివరము), (పండర పుర శిలాశాసనము, క్రీ.శ. 1273).

< తె. పైకము = ధనము, ఒక నాణెము; పసిఁడి నాణెము లేఁత, పచ్చ అను అర్థములు కల పచ్చ పచ్చటి, పచ్చని, పచ్చి, పచ్చిక, పయిఁడి, పసరు, పసి, పసిఁడి, పసిమి, పసిరిక, పసుపు, పెయ్యపెసర, పెసలు, పైకము. పైఁడి, పైద, పైదలి, పైరు - ఈ పదరాశి సమస్తము పచ్ - పయ్ - అను ద్రావిడమూలధాతు జన్యము, పసిఁడి యనఁగా పసుపు పచ్చని లోహము (= బంగారు) దీనితో చేసిన నాణెముల రాసియే పైకము అని మౌలికార్థము, కన్నడ పయ్క, పైక; తమిళ; పయిక్కం.

41. బుకగుండా : బాలుఁడు (కులకర్ణి. పు. 653).

< తె. బురుకఁడు = స్తనపాయి, బిడ్డఁడు; బురక = పసిపాపఁడు, పోరగాఁడు, తెలుఁగు 'బరగేఁ' నుండి యని కులకర్ణి.

కన్నడ. పోర. శిశువు; తుళు. పోర, పోరె = బాలుఁడు; పోరి = బాలిక.

42. మాందీ; గుంపు, సమూహము (జ్ఞా. 7-104; 8-56, 'ఈశ్వర నిష్ఠాంచీఁ మాందియలీఁ' 18-1775)

< తె. మంది = జనులు, జనుల గుంపు; సేనా భాగము; మంది మార్బలము; మంద = గుంపు, ఆలమంద, పసులమంద; కన్నడ. మందె = జనులు, పశువుల మంద; తుళు. మందె = జనులు, పత్తుమందె = పది మంది, తమిళ. మంతై = గుంపు, తెలుఁగున మను, మనికి, మనికిపట్టు, మన్నిక. మంద, మంది మొదలగునవి ఏకధాతు జన్యములు.

(సంస్కృత - మండ్ (=శోభాయామ్) నుండి యని కులకర్ణి, పు.588;

సంస్కృత, మండలిక (=సమూహము, రాశి) నుండియని తుల్పుళే, పు. 234)

43. ముండ : 'విటిదాండు' ఆటలో మూఁడు (కులకర్ణి. పు. 596) (ముజుందార్. పు. 85)

< తె. మూండు, మూఁడు పూర్ణబిందు ఘటితోచ్చారణము ప్రచురణముగా నుండిన కాలమున మరాఠీలో ప్రతిదేయమనుట స్పష్టము. 'పోండిగ నగజ తపశ్శిఖి మూండు జగంబులను దీవ్రముగఁబర్విన బ్రహ్మాండముగాఁచిన గాంచన భాండము క్రియఁ దాల్చెఁ దత్రృభా భాసితమై (కు. సం. 6–158) కన్నడ. మూరు; తుళు, మూజి. తమిళం. మూస్టు = మూఁడు; మలయాళ, మూన్ను.

44. ముదలు : రూ. ముద్దల, మూలధనము (జ్ఞా. 8–35 తైసేం మన వణ ముదల జాయో) (= తాదృశమయిన మనస్థితి మొదలు సంచి) (మూలధనము) అగుచున్నది. పైది. 5–157).

< తె. మొదలు : మూలధనము. సంస్కృత. ముద్రా శబ్దభవము కావచ్చునేమో యని పాంసే. పు. 41.

ముద్దల: చూ. ముదలు, మూలధనము, బండవలము, సంస్కృత. మూలద (?) 'మూలదేయమ్' మూలము కానోపునని కులకర్ణి. పు. 596.

45. యలమ్మా : రేణుకాదేవి. ఒకానొక గ్రామదేవత (కులకర్ణిపు. 607)

< తె. ఎల్లమ్మ : ఒకానొక గ్రామదేవత, ఎల్లలయందుండు పొలిమేర దేవత (?) ఎల్లయందును (= అంతటను కలదేవత; కన్నడమునుండి యని కులకర్ణి.)

46. లేండ: 'విటిదండు' ఆటలో రెండు (కులకర్ణి, పు. 635. ముజుందార్, పు. 85) మరాఠీలో హ్రస్వమగు ఎకారములేదు గావున దీర్ఘ స్వరాది.

< తె. రెండు : కన్నడ, ఎరడు; తుళు రడ్డు ; రడ్డనె = రెండవు; తమిళ.

ఇరంటు; మలయాళ. రండు. తెలుఁగు 'రేండ్' నుండి యని పీఠిక పు. 100 లోను, రోండూ నుండి యని నిఘంటు భాగము (పు. 635) నను కులకర్ణి నిర్ణయము. ఇట దంతమూలీయ తాడిత (alveolar flap) మగు రేఫము దంతమూలీయపార్శ్విక (alveolar lateral) మగు లకారముగా పరిణతము. 'రసోర్లశౌ' మాగధీ ప్రాకృతములో ప్రసిద్ధమగు ధ్వని పరిణామము. గుఱ్ఱం - గుల్లం, రాను - లాను, రాములు - లాములు ఇత్యాద్యుచ్చారణము పిల్లల వాడుకలో ప్రసిద్ధము.

47. వకట : 'విటిదాండు' ఆటలో ఒకటి (కులకర్ణి, పు. 637) ముజుందార్.పు. 85).

< తె. ఒకటి ; వ్యవహార రూపము వకటి; కన్నడ, ఒందు; త. ఒన్టుమ, ఒన్ను. వరకల : చూ. ఓరకల (Candy పు. 889)

48. వాళ : బహిష్కారము, జాతిభ్రష్టత (కులకర్ణి. పు. 655).

< తె. వెలి = కులబహిష్కారము. వెలిచవి, వెలివాడ, వెలివేయు, వెలిసంత, వెలుపల, వెలువడు, వెలువరించు, సంస్కృత, వృ –, వార –లు దీనికి మూలమని కులకర్ణి.

49. వైద : 'విటిదాండు' ఆటలో అఱు (కులకర్ణి పు. 671; ముజుందార్ పు. 85) 'ఆర' అనఁగా ఐదును, 'వైద' అనఁగా అఱును అను నర్థములు తబ్బిబ్బు వలన నేర్పడినవి.

< తె. ఐదు = నాలుగు నొకటి. అజాదిరూపము హలాదియగుటయు అర్థవిపరిణామము కలుగుటయు మరాఠీ 'వైద' విశిష్టత.

వోరకల : చూ. ఓరకల (జ్ఞా. 17-405)

50. సజగురా : ధాన్యవిశేషము (కులకర్ణి. పు. 701).

< తె. సజ్జ + కొఱ్ఱలు అను ధాన్యములు, సజ్జ, కొఱ్ఱ రాయలసీమలో ప్రచురమగు పంటలు.

సూచికలు :

1. మల్లంపల్లి సోమశేఖరశర్మ. ధర్మవర శాసనములు, భారతి, విభవ చైత్ర సంచిక.

2. కుందూరి ఈశ్వర దత్తు. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు వారి ప్రచురణ, 1963,పుటలు. 3,84,156.

3. శ్రీశైల శాసనము. A.R.No 20 of 1915. క్రీ.శ. 1377; కుమార గిరిరెడ్డి అనపర్తి తామ్ర శాసనము, క్రీ.శ. 1390, రెడ్డి సంచిక పు. 381; తంగెడి శాసనము A.R.No 380 of 1926, క్రీ.శ 1391; అమీనబాద శాసనము A.R.No 543 of 1909, క్రీ.శ. 1415; పలివెల కొప్పేశ్వరస్వామి దేవాలయ కళ్యాణ మంటప స్తంభము మీఁది శాసనము A.R.No 503 of 1893; క్రీ.శ. 1416; మన్యమాపురపు శాసనము Local Records, Vol III; రెడ్డి సంచిక పు. 41; ఎఱ్ఱాప్రగ్గడ హరివంశము, పీఠిక. 19; నిశ్శంకకొమ్మన శివలీలా విలాసము, పీఠిక; శ్రీనాథుని కాశీఖండము, 5-1.

4. శ్రీనాథుని కాశీఖండము, 1-34, 1-68, 5-237, 6-309; భీమేశ్వర పురాణము, 1-29; నిశ్శంకకొమ్మన శివలీలావిలాస పీఠిక.

5. 'మా తండ్రి విట్టల క్ష్మాధీశు పేరా..... శ్రీరామ చరిత... మొప్పఁజెప్పెద...' అని రంగనాథ రామాయణావతారిక, క్రీ.శ. 13వ శతాబ్ది.

6. భూనుతుఁడగు గోన బుద్ధ భూవిభుని - సూను లుదారులు సుగుణ భూషణులు, ఘనుఁడు మీసరగండ కాచ భూవిభుఁడు - వినుత పుణ్యుండ గు విట్టభూపతీయు రచియించి రుత్తర రామాయణంబు ...... కాండాంతము, ఉత్తర కాండము, ద్విపద రామాయణము)

7. Prof. S.G. Tulpule, An old Marathi Reader, Venus Prakashan Poona, 1960, p.94.

8. తిరుమల రామచంద్ర, మనలిపి పుట్టు పూర్వోత్తరాలు, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1957. పుటలు. 164-166.

9. Sir G.A. Grierson, Linguist Survey of India, Vol. IV, pp. 594 - 618.

10. నాచన సోమన, ఉత్తర హరివంశము, వావిళ్ళవారి ప్రచురణ, చెన్నపురి, తృతీయా. 120, 129.

11. కృష్ణాజి పాండురంగ కులకర్ణి, మరాఠీ వ్యుత్పత్తికోశ్, ఐతిహాసిక వ తౌలనిక, కేశవభికాజీ ధవళేవారి ప్రచురణ, ముంబయి 1946, పు. 596; సురవరము ప్రతాపరెడ్డి, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదువారి ప్రచురణ. ద్వితీయ ముద్రణము, పుటలు. 84,85.

12. Dattatreya Chintamani Mujumdar, Encyclopaedia of India Physical Culture, Shree Ram Vijaya Printing Press, Rospura, Baroda, 1950, p.85.

13. John Beams, A comparative grammar of the Modern Aryan Languages of India, London 1872. Vol. I, Introduction, p.72; Rt. Rev. Dr. Robert Caldwell, A comparative Grammar of the Dravidian or South Indian Family of Languages, Trubner & Co, London, Second Edition, 1875, p.25; Sir George A.Grierson Linguistic Survey of India, Calcutta, 1905, Vol VII, Introduction, p.22; R.V. Jahagirdar, Kaneress Influence on old Marathi with special reference to Jnaneswari, Annals of the Bhandarkar Oriental Research Institute, Vol, XI, p.374-

397; Dr. C. Narayana Rao, History of Telugu Language, A.U. Publication, Waltair 1937, Vol.I, p.195-196; కులకర్ణి, పూర్వోదాహృతము. ప్రస్తావన, పుటలు. 62,63.

14. నారాయణ గోవింద్ కాళేల్కర్, మరాఠీధ్వని విచార, పూనా, 1955, పుటలు. 4,46,159; స్పృష్టాస్పృష్టములని, శుద్ధతాలవ్య దంతతాలవ్యములని కులకర్ణి వ్యవహారము, చూ. కులకర్ణి, ప్రస్తావన, పు.6.

15. < ఈ సంకేతము మొనవైపున నున్నది జన్యపదమని గాని పరిణత రూపమని గాని అర్థము. పదపట్టికలోని తక్కిన సంకేతములు స్పష్టము.

16. Major Thomas Candy & Captain Molesworth, A Dictionary English-Marathi, Second edition, Poona, 1873.

17. Dr. Bh. Krishna Murti, Telugu Verbal Bases: A comparative and Descriptive study, University of California Publications in Linguistics, Vol XXIV, University of California Press, Berkely, p.279.

18. Keshava Bhikaji Dhavale, Students Modern Dictionary En glish and Marathi, Karnatak House, Bombay, 1954.

19. జ్ఞా = జ్ఞానేశ్వరి, జ్ఞానేశ్వరకృతము, మరాఠీ సాహిత్యములో మణిపూస - 'భావార్థదీపిక' యన్నది దీని యసలుపేరు.

20. శిశు = శిశుపాలవధ, మహానుభావ పంథకు చెందిన కవీశ్వర భాస్కరభట్ట కృతము, క్రీ.శ. 1305.

21. ఉద్ధవగీతా, భాగవతము ఏకాదశ స్కంధాంతర్గతము, కవీశ్వర భాస్కరభట్ట కృతము, క్రీ.శ. 1035.

22. వివేకసింధు, ముకుందరాజకృతము ఓవీ వృత్తములలో సంతరింపఁబడిన తాత్త్విక కృతి, కాలము వివాదగ్రస్తము, క్రీ.శ. పదుమూఁడు, పదునాలుగు శతాబ్దులని స్థూలనిర్ణయము.

23. మూర్తి ప్రకాశ, కేసో బసకృతము, క్రీ.శ. 1285.

24. శ్రీకృష్ణ చరిత్ర, కర్తృత్వము వివాదగ్రస్తము, భాస్కరుఁడని కొందఱు మ్హాయిబట్ట (మహీంద్రభట్ట) అని కొందఱు, పంచకృష్ణపంథ – మరాఠ్వాడాలోని ఒక భక్తి సంప్రదాయము (లేక మహానుభావ పంథ) కు ప్రధానాచార్యుఁడయిన చక్రధరుని అనుయాయులు, క్రీ.శ. 1300.

25. పూజావసర, నాగదేవాచార్య శిష్యుఁడగు బైదేవబస విరచితము, చక్రధరుని సహచరులలో నాగదేవాచార్యుఁడొకఁడు.

26. రసకౌముది, వైద్య గ్రంథము, అళజపూర (నేఁటి ఎలిచ్‌పూర్) వాస్తవ్యుడును విజయనగర బుక్కరాయల ఆస్థాన వైద్యుఁడును అగు విఠ్ఠలుఁడు దీనికి కర్త క్రీ.శ. 1350.

27. Sir. R.L.Turner, A Comparative and Etymological Dictionary of Nepali Language, London, 1931, p.318, suggests borrow ing from an aboriginal language.

28. Prof. T.Burrow and Prof. M.B. Emeneau. A dravidian Etymo logical Dictionary, Oxford University Press, London 1961, Entry No. 381.

29. స్మృతిస్థళ, నరేంద్ర పరశురాములను జంటకవులచే రచితము, క్రీ.శ. 1309.

30. కోరాడ రామకృష్ణయ్య, Dravidian Cognates, Madras University Telugu Series No. 11, Madras, 1944, p.111.

(భాషా చారిత్రక వ్యాసావళి – ఆంధ్ర సా.పరి–1972)

16. సురవరం ప్రతాపరెడ్డి

(1896 - 1953)

స్వాతంత్ర్య సమరయోధుడుగా, పత్రికా సంపాదకుడుగా, సాంఘిక చరిత్ర నిర్మాతగా, సృజనాత్మక రచయితగా బహుముఖీనమైన ప్రతిభను ప్రదర్శించిన ప్రజ్ఞాధురీణులు సురవరం ప్రతాపరెడ్డిగారు. ఆయన ఒక వ్యక్తి కాదు. సంస్థ. ఆంధ్ర మహాసభ, గ్రంథాలయోద్యమం మొదలైన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని తెలంగాణాలో రాజకీయ, సాంస్కృతిక చైతన్యానికి ఎంతో పాటుపడ్డారు. 1926లో ఆయన నెలకొల్పిన గోలకొండ పత్రికలోని సంపాదకీయాలు, వ్యాసాలు నిజాం నిరంకుశపాలనపై గురిపెట్టిన బాణాలుగా ప్రజల్ని ప్రభావితం చేశాయి. పరిశోధనా శేముషి అయిన ప్రతాపరెడ్డి ప్రప్రథమంగా ఆంధ్రుల సాంఘిక చరిత్రను అందించి కేంద్ర ప్రభుత్వ బహుమానాన్ని పొందారు. హైందవ ధర్మవీరులు, హిందువుల పండుగలు, రామాయణ విశేషములు మొదలైనవి ఆయన సూక్ష్మ పరిశీలనాదృష్టికి నిదర్శనాలు. ఆధ్యాత్మిక గ్రంథమైన రామాయణాన్ని శాస్త్రీయమైన చారిత్రక దృష్టితో వివేచించారు. వందలాది కవుల సంస్కృతాంధ్ర కవితలను 'గోలకొండ కవుల సంచిక'గా (1934) వెలువరించి తెలంగాణాలో కవులు లేరన్న అపప్రథను ఖండించి తెలంగాణా సాహిత్య నిధిని వెలికి తెచ్చారు.

ప్రతాపరెడ్డిగారు లఘుకావ్యాలు, నాటకాలు (భక్తతుకారాం, ఉచ్ఛలవిషాదం), కథలు రచించి సృజనాత్మకరంగంలో కూడా ప్రత్యేకతను చాటారు. ఆయన కథలు నిజాం కాలం నాటి పటేల్ పట్వారీలు, తాసీల్దార్లు, వకీళ్లు మున్నగు వారి మనస్తత్వాలను చిత్రిస్తూ నాటి తెలంగాణా ప్రజల జీవితానికి దర్పణం పడతాయి. ఇవి ఉర్దూ భాషా మిశ్రితమైన మాండలిక భాషలో విరచితమైనాయి. పల్లె పదాలు, నానుడులు, సామెతలు మున్నగు బహువిషయాలపై రచించిన వ్యాసాలు నిశితమైన పరిశీలనా దృష్టికి గీటురాళ్ళు. 1896 మే 28న మహబూబ్‌నగర్ జిల్లా ఇటికాలపాడులో జన్మించిన సురవరం 1952 లో వనపర్తి శాసన సభ్యులుగా ఎన్నికైనారు. రాజకీయాల్లో ఇముడలేని స్వతంత్ర వ్యక్తిత్వం గల ప్రతాపరెడ్డి 1953 ఆగస్టు 25న ఈలోకాన్ని వీడి వెళ్లారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు, రెడ్డి హాస్టలు మున్నగు సంస్థలు ఆయన కీర్తి పతాకలు.

16. దాక్షిణాత్య లోకోక్తులు

- సురవరం ప్రతాపరెడ్డి

సామెతలలో ఎంతో అర్థము ఇమిడియుండును. భాషకు ఒక అలంకార ప్రాయము, చరిత్రకు కొంత ఉపకరణము, కవిత్వానికి తోడు నీడ, భావ ప్రకటనకు పుష్టి, పండిత పామరులకు సంగమ స్థానము. ఇవి సామెతలలోని విశేషములు. ప్రతి దేశములోను, ప్రతి జాతిలోను, ప్రతి భాషలోను సామెతలకు మంచి స్థానమున్నది. ఒక్కొక్క ప్రాంతములో ఒక విధమైన సామెతలు, అవి జనుల భావములను, ఆచారములను వ్యక్తపరచునవై యుండును.

ఇతరుల మాటయేయో కాని తెనుగువారి సామెతలకు ప్రత్యేక స్థానము కలదు. ప్రాయికముగా సామెతలు యతి ప్రాసయుక్తముగానుండును. ప్రాసతో తిట్టరా పాడు ముండాకొడుకా అని ఎవ్వరో అన్నారట. సామెతలు మూడు నాలుగు విధాలుగా నుండును. హాస్యరసయుక్తమయినవి. బూతులతో నిండినవి, లోకానుభవయుక్తమైనవి యిట్లు పలు తెరగులుగా నుండును.

తెనుగులోని సామెతలను ఒకచోట చేర్చి ఒకటి రెండు గ్రంథాలు ప్రకటించినారు. అయితే అందు దశాంశమైనా కూర్చలేదని చెప్పవచ్చును. ఒక్కొక్క జిల్లాలో ఒక విధమైన సామెతలు కలవు. ఇవన్నింటిని ప్రతి మండలమువారును కూర్చి వివరములతో కూడినవిగా ప్రకటించుచు వచ్చిన కొంత కాలానికి మరెవ్వరైనా అన్నింటినొకచో కూర్చుటకు వీలుండును.

మన ఆంధ్రులకు అరవలకు పూర్వకాలము నుండి అదెందుకో సరిపడ కున్నట్లున్నది. అరవలు కూడా తెనుగు వారిని గురించి హేళనముగా సామెతలు చెప్పుకొందురు. తెనుగువారును అదే పద్ధతిపై అరవవారిని గురించి చెప్పుకొందురు.

శ్రీనాథ మహాకవికి అరవ సాంబారు రసము రుచించకపోయెను. ఆంధ్రులకు ఇప్పటికిని సాంబారు రసం అంటే సరిపడదు. శ్రీనాథునికి అరవ దేశము మంది కూడా సరిపడినట్లులేదు. "పిళ్లె" జాతి వారిని వర్ణించినది వింటే ఈ సంగతి అర్థమౌతుంది. అతని తర్వాత పండిత జగన్నాథ రాయలవారికిని ఇదే విరోధముండినది. ఆయన "ప్రౌఢ మనోరమా కుచమర్దిని"లో ద్రావిడుల దూషణ అచ్చుటచ్చుట వ్యక్తమగుచున్నది.

దక్షిణ దేశములోని కొన్ని పట్టణాలు, ఆచారాలు ఆంధ్రుల సామెతలలో కెక్కి సాధారణమైపోయినవి. అట్టి సామెతలెన్నియున్నవో కాని నాకు తెలిసిన అయిదారింటిని ఇందు తెలుపుకొంటాను.

అరవ భాష మనవారికి సరిపడినట్లు లేదు. ఎవరైనా మాట్లాడే దానిలో అర్థముకాకుంటే – ఏమిటదీ 'అరవ మొత్తుకోళ్ళు' అని ఎగబడతారు. 'అరవ అధ్వాన్నము' అనియు మరొక సామెత కలదు. ఎవరైనా బండచాకిరీ చేస్తే దాన్ని 'అరవ చాకిరీ' అంటారు.

తిరుపతి క్షౌరం అంటే అందరికీ తెలిసినసంగతే. తిరుపతికిపోయే యాత్రికు లెక్కువ. మంగళ్ళు తక్కువ. వేంకటేశ్వరునికి వెంద్రుకలంటే చాల ప్రీతి. ముత్తైదువలు కూడా నున్నగా బోడి కొట్టించుకొని వెంట్రుకలు సమర్పించుకొని వస్తారు.

అయితే మంగళ్ళు క్షౌరానికి పోయిన వారిని వరుసగా కూర్చొనబెట్టి ప్రతి వాని నెత్తిన ఒక పట్టె పెట్టి ఆ మనిషి తనవాడని రిజిస్టర్ చేసుకొందురు. ఆ ప్రకారము కాబడ్డ మనిషిని ఇంకొక మంగలివాడు మూడు నాల్గంతల పైకమిత్తునన్నను ముట్టడు.

అట్లు ముట్టినా మంగలి కత్తులతో ఘోర యుద్ధము ప్రారంభమైనదన్న మాటే. ఇట్టి పట్టెల క్షౌరానికే మనవారు తిరుపతి క్షౌరం అని ప్రసిద్ధి నించినారు.

ఇంకా కాస్త దక్షిణానికి విజయం చేస్తే 'చిదంబర రహస్యము'ను తెలుసుకొనవచ్చును. చిదంబర క్షేత్రములోని ఒక దేవాలయములో ఒక పర్దా కట్టి యుంటారట. దాని లోపల ఏమిన్ని ఉండదు. అయినా యాత్రికులు అందు దేవుడున్నాడని భావించుకొనవలెనట. ఏమిన్నీ లేని వస్తువును ఉన్నదనడానికి మనవారు చిదంబర రహస్యం అంటారు.

ఇంకా కొంచెము దక్షిణానికి తర్లినామంటే మనకు 'పుంగనూరు మనుషులు' కనబడతారు. మనలోని మూర్ఖులను 'పుంగనూరు మనిషీ' అని తిట్టుతాము. ఇప్పటికి నీ పుంగనూరు గురుస్థానమొకటి మద్రాసు రాజధానిలోనున్నది. అయితే అచట మనుషులు మనవలెనే తెలివి తేటలు కలవారేకాని యెవ్వరో మహానుభావులు ఈ సామెతలను కల్పించి పోయినారు. పుంగనూరులో నౌకరులను విస్తర్లు ఎత్తి వేయరా అంటే యెంత మంది తిన్నారు అని అడుగుతారట. ఫలానివాణ్ణి పిలుచుకొని రారా అంటే అతడు లేకపోతే యేమి చేయాలె అని అడుగుతారట. ఉన్నాడు పోరా అంటే రాకపోతే మరి అని అడుగుతారట. ఈ కల్పనలు ముచ్చటగానే ఉన్నవి.

తిరుపతికి సమీపములో 'కంచి' అనే క్షేత్రము కలదు. 'నగరేషు కాంచీ నారీషు రంభా' అని ప్రాచీనము నుండీ దీనికి ప్రఖ్యాతి. 'కంచంత కాపురము' అనే సామెత కలదు. తెనాలి రామకృష్ణుడు తన పాండురంగ మాహాత్మ్యములో నిట్లు వర్ణించినాడు.

"కాపు కోడలు కంచంత కాపురంబు
బాలవంటి కులంబు కాడ్పరచి యురికె
మగని నటుబెట్టి రెండవ మగనివెంట
నువిదలకు బుద్ధి పెడతల నుండుగాదె."

అంటే కంచి పట్నమంత పెద్ద కాపురము అన్న మాట. ఇక్కడ మాత్రము మనవారు ఒక్కమారైనా మెచ్చుకొన్నారు.

"ద్రావిడ ప్రాణాయామము" అనే సామెత సాధారణము. ద్రావిడులు ప్రాణాయామము చేయవలెనంటే నేరుగా ముక్కు పట్టుకోకుండా కుడిచేతిని నెత్తి వెనుకనుండి పెనవేసుకొని వచ్చి దానితో ముక్కు పట్టించుకొందురట. ఆ ప్రకారము ఎవ్వరును చేయరు కాని సామెత ఏర్పడింది. అంటే ఎవ్వరైనా సూటిగా చెప్పుటకు మారుగా డొంక తిరుగుడులు, సవ్యాపసవ్య ప్రదక్షిణాలు చేసి చెప్పదలచిన ఆ రెండు ముక్కలు యిన్నూరు మాటల వరకు పెంచి పావుగంట కాల హరణము చేసి అంతయైనను ఒక్కొక్క మారు తమ అభిప్రాయాన్ని వినే నెత్తిలో పూర్తిగా యెక్కించ లేని సందర్భములో ఈ సామెతను చెప్పుతారు.

ఇంకా దక్షిణానికి యాత్ర చేస్తే మనకు కుంభకోణము ప్రత్యక్షమౌతుంది. 'వాడు కుంభకోణము చేసినాడురా' అని మన వారిలో నొక సామెత. అనగా మోసము చేసినాడని అర్థము. ఇది కూడా అన్యాయంగా వ్యాప్తి గావింపబడినట్టి సామెతయే అని చెప్పవలసిందే.

ఇంకా దక్షిణానికి దిగితే శ్రీరంగం అనే పవిత్ర శ్రీవైష్ణవ క్షేత్రం ప్రత్యక్షం అవుతుంది. "శ్రీరంగనీతులు" అనే సామెత తెనుగు వారిలో చాలా ప్రసిద్ధి. అంటే తాము మాత్రము ఆచరింపక ఏమేమో బోధించితే అవి శ్రీరంగనీతులు అని మన వారంటారు.

ఇంకా దక్షిణానికి పోతే 'ఆడ మళయాళం' లో పడిపోతాము. ఈ ఆడ మళయాళం అనే దేశాన్ని గురించి మన దేశంలో వ్యాపించినన్ని కతలు, కల్లలు మరెచ్చటను లేకుండ వచ్చును. ఈనాడు కూడా పల్లెలలోని జనులు కట్టు కథల నంతా నమ్ముతారు. ఆడమళయాళంలో అంతా ఆడవాళ్ళేనట. మగవాడు పోతే దక్కడట.

అయితే గాలికి పిల్లలు పుట్టుతారట. 'మళయాళ భగవతీ' అని మంత్రం వేసినారంటే రాయో రప్పనో పశువో అయి పోవలసిందేనట. ఇంకా ఇట్టి చిత్ర కథలు కొల్లలుగా మన దేశములో చెప్పుకుంటూ వుంటారు.

మళయాళ మంత్రాలకు ప్రసిద్ధి అయిపోయింది. పూర్వంలో మంత్రగాండ్లు మళయాళం పోనీ పోక పోనీ తమ కేమైనా మంత్రాలు వచ్చి వుంటే వాటిని వారు మళయాళంలో నేర్చుకొన్నామని చెప్పుకునే వారు. అందుచేతనే మంత్రగాండ్లు యిప్పటికిన్నీ మోడీ గారడీ వంటి ఇంద్రజాలాన్ని ప్రదర్శించే దానికి ముందు "ఛూ, మళయాళ భగవతీ" అని ఆడ మళయాళ శక్తిని తలచుకొంటారు.

ఇంకా ఇట్టి సామెతలు మరెన్ని వున్నవో మేమో.

17. పాకాల యశోదారెడ్డి
(1929 - 2007)

పాకాల యశోదారెడ్డి సంస్కృతాంధ్ర విదుషీమణి, మాండలిక కథారచయిత్రి, ప్రౌఢ గంభీర వక్త. 1929 ఆగస్ట్ 8న మహబూబ్‌నగర్ జిల్లా బిజినేపల్లిలో జన్మించిన ఆమె తెలుగు, సంస్కృతాంధ్రాలలో ఎం.ఏ.డిగ్రీ పొంది ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేశారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా కొనసాగి 2007 అక్టోబర్ 7వ తేదీన తనువు చాలించారు.

యశోదారెడ్డి నిశితమైన విమర్శనా దృక్పథంలో పలు విమర్శ గ్రంథాలు, వ్యాసాలు రచించారు. డాక్టరేట్ పట్టం పొందిన 'తెలుగులో హరివంశములు' హరివంశ కావ్యాలపై సమగ్ర పరిశోధనా గ్రంథం. ఇంకా ఎర్రాప్రెగడ. పారిజాతాపహరణ పర్యాలోచనము, ఆంధ్ర సాహిత్య వికాసము మున్నగు విమర్శగ్రంథాలు వెలువరించారు. ఆమె సాహిత్యోపన్యాసాలు ప్రౌఢమైన భాషాపటిమతో పాటు విషయ గౌరవాన్ని సంతరించుకొన్నాయి. తెలుగు నుడికారం రంగరించుకున్న మాండలికంలో గలగలా మాట్లాడగలిగే పట్టుకూడా ఆమెకు ఉంది. పాలమూరు యాస–బాస ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. ఆకాశవాణి ప్రసంగాలు, మా ఊరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు మాండలిక భాషా పెన్నిధులుగా పేరు తెచ్చుకొన్నాయి.

అంతర్జాతీయ ఖ్యాతి గడించిన చిత్రకారులు పి.టి.రెడ్డి (పాకాల తిరుమల రెడ్డి) ఆమె భర్త. హైదరాబాదు నారాయణగూడలోని వారి నివాస భవనం (సుధర్మ) ఆ దంపతుల కళాభిరుచికే కాక, సాహిత్య చర్చలకు నిలయంగా వెలుగొందింది.

17. తెలంగాణ భాష - సాహిత్య గౌరవం

- పాకాల యశోదా రెడ్డి.

"ఇహ శిష్టానుశిష్టానా మనుశిష్టానాం సర్వదా
వాచమేవ ప్రసాదేన లోకయాత్రా ప్రవర్తతే"

అన్నారు పెద్దలు – నిజానికి వాగ్దేవి ప్రభావం వల్లనే మానవులు సంస్కారవంతులై సంజ్ఞా భాషను విడిచి వాగ్రూపంతో పరస్పరం వ్యవహరించుకోగలుగుతున్నారు.

భాష – to speak, to tell అనే అర్థవ్యక్తి కలిగిన ధాతువుచే ఏర్పడిన కారణంతో భాషింపబడేది 'భాష' అంటూ మనం నిర్వచనాన్ని కల్పించుకున్నాం. అంతేకాదు భారత కవుల్లో ప్రథముడైన నన్నయ భట్టారకుడు ఆంధ్రశబ్ద చింతామణిలో **'స్వదేశ వేషభాషాభిమతా స్సంతో రసప్రలుబ్ధధియయః'** అంటూ ఒక వ్యక్తి ఎన్ని భాషలు నేర్చినా, ఎన్నెన్ని మహానగరాలు సందర్శించినా 'పుట్టింటి పుల్లకూర రుచి' అన్నట్లు రస ప్రలుబ్ధులైన వారందరు స్వదేశీ, స్వభాషలందు అమిత గౌరవ ప్రపత్తులు కలిగి ఉంటారన్నాడు. నిజమే కదా! అయితే ఇప్పుడీ నేపథ్యంలో తెలంగాణపు తెలుగును గూర్చి కొంత విచారించవలసిన అవసరం ఏర్పడింది.

వింతలకు దొంతి భాష. విచిత్రాలకు విడిదిపట్టు భాష. పెద్దరికానికి పెట్టిన పీట భాష, ఎందుకంటే! అనునిత్యం, అనుక్షణం మన నాలుకలపై నర్తిస్తూ కూడా తనవారికే తన స్వరూపాన్ని తెలియనీయకుండా తప్పించుకొని తిరిగే నెరజాణ ఈ భాష, ఇందుకు కారణం భాష మాటాడు వారికే తన నిజస్వరూపం తెలియనీయకుండా

మారుతుంది. ఇది – అంటే 'మార్పు' భాష సహజ లక్షణంగా పరిణమించింది. ఈ మార్పుకు కారణాలు నానానేకాలు.

ఇందులో ప్రధానంగా భౌగోళిక పరిస్థితులు, అన్యదేశీయుల ఆక్రమణలు, రాజకీయ పరిణామాలు, వ్యక్తుల అవయవలోపాలు, శీతోష్ణ పరిస్థితులు, అలసత, ఆయా వారిసంస్కారం, ఇంటి వాతావరణాలే కాక, అనుకరణాలు, వ్యాకరణ రీత్యా సంభవించే మార్పులైన సమస్వరత, స్వరభక్తి, అనుచిత విభాగం, తాలవ్యీకరణం, వర్ణలోప, వర్ణాగమ, వర్ణ వ్యత్యయాల వల్ల కలిగే మార్పులు మొదలైనవి సామాన్యుల్లో ఉచ్చారణ శైథిల్యాన్ని కలిగిస్తూ ఉంటాయి. ఇవే రాను రాను మాండలికతను సృష్టిస్తాయి.

భాష కేవలం భావ వ్యక్తీకరణకు ఒక ఉపకరణం, లేదా వాహిక మాత్రమే కాదు. అది ఒక జాతి జీవన సర్వస్వానికి ప్రాణనాడి వంటిది. ఆ భాషలో ఆ భాషను భాషించే వారి ఆచార వ్యవహారాలు అంటే వివాహాలు, విందులు, పండుగలు, చదువు సంధ్యలు, శకునాలు, నమ్మకాలు, అభిరుచులు, ఆట పాటలు, అనుభవాలు, జ్ఞాపకాలు, అన్నీ మొగిలి గర్భంలో దాగిన సురభిళంలా నిండుకొని వుంటాయి. ఒక జాతి తరతరాలుగా కూడబెట్టిన అనుభవరాశి యావత్తూ సమాహార రూపంలో పరిపక్వమై భాషా మూలాలకు ఆప్యాయనంగా ఆహారాన్ని అందిస్తూ ఉంటాయి. ఈ విధానమే అంతః స్రోతస్వినిలా ఉపకరిస్తూ భాషలో సామెతలనూ, జాతీయాలనూ, అలంకారోక్తులనూ, ప్రౌఢోక్తులను సృష్టిస్తూ దాన్ని సుసంపన్నం చేస్తుంది. సంఘు వ్యక్తిలో భాషా ప్రయోగ దక్షతలు లేనినాడు, ఆ భాష తన సొగసునూ పాటవాన్ని గోలుపోయి వేదన పడుతుంది.

ఏ భాషకైనా అలంకారోక్తులు, సామెతలు, పలుకుబళ్ళు, నానుడులు పెట్టని సింగారాలు. **ఏ సింగారాలూ, షోకులూ, సొగసులు లేకుండా సాఫుగ ఉత్కి ఆరేసిన బట్ట తీర్గ, చెట్టు చేమలేని సిమెంటు సడాకోలె, బోసిముంతోలె వుంటే ఏం ముద్దమ్మ! అన్ని రసాలు, రుచులు గలిస్తెనె, తినె తిండికి రుచీ పచిగాని, సప్పిడి కూటికి ఎవరు**

ఆశపడ్తరయ్యా ? ఇప్పటి యాంత్రికమైన భాషకు ఒక విషయాన్ని గూర్చి నిక్కచ్చిగా నిగ్గుదేల్చేందుకు ఆ విషయసంబంధియైన వస్తు సర్వస్వాన్ని ఆమూలాగ్రం, నఖశిఖ పర్యంతం సూక్ష్మ పరిశీలనం గావించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే మనస్సును కడిగి అద్దంలా చేసుకొని ఆలోచించండి. **'తెలంగాణపు తెలుగు'** అంటూ పేరు పెట్టి పేటవేయనూ వద్దు. అరకొర చదువులతో వెక్కిరించనూ వద్దు. నిష్పాక్షిక బుద్ధితో నిశిత పరిశీలనం చేసినప్పుడు అసలు సిసలైన తెలుగు, చొక్కమైన తెలుగు, తిక్కన, గౌరన, ఎఱ్ఱన, నాచనాది మహాకవుల అమృతవాక్కులకు ఆలవాలమై వారి కీర్తికి మంగళాశంసనం చేసిన తెలుగు ఈ తెలంగాణపు తెలుగుమాట అంటూ తోపకమానదు. ఆ తెలుగే ఈనాడు విధి వైపరీత్యంతో తెలంగాణపు పల్లెప్రాంతాల్లో మొన్న మొన్నటివరకు యాసదుప్పటి కప్పుకొని పేడి రూపంలో ఉన్న అర్జునుడివలె, బానసీడైన నలచక్రవర్తిలా, అశ్వత్థంలో దాగిన అగ్నిలా నివురుగప్పిన నిప్పులా, మసిబట్టలో మాణిక్యంలా వుంటూ, **'నీకాల్మొక్కుత బాంచెను' 'బారగొట్టంగ వచ్చి బా సంధ్లు జేస్త'** అనే రూపంలో పరివర్తమై వెక్కిరింతలకు గురిఐంది.

కొంత సహనంతో కొంత అన్వేషణా దృష్టితో ఓపిన కొలది యాస ముసుగు తొలగించి పరిశీలించండి. ఈ భాషలో అమూల్యమైన రత్నరాసులెన్నో లభ్యమౌతాయి. ఈ పద ప్రయోగం జున్నుపాలకన్న, జుంటి తేనెకన్న, మీగడ పెరుగుకన్న, కొదమ వెన్నెలకన్న, కోరిన వలపుకన్న తియ్యనై, వినే చెవికి శ్రవణ సుభగతను చేకూరుస్తుంది.

ఇదే మాట తెలంగాణపు మాండలికంల జెప్పుత జర ఇనుడి!

అమ్మలూ! మాట వలుకంటె అందరికి మన్ననే! కాదన్నదెవరు? అవద్దమాడకుండ నిజం జెప్పాల్నంటె యామాటకామాటనె సొగును. ఇనే చెవ్వు మెచ్చే మనుసుండాలెగాని, తెలంగాణపు తెలుగు జుంటితేనోలె, పసిపావ నవ్వోలె చెవులూరించుకుంట ఆమెతలు వెట్టుకపోతాది.

అదేంది? అప్పుడె కిచ్చున నగవడ్తిరి? ఏంది? వాక్యం తొలిగనే 'సేమా!' అంట తాలవ్యయకరాం తోటి మొదలెట్టినాను? అయ్యో అప్పుడే ఉర్కి ఉర్కి వనులగాన్కం ఎందుకు, ఈ నగువాట్లెందుకు? జరతాల్మివట్టుండి. నగిన నావసేనె నాల్గు వుట్లు వండుతది. నాయాస ఇడ్సి రొండు మాటలు పుస్తకం బాసల జెప్త 'భాష ఎప్పుడూ స్థిర రూపమైనది కాదు. మార్పు దాని సహజ లక్షణం. వాగ్రూపంలో అది అస్థిరమై ప్రవాహ రూపంలోనే ఉంటుంది. అందుకే ప్రవాహినీ దేశ్యా అన్నారు. సముదాన పడ్డరు గద! ఇంగ నామాటలల్ల ఇనుండి.

అన్నిటికన్న తమాసైన ముచ్చటేందంటే 'నీ కాల్మొక్కుత' అన్నమాట పాటకు పల్లవివోలె ఎక్కిరింతకు గురిఐంది. నిజానికి మీరు కండ్లింతలు జేస్కొని ఎక్కిరింత అంటవేంది 'వెక్కిరింత' అనాలె! హల్లు 'వ' కారాన్ని 'స్వర ఎకార'ంగ వల్కి అర్థావబోధల ఎంత అనర్థం దెచ్చినవు అంటనన్ను ఉరుమాలె. ఎందుకంటె - **ఎక్కిరింత** అంటె వాహనం, ఈ అర్థంలనె శ్రీనాథుడు నైషధంల వాడిందుగద! అందుకె తొల్తనె నన్ను తప్పు పట్టకుండ జెప్పిన. యాసతోటి తాలవ్యాలకు ఏరుతారు లేకుండా శాస్త్రం వొప్పిందిగన్కనె నాకు అట్ల వల్కుడు అలవాటు.

యా సంఘంలనన్న ఆయా స్థితులు, పదవులు, తాహతుల వట్టి వాండ్ల సంస్కారం రూపుదిద్దుకుంటది. పాపం ఈడిగం జేసేటప్పుడు రాచరికపు వ్యవస్థల ఈ పలుకుబడి నీబాంచెను అనడం తప్పదు. అందరూ ఆమాటనరు. ఇక్కడోళ్ళు శనామంది సర్కారు నౌకర్లల్ల లేరు. తెల్వి తక్కువకు, అమాయికతకు, అభిమానం ఆత్మగౌరవం ఎక్కువ. ముక్కుమీద ఈగెవాల్తె కోసేసుకునే మూర్ఖత మావోండ్లది. ఆ ప్రాంతాల్లో గుమాస్తా చదువులు బాగా అబ్బినవిగన్క I remain your most obedient servant అంట రాశి రాతి పల్కమోలె జేసిన ముచ్చెట మరిస్తె ఎట్ల? 'ఆడిపన్ దాసోహ' అంటకండ పాతంగపాడినగని, రాశినగని తప్పుకండ్లవడదు.

ఎన్కటితరాల నుండి ఎంతో అనుభవం తోటి నెత్తినెర్సినోళ్ళ నోళ్ళల్ల నాని మాట మాటకు ఒక సామెతగ, పద పదానికి ఒక జాతీయంగ అన్ని బద్దురంగ జనం నోట నానుకుంట వసివాళ్ళు వాడకుండ, శావ జావకుండ, రుచి దప్పకుండ, ఉండవి. నాకు దెల్సిన కాణ్ణుండి ఊరూర సినిమాలొచ్చి, భాషా స్వరూపం తెలువని వాళ్ళ పలుకు ప్రభావంతో అక్రరూపమైన ప్రయోగం వదలి గాలి పూరాలు నింపుకుంట, యాస పలుకురాక వికృతం చేస్తూ ఇప్పటి ఏటవతలి వ్యవహారికంల చెప్పవలసి వస్తే నానా రద్దీ, కంగాళీ చేసి ఆఖరికి కత్తెరగల్సిన కల్తి గింజలు జల్లి సంకరపు ఇత్తనంతోటి పంట పండిస్తుండరు.

ఇట్లా ఈ తెలుగు ఈనాడు విస్మృత వైభవంతో తనను తుర్క తెలుగంటూ పరాశ్కంజేస్తుంటె ఎద మసలంగ ఎదుటోండ్ల ఎర్కలేనితనానికి నొచ్చుకుంట గుడ్లనీళ్లు గుక్కుకుంట చూస్తుండది.

అయ్యా! తెలంగాణపు తల్లి తాలుగింజలను కనలేదు. గట్టి గింజల్నె గన్నది. ఆ మాటలేవి ఆ మాండలికపు సోకులు, పోకళ్ళు, హొయ్యారాలు, పాగలు, గంభీరం అన్నీ కలెగల్పుగ గుమ్మరిచ్చి గాదెలు నింపెనత్తువ వున్నోళ్ళుండరు.

ఇంగోమాట – తెలంగాణపు తెలుగని ఆభాషకు మూలధనమైన పదబంధాలను విడిచి దోసిన ఇంట్ల ఉత్తబోకులోలె అచ్చిన, అచ్చింది, వత్తానంది, పోతాన్న, గట్ల, గిట్ల (ఈ పద ప్రయోగ యోగ్యత తెలియక) అంటరాస్తె నీ పెద్దిర్కం యాండది? అందుకే నీమాటలు తెలుగు తీపిని రంగరించుకోని యాస ముసుగున దాగి గల్లుగల్లున దస్సుకుంట రావాలె, అప్పుడందరు ఇది కేవలం రౌడీలకు, గుండాలకు అక్కరైంది మాత్రమే కాదు దివ్యాదివ్యులకు కూడా పనికొచ్చే మాట అంట అబ్బురపడాలె. అది తెలుగు బిడ్డ చేయవలసిన పని.

ఈపై వారసత్వాన్ని యాస అంట చిన్న చూపుతో పొగొట్టుకుంటె మళ్ల దొరకడం

కష్టం. అందుకే నీ నా పట్టింపులు వద్దు. ఇప్పటికే అపురూప పదప్రయోగం యెంతో మరుగు పడిపోయింది. ఇకనైనా అరమరికలు విడచి నిజం తెలుసుకొని భాషామ తల్లిని సేవింతం. ఎందుకంటారా?

ఒకే భాష ఒక్కొక్కచోట రాజదండాన్ని చేతబట్టి అధికారికంగా ఆజ్ఞలను ఇవ్వగలిగిననాడు, అదే భాష ఇంకొకచోట విప్లవ జ్యోతియై కాగడాలను వెలిగించగలిగిన నాడు, అదే మాట వేరొకచోట భక్తి రసామృతాన్ని వర్షించగలిగిన నాడు, ఆ పలుకే మరోచోట ఆర్తుల కన్నీళ్లు తుడువ గలిగిననాడు, ఆ పలుకే రసధునియై సహృదయ హృదయాలను ఆనంద తరంగితం చేయగలిగిన నాడు ఆ భాష జిగీ, బిగీ, జిలుగు కలిగిన భాషగా తల ఎత్తుకొని బింకం చూపగలుగుతుంది.

ఇంతే కాక భాషలోని ఒకే పదం ఈనాడు ప్రపంచవ్యాప్తి నొందిన ఇంగ్లీషు పదాలవలె క్రియగా, విశేషణంగా, విశేష్యంగా, ఉపయోగింప సామర్థ్యం కలిగిన నాడు అది పటిమగల భాషగా గుర్తింపును పొందుతుంది. అంతటి శక్తి సామర్థ్యాలు కలిగిన భాష మన తెలంగాణపు తెలుగని చెప్పటానికి గర్విస్తున్నాను. మీకు మాసరగా-

"నాయినా రాములయ్యా! నీ ఇంట్ల ప్రయోజనమని నీకడ్పుతొక్కి వొచ్చి నోళ్లంత నీ వోండ్లె సుమా! తన మనోండ్లల్ల ఏరుతారు జేసి ఐంతిల 'పొరపొచ్చెం' జూపకు". ఈ వాక్యంలో అర్థవ్యక్తి అంత సులభంగా ఏర్పడదు ఇప్పటి విద్యార్థికులకు. యాంత్రికంగా ఒకే మగ్గంలో నేసిన జనతా బట్టను ఆదరించిన వారికి ఈ పలుకుబడి సులభంగా పట్టుబడదు. అన్నిటికన్న ప్రధానంగా పొరపొచ్చెం అనే పదం ప్రాచీనమైన ప్రయోగ విశేషం. భారతకాలంనాటికే ఈపదానికి అనేకార్థాల్లో ప్రయోగ సిద్ధి ఏర్పడింది. ఇది సమస్త పదం. దీని రూపం పొర + పొచ్చెము - పొర పొచ్చెం - బహుళార్థ సాధక పదం.

పొర = సన్నటి ఆచ్ఛాదనము. ఇట్లే పొచ్చెము = వెలితి, కపటము అనే

అర్థాల్లో ఉపయుక్తమౌతుంది. ఈ రెండు పదాల సమాహార రూపం పొరపొచ్చెము అంటే భ్రమ, ప్రమాదాలు, నూన్యతాధిక్యతలు మొదలైనవి. కాని దాని అసలు రూపం పర + పక్షము = పొరపొచ్చెము. నాయనా బంతిలో నీవు ఇతరులు – నావారంటూ వ్యత్యాసం – పక్షపాతం చూపకు అనే అర్థం గర్భితమై యున్నది. ఈ పదం యాసముసుగులో పొరపొచ్చెమైంది.

ఇట్లే 'పొల్లు' – సాధారణంగా గింజ పట్టుని తాలుకంకిని పురస్కరించుకొని ఈ కంకి పొల్లుపోయింది, అంటే తాలు పోయింది అనే అర్థంలో ప్రయోగం ఉంది. ఈ పదాన్ని ఇట్లా అభిదాశక్తితోనే కాకుండా 'లక్షణా', వ్యంగ్యార్థాల్లో కూడ ప్రయోగించడం కనిపిస్తుంది. ఉదాహరణకు :

1. లింగణ్ణి నిన్న పొల్లు పొల్లు గొట్టిన్రు – ఇక్కడ పొల్లు – పొట్టు.
2. ఆc వాడా? ఉత్త పొల్లు – సారహీనుడు, వ్యర్థుడు, శక్తిలేనివాడు.
ఎ. కుక్కమూతి పిందెలు పుట్టినట్లు ఆ ఇంట్ల ఈ పొల్లు పుట్టిండు – పనికిమాలినవాడు.
3. వాడికిందంత పత్తైందని – చేసిందంతా పొల్లుపోయింది – వ్యర్థమైంది. మొదటికి వచ్చింది.

బాగా పరిచితమైన ఉపమాన సాదృశ్యంతో ప్రయోగించిన పదానికి బిగువునూ, స్పష్టతను చేకూర్చే విధానం ఇది.

దీనికే 'చిన్న' అనే అర్థంలో కూడా ప్రయోగం ఉంది. పొల్ల, పొల్లగాడు, పొల్లది. ఇట్లే తద్ధితరూపంలో ప్రయోగం **'పారిపోయె గడు పొల్లదనంబున నూతపుత్రుడు'** ఇక్కడ లాఘవము, తక్కువతనం అనే అర్థాలు పొసగుతున్నవి. 'అది నీ పొల్లదనం కాదా' ఈవిధంగా తెలంగాణపు భాషలో ఒకే పదం విశేష విశేషణ, క్రియాజన్య విశేషణాది రూపాల్లో ప్రయుక్తమై ఆ భాషా పాటవాన్ని ప్రదర్శిస్తున్నాయి.

ఇట్లే **పొడవడంగు**: నశించు, చెడిపోవు, ఆధిక్యంపోవు, చావు అనే అర్థాల్లో ఎర్రన, నాచన సోమనాదులు ప్రయోగించినారు. దీన్ని ఇక్కడ 'నీ పొడవు ఆరా' అంటూ తిట్టుగా ఉపయోగిస్తాం.

ఇక్కడ పొడవు - ఆమె ఎత్తు అనే కాక, ఔన్నత్యం, వృద్ధి, బింకం, గొప్ప, అనే అర్థ వ్యక్తి కలిగినట్టిది. నీవు పెద్దీర్కెంజేస్తె పొడుగే - వృద్ధి కాదు నష్టమే అనే ధ్వని. అట్లే నీవంత పొడవు జేసినవ్‌లే - ఆ! నీవు చేసిందేమిలేదనే తిరాస్కారార్థంలో మరో ప్రయోగం. పొలిపెర - జాడల అనే అర్థంలో గౌరన ద్విపద హరిశ్చంద్రోపాఖ్యానంలోని ప్రయోగం ఉంది. **మన పక్కింటి జానకమ్మ శాణతనం పొడుగాను, దాని బిడ్డ మచ్చెర్కల తనాన్ని మందికండ్లల్ల ఇట్ల పొలిపెర కన్నవడనిచ్చిందా?** అంటూ ఇక్కడ మాటా ముచ్చెట్లు చెప్పుకుంటారు.

మరికొన్ని భారత ప్రయోగాలు :-

అక్కిచ్చుకున్నడు - అక్క = ఎద - సొంతం జేసుకున్నడు. అంగడి - సంత = బజారు = రచ్చ 'అంగడికి పాంచాలిని దివిచికొని వచ్చునెడ (ఆం.భా.వి.ప) ఇక్కడ 'సభ' అనే అర్థంలో ప్రయుక్తమైంది.

1. నిన్న అంగడి బాగ జరిగింది. (బజారు బేరసారం).
2. నేను లేకపోతె ఇల్లంత అంగడి అంగడి జేసిగ్రు - చెల్లాచెదరు.
3. అమ్మో - అంగడి వెట్టకు నీకు పుణ్యం ఉంటుంది - పెద్దగా మాట్లాడి నల్గురికి తెలిసేట్లు చేయకు రచ్చ చేయకు, సభ చేయకు.
4. అప్పటిగోలె - అప్పటి నుండి (నిన్నటి గోలె నాకు నిద్రవత్తలేదు).
5. అంటసిల్లు - ఒకదానితో ఒకటి కూర్చు (ఆది. ప.).
   ఆకాకు అంట సిల్లింది - (పెండ్లాం మొగుడు పెండ్లినా దేసిన బ్రహ్మముడి

ఇద్వకుండ అంటసిల్లి కూసుంటె ఎట్ల?)

6. నా ఇచ్చ – నా స్వేచ్ఛ – నా ఇచ్చనే నేను జేసిన, నాకెవ్వరు చెప్పలేరు.

7. అంతవట్టు – అంతవరకు (భీష్మ. ప.) (వాడొచ్చేంతవట్ట వోక్కెవట్టు).

8. ఈగు – దాటు, (ఉద్యోగపర్వం) – ఈ కష్టాన్ని ఎట్ల ఈగుతవో, ఈసోర్కెలకెళ్ళి ఈగుసూతం.

9. ఏతులు – ఆధిక్యాలు – లేని పొచ్చులు – 'ఏతుల వోవు దుర్వినీతులు' (పాండు. మా.) అబ్బ ఏం ఏతుల వడవడ్తివిరా, (ఎన్కాముందు జూడక ఎగిరిపడు.)

ఇక పదబంధాలు : పొట్కువెట్టు, కుంపటి వెట్టు, మిడ్క

పొట్కు : ఇంటికప్పు సరిగా లేనప్పుడు అంటే సవుటి మిద్దెలైనప్పుడు వాన నీరు టప్ టప్ మంటూ ఒక్కొక్క చినుకుగా పడ్తూ విసుగు కలిగిస్తాయి. అంతే కాదు మట్టి నేల ఉప్పర్లి బేట్లు లేస్తుంది. ఇది భరించరాని బాధ. పొట్కు అనే పదాన్ని లక్షణార్థంలో 'ఈ ఇంట్ల పొట్కు వెట్టింది నీవాతల్లి!' అంటూ వాడుక ఉంది.

ఇంగులాల పుట్ట : ఇది హరివంశ ప్రయోగం. దీన్నే తెలంగాణంలో 'నీవొక్కడవు తీస్మారు కాడవనకుంటవా ఏంది? ఆడ్కివోతె నీ బొక్కలు సున్నం జేస్తరు. అది ఇంగులాల పుట్ట' – అగ్ని గుండాల వంటి వారు. – శౌర్యవంతులకు స్థానం లేదా పుట్టినిల్లు అనే అర్థంలో ఉపయోగిస్తాం.

కొన్ని జాతీయాలు : ఆ ఇంట్ల పొయ్యిల పిల్లి ఇంకా లేవలేదు.

పల్లెటూళ్ళలో వెచ్చదనం కోసం పిల్లి పొయ్యిలో నిద్రిస్తుంది. తెల్లవారి గృహిణి నిద్రలేచిన వెంటనే పొయ్యిలో పండిన పిల్లిని లేపి అలికి శుభ్రం చేసి వంట

ప్రారంభిస్తుంది. ఇంట్లో బియ్యం నిండుకుంటే చేసేది లేక ఆ ఇల్లాలు పొయ్యిరాజెయ్యలేదని చెప్పేందుకు ఉపయోగించే పదబంధం ఇది.

మేసింది : మేత - పశుగ్రాసం మేసింది. ఆవు గడ్డి మేసింది. అంటే తిన్నది అని అర్థం. కాని ఈ వాక్యాన్నే 'అమ్మా! పిల్లగాడికి రాత్రి పూటనే కండ్లకు మందువెట్టు. అది రాత్రంత మేసి తెల్లారెట్వాళ్ళకు బాగైతది అంటూ ఉపయోగిస్తారు.

దీపం పెద్దచేయి : దీపాన్ని మలుపు అనే అర్థం, కాని అట్లా సూటిగా చెప్పడం శుభసూచకం కాదు. అందుకే దీపం ఆర్పు, తీయి అనక పెద్దజేయి అంటారు. ఇది సంప్రదాయ లక్షణం. ఇట్లే దీపం కొండెక్కిందని కూడా అనడం ఉంది.

తెలంగాణపు భాషలో ఒక్కొక్క పనికి ఒక్కొక్క పదం నిర్దేశంపబడి ఉంది. ఉదాహరణకు : ముక్కలై, వక్కలై, చెక్కలై, నూకలై, పరమై, నుగ్గై, నూచై, నుస్సై, పొట్టై, పిండైంది, తవుడైంది. ఒక వస్తువును చిన్నదిగా చేసే కొద్దికి అది తరతరాలుగా పొందే పరిణామ స్వరూపం ఇది. ఇట్లే - తెంపు, దుసు, దులుపు, రాల్పు, బర్కు జుంజు, ఏరు, కలుపు, కొట్టు, ఈ విధంగా కాయలు తెంపు, చిన్న ఆకుదుసు, గింజలు దులుపు, కంకిరాల్పు, కూరబర్కు, గింజలు ఏరు, కాయలు వలువు, వరిమెద కొట్టు.

చావు అనే తిట్టు : నీవు జావ, నిన్నెత్కపోను, నిన్ను బొందవెట్ట, నీకు పాడెగట్ట, నీనెత్తివలుగ, నీతాడుదెగ, నిన్నడ్డబడ్క పోను, నీ పెండ్లాం తాడుతెగ, నీకు కాష్టంజేయ, నీమొకం బోర్లిచ్చ.

ఈ తిట్లలో ఆచారం ఇమిడి ఉంది. కొందరు ఖననం, కొందరు దహనం చేస్తారు. ఆ విధంగానే బోరగిల, వెల్లకిల పడుకోబెట్టే వేరు వేరు మతస్థుల ఆచారాలు వేరుగా ఉన్నాయి. ఒకడి తాడు తెగడం. అంటే మొలత్రాడు తెంపడం. నీ పెండ్లాం తాళితెగ అంటే పాపం ఆమె మంగళ సూత్రం తెగ అనే తిట్టు.

దయితుడు - ప్రియుడు (ఆం. భా. విరాట.ప). ప్రియార్థ వ్యక్తి కలిగిన ఈ

పదం తెలంగాణంలో అందరిని ఆకర్షించేది, గయాళి అనే అర్థంలో వాడుక ఉంది. ఉదా: అమ్మో అది దయిత, దాన్ని గెలిసేదెవరు? కరిదేవర = విష్ణుమూర్తి నల్లనివాడు అనే యయాతి చరిత్రలోని అర్థంలో గ్రహించి ఇక్కడివారు కర్రెన్న, కర్రెమ్మ అంటూ పేర్లు పెట్టుకుంటారు.

కసటు – మాలిన్యం – కసటువోకడిగి (భారత ప్రయోగం) ఈ పదం ఆధారంగా కసరు = చెత్త చెదారం, ఆకుపచ్చని, మేక కడుపు తిత్తిలో ఉండే మాలిన్యం– మ్యాక తిత్తిల కసరు వారెయ్యకుండి చెట్లకు ఎర్వు అయితది. తల్లీ ఇంట్లకస్బు సుబ్రంగ ఊడ్వు. మిగమీరు – మేరదాటి ప్రవర్తించు – 'గోపాల్ పురాగ తల్లిమాటలెక్కవెట్టక మిగమీరి నడుస్తుండడు.' చిల్లి – తూటు – రంధ్రం – ఈ కుండ సన్నగ తూటువడ్డది. ఈ బిందె చిల్లివోయింది. రాత్రి దూడను రేస్కెకవట్టిపై అంత తూట్లు తూట్లువడ నెత్తు వల్సింది. ఈ రంధ్రాన్ని సీద్రం, తొర్ర, బొర్ర, బొక్క అనే పదాలు కూడా సూచిస్తాయి.

సామెతలు – జాతీయాలు :

ఈ సామెతల ప్రాముఖ్యాన్ని గూర్చి కేవలం మనమే కాదు పాశ్చాత్యులు కూడా యింటింట " a wise old saying which has obtained credit by long use and general understanding " అంటూ సంభావించినారు. ఇవి నిత్య జీవితంలో ఏదో వో చిన్న సామాన్య సందర్భాన్ని ఆధారం చేసుకొనిపుట్టినా, అవి ప్రయోగంలో మనస్సులను గాఢంగా నాటుకొని ముద్రితమై యుంటాయి. ఉదా: అయ్యో దున్నంగవోయి దులువంగ వస్తివి – ఇది మన వ్యవసాయ విధానాన్ని ప్రస్తుత సంబంధిగా ఒకడు చేసిన ఆలస్యానికి ప్రతీకగా నిలిచింది. ఇట్లే "చచ్చిపోయిన బర్రె పలిగిపోయిన బుడ్డెడు పాలిచ్చిందట' ఇందులో బర్రెగాని, పాలు పట్టిన దుత్తగాని సాక్ష్యానికి మిగిలి లేవు. లేని విషయాన్ని గొప్పగా చెప్పుకునే సందర్భం ఇది.

"ఎరువుల సొమ్ము బరువుల సెట్టు" - తియ్యాసేటు తీపుల చేటు" మన పల్లెటూళ్లలో ఏదో పెండ్లికో ప్రయోజనానికో వెళ్ళేటప్పుడు తనకు లేని నగలను అరువుగా తెచ్చుకొని అలంకరించుకునే అలవాటుంటది. అది మంచి పద్ధతి కాదు. ఎందుకంటారా? తనదికాని సొమ్ము కేవలం బరువు మోయడం తప్ప మరేమీ మిగలదు. ఒకవేళ అదిపోతే దానివిలువ అచ్చుకోవలసి వస్తుంది. అట్లా కాకపోయినా చెవినుండో, ముక్కునుండో తీసుకోవడం తిరగి ధరించడం బాధను కలిగించే విషయం. అందుకే తనది కానిది భారవహమే తప్ప మరే లాభం లేదనే హెచ్చరిక.

ఇట్లే - 'గతిలేనమ్మకు గంజే పానకం', ' రోలువోయి మద్దెలకు జెప్పిందంట', 'ఆదరాక పాత గజ్జెలంట', 'పట్టినోడు పర్క అంటె ఉత్తోడు జెల్ల అన్నడంట' - ఈ విధంగా వ్యవసాయాన్ని ఆధారంగా చేసుకొని, ఆయా వృత్తులను ఆధారంగా చేసుకొని వెలసిన సామెతలు ఈ తెలంగాణ ప్రాంతంలో ధృవపడి సంఘజీవితంలో అనుభవ పూర్వకమైన సత్యాలుగా స్థిరపడ్డాయి. అందుకే సి.పి.బ్రౌన్ గారు సామెత అంటే ఒక సంగతికి దృష్టాంతంగా లోకులు వాడుకగా చెప్పే మాట అన్నారు. ఈ సామెతల్లో నానుళ్ళు, అర్థాంతర న్యాసాలంకారాలు, దృష్టాంతాలు పుష్కలంగా పండించుకున్నది తెలంగాణ తెలుగు.

ఇట్లే జాతీయాలు పుట్టి మునిగింది, దున్నపోతుపై వాన, ఉట్టి గట్టుకొని ఊగు, పిల్లివట్టిన దొ్బ్బ, రాళ్లేయకు, బెండువోయింది, పలుగాకి, బండ్లువిసుకు, రొమ్ముకుంపటి, నిలువుదోపు, గోడుగుడుచు, కన్నమ్మకష్టం, అక్కగొ్రు. ఇవేగాక తెలంగాణంలో ఒక పదంతో మొదలై సాగివచ్చే పదాలెన్నో కనిపిస్తాయి.

ఉదాహరణకు : **మారి** -జిత్తులమారి, తంతులమారి, తొత్తులమారి, తంటాల మారి, తాకట్లమారి, టక్కుమారి.....

సాని - మేదరసాని, దొమ్మరిసాని, దొరసాని, ఎర్కలసాని, కుమ్మరిసాని, బోగంసాని.

గొండి – ఆశగొండి, లంచగొండి, గండ్లగొండి.....

పూస – ఎన్నుపూస, మెడపూస, ముడ్డిపూస, ఎన్నపూస, పచ్చపూస, నల్లపూస, కారప్పూస, బెల్లప్పూస, సుద్దపూస.....

ఆడి – వన్నెలాడి, వగలాడి, కులుకులాడి, మెరుగులాడి, తిప్పులాడి, మెచ్చులాడి...

పాప – కంటిపాప, సంటిపాప, బోగంపాప, లంజెపాప, ఈపులపాప, పసిపాప, సంకపాప, దొంగపాప.....

పోతు – తిండిపోతు, దున్నపోతు, చీరపోతు, తాగుపోతు, తిరుగుబోతు, ఆబోతు, కష్టపోతు, నిద్రపోతు, సోమరిపోతు, వొర్లువోతు, కుళ్ళువోతు, గొడ్డువోతు.....

ఇట్లే – అరకట్లం, బాసెనపట్టు, ముకుదాడు, గుదిబండ, దామెనతాడు, తొండెం, అండెం, చిక్కం, గూడలు, గుసిళ్ళు, దుత్తలు, సిపాయిలు, దడి, బుర్క డొగెర, పిడ్కలకుచ్చెన, కుమ్మరావం, పాలదాలి మొదలైన జాతీయాలు కనిపిస్తాయి.

ఈ విధంగా పరిశీలిస్తూ పోతే అపురూపమైన ప్రయోగ వైచిత్రి తెలంగాణపు తెలుగులో ఉంది. మీరందరూ ఏకమై ఈ సంపదను కాపాడి భాషా వీధుల్లో జాగ్రత్త పరచండి. వింటారు కదూ నామాట.

(రాజాబహద్దూర్ వెంకట్రామ రెడ్డి ఉమెన్స్ కాలేజి గోల్డన్ జూబిలీ సావనీర్ – 2005)